స మీ క్ష

[కృష్ణాపత్రికనుండి పునర్ముద్రితము]

*

పద్మావతీ పరిషత్

మచిలీపట్టణము

పద్మావళీ పరిషత్ : మచిలీపట్టణము

♦ ద్వితీయ ప్రచురణము ♦

సర్వస్వామ్యములు కృష్ణాపత్రికవి

1 9 3 7

వెల

రూ॥ పా॥ ఋ

అనుక్రమణిక

సాహిత్యము :

ప్రణయ కీర్తనము
కుమార సంభవము
శాకుంతలము
మేఘసందేశము
కావ్యజగత్తు
రస స్వరూపము
రూపాంతరము
కవి ప్రశంస

శిల్పము :

చిత్రకళ
శిల్ప లక్షణము
కళా సృష్టి
శిల్ప ప్రయోజనము
నీతివాదము
రాజపుత్ర శిల్పము
విగ్రహ నిర్మాణవిద్య
శిల్పులు — కర్మకారులు
నృత్యకళ

ధర్మము :

రూపకల్పన
ఆత్మ వితరణము
సాధన

తెలివిడి

ఇందలి వ్యాసము లొకనాటివి కావు. పత్రికలలో నపుడప్పుడు బయల్వెడలుచుండు వాదోపవాదములను బురస్కరించుకొన్నవగుటచే నివి యస్వతంత్రములు నసంపూర్ణములు; నంతియేకాదు; వీనికి గాలభేదము పునరుక్తిని, వాదతీవ్రత అత్యుక్తినిగూడ నాపాదించియుండవచ్చును.

కాళిదాసునకు సంబంధించిన రచనలు రవీంద్రుని వ్యాఖ్యల ననుసరించి ప్రవర్తించినవి. ఈ వ్యాఖ్యలచే కాళిదాసునకు ధర్మోపదేశికత్వము సిద్ధించుచున్నను, నిజమునకు గవీశ్వరులు ధర్మోపదేష్టలుకారు. అనుద్దిష్టమగు శబ్దబోధవలెనే ధర్మబోధకూడ, వారికావ్యములందు గర్భితమైయుండును. అంతియేకాని వారు బుద్ధిపూర్వకముగ తమ కావ్యములను శబ్దశాస్త్రమునకు ధర్మశాస్త్రమునకు లక్ష్యభూతములొనర్పరు. వేదములవలె ప్రభుసమ్మితములును, పురాణాదులవలె మిత్రసమ్మితములునుగాక, కావ్యములు కాంతాసమ్మితములగుటచే ప్రత్యక్షబోధ వానిపని కాదు. పరోక్షమార్గముననే ధర్మము నవి హృద్గత మొనర్చును. వ్యాఖ్యాతలుమాత్ర మా కావ్యములను తత్త్వదృష్టిచే వివేచించి ధర్మసారమును వెలికిదీయ జూతురు. రవీంద్రుడు స్వయము కవియయ్యు, దత్త్వజిజ్ఞాసువుకూడ నగుటచే కాళిదాసకావ్యసమాలోచనమున నందలి ధర్మనిరూపణమునకుగూడ గడంగెను.

కాళిదాసు సౌందర్యోపాసకుడు. శ్రీ అరవింద యోగి నుడివినటుల, ఇంద్రియరాజ్యము వాని భోగభూమి. కాని అయ్యది కేవలము భౌతికము కాదు. తన నిరుపమానకళాభిజ్ఞతచే నీ కవికులగురువు ఇంద్రియములందలి సత్యమును గడు హృద్యముగ నుద్ఘాటింపగల్గినాడు. ఇంద్రియములు రసస్నిగ్ధములైనప్పుడు విషయరాజ్యము ఆనందరసముయొక్క విలాస భూమిగ జూపట్టును. తత్త్వశాస్త్రజ్ఞునివలె కవి ఆత్మానాత్మ వివేచనము చేయక బుద్ధి కల్పించుకొను భేదముల కతీతుడై తన కళావైదగ్ధ్యముచే ఇంద్రియాతీంద్రియములమధ్య ఆనంద సేతువును నిర్మించి, సర్వమును రసమయముగ నొనర్చును. ఇంద్రియములు తత్వతః దేవతాగృహములు.

కాళిదాసుని కాలమున రాజమందిరములు కేళీగృహములై వెలసినవి. విషయలోలురగు రాజన్యుల నాశ్రయించిన కవులు, తమ పోషకులకు రాగోద్దీపనము గావించుటకే తమ కవితానైపుణ్యమును తార్చుచుండిరి. దేవమందిరములలో దీపధూపారాధనలొనర్చుచు రసాధిదేవతను భక్తకోటికి ప్రత్యక్షమొనర్చుచుండవలసిన కవులు ఆనాడు రాజసభలలో వేశ్యలవలె మేళములుకట్టి కామార్చన చేయుచుండిన మాట నిజము. కాని భారతీయుల ప్రకృతి, బయట నెట్టి విషయ లంపటమున జిక్కొన్నను, వారిలోపల దాగియుండు ధర్మనిరతియు, వైరాగ్యబోధమును పూర్తిగ లోపింపజాలవు. భారత వాణి అంతరముననుండి మేఘగర్జనమువలె "నఖలు నఖలు" అని ధర్మఘోష చేయుచునే యుండును. రోమనుల విషయ లంపటత్వమునకును, భారతీయుల భోగపరాయణతకును భేద మిచ్చటనే కలదు. రోమనుల కామప్రవృత్తి వారిరాజ్యమును సభ్యతను తుదకు జాతినిగూడ విచ్ఛిన్నము చేయువరకు వదల

లేదు. భారతీయుల భోగపరాయణత వీరి యంతఃప్రకృతిని సంఘపటిష్ఠతను బూర్తిగ నభిభవింపలేకపోయెను.

కావుననే భరతవర్షమున ఆర్యధర్మము ఏనాడును నిశ్శేషముగ లోపించలేదు. దాని అప్రతిహతశక్తి నిరంతరము సాగివచ్చుచునే యుండెను. కావుననే యీ దేశము కర్మభూమియని పేరొందినది. భారత సభ్యతయందు ఇహాపరములను సమన్వయము చేసుకొనగల చైతన్యశక్తి గలదు. అర్థకామములు సంఘముపై బడి కొల్లగొట్టకుండ ధర్మమోక్షములు యామికులవలె హెచ్చరిక గలిగియే యుండెను. భోగపరాయణత మితిమీఱిన కాలమున భారతవాణి కాళిదాసుని ముఖతః భోగత్యాగములను సమన్వయించెను. "శైశవే అభ్యస్తవిద్యానాం, యౌవనే విషయైషిణాం, వార్ధకే మునివృత్తీనాం, యోగేనాంతే తనుత్యజాం"— ఈ వర్ణనమునందు కాళిదాసు ఆర్యసభ్యతయొక్క సమరస ధర్మమును సూచించినాడు. కుమారసంభవశాకుంతలాదులయందు గూడ నీ సామరస్యమునే ఆ మహాకవి అతులవిభూతితో చిత్రింపగలిగెను.

బ్రహ్మాండమునం దొక అంశమాత్రమో, ఒకదిక్కు కేవలము ఉపరిభాగమో యనదగు నీ వాస్తవలోకమే స్థూలదృష్టికి పూర్ణసత్యముగ గన్పట్టును. కవు లెప్పుడును దాని నతిక్రమించుటకే చూచుచుందురు. దాని కావలనున్న వెలుగులు వారి నాహ్వానించుచుండును. వాస్తవ లోకాతిక్రమణము భావకబలతకు ముఖ్యలక్షణము. దీనినే పాశ్చాత్యులు "Idealism" ఐడియలిజమందురు. రసభావస్ఫూర్తిచే బుద్ధియందంకురించు వ్యక్తిగత సంస్కారవిశేషమునే పాశ్చాత్యులు 'ఐడియలిజ' మందురు. అంతియేకాని వారి కది ప్రత్యక్షానుభ

భవవిషయము కాదు. వారి భావనాశక్తి వాస్తవలోకమును విడిచి ఎక్కువదూరము పోజాలదు. చాలవరకు దాని పొలిమేరలందే విహరించుచుండును. ప్రవృత్తిప్రధానమగు వారి సభ్యతకూడ వ్యావహారిక ప్రపంచమును విడనాడు సాహసమును వారి కొసగజాలదు. వారి సభ్యతయందు, సంస్కారమునందు కొఱవడిన యీ "ఐడియలిజమ్" వారి కవితయందు కొంతవరకు గోచరించుననుటకు సందియములేకున్నను, అది (Subjective) వ్యక్తిగతమైన చిత్తసంస్కార విశేషమేకాని అంపరోక్షానుభూతి లేదు.

భారత కావ్యజగత్తు దీనికంటె భిన్నమైనది. భారత ధర్మము నివృత్తిపూర్వకముగావున ఆధ్యాత్మికజ్ఞానసంపద, భారత జాతీయజీవనమును, లోపలను బయటనుగూడ తరతరములనుండియు, నావరించి ప్రకృతిగతమై పాదుకొనిపోయినది. భారతకవిత అట్టి జాతీయసంస్కృతియందు పుట్టి పెరిగినదగుటచే భారతకవుల "ఐడియలిజమ్" ప్రత్యక్షవిషయము. పాశ్చాత్యుల "ఐడియలిజము" వలె నది ఊహాకల్పితమైనది కాదు. భారతకవి రసభావవశుడగుటతోడనే, వాస్తవజగత్తు నతిక్రమించి ఆనందరససింధువున నిమగ్నుడగును. అప్పు డూర్ధ్వలోకము లన్నియు వివృతద్వారములై కవికి అమృతాభిషేచనము చేయును. ఇయ్యది అప్రియత్నోపపన్నము; ఉపాసనాబలముచే సిద్ధించిన ఆత్మప్రతిభ; ఆర్యఋషుల కృపాకటాక్షముచే జేకూరిన నిస్తులభాగ్యము.

భరతవర్షములోగూడ ఆర్యధర్మచ్యుతులైన కుకవులు లేకపోలేదు. జుగుప్సాకరములైన నీచకావ్యములెన్నియో యిచటగూడ వెలసినవి. ముద్రణాసౌకర్యమే లేనియెడల నవి యేనాడో మక్షికములకు భక్ష్యములయ్యెడివి. అంతియే

కాని భారతప్రకృతి వానిని జీర్ణము చేసికొనజాలదు. నీచ కావ్యములు పుట్టుకొని వచ్చుచుండిన రోజులలోనే "కావ్యాలాపాంశ్చవర్జయేత్" అను విధివాక్యము పుట్టినది. కాని ఆ నీచ కావ్యములయందుగూడ భారతీయుల కాణాచియగు రసానుభవము అచ్చటచ్చట గన్పించుచుండుటచేతనే వానికి కావ్యశబ్దవాచ్యత కలిగినది. రసవిచారము, ఈ దేశములోవలె నెచ్చటను బరిణతిని పొందియుండలేదు. ఇటీవల నీ శాస్త్రము బిరుసెక్కి ఘనీభవించినను రసజగత్తుయొక్క విస్తీర్ణతను గభీరతను దెలిసికొనవలెనన్న భారతీయుల రసశాస్త్రమువలె నుపకరించగలిగినది మరియొకటి లేదు. రసస్వరూపము, కావ్యజగత్తు అనువ్యాసములం దీవిశేష మించుక సూచింపబడినది.

శిల్పవ్యాసములు, పాశ్చాత్య కళావ్యామోహితులకు సమాధానములుగ వ్రాయబడినవి. భారతీయుల కల్పనాశక్తి శిల్పమునందువలె నితరవిద్యలయం దంతగా వెల్లడికాలేదు. భారతశిల్పము కేవలము దేవతాసృష్టి; విశ్వకర్మ స్వయముగ గల్పించుకొనిన కళాప్రపంచము. ఆ చిత్రరచన, ఆ మూర్తి కల్పన, ఆ యాలయనిర్మాణము, ఆరేఖావిన్యాసము, ఆయలంకారపుష్టి, ఆరాగవిస్తారము, ఆయుజ్జ్వలసౌందర్యము, ఆయాధ్యాత్మిక తేజము, భారతీయశిల్పజగత్తులో గాక మఱి యెచ్చటగాంచగలము! మానవునికళాసృష్టియందు ఈశ్వరసృష్టి సఫలతచెందుచున్నది. ఇక స్రష్టకును సృష్టికిని భేదమెక్కడ? మాయాశక్తిచే అరూపము నిరంతరము రూపొందుచున్నది. "ఆత్మమాయయా సృజామ్యహం." మానవుడు తిరిగి కళోపాసనచే రూపమును తొల్చి అందలి అరూపమును బ్రత్యక్షమొనర్చుకొనుచున్నాడు. సృష్టియం దీశ్వరుని అవతరణము,

శిల్పమునందు మానవుని ఆరోహణము— ఈ రహస్యమును భారతశిల్పముగాక మఱి యే యితరశిల్ప ముద్ఘాటింప గల్గినది? కళాప్రయోజనము, శిల్పలక్షణములు, విగ్రహనిర్మాణము, మొదలగు వ్యాసములందు, భారతశిల్ప సంప్రదాయము యొక్క మూలసూత్రములు దిఙ్మాత్రముగ సూచింపబడినవి.

"రూపకల్పన" "సాధన" యను వ్యాసముల యందు భగవత్స్వరూప మొకింత విశదీకరింపబడినది. పురాణము లందలి బ్రహ్మ విష్ణు మహేశ్వరు లను మూర్తిత్రయ కల్పనముతో భారతీయజ్ఞానము పారము ముట్టిన ట్లెంచరాదు. భాగవతతత్త్వమునందలి మూర్తిత్రయము అంతకంటెను గభీర మైనది. "బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి శబ్ద్యతే" అని భాగవతకారుడు అద్వయమైన పరతత్త్వమును నిర్వచించినాడు. బ్రహ్మ, పరమాత్మ, భగవానుడు, ఈ మూడును పర్యాయ పదములు కావు. ఇవి వేదాంత త్రిత్వమును వ్యక్తీకరించు సాంకేతిక పదములు. సర్వాతీతమైనది- బ్రహ్మము. సర్వాంత ర్యామి-పరమాత్మ. మఱి యీ ద్వయమును అతిక్రమించి వీనిని అంగీభూతమును అంతర్భుక్తమును చేసుకొను చున్నది భాగవతతత్త్వము. మొదటిది "The Transcendental". రెండవది The Immanental. మూడవది "The Concrete Whole". ఈ మూడును తత్వతః ఒక్కటే. కాని ద్వంద్వ భూయిష్ఠమైనబుద్ధికి ఈ మూడును పరస్పరవిరుద్ధములైన తత్త్వ ములుగ గోచరించును. బుద్ధినే పరమప్రమాణముగ జేసు కొనిన దార్శనికులు ఈ మూటిని సమన్వయింపలేక మత వివాదములందు జిక్కుకొని, పాక్షికసిద్ధాంతములను చేయు చూనిరి. సర్వాతీతమైన పరబ్రహ్మమే సత్యమని కొందరు, సర్వాంతర్యామియైన పరమాత్మయే సత్యమని మరికొందరు,

భగవత్తత్త్వము భక్తులుకల్పించుకొనిన ఉపాస్యమని మరి కొందరు,- ఈ విధముగ భిన్నసంప్రదాయములను తదనుగుణములైన సాధనవిధానములను గల్పించుకొనుచుండిరి.

గీతలలో ముగ్గురు పురుషులు పేర్కొనబడిరి. ఒకడు క్షరపురుషుడు. రెండవవాడు అక్షరపురుషుడు. క్షరాక్షరములకును పరాపరప్రకృతులకును అతీతుడైన మూడవవాడు పురుషోత్తముడు. శ్రీకృష్ణుడు "నేను క్షరుడనుగాను అక్షరుడనుగాను, ఈ రెంటిని అంతర్భుక్తము చేసుకొనిన పురుషోత్తముడను" అని ముక్తకంఠముతో బలికినాడు. ఈ పురుషోత్తమ స్వరూపమే భాగవతమునందు భగవత్తత్త్వముగ నిరూపించబడినది. వివిధదర్శనములు, భిన్నసాధనములు, భక్తిజ్ఞానవైరాగ్యములు, భగవత్తత్త్వమునందు సమన్వితములైనట్లు ఏ యితర తత్త్వమునందును కాజాలవు. భగవత్తత్త్వము నవగాహించకున్నచో భారతీయుల విగ్రహారాధనముయొక్క మూలరహస్యము గోచరము కాజాలదు. కేవల నిర్గుణోపాసకులకు సాకారోపాసన గౌణము. కావుననే ప్రతిమార్చన అల్పబుద్ధులైన మందాధికారులకొరకు ఉద్దేశింపబడినదని మాయావాదులు చెప్పుదురు. కాని మందాధికారులకొరకుద్దేశింపబడినది ప్రతీకోపాసనగాని, సాకారోపాసన కాదు. మధ్యమాధికారులకొరకుద్దేశింపబడినది సంపదకోపాసన. నిరాకార తత్త్వము ననుభూతము చేసికొనగల ఉత్తమాధికారులే సాకారోపాసనయొక్క పూర్ణప్రయోజనమును బొందగలరు. జ్ఞానము, భక్తిసిక్తమైనగాని, నిఖిలరసామృతమూర్తి దర్శనము లభింపదు. ఆ యనన్యభక్తియందు సాకారనిరాకారములు, సగుణనిర్గుణములు, పరాపరప్రకృతులు ఐక్యములగును.

బుద్ధి యెప్పుడును పార్థక్యమునే చూచుచుండును. అఖండసత్యమును ఖండఖండములుగ జీల్చి, ఒక్కొక్కటినే పూర్ణసత్యమని భ్రమపడుచుండును. 'సమంబ్రహ్మము' నందీభేదములెక్కడ ? ఒక్కనాదమే గాయకుని శారీరమున భిన్నరాగ ప్రస్తారములుగా అభివ్యక్తమగురీతి, ఒక్క శ్వేత కిరణమే స్ఫటికద్వారమున ప్రసరించినప్పుడు సప్తవర్ణశోభితమై ప్రకాశించినటుల, సంస్కృతబుద్ధికి సకలతత్త్వములు ఒక్క భగవంతుని భిన్నదిక్కులుగ, భిన్నకళలుగ, చిత్రవిచిత్ర లీలావిలాసములుగ బ్రత్యక్షమగును. "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" అను మంత్రమునందలి "ఏకమ్" సంఖ్యావాచకము కాదు. అది తప్ప మరియొకటి లేదని అర్థము. "ఏకం సత్ నాన్యత్ కించిదస్తి" సత్తుచిత్తుల కభేదమని దాని భావము. ఆ యైక్యము అనుభవైకవేద్యము.

పాశ్చాత్య సభ్యతాసంఘట్టనమున భారతసంస్కృతి యొక్క క్రమవికాసమునకే కాదు, మొదలు ధారకే ముప్పు వచ్చినది. సంఘములోపలను బయటనుగూడ తీవ్రమైన పోరాటమేర్పడెను. జీవనముయొక్క వివిధప్రకరణములయం దెట్టి సామరస్యమును గన్పట్టుట లేదు. ధర్మార్థకామమోక్షములకు బరస్పరము స్పర్థ కలిగెను. భారతజాతి స్వయం నియంతృత్వాధికారమును గోలుపోయి అంధప్రాయమైన అనుకరణములోనికి దిగినది. భరతవర్షమువలె ఆత్మవిస్మృతి బొందినదేశము మరియొకటి లేదు. కాని యీ పురాణపుణ్యావని స్వశక్తిని మరచి ఎంతకాల మిట్లు నిద్రించగలదు? భారత జాతిని పారతంత్ర్యమున బడవేసిన ఆ పాశ్చాత్యసంఘట్టనమే నేడు దానిని తిరిగి ప్రబుద్ధమొనర్చుచున్నది.

భారత సంస్కృతి చందనతరువువంటిది. దానిని నరకినకొలదియు క్రొత్త క్రొత్త పరిమళములు బహిర్గతములగుచుండును. భారతీయులు తిరిగి స్వస్వరూపసాక్షాత్కారమును బొందుటకు అన్వేషణమును ప్రారంభించిరి. ఈ మధ్యకాలములో ఎందరో భక్తులు యోగులు తత్త్వవిదులు సంస్కర్తలు పరిశోధకులు శ్రేణులుదీర్చి బయలుదేర లేదా? చూచుచుచూచుచుండగనే నవ్యభారతము తిరిగి సృష్టియగుచున్నది. భరతవర్షము విశ్వమధ్యమున నిలచి, జ్ఞానసామ్రాజ్యమున గురుపీఠము నధిష్ఠింపనున్నది. ఆ శుభముహూర్తముకొరకు ఆ కళ్యాణసంరంభమునకై ప్రపంచమంతయు వేచియున్నది. దేశములోపల ప్రతిభాశాలురు, ఆ భావిభాగ్యోదయ రేఖలను గాంచి, ఉషస్సూక్తములనుబాడుచు అర్ఘ్యోదకములను విడుచుచున్నారు. ఆ సౌభాగ్యరేఖలను స్థూలారుంధతీ న్యాయముగానైన సూచింపగలిగినయెడల, నీ కూర్పు సార్థకము కాగలదు. భారతసభ్యతా జిజ్ఞాసువులయందు సమాలోచనమును బురికొల్పుటయే యీ ప్రచురణముయొక్క ఉద్దేశ్యము. పఠితృలోకమే అందులకు ప్రమాణము.

1—6—37.

ము. కృ.

మంగళగీతము

భైరవి

అయి భువన - మనో - మోహిని!
అయి నిర్మల - సూర్య - కరోజ్జ్వల - ధరణి!
జనక — జననీ — జనని!
నీల - సింధు - జలధౌత - చరణతల
అనిల - వికంపిత - శ్యామల - అంచల
అంబర — చుంబిత - ఫాల - హిమాచల
శుభ్ర - తుషార - కిరీటిని!
ప్రథమ - ప్రభాత - ఉదయ - స్తవగగనే
ప్రథమ సామ - రవ - స్తవ - తపోవనే
ప్రథమ - ప్రచరిత - స్తవ — వన - భవనే
జ్ఞాన ధర్మ కథా పుణ్య — ఖ్యాతినీ!
చిర కళ్యాణమయీ — త్వంధన్య
దేశ విదేశే - వితీర్ణ — అన్న
జాహ్నవీ - యమునా — విగళిత - కరుణా
పుణ్య - పీయూష - స్తన్య - వాహినీ.

రవీంద్రుడు.

సాహిత్యము

ప్రణయ కీర్తనము * *

కవికులతిలకమగు కాళిదాసుని కృతులు శృంగారరస ప్రధానములు. శృంగార, వీర, కరుణ, అద్భుత, హాస్య, భయానక, బీభత్స, రౌద్ర, శాంతములనెడు నవరసములలో శృంగారము ప్రథమమే కాక, ప్రధానము కూడ నగుటచే ఆలంకారికులు దీనిని ఆదిమరసమని ప్రశంసించిరి. వైష్ణవభక్తులు నిరూపించు శాంత దాస్య సఖ్య వాత్సల్య మధురములనెడు పంచభావములలో మధురభావము రసశిరోమణిగ పరిగణింపబడుచున్నది. శృంగారరసమునకును మధురభావమునకును స్థాయిభావము రతియగుటచే నీరెండును ఒకటియేయని తెలియనగును. పరస్పరరూపలావణ్యములం దుద్భవించి, స్వప్నచిత్రసాక్షాద్దర్శనములచే దృప్తినొందక, ప్రత్యంగప్రాప్తికై నిత్యనూతనరూపములం దాల్చుచు, ఒకప్పుడు శిరీషముకంటెను కోమలమై, ఇంకొకప్పుడు వజ్రముకంటెను కఠోరమై, హర్షము, విషాదము, ధైర్యము, గర్వము, కార్పణ్యము, క్రోధము, క్షమ, దురభిమానము, నిర్వేదము మొదలగు వికారములనొందుచు, ఏకనిష్ఠ, సంగలిప్స, ఆత్మప్రసన్నత్వము, కారుణ్యము, ఏకాత్మత, మొదలగు భావముల కావాసమై జరామరణశూన్యమై స్థిరసౌదామినింబోలె విరాజిల్లు నాయికానాయకుల యీప్రేమలీలావిలాసము ఎల్లదేశములలోను

ఎల్లకాలములలోను కవులకు వర్ణనీయమైన విషయమగుటలో నాశ్చర్యమేమి ?

ప్రాచ్యులు పాశ్చాత్యులునగు కవులెల్ల రీ శృంగారరసాస్వాదనమునందు లాలసులై యుండినను, వారి రచనలయందు చూపిన పోకడలయందేకాక రసస్వరూపనిరూపణమునందు గూడ విశేషవ్యత్యాసము పొడగట్టును. ఆంగ్లేయసాహిత్యమునందు సుశిక్షితులైన మన విద్యాధికులు దేశీయసాహిత్యము నెడల తరచుగ జూపు నిరసనభావమే యీ వ్యత్యాసమును చెప్పక చెప్పుచున్నది. "లవ్" అను ఇంగ్లీషు పదమునకు దేశీయవాఙ్మయమునందు పర్యాయపదము లేదని చెప్ప సాహసించు వివేకులు మన విద్యాధికులలో బయలుదేరుటయే పాశ్చాత్య సాహిత్యము వారిలో నెట్టి వ్యామోహమును గల్పించినదియు తెల్లమొనర్చుచున్నది. కాని ఉభయఖండముల వాఙ్మయములను జాగ్రత్తగ బరిశీలించినచో ముఖ్యముగ ప్రణయకీర్తనమునందు పాశ్చాత్యకవు లెంత వెనుకపడినదియు స్పష్టపడును. ఈ మాట మన విద్యాధికులకు ఆశ్చర్యమును గలిగించక మానదు.

పాశ్చాత్యకవులు రచించిన శృంగారరసప్రధానములగు కావ్యములందు ముఖ్యముగ నొక్క విశేషము గన్పట్టును. ఉద్దామమై, పొంగి పొరలి, కూలములను దెగద్రోయుచు, వెల్లువయై పాఱు భాగీరథింబోలె, నారీనరుల యౌవన ప్రభావమున నావిర్భవించు ప్రణయము మానవకల్పితములగు నియమములను, విధినిషేధములను నతిక్రమించి, తన స్వతంత్ర నిరంకుశత్వమును జాటుకొనుటలో బ్రదర్శితమగు ఉద్వేగమును బాశ్చాత్యకవు లతిసమర్థతతో నిరూపించి రను

టకు సందియము లేదు. ఆ యుద్వేగము ముఖ్యముగ షేక్స్పి యరు మహాకవియొక్క "ట్రాజిడీస్" అను దుఃఖాంత రూపకములలో నెక్కువగ గన్పట్టును. "రోమియో జూలి యటుల" ప్రణయోద్దామత ఆంగ్లేయ సాహిత్యమున కెల్ల మేలిబంతియైనది. "షెల్లీ" మహాకవియొక్క "ఎపిసైకిడియను" వంటి కావ్యములలో ప్రేమయొక్క స్వాతంత్ర్యమును, నిరంకుశత్వమును నతిహృద్యముగ వర్ణింప బడియున్నవి. ఇటీవల ఆంగ్లేయనవలలలో, జాతిమతభేద ములు, వివాహము, సామాజికనియమములు, మొదలగు కల్పితవిధు లెట్లు ప్రేమను బంధించి యుంచజాలవో, ప్రేమప్రాబల్యమున సాంఘికసంస్థలెట్లు కూలుచున్నవో, ఆ విష యములు విచిత్రరీతుల వర్ణింపబడుచున్నవి. "బియాట్రిస్" పాత్రరచనయందు కూడ నీ యవస్థ అతిక్రమింపబడలేదు. మొత్తముమీద పాశ్చాత్యసాహిత్యములందు ఎంతవఱకును ప్రేమయొక్క వేగము వర్ణింపబడుటయే కాని ప్రేమయొక్క చరమలక్ష్యమును కనుగొనుటకు ఆంగ్లేయకవులంతగ బ్రయ త్నింపలేదని పరిశీలకులు గ్రహింపకపోరు. ఇయ్యది వారి దోషముకాదు. ఏ కవియు తన సంఘమునం దంతర్గతముగలేని ధర్మభావమును వెలిబుచ్చజాలడు. ఆంగ్లేయజాతి ప్రేమ యొక్క పరిపూర్తి ఎందున్నదియు గ్రహింపలేదనుట సాహస ముకాదు. వారి సామాజిక రాజకీయసంస్థలే యిందుకు బ్రమా ణములు. వారి సామాజికనీతియం దేలోప మున్నదో ఆ లోపమే వారి వాఙ్మయమునందుగూడ వ్యక్తమగుటసహజము.

మొదట రసమార్గముయొక్క సాధన వ్యతిరేకముఖ మున నుండును. ప్రేమోదయకాలమున సర్వమును దాని సాఫల్యమునకు బ్రతికూలముగ నున్నట్లు గనుపడును.

సంఘము, వివాహము, సంసారము మొదలగు సమాజ నియమ బద్ధములగు నేర్పాటులన్నియు నీ ప్రేమాంకురమునకు అంతరాయములుగ భావింపబడును. ఈ వ్యతిరేకభావము హెచ్చిన కొలదియు ప్రేమయొక్క వేగముకూడ హెచ్చుచుండును. లజ్జ, భయము, అసహనము, ధైర్యము, క్రోధము, కార్పణ్యము, మొదలగు రాజసికవికారము లన్నియు తీవ్రముగ బెరుగసాగును. నాయికానాయకు లీప్రతికూలావస్థనుండి తప్పించుకొనుటకు నొక కల్పితజగత్తును సృష్టించుకొందురు. అం దంతరాయము లుండవు. బంధనము లెదురొక్కనవు. స్వేచ్ఛావిహారమున పరస్పరరూపలాలసయందు విహ్వలులగుచుందురు. కాని ఇది కల్పితజగత్తు. ఇది సంఘముయొక్క పొలిమేరలలో, సంసారమునకు దూరముగ, వాయుమండలమున నిర్మింపబడు కృత్రిమసౌధమువంటిది. అందుండి చూచిన జగత్తు చలనములేనిదై యుండును. సమాజము ఆత్మను బంధించియుంచు శృంఖలమువలె గన్పట్టును. సంసారము మందమై భారమై తోచును. ప్రేమయొక్క నవకిసలయములు పరులదృష్టిని సహింపజాలవు. స్వాధీనతారసమునందే ప్రేమ తన యుద్దామతను ప్రజ్వలింపజేసికొనుచుండును. కాని యిది వాస్తవజగత్తు కాదు. ఇందు వస్తుతంత్రము లేదు. దీనిని బోషింపగల మార్గములు లేవు. ప్రతికూలమగు పరివేష్టనమునందు జిక్కుకొనిన జీవివలె నది నిరంతరము ఉద్రేకమున బ్రజ్వరిల్లుచుండును. స్థిరత్వములేదు. సామంజస్యములేదు. శాంతి లేదు. కల్యాణములేదు. భయము, అసహనము, క్రోధము, విద్రోహము, చాంచల్యము మొదలగు చిత్తవికారములతో ప్రేమ యుద్వేజితమగుచుండును. దీనిని జ్వరమువంటి రోగమనిన దోషములేదు. పాశ్చాత్యసమాజము లట్టి యశాంతి

యందు, అట్టి వేగమునందు, అట్టి ప్రియాసయందు జిక్కు-కొనినప్పుడు, వారి సాహిత్యములందు కూడ నట్టి యశాంతి ప్రతిఫలించుటలో నాశ్చర్యము లేదు. వారి నాటకములు విషాదాంతము లగుట సహజము. సంఘము మారుచున్నను, నియమములు పరివర్తనము నందుచున్నను, వాని యడుగున ధ్రువత్వమును, స్థిరత్వమును, సామంజస్యమును ఏది కల్పింప గలదో అయ్యది పాశ్చాత్యనాగరకతయందు మృగ్యము. దానికొఱకు పాశ్చాత్యులింకను అన్వేషించుచున్నారు. దానిని కనుగొనుటకు వారికి తగిన చిత్తశాంతి యింకను కుదుర లేదు. ఈ ఇంద్రియ చాపల్యమున, ఈ భోగలాలసయందు, ఈ తీవ్రప్రయాసలందు, ఈ భయమోహములయందు, ఈ భ్రమయందు వారికి చరమలక్ష్యము గోచరముకాజాలదు. ఇంద్రియములు పరిశుద్ధతనొందినగాని, చిత్తమున కొంత శాంతి యలవడినగాని, ప్రపంచముయొక్క పోరాటము సంఘర్షణము స్పర్థయు నణగినగాని, సంఘముయొక్క పునాది యం దుండవలసిన స్తిమితత్వము, స్థిరత్వము, మంగళము హృద్గోచరములుకావు. ఆసమయ మెప్పుడు వచ్చునో? అందుకై పాశ్చాత్యులింకను ఆవేదన పడవలసియున్నది.

సంస్కృతకవులును ప్రేమయొక్క వేగమును అసహానమును వర్ణించకపోలేదు. ఆ వర్ణనలు భరతవర్షముయొక్క శీతోష్ణస్థితులవలె నిరంతరస్పర్థతో, ప్రచండవేగముతో, ప్రపంచమంతయు తారుమారగుచున్నటుల చిత్రింపబడెను. పూర్వరాగముయొక్క ప్రథమావస్థయంతయు నట్టి ప్రేమోద్వేగముచే విరహవేదనల కాలవాలమగును. చేతనాచేతనములన్నియు బ్రతికూలములై, మిథునానురాగముపై స్పర్థ వహించును. సకల ఋతువులు సంహారమునకు గడంగును.

శీతమయూఖుడు సహితము ప్రచండభానునికంటె తీక్ష్ణతాపమును గలుగజేయును. కుసుమములు వజ్రబాణములకంటె కఠినములగును. మలయమారుతము విషప్రసారము భంగి అగ్నిజ్వాలలను రగుల్కొల్పును. సఖుల విశ్వాసముకూడ అనుమానాస్పదమగును. పితలు శత్రువులగుదురు. ఈ వ్యతిరేకావస్థను సంస్కృతకవు లత్యద్భుతముగ వర్ణించిరి. ఆ వర్ణించుటలో భరతవర్షముయొక్క ప్రకృతివై చిత్ర్యము లన్నియు నూతనార్థములతో వినోదభావమును వెలిగ్రక్కునటుల సూచింపబడెను. అద్భుతమగు నీకావ్యసృష్టిని ఒక్క సంస్కృతసాహిత్యమునందే చూచి యానందింపగలము. కాని సంస్కృతకవు లీ వ్యతిరేకపథమును మాత్రము వర్ణించి తృప్తి బొందలేదు. మోహమును అకృతార్థముగ జేయుటకు వా రిష్టపడరు. వారి సామాజికనీతి అందుకొప్పదు. కావున నే విషాదాంతకావ్యములను దేశీయాలంకారికులు దూష్యము లనిరి. అయ్యవి సృష్టియొక్క రహస్యమందిరమును బ్రవేశింపని పాశ్చాత్యులకే సరిపోయినవి కాని సకలవ్యవహారములకును చరమలక్ష్యమును, పరమార్థమును అనుభవసిద్ధము చేసికొనిన భారతీయు లందు కెట్లు సమ్మతింతురు? ప్రేమోద్వేగమునకు సంఘమును సంసారమును బలియిచ్చుట ధర్మమునకు విఘాతము. సంహితలు, సాధనలు, సాహిత్యములు, కళలు,—సర్వమును హిందూదేశములో ధర్మభావమున సమన్వయము కావలయును. అట్లుకాని ఏ యాచారమును, ఏ సాహిత్యమును హిందూసంఘము జీర్ణించుకొనజాలదు.

ప్రేమయొక్క పరిణామమును భారతీయకవు లెట్లు నిర్ణయించిరను విషయము ప్రస్తుతాంశము. పాశ్చాత్యకవుల దృష్టిని మరుగుచేయు యవనికను సంస్కృతకవులు ఛేదించి,

ప్రణయలహరి యింకను రాగతాళములతో నృత్యమునల్పుచు బ్రవహించి, ప్రవహించి క్రమక్రమముగ విశుద్ధతజెందుచు సంసారసాగరమున నెట్లు నిస్తబ్ధత జెందునదియు ననదృశముగ జూపిరి. వారిలో కాళిదాసు "కులగురువు". యౌవన ప్రభావమున నావిర్భవించు మోహము, సంయతిచే శాంతిని, ధర్మధారణచే ధ్రువత్వమును, సంసారముచే మాంగళ్యమును బొందినగాని, అయ్యది చంచలము, ప్రతికూలము నగు జగత్తు నుండి తప్పించుకొని కృతార్థత జెందనేరదు. ప్రేమలో వేగ మున్నంతకాలము స్థిరత్వములేదు. విశృంఖలస్వాధీనతయందు స్థిరత్వము శూన్యము. బంధనమునందే సౌందర్యము జరామరణ ములు లేక స్థిరసౌదామినివలె విరాజిల్లును. హిందువుల పూర్వ మీమాంసాప్రకారము స్త్రీయొక్క జన్మము మాతృత్వము నందే సాఫల్యము నొందును. వివాహము సంసారమునకు భూమికవంటిది. స్వాతంత్ర్యప్రాప్తికి సమాజనియమములు సాధ నములే కాని ప్రతిబంధకములుకావు. దుఃఖద్వారమున ఆనం దమును, త్యాగమూలమున భోగమును అనుభావ్యములు. సంయతి, స్థైర్యము, త్యాగము లేనినాడు ప్రేమ ననుభవించుట కధికారములేదు. బ్రహ్మచర్యమునందలి కఠోరనియమములే ప్రేమోద్దామతను తగ్గించి గృహస్థాశ్రమమందలి మాంగళ్య మున జేర్పగలుగును. గృహస్థాశ్రమమునకు రెండు ద్వార ములు కలవు. ఒకటి కళ్యాణబంధనము, రెండవది ఆత్మ యొక్క నిర్లిప్తత. కావుననే హిందూగృహమునకు ఋషి త్వము పునాదియైనది. "ప్రజాయై గృహమేధినాం" అని కాళిదాసమహాకవి చెప్పిన వివాహప్రయోజన మంగీకరించిన గాని, వివాహమున కధికారములేదు. లోకకళ్యాణమును లక్ష్యమునందుంచుకొనని వివాహము వివాహముకాదు. అయ్యది

కేవలము విషయసంభోగము. ఎప్పుడు సంసారమునందలి కళ్యాణము ప్రేమయొక్క చరమలక్ష్యముగ భావింపబడెనో అప్పుడు ప్రేమయొక్క అన్వయమార్గము గనుపెట్టబడెను. వ్యతిరేకమార్గమున సర్వనియమములు ప్రతికూలమైనట్లు అన్వయమార్గమున సమస్తము అనుకూలమగును. ఈ మార్గమున ప్రేమోద్వేగము శాంతియందు పరిణమించును. ప్రణయమునకు ధ్రువత్వము సంఘటించును. సంసారమున మధురభావము విరాజిల్లును. ప్రేమ యిక కృత్రిమాలంకారములను, కల్పితజగత్తును, చంచలస్వభావమును వీడి, ధర్మముపై నిర్మింపబడిన భావప్రపంచమున ధ్రువత్వమును, శివత్వమును బొందును. ఇక సర్వము సమన్వయము కాకుండ నెట్లుండగలదు? శరీరము ఆత్మ, బంధనము స్వాతంత్ర్యము, ప్రేమ సంసారము, భోగము త్యాగము, దుఃఖము ఆనందము-సర్వము ఒక్క మధురభావమున ఒక్క శృంగారరసమున మేళనమగును. ఇయ్యదియే సంస్కృతకవులు త్రొక్కిన అన్వయమార్గము. ప్రేమ విషాదమునగాక మంగళముననే పూర్ణత్వము నొందును. అందు విఘాతమే లేదు. శివుడు మృత్యుంజయుడై యుండ వాని నాశ్రయించిన ప్రేమ యెట్లు విషాదమున నంతమొందును? పాశ్చాత్యుల ప్రణయకీర్తనమునకును, సంస్కృతకవుల ప్రణయకీర్తనమునకును ఇచ్చటనే వ్యత్యాసము గలదు. ఈజప్టుదేశ విమర్శకుడొకడు, పాశ్చాత్యుల ప్రేమ వివాహముతో నంతమగుననియు ప్రాచ్యఖండస్థుల ప్రణయము వివాహముతో నారంభించుననియు, నీ యంశము నే భంగ్యంతరమున వెల్లడించెను. ఈ సందర్భమున నొక యుదంతము జ్ఞప్తికి వచ్చుచున్నది. ఈ మధ్య నొక ఆంధ్రవిద్యార్థి యొక యువతిని వివాహమాడెను. ప్రణయసమయమున

నా వరుడు "సంతానము గలుగకుండ దైవమును బ్రార్థించు కొను" మని వధువున కుపదేశించెను. ఇది ప్రత్యక్ష నిదర్శనము. ఈ విద్యాధికుడు కన్యయందు పత్నీత్వమునే జూచుట కుద్యుక్తుడయ్యెను గాని మాతృత్వము వానికి హృద్గోచరము కాలేదు. తన భార్యయందు మాతృత్వమును జూడలేనివాని యందు కాముకత్వము నశింపలేదని యర్థము. "ప్రజాయై గృహమేధినాం" అను ఆదర్శమునందు గృహస్థాశ్రమము యొక్క పరమకళ్యాణమును మనోగతము చేసికొనినవానికే ప్రేమయొక్క నిజస్వరూపము సాక్షాత్కారము కాగలదు. అప్పుడే యోగికిని గృహస్థునకును గల సామంజస్యము తేటపడును.

శృంగారరసము సమస్త రసములకు నాయకమణి. ఈ రసమునకును ఏకాదశేంద్రియములలోని ప్రతి యింద్రియము నకును నిబిడమును, నిగూఢమునగు సంబంధము గలదు. ఈ రసము ప్రథమావస్థయందు కూసము విడిచిన కాలసర్పమువలె విషజ్వాలలు గ్రక్కుచుండును. కాని ఈ రసమున కాధారుడు మదనారియగు మహేశ్వరుడని మఱవగూడదు. మన్మథుని మొదట భస్మీభూతునిగ జేసి తిరిగి అనంగునిగ బ్రతికించినగాని ఈ రసము నాస్వాదించుట కధికారము కలుగదు. లేనియెడల విషయలాలసయందు పెరుగు మోహము చంచలమై ముహూర్తముహూర్తము ఒక్కొక్క విషయము నాశ్రయించి ఉద్వేగము నొందుచుండును. పరముహూర్తమందు విషయాంతర ప్రేరణవలన భావవికారము కలుగుచుండును. విషయలిప్సాజనితమగు నీ యుద్వేగము చిత్తైకాగ్రతకును సమత్వమునకును వ్యాఘాతము గలిగించును. ఇది ధర్మధారణమున కంతరాయము. ధర్మము లేనిచోట రస ముప్పొంగజాలదు. రసాధి

కారమందు ఉద్వేగమును, చంచలత్వమును, బహుముఖత్వ మును నిరోధింపవలయును. నిరోధించుట యనగా నిర్మూలన మొనర్చుట గాదు. ఆపస్తంబ, ఆశ్వలాయన గృహ్యసూత్రి ములు శుష్కవైరాగ్యమును బోధించవు. అవి కామసూత్రి ముల ననుసరించియే యుండును. హిందూ ధర్మమీమాంస లన్నియు, దాస్య, సఖ్య, వాత్సల్య, మధురభావములను శాంతరసముపై నెలకొల్పజూచును. ఏలయన శాంతము సకల రసములకును ఆశ్రియము. చిత్రికారుడు చిత్తరువును చిత్రిం చుటకుబూర్వము, పటమునందు, ముందుగ సఫేదురంగును బూయును. అందుపై చిత్రివర్ణసమావేశ మొనర్చి విగ్రిహ మును జిత్రించును. అట్లే రసభోగియొక్క చిత్తపటమునందు ముందుగ శాంతరస శుభ్రివర్ణ మంకితముగావలయును. తద నంతరము శృంగారాదిరసమూర్తులు పరిపూర్ణవికాసము జెందును. కావున శాంతసమాహితుడు కానివానికి రసాస్వా దనగాని, సాధనగాని సంభవములుగావు. శాంతరసము నివృత్తి మూలకముగాదు. శృంగారరసముయొక్క స్థాయిభావము రతి. రతి నివృత్తికాదు. కాని ఇందు మమతాగంధముగాని, విషయ సుఖస్పృహగాని, భోగవాసనాజనితోద్వేగముగాని, ఆత్మసుఖ వ్యాఘాతజనితక్రోధముగాని ప్రిబలకూడదు.

శ్లో॥ ప్రియశః శమప్రిధానానాం, మమతాగంధవర్జితా ।
పరమాత్మతయాకృష్ణే జాతా శాంతరతిర్మతా ॥

ఈశాంతరతియందలి ధర్మమే నాయికా నాయకుల యం దుండవలసిన ప్రిధానలక్షణము. ఈశాంతగుణము విశ్రృం ఖలస్వాధీనతయందు అలవడనేరదు. సంహితలు ధర్మసూత్రి ములు నీ గుణవ్యవసాయమునకై ఆశ్రిమవ్యవస్థల నేర్పరచి, సంయతిలేని రసాస్వాదనము విషయలౌల్యమని ఘంటాపథముగ

జెప్పుచున్నవి. ధర్మవ్రతనియమములచే సిద్ధిపొందని శరీరమందు కామముయొక్క పైశాచిక నృత్యము మాత్రమే గన్పడుచుండును. ఈనృత్యమును జూచి రసలీలయని భ్రమపడుట మహాపాతకము. ఆనృత్యము పైశాచికము గనుకనే విషాదాంతమగును. నియమబద్ధ సంసారమున బ్రకాశించు విశుద్ధమధురరసము మంగళాచరణముతో నుపసంహారము నొందును. భారతీయుల గృహస్థాశ్రమ రహస్యమును దెలిసికొనిన సంస్కృతకవులు మంగళాంతములగు రూపకములను రచించి ధన్యులైరి. దారువునందు బుట్టిన అగ్ని క్రమముగ దారువునే దహించు భంగి శరీరలావణ్యమున నుద్భవించిన అనురాగమను నిర్ధూమధామానలము ధర్మధారణచే ఇంద్రియములను జయించి మమతాగంధరహితమగు శాంతరతియందోలలాడును. పరిణయముయొక్క యీపరమరహస్యమును కాళిదాసమహాకవి తనరచనలయం దెట్టి యసదృశ కళానైపుణ్యముతో నుత్తేజింపజేసినదియు ముందు చూపబడును.

1916

*

కుమారసంభవము * *

ప్రణయమహిమను దెలియజెప్పుటలో జగత్పితలగు పార్వతీపరమేశ్వరుల ప్రేమలీలావిలాసముకంటె మంచి యుపమానము లేదు. కవికులగురువు కాళిదాసు పార్వతీమహేశ్వరుల ప్రణయమును గీర్తించి ధన్యుడయ్యెను. ఈ పార్వతీమహేశ్వరులెవరు? ఆనందస్వరూపమగు పరమతత్త్వము కేవలము విశుద్ధాద్వయవస్తువుకాదు. కాళిదాసు పరమతత్త్వము నిట్లు నిరూపించుచున్నాడు:

> త్వా మామనన్తి ప్రకృతిం పురుషార్థప్రవర్తినీం
> తద్దర్శిన ముదాసీనం త్వామేవ పురుషం విదుః
> త్వమేవ హవ్యం హోతాచ, భోజ్యం భోక్తాచ, శాశ్వతః
> వేద్యంచ వేదితాచాసి, ధ్యాతా ధ్యేయంచ యత్ పరమ్॥

సచ్చిదానందస్వరూపుడగు పరబ్రహ్మమున జ్ఞాత-జ్ఞేయము, కర్త-కార్యము, భోక్త-భోగ్యము, అచింత్యరూపమున భేదాభేదములను బొందుచున్నవి. ఆ లీలావిలాసమనిర్వచనీయము. ప్రపంచమున బ్రకాశించుచున్న బాహ్యలీల ఆ పరమతత్త్వమునందలి ప్రకృతిపురుషుల అభ్యంతరలీలయొక్క ఆభాసమే. కాని ఆ యభ్యంతరలీల నెందరు అనుభూతము చేసికొనగలరు? స్థితప్రజ్ఞులగు జీవన్ముక్తులే యట్టి యనిర్వాచ్యానందమున నోలలాడగలరు. ఆ యానంద

మును లోకులకు జవిచూపుటకై కాళిదాసమహాకవి పార్వతీ పరిణయమను నొక పురాణగాథ నవలంబనముగ దీసికొని, కుమారసంభవమను లోకోత్తరమైన ప్రబంధమును రచించెను. ఈ పురాణగాథ చరిత్రవిషయమా యను శంకతో మనకు బనిలేదు. మనకు గావలసినది సాహిత్యవిషయము మాత్రమే.

అప్రాకృతవిషయములతో నిండిన పురాణములు సాహిత్యమున కెట్లుపకరించునని ప్రశ్నించవచ్చును. లోక వ్యవహారములకు సరాసరి నకలుగ నుండునదియే సాహిత్యమని పాశ్చాత్యుల యభిప్రాయము. సంస్కృతకవుల యభిప్రాయ మట్టిదికాదు. కవి కేవలము "కాపీస్టు"కాని "ఫొటోగ్రాఫరు"కాని కాదు. "వాక్యం రసాత్మకం కావ్యమ్" రస లీలలను ప్రదర్శించునదియే సాహిత్యము. "రససిద్ధాః కవయః" రససిద్ధులైన కవులే యట్టి రసలీలలను బ్రదర్శింపగలుగుదురు. "నిరంకుశాః కవయః" కవులు నిరంకుశులు. లోకము వారిని శాసింపజాలదు. కవులే లోకములను శాసింప గలుగుదురు. కావ్యములు వ్యవహారదర్పణములైనచో నవి ఉద్దీపన సాధనములు కాజాలవు. కవులు మంత్రద్రష్టలగు ఋషుల వలె, బాహ్యలోకవ్యవహారముల మఱుగున, సృష్టియొక్క హృదయాంతరాళమున బ్రవహించు రసవాహినియందు బ్రవేశించి, అందుండి అమృతభాండములను బైకిదెచ్చి లోకులకు బంచిపెట్టుదురు. ఆ యమృతభాండములు లోకవ్యవహార చరమలక్ష్యములను జూపును. దేవతలు పురాణకవుల మానసమూర్తులు. భరతవర్షాంతరాళమున బీజరూపముగ నుండిన భక్తిజ్ఞానవైరాగ్యములకు విచిత్రరీతుల రూపకల్పనలు గావించి, పురాణరచనలయం దొక క్రొత్త ప్రపంచమును సృష్టించిరి. ఈప్రపంచము వ్యాసాది మహర్షుల గభీర

రసానుభవములనుండి బహిర్గతమగుటచే నిది మనకును బాహ్యవిషయము కాజాలదు. పురాణములు భారతధర్మ ప్రపంచమున దాగియుండు రసజగత్తుయొక్క ప్రకాశములని తెలియనగును. యథార్థముగ నాలోచించితిమేని ఈరసజగత్తు బాహ్యవ్యవహారములకంటెను సత్యమైనదనికూడ గ్రహింప గలము. అందుకనియే వ్యవహారములు మారుచున్నను పురాణములు సతతము ధర్మప్రపంచము నుద్దీపనము గావించుచు తమ యాధిపత్యమును గాపాడుకొనుచున్నవి. ఎందఱు కవులో శతశతాబ్దములనుండియు పురాణము లను గనుల నుండి అమూల్యములగు రత్నములను దీసి సానవెట్టి సరస్వతీ దేవికి కంఠాభరణములను గావించుచుండిరి. సరస్వతీదేవి యొక్క అపరావతారమని కీర్తిగాంచిన కాళిదాస మహా కవియే పురాణేతిహాసములనుగూర్చి "మణౌ వజ్రసముత్కీర్ణే సూత్రస్యేవాస్తి మే గతిః" మణులను మాలికలుగ గూర్చు టయే నాపని యని చెప్పుకొనెను. ప్రణయకీర్తనము గావించుటలో సంస్కృతసాహిత్యమునందే కాదు, మఱి యే యితర సాహిత్యమునందైనను పార్వతీపరిణయమువంటి లక్ష్య మిం కొకటి లభించుట అసంభవము. అందు భరతవర్షముయొక్క మర్మమంతయు మూర్తీభవించియున్నది. కాళిదాసు రస సిద్ధుడగుటచే శివపురాణమునుండి ఈ యసదృశమైన వస్తువు గైకొని అసమానమగు కళావైదగ్ధ్యమును బ్రదర్శించెను.

దక్షప్రజాపతిపుత్రిక యగు సతీదేవి శివుని స్వయముగ వివాహమాడెను. దక్షు డొకమారు యజ్ఞము చేయుచు, సమస్తదేవతలను బిలిచి శివునిమాత్ర మాహ్వానింపలేదు. సతీ దేవి తనభర్తకు తన తండ్రి గావించిన తిరస్కారమును భరింప జాలదు. ఎవరివలన శివునకు తిరస్కారము గలిగెనో, వాని

వలన బొందిన దేహమును త్యజింపక సతీదేవి యెట్లూరకుండ
 గలదు? సతీదేవి యోగబలముచే తనదేహమును దక్షుని
యజ్ఞశాలయందే త్యజించెను. ఎట్టి యపూర్వపాతివ్రత్యము!
దాక్షాయిణి అట్లు తన దేహమును త్యజించిననాటినుండియు
భరతవర్షము పుణ్యసతుల కాలవాలమై దనరుచుండుటలో
నాశ్చర్యమేమి? సతీవియోగముచే నీ యర్ధనారీశ్వరుడు
శక్తివిహీనుడై తపోనిమగ్నుడయ్యెను. పార్వతి మృత్యుంజయ
కాకపోవుటచే తిరిగి క్రొత్తదేహమును ధరించక తప్పదు.

ప్రకృతి పురుషుని ఆశ్రయించుకొనియుండుననియు, పురు
షుడు ప్రకృతిపై నాధారపడకపోయినను దాని అభావమున
నిర్గుణుడై యుండుననియు ఈ సందర్భము బోధించుచున్నది.
ఈమారు పార్వతి యెట్టి దేహమును ధరించవలెను? శివుని
మహదైశ్వర్యము నెఱింగి వానియెడ పూజ్యభావము గలిగి
యుండువాడే పార్వతికి జనకుడు కాగలడు! అట్టివాడు హిమ
వంతుడు. హిమవంతుడు నగాధిరాజు. పూర్వపశ్చిమ సము
ద్రముల వరకు వ్యాపించియున్నవాడు. ఉత్తమగుణసూచకము
లగు రత్నములు ఓషధులు మొదలగు ద్రవ్యములకు బుట్టి
నిల్లు. మేరువునకు సఖుడు. సోమరసము వానియందే లభించు
చుండుటచే యజ్ఞభాగమునకుగూడ నతడర్హుడు! హిమాల
యము ఒక అధిష్ఠానదేవతయొక్క స్థూలదేహము. పృథివ్యా
కాశములు మొదలుకొని సమస్తమునులకుగూడ బూజ్యు
రాలైన మేన కులశీలసౌందర్యాదులచే హిమవంతునకు వర
ణీయ యగుటచే ఆయనకు భార్య యయ్యెను. ఈ దంపతు
లకు మైనాకుడు ప్రథమసంతానము. మైనాకము అచలము
కాదు. సప్తసముద్రములలోను సంచారము చేయుచుండును.
ఇంద్రుని వజ్రాయుధము పర్వతపక్షములెల్ల ఛేదించుచుండ

మైనాకము సముద్రమున దాగుకొని అచలము గాక యుండ గలిగెను. ద్వితీయసంతానము పార్వతి. ఈ పార్వతియే ఆది శక్తి, జగజ్జనని. ఈమెకు పూర్వపశ్చిమసముద్రములవరకు వ్యాపించిన పర్వతచక్రవర్తి తండ్రియు, దిగంతములను నిండి యుండు మేన తల్లియు, సప్తసముద్రములను సంచరించు మైనాకుడు భ్రాతయు నగుటలో నాశ్చర్యము లేదుగాని, మఱి యీ పార్వతి తిరిగి శివునిచెంత కరుగు టెట్లు? 'దేవతాత్మ' యగు హిమాలయుడు సర్వధర్మములు నెఱిగినవాడు. కావున తన కుమార్తెను ఇంకొక చక్రవర్తి కొసంగక, మహేశ్వరుని ఆశ్రమమునకు గొంపోయి అర్ఘ్యోదకముతో వానిని బూజించి జయావిజయలను నిరువురు సఖులను తోడొసగి, ఈశ్వరుని శుశ్రూషార్థము నియమించెను.

సతీవియోగముచే శక్తివిహీనుడైన శివుడు వ్యాఘ్ర చర్మము ధరించి, గంగాధార పడుచోట, దేవదారు వనాభ్యంత రమున, గభీరమైన తపస్సునకు గూర్చుండెను. అచ్చట మృగనాభిగంధభరితములైన కమ్మని తెమ్మెరలు వీచుచుండెను. కిన్నెరలు ఇంచుక గానము చేయుచుండిరి. నందియు, భృంగియు యథేచ్ఛగ సంచరించుచుండిరి. పార్వతి తన మృదు హస్తములతో జలమును, పుష్పములను, కుశలను శివున కందిచ్చుచుండెను. శివుడీ కన్యయొక్క పరిచర్యల నేభావమున స్వీకరించుచుండినదియు కవి చెప్పలేదు. పార్వతి శివుని కటాక్షములకు బాత్రి కాకపోయినను, వాని జటాజూటమున బ్రకాశించుచున్న చంద్రకళచే దేహకాంతిని మాత్రము దూరము చేసికొనుచుండెను. శివుని తపస్సున కుద్దేశమేమి?

స్వయం విధాతా తపసః ఫలానాం
కేనాపి కామేన తపశ్చచార ॥

మహేశ్వరుని మనమునందలి కామన యేదియో యెవరు చెప్పగలరు? అది అనిర్వాచ్యము. ఆదిశక్తి తిరిగి తన చెంతకు ఎప్పుడు వచ్చునాయని తపస్సు చేయుచుండెను గాబోలు! తపోనిరూఢుడైన శివుడు నవయౌవనముచే దీపకళికవలె బ్రకాశించుచున్న పార్వతిచేయు శుశ్రూష నంగీకరించెను. "వికారహేతౌ సతి విక్రియన్తే యేషాం న చేతాంసి త ఏవ ధీరాః." శివుడీమెపై నొక్కమారైనను తన కటాక్షమును బఱపలేదు. కాని పార్వతి అతిసహనముతో నియమవేదికను చక్కగ శుభ్రముచేయుచు, నిత్యానుష్ఠానార్థము జలమును దర్భలను దెచ్చిపెట్టుచు ప్రతిదినమును శివుని గొల్చుచుండెను. ఈవిధముగ గొన్నిదినములు గడచెను. శివుడు తన తపస్సును వదలి పార్వతిని స్వీకరించునట్లు లేదు. దేవతలు తొందరపడుచుండిరి. తారకాసురుని బాధచే దేవతాశ్రమములన్నియు సంక్షుభితములగుచుండెను. పార్వతీపరిణయమునగాని లోకమునకు తిరిగి కళ్యాణము చేకూరదు. పార్వతీసాన్నిధ్యముసయితము తపోవ్యగ్రమైన శివుని చిత్తము నాకర్షించుటకు సమర్థము కాలేదు. ఇంద్రసభ జరిగెను. పార్వతికి మన్మథబాణము తోడ్పడినగాని దేవతల యభీష్టము సిద్ధింపదని అచట నిశ్చయింపబడినది. మన్మథుడును, రతీదేవియు, వసంతుడును శివుని యాశ్రమమునకు బోయిరి. వసంతునిరాకతో ఆ గిరిపరిసరముల అకాలవసంతోదయమై మోడుపడియున్న చెట్లన్నియు జిగిర్చెను. పుష్పములు వికసించి పరిమళముల వెదజల్లుచుండెను. తుమ్మెదలు ఝుంకారములు చేయుచుండెను. శుకములు కలరుతములు సేయసాగెను. పశుపక్షులు కిన్నరులు మున్నగు స్థావరజంగమప్రాణికోటియంతయు కామాతురతజెంది కలయికను గోరుచుండెను. మునులు

సహిత మీ కృత్రిమవసంతావిర్భావముచే శృంగారవికారములు తలసూప, మనోనిగ్రహము బూనవలసినవారైరి. శివగణమంతయు తారుమారైనది. గణేశుడుకూడ చంచలుడయ్యెను. ద్వారపాలకుడుగనున్న నందికేశ్వరుడు వామప్రకోష్ఠమున హేమవేత్రము నుంచుకొని నోటిపై వ్రేలిడుకొని శివగణముల నల్లరిచేయకుండ వారించుచుండెను. ఆనందీశ్వరుని యాజ్ఞచే,

నిష్కమ్పవృక్షం నిభృతద్విరేఫం
మూకాణ్డజం శాన్తమృగప్రచారమ్
తచ్ఛాసనాత్ కానన మేవ సర్వం
చిత్రార్పితారమ్భ మివావతస్థే॥

చెట్లు కదలలేదు. తుమ్మెదలు చలింపలేదు. పక్షులు కూయలేదు. మృగములు సంచరింపలేదు. ఆ యరణ్యమంతయు చిత్తరువులో వ్రాయబడినదియుంబోలె నొప్పుచుండెను. వసంతుడు నిశ్చేష్టుడయ్యెను. నందికేశ్వరుడు మదనుని జూడలేదు. మదనుడు వాని దృష్టిపథమున బడకుండ సురపొన్నల శాఖల చాటున దాగుకొని అటనుండి ముక్కంటిని జూచుచుండెను. ఆ యవసరమున త్ర్యంబకుడు వీరాసనము దాల్చి నిశ్చలుడై సమాధినిమగ్నుడై యుండెను.

అవృష్టిసంరమ్భ మివామ్బువాహ
మపా మివాధార మనుత్తరంగమ్
అన్తశ్చరాణాం మరుతాం నిరోధా
న్నివాతనిష్కమ్ప మివప్రదీపమ్॥

పరమేశ్వరుడు అంతర్వాయువు లన్నిటిని బంధించి వర్షాడంబరములేని నిండుమేఘమువలె, అలలులేని సరోవరము

వలె, చలించని దీపమువలె నుండెను. లోపలి తేజస్సు యొక్క జ్వాలలు బ్రహ్మరంధ్రమును దుసి ఆపైనున్న బ్రహ్మ కపాలముయొక్క నేత్రాన్తరముగుండ పైకి లేచుచుండెను. ఈ తీరున నున్న మహేశ్వరుని జూడగానే మదనకు భయము పోకెను. చేతనున్న బాణమును విల్లును జారిపోయెను. భయకంపితుడైన వసంతుడు, ఆ సమయమందు సఖులతో ఆశ్రమమున కరుదెంచు గిరిరాజకన్యనుగాంచి ఆమె కంఠము నలంకరించిన పుష్పమాలగ శివుని సాన్నిధ్యమున జేరెను.

సుగన్ధినిశ్వాసవివృద్ధతృష్ణం
బిమ్బాధరాసన్నచరద్ద్విరేఫమ్
ప్రతిక్షణమ్ సంభ్రమలోలదృష్టి
ర్లీలారవిన్దేన నివారయన్తీ ॥

ఈ శ్లోకము శాకుంతలములోని "చలాపాఙ్గాందృష్టిం" అను శ్లోకమును స్మరణకు దెచ్చుచున్నది. పార్వతి నిజనిశ్వాస పరిమళమునకై అధరబింబముపై వ్రాలుచున్న తుమ్మెదను మాటిమాటికి తత్తరమున చంచలదృష్టులతో గాంచుచు, లీలారవిందముచే వారించుచు, శివుని ముందర నిలచెనట. ఇట్టి సౌందర్యవిలాసమును బ్రదర్శింపుచు గిరిరాజకన్య మహేశ్వరునకు యథాప్రకారము ప్రణిపాతపూర్వకముగ బుష్పముల నందిచ్చుచుండెను. అట్లు ప్రణమిల్లిన శైలసుతకు పరమేశ్వరుడు "అనన్యభాజం పతి మాప్నుహీతి" "వేరొకతెను బొందని మగనిం బడయుదువుగాక" యని దీవన యొసంగెను. పార్వతి సన్నిధానమునందుండుటచే నిదియే మంచి సమయమని తలచి కాముడు శివునిపై తన బాణమును గురిపెట్టి వింటినారిని పలుమారు సవరింపుచుండెను. అంతట హరుడు చంద్రోద

యమునందలి సముద్రమువలె గొంచెము ధైర్య మెడలి పార్వతివదనముపై వలపుచూపులు నిగిడించెను. మదనుని బాణముచే పార్వతికి గూడ రోమాంచ ముదయించెను. బాల కదంబకల్పములగు నంగములచే భావప్రకాశము సల్పుచు వ్రీడావశమున నాబాల మోమును వంచి ప్రక్కకు తిరిగెను. మహేశ్వరుడు జితేంద్రియుడు. ఈ మనోవికారమునకు గారణ మేమని నలుదెసలు దిలకించెను. మదనుడాకమూలాలను ఆలీఢ పాదుడై నిల్చి బాణమును సంధించుచుండెను. తపోభంగము కావింపగడంగినందులకై పరమేశ్వరునకు గోపమువచ్చెను. అంతట తటాలున తృతీయనేత్రమునుండి మిట్టిమెఱయు జ్వాలలతో అగ్ని యెగసెను. "క్రోధం ప్రభో సంహార సంహారేతి" "స్వామీ కోప ముపసంహరింపు ముపసంహరింపు" మని ఆకాశమున దేవతలు మొఱలిడునంతలోనే మదనుడు భస్మావశేషుడయ్యెను.

శివుడు జితేంద్రియుడు. సర్వమయుడు. కావున మోహావ కర్తయగు మదనుని భస్మము చేసెను. పార్వతి మనమునందలి ఆశాలత వాడెను. దేవతలు నిరాశ జెందిరి. కాని పార్వతి నిరాశ జెందలేదు.

నినిన్ద రూపం హృదయేన పార్వతీ

శివచిత్తమున కెక్కని యీ నా పాడుసౌందర్య మేపాటి దని మనస్సులో తన సౌందర్యమును నిందించుకొనెను. శివ చిత్తము నాకర్షింపగల సౌందర్యము మదనవసంతుల సాహాయ్యముచే సిద్ధించునది కాదని తెలిసికొనెను. తపస్సుచేత సంపాద్యమైన రూపమే మృత్యుంజయునకు తన్ను అర్ధాంగ లక్ష్మిగ జేయగలుగునని నిశ్చయమొనర్చుకొనెను. కవి

సార్వభౌము డిచ్చట ప్రేమోద్దామత నెట్లు నిగ్రహించినదియు విమర్శనీయము. మేనాదేవి "తపః క్వ వత్సే క్వచ తావకం వపుః" మృదులమైన నీ శరీరము తపఃక్లేశమున కోర్వదని ఎన్నియో విధముల బాలికను నివారించెను. కాని "పయశ్చ నిమ్నాభిముఖం ప్రతీపయేత్" పల్లమునకు బాఱుచున్న నీటిని మెరకకు పాఱించుట యెట్లు? కఠోరతపస్సు చేగాక శివుడెట్లు లభించును? జనకుని అనుజ్ఞబడసి గౌరీశృంగమున తపోవనమును నిర్మించుకొనెను. ముత్యాలపేర్లను తీసి రుద్రాక్షమాలికలను స్వీకరించెను. పీతాంబరముల వదలి కాషాయవస్త్రములను ధరించెను. కేశములు జడలుకట్టుకొనిపోయెను. భూతలము శయ్య అయ్యెను. నేత్రములయందలి చంచలత్వము వీడెను. స్వహస్తములతో వనవాటికను పెంచుచుండెను. హరిణములతో స్నేహము నెఱపుచుండెను. ప్రకృతి యొక్క సహజసరళత్వమును నిర్మలత్వమును అలవరచుకొనుచుండెను. ఆశ్రమమును జూడవచ్చిన మునిజనులకు అతిథిసత్కారము గావించుచుండెను. క్రమముగ నా తపోవనము పవిత్రతరమగుచుండెను. ఇంతలో గ్రీష్మకాలము వచ్చెను. ఇంకను మహాదేవునకు దయ రాలేదు. ఉమాదేవి ఇంకను కఠినవ్రతములను బూనెను. పంచాగ్నిమధ్యముననుండి తపస్సు చేయ నారంభించెను. నేత్రాంతములు నల్లబడెను. శరీరము నుండి వెచ్చని గాడ్పులు వచ్చుచుండెను. కుటీరము వదలి శిలపై పండుకొనసాగెను. పిమ్మట పుష్యమాసము రాగా నామె జలస్తంభనము మొదలిడెను. పార్వతి ముఖము జలముపై పద్మమువలె ప్రకాశించుచుండెను. ఉపవాసములు హెచ్చెను. తనువు కృశించిపోవుచుండెను. కాని పార్వతి సంయమమును వదలలేదు. వ్రతములు కఠినతరములగు

చుండెను. పర్ణములను దినుట గూడ మాని అపర్ణయని పేరు గడించుకొనెను. తపోవృద్ధులు కూడ నిట్టి నియమములకు లోబడజాలరు. యౌవనమత్తత యంతయు హరించెను. హావభావ లీలాచాంచల్యము పూర్తిగ నష్టమాయెను. ఉమా దేవి తపోమహిమ లోకలోకాంతరముల వ్యాపించినది.

ఈ యవస్థలో నొక జటాధారి యాశ్రమమునకు వచ్చెను. ఇక పార్వతి యొక్క అగ్నిపరీక్ష యారంభమైనది. పార్వతి అతిథిని సత్కరించినది. అతిథి యగు బ్రహ్మచారి యోగక్షేమములడిగి నీ తపస్సున కుద్దేశమేమని ప్రశ్నించెను. "రాజకన్య లెందుకు తపస్సు చేయుదురు ? నీకోరికను మన్నింపని యువకు డేలోకమందైన నుండునా ? దేవతలు గూడ నీతో రాజ్యము చేయుట కిచ్చగింతురే ? హిమవంతుని పుత్రిక నవమానము చేయగలిగిన వాడెవ్వడు ? నీవు కఠోర వ్రతములచే నీశరీరమును శుష్కింప జేసికొనుచున్నావు. నీ యౌవనలావణ్య మంతయు నీతపఃక్లేశము చేత నూసిపోవు చున్నది. నేను సంపాదించిన తపఃఫలములో సగము నీకిచ్చి వేసెదను. దీనిని గూడ స్వీకరించి నీవాంఛను దీర్చుకొనుము" అని యాబ్రహ్మచారి పార్వతికి బోధింప మొదలిడెను. తన సంగతిని దాను జెప్పుకొనుట కిష్టములేక పార్వతి తన సఖిని వివరములను జెప్పుమని సంజ్ఞచేసెను. అప్పుడు సఖ యిట్లు చెప్పదొడంగెను :—

"ఈ కన్యామణి మహాదేవుని అర్ధాంగ లక్ష్మియగు టకు ఉత్కంఠయై యున్నది. మదనుడు భస్మావశేషుడైనను ఈమెహృదయము శీతలము కాలేదు. కిన్నరులు మహాదేవుని చరిత్రమును గానము చేసినప్పుడు ఈమె భావవివశయై, కంఠ స్తంభిత బాష్పయై విలపించుట జూచి వారును విలపించెడి

వారు. 'నీవు సర్వగతుడవని వేదవిదులు కీర్తించెదరు. నేను తపస్సు చేయునది నీకొఱకని నీకు దెలియదా ?' అని యీమె దుఃఖించును ! ఎంతకాల మీతపస్సు ? తన చేతితో నాటిన చెట్లు పుష్పించి ఫలించినవి. కాని యీమె ఆశాలత ఫలించ లేదు. ఫలించు లక్షణములు గూడ గన్పట్టవు. మా సఖిపై ఎప్పుడా మహాదేవునకు కృప కల్గునో ? సఖుల మగు మేము ఆమె కష్టమును జూడ లేకున్నాము! " ఈ వృత్తాంతమును వటుడు విని " ఇది నిజమా, పరిహాసమా ? " యని పార్వతిని జూచి యడిగెను. పార్వతి స్ఫటికమాలను జేతితో త్రిప్పు చుండెను. ముఖము తప్తకాంచనము భంగి ప్రకాశించు చుండెను. పార్వతి మాటలాడుట కారంభించును గాని మాట అధరములను వదలి బయటకు రాదు. అతిప్రయత్నముపై మాట పెదవిదాటును. ఇంతకాలము పార్వతి మహాదేవ ప్రణయకాంక్షిణి యని విన్నాము. ఇప్పుడామె ముఖతః శివ కీర్తనము వినుటకు మనహృదయములు తత్తరపడుచున్నవి.

యథాశ్రుతం వేదవిదాం వర త్వయా
జనోఽయ ముచ్చైః పద లఙ్ఘనోత్సుకః
తపః కి లేదం తదవాప్తిసాధనం
మనోరథానా మగతిర్న విద్యతే.

ఓ వేదజ్ఞవరేణ్యుడా ! నీవు విన్నమాట వాస్తవమే. ముగ్ధురాలనైననేను శివలాభరూపమైన మహోన్నత పదవిని గోరి, అందులకు అతితుచ్ఛమగుటచే అసాధకమైన యీతప స్సును సాధనముగ బూనుకొని యున్నదానను. కోరికలు ఎంతటి విషయము మీదనైనను బ్రసరించును గాని శక్తిని ఆలోచింపవుగదా, కావున అసాధ్యమని వదలుదానను గాను.

ఇట్టి మాట నెప్పుడైన వింటిమే ? ఇందు చాంచల్యము లేదు. ఇంద్రియస్పర్శ లేదు. ఇది ఐహికవిషయసంబంధము కాదు. స్థిరము, ధీరము, హితము, అచలమునగు ప్రణయము. ఇందు నేను అనునదిలేదు. అహము విచ్ఛిన్నమైపోయినది. మిగిలినది ఆకాంక్ష,-దురాకాంక్ష; ఉపాయము కఠోరతపస్సు. ఇంకొక మార్గములేదు. ఎంత ఆత్మనిసర్జనము, ఎంత దైన్యము, ఎంత భక్తి ప్రకాశింపుచున్నది! కాని ఇంకను అగ్నిపరీక్ష పూర్తికాలేదు. బ్రహ్మచారి శివుని నిందింపనారంభించెను. శ్మశానము, గజచర్మము, దరిద్రత, సర్పములు, వృషభము అన్నియు నేకరువు పెట్టినాడు. శివనిందను తండ్రిముఖమునుండి వినినప్పుడే దేహము త్యజించిన సతి అపరిచితుడగు నీ యువకుని దూషణవాక్యలను సహింపగలదా ? ఈ యప్రియములను వినగానే పార్వతి యధరము అదరనారంభించెను. నేత్రాంతములు కెంపెక్కెను. స్థిరస్వరమున నిట్లుచెప్ప దొడంగెను. "మూఢులు ఈశ్వరుని వాస్తవస్వరూప మెఱుంగరు. మహాత్ముల నడవడి నెఱుంగనేరక వారిని దూషింతురు. లోకాతీతమహిమాస్పదునికి సంపదలెట్టివో, భూషణములెట్టివో, వాహనములెట్టివో ఎవరికేమి తెలియును ? ఇంతకును నీతో వాదమెందుకు ? మహేశ్వరుడు దుష్టుడైననేమి ? వానికి నా మనస్సును అర్పణము జేసినాను. ఇక నిందయొక్క భయము లేదు" అని సఖిని జూచి, "నిందించిన వారేకాక, నింద వినిన వారుగూడ పాపులగుదురు. మాట్లాడనీయవల"దని చెప్పి తాను లేచి ప్రక్కకుబోయెను. బ్రహచారి యింతలో నామె చేయిపట్టుకొనెను.

శ్లో॥ తం వీక్ష్య వేపథుమతీ సరసాఙ్గయష్టి
ర్నిక్షేపణాయ పద ముద్ధృత ముద్వహన్తీ

మార్గాచలవ్యతికరాకులితేవ సింధుః
శైలాధిరాజతనయా న యయౌ న తస్థౌ॥

ఆమెయొడలు చెమర్చెను. ఎత్తినకాలు ఎత్తినట్లేయుండెను. ముందఱకును బోజాలదు. వెనుకకును బోజాలదు. అంతట శివుడు "ఓ సుందరీ నీ తపస్సుచే నన్ను బిలచి నీదాసునిగ జేసికొంటివి" అనగనే తపఃక్లేశము బ్రహ్మానందముగ బరిణమించెను. ఆమెశరీరము నూతనమూర్తిమత్త్వచే ప్రజ్వరిల్లెను. కవిశేఖరుడిచ్చట గాంధర్వవివాహము గ్రహించక దానపూర్వకమగు పాణిగ్రహణమునే వర్ణించెను. ఈ ప్రణయము శమదమములచే శాంతినొందినది. ప్రేమోద్ధతత్వమును స్వభావోద్దామత్వమును సూచించు గాంధర్వమిచట పనికిరాదు. వివాహ సంస్కార మట్టిదికాదు. ఇయ్యది సాంఘికబంధనము. సహజమగు సౌందర్యమున చాంచల్యముగలదు. ధర్మబద్ధమైన పరిణయమున తపస్సౌందర్యము స్థిరసౌదామనివలె విరాజిల్లును. ఇక కృత్రిమాలంకారములతో బనిలేదు. బాహ్యప్రకృతియొక్క లీలావిలాసము లతిక్రమింపబడినవి. హావభావలీలాచేష్టలకిక తావులేదు. పుష్పము ఫలించినది. నగరాజకన్య మహేశ్వరుని అర్ధాంగరాజ్యలక్ష్మియైనది. పురుషుడు ప్రకృతిని స్వీకరించెను. లోకమునకు మంగళము చేకూరినది. దేవతలెల్లరు పరమామోదమున మునింగిరి. దేవగణములు సప్తఋషులు, దిక్పాలకులు కల్యాణమును వీక్షించుట కేతెంచిరి. అరుంధతమ్మకూడ ప్రత్యక్షమయ్యెను. బ్రహ్మాండమంతయు తూర్యనాదములు సల్పుచుండెను. ఏమీ ప్రణయమహిమ! ప్రేమ-కల్యాణమున, సౌందర్యము-మంగళమున, దుఃఖము- ఆనందమున, త్యాగము- భోగమున, పరిణతి చెంది ప్రకృతి పురుషుని జేరినప్పుడు లోకలోకాంతరములు

" రసోవై సః " యనుకీర్తనమును సామచ్ఛందస్సున గానము సేయుచు నృత్యము సల్పును.

కాళిదాసు పాఠకుల నెట్టి యున్నత భావశిఖరమున జేర్చెను ! పార్వతీజననమునుండి కల్యాణమువరకు ఎట్టి నిరుపమాన శిల్పమును బ్రదర్శించు సోపానపరంపరల నిర్మించెను ! ఈ కవిశేఖరుడు ఋషితుల్యుడగుటకు సంశయమేమి. చక్రవర్తి పుత్రికారత్నమును శివశుశ్రూషయందు నియోగించెనేకాని రాజసౌధములకు బంపలేదే ! శుశ్రూషయందు ఆత్మప్రదానము, పూజ్యభావము అలవడును. కాని కవి యింతటితో తృప్తినొందలేదు. స్వభావ సౌందర్యమునందలి చాంచల్యమును ఉద్ధృతత్వమును సంయమముచే నిరోధించవలెను. యౌవన మత్తతను రగుల్కొల్పుచున్న వసంతుని, మోహ ప్రభావమును పోషించు మన్మథుని తిరస్కరించవలెను. కామదహన మెట్టి కావ్యసృష్టి ! ఏసాహిత్యమందైన నిట్టి యపూర్వ కళాచాతుర్యము ప్రదర్శింపబడెనా ? ప్రణయస్వరూపమును దెలిసికొనిన కవియే యట్టి యుత్కృష్టకల్పనను గావింపగల్గును. శాకుంతలములోని దుర్వాసశ్శాపమును, కుమారసంభవమునందలి కామదహనమును, కాళిదాసునకు కవితాప్రపంచమున సార్వభౌమత్వము నీయగల్గును. మదనుని భస్మీభూతునిగ జేసినందుకు పార్వతి శివుని చిత్తకాఠిన్యమును నిందించలేదు. ఇయ్యది శివశుశ్రూషచే గలిగిన సంస్కారము. శుశ్రూషవలన పూజ్యభావ మలవడినను, సౌందర్యము యొక్క స్థిరత్వమీమెకు గోచరముకాలేదు. మదన దహనమునంత దీని యభావము మాత్రము మనోగతమయ్యెను. "వ్యర్థం సమర్థ్యలలితం వపుః " సుందరమైన తన మేను నిష్ప్రయోజనమని తెలిసికొనెను. " నినన్దరూపం హృదయేన పార్వతీ "

శివలాభమును గల్గించలేని తన సౌందర్యమును నిందించు కొనెను. కాని పార్వతియొక్క హృదయము శూన్యమయ్యెను. అంతకుపూర్వము యౌవనమత్తత యచ్చట రాజ్యముచేయుచుం డెను. ఇప్పుడు దాని దురంతప్రభావము భగ్నమగుటతోడనే హృదయము శూన్యమయ్యెను. ఇక తప్తకాంచనమువలె బ్రకా శించు తపస్సౌందర్య మీహృదయపీఠిక నధిష్ఠించవలెను. కవి యందులకై యీ కన్యకామణిని తపోవనమున జేర్చెను. ఇది మూడవమెట్టు. యౌవనమత్తత యొక్క నిరర్థకత గోచరమైన లాభము లేదు. శమదమములచే భావవేగము శమించవలెను.

ఇందుకు ప్రథమమున గర్వరాహిత్యము కావలెను. చక్రవర్తి యొక్క పుత్రిక యనిన నెట్టి ప్రమత్తత! శివపూజా ధురంధ రత్వ మనిన నెట్టి యధికారము! చిత్తశుద్ధిలేకయే ఉన్నతమైన జ్ఞానసాధనల నవలంబించిన వారియం డిట్టి అహంభావము జనియించి, ధర్మవికాసమునకు ప్రతిబంధక మేర్పడును. అట్టి యున్నతసాధనలకు ముందుగా అధికారమును సంపాదించుకొన వలెను. నిస్స్వార్థతయే యట్టి యధికారము నొసంగగలదు.

అహంకారరాహిత్యమే యట్టి యర్హత నీయగలదు. కావున పార్వతి శివపూజను వదలి ముందుగ ప్రకృతియందలి చేతనా చేతనములను బూజింపవలెను. మానవుడు వానికంటె నెట్లు ఎక్కువ? వృక్షలతాదులయందు, కురంగశాబకములయందు సహజసరళత్వము గలదు. నిత్యనిర్మలత్వము గలదు. వన వాటికయందలి పుష్పమెట్లు నిర్మలముగనుండునో గమనింపుడు! ప్రత్యుదయమున దళములపై బడు ధూసరమును హిమాంబు వులు గడిగివేయుచుండు నా నిర్మలత్వము నిరుపమానము. మానవహృదయమునందట్టి నిర్మలత్వమేదీ! తపోవనమందలి హరిణశాబకమెట్టి సరళవిశ్వాసముతో, ఎట్టి సహజస్నేహా

ముతో మెలంగుచుండును ! తన్ను వేటాడవచ్చిన వ్యాధు నైన గుర్తింపజాలదు. ఆ కోమలవిశ్వాసమే భక్తికి మూలము. అట్టి విశ్వాసము కుదురనిది శివపూజకధికారము లేదు. పార్వతి వనపాలనమందు హరిణముల సరళవిశ్వాసమును, లతల సౌకు మార్యమును, పుష్పముల నిర్మలత్వమును సంపాదించెను. అనధి కారి బ్రహ్మజ్ఞానము సాధింప మొదలిడినప్పుడు తదితరసాధకుల యెడల నిరసనభావము కలుగుట నిక్కము. అయ్యది ధర్మజీవ నమున కెంతయు ప్రతికూలము. పార్వతి మునిజనంబుల సేవించ మొదలిడెను. "అతిథి దేవో భవ!" అతిథి పూజచే నిరహంకారభావము, సర్వసమత్వము, వినయ సంపన్నత లభ్య మగును. పార్వతి సమవయస్కలగు తన సఖులతో సఖ్యము నెరపుచుండెను. కాని యీ పరిచర్యలయం దింకను స్థిర త్వము లేదు. తపస్సు ఆత్మప్రదానముతో ప్రారంభమగును. కాని అది స్థైర్యమున, ధీరత్వమున, కఠోరనియమముల నేకాగ్రత నొందవలెను. ఆత్మనిశ్చయము, త్యాగము, సహనశీలము దృఢపడినగాని తపస్సు పక్వముగాదు. బాల్యమునొక్క చాపల్యమును, యౌవనమునందలి ఉద్ధృతత్వమును, మధ్య వయస్సునందలి అహంకారమును, శమదమాదిషట్కసంపత్తిచే తొలగించి, పరిణతవయస్సునొక్క శాంతమును, ధీరత్వమును, నిర్లిప్తతను సాధించుట యత్యవసరము. అప్పుడు గాని ముముక్షుత్వమున కధికారము కలుగదు. తపఃక్లేశముచే పార్వతి ఈశ్వర సాక్షాత్కారమున కధికారమును సంపాదించుకొనెను. పార్వతియందు పూర్వము లేని ఆత్మసౌందర్యము దీపశిఖవలె ప్రజ్వరిల్లెను. మదనుడు అనంగుడై సజీవియయ్యెను. మను తాంధముకాని భోగము, ఇంద్రియస్పర్శలేని శాంతరతి, భావావేశము లేని మంగళము, పార్వతియందు మూర్తీభవించి

నవి. ఇక పార్వతి శివుని యర్ధాంగలక్ష్మియై భాసిల్లదా? శివుడిక శక్తివిహీనుడై యుండజాలడు. త్రిలోకనాథుడే పార్వతిని వెదకుచు వచ్చును.

"అద్య ప్రభృత్యవనతాఙ్గి, త వాస్మిదాసః
క్రీత స్తపోభిః"

మహేశ్వరుడెంత కరుణామయుడు! తనంత తానే నిర్గుణయోగనిద్రనుండి బయల్వెడలి శక్తిరూపిణియగు పార్వతిని జేపట్టి నీకు దాసుడనని ప్రణమిల్లెను! త్రిలోకనాథుడు దాసానుదాసుడగుట ఎంత మనోహరము! క్లేశమంతయుబోయి శాంతము తేజరిల్లెను, దుఃఖము శాశ్వతానందమున బరిణమించెను. ఈశ్వరసంభోగమున లోకమునకు మంగళము చేకూరె. పార్వతి తపస్సుతో నొక పార్వతికేకాదు, సకల దేవతలకు ఈశ్వరసాక్షాత్కారము లభించె. "విపక్వం ఫలమద్య నః" మా తపస్సులుకూడ నేడు ఫలించినవని దేవతలు కీర్తించిరి. "మనోరథస్యావిషయం, మనోవిషయాత్మనః" సకల జగత్తులకు నాథుడవగు నీవు మమ్ము దలచుకొనుటయే మా మహాభాగ్యము! అహో! పార్వతి తపఃప్రభావమెట్టిది! "అత ఆహర్తు మిచ్ఛామి పార్వతీమాత్మజన్మనే" "కుమారసంభవము కొరకు పార్వతిని సంగ్రహించుచున్నాను" అని మహేశ్వరుడు పలుకుచున్నాడు. కళ్యాణముయొక్క చరమలక్ష్యము ఫలించినది. "నచాహంలౌల్యాత్ స్త్రియమిచ్ఛామి, కింతు దేవోపకారాయ" కాళిదాసకవిశేఖరుడు ఎట్టి ఉత్తమోపదేశమును గావించెను! ప్రణయము పరిణయమున సాఫల్యము నొందినది. సమస్తమంగళములు చేకూరినవి.

1916

*

శాకుంతలము * *

అభిజ్ఞానశాకుంతలము కాళిదాసీయనాటకములలోనే గాక, సర్వరూపకములలోను శ్రేష్ఠతమముగ బరిగణింపబడు చున్నది. "కావ్యేషు నాటకం రమ్యం, తత్రాపిచ శకున్తలా" యను నార్యోక్తి యీ యంశమును దృఢపఱచుచున్నది. "ప్రపంచమును స్వర్గమును నొక్కచో జూడ దలచితిమేని, అయ్యది శాకుంతలమునందే గాననయ్యెడి"నని 'గేతి' యను జర్మనుదేశ కవివరేణ్యుడు ఒక పద్యమున నుడివియున్నాడు. ఈ నాటకము మొదటినుండి తుదివఱకును పాఠకుని మనమును నిరవధికమగు మాధుర్యమునందు ప్రశాంతియందు రమణీయతయందు ముంచుచుండును. ఈవిషయమునే బాణ మహాకవి

నిర్గతాసు న వా కస్య కాళిదాసస్య సూక్తిషు
ప్రీతి ర్మధురసార్ద్రాసు మంజరీష్వివ జాయతే ॥

అని వచించినాడు. ఈ రూపకరాజము సంపూర్ణ నాటకలక్షణోపేతమై విరాజిల్లుచున్నది. కాని "ఉత్తరే రామచరితే భవభూతి ర్విశిష్యతే" అను సుప్రసిద్ధవచనము ఉత్తరరామచరిత్రమున కాధిక్యత నొసంగుచున్నది.

శాకుంతలమునందువలె, రసభావగుణౌచిత్యఘటనాలంక్రియాదులు ఉత్తరరామచరిత్రయందును లోకోత్తరముగ బ్రదర్శింపబడినవనుటకు సందియము లేదు. కాని కళాకౌశల

మున భవభూతి కాళిదాసుని మించుననుట సంశయాస్పదము. కాళిదాసుని కవిత్వము వ్యంగ్యప్రధానము. భవభూతి కవిత్వము వాచ్యప్రధానము. కాళిదాసు తాను చూపదలచిన విషయమును ఒకటి రెండు రేఖలలో బహుసుకుమారముగ సూచించి వదలి వేయును. భవభూతియన్ననో, ఆరసమును సూక్ష్మదర్శినీ యంత్రముక్రింద బెట్టి, దానియంగోపాంగవిశేషముల నన్నిటిని సవివరముగ అభివ్యక్తముసేయును. కావున సామాన్య పఠిత సహితము ఉత్తరరామచరిత్రమును జదివి సులభముగ నానందించవచ్చును. కాని శాకుంతలము వ్యంగ్యప్రధానమగుటచే రసజ్ఞులుకాని దాని మాధుర్యమును సంపూర్తిగ గ్రోలజాలరు. కవితాకౌశలము వాచ్యమునందుకంటె వ్యంగ్యమునందే యెక్కువగ కాననగును. కవిత్వము వక్రోక్తియని యొక ఆలంకారికుడు చెప్పినమాట వాస్తవము. "అంతర్గూఢాభిమానోక్తిరుదాత్త ఇతిగీయతే" యని సర్వశ్రేష్ఠమగు ఉదాత్తప్రబంధము యొక్క లక్షణము నిరూపింపబడుచున్నది. ధ్వనివిషయమున కాళిదాసమహాకవి అద్వితీయుడు. ఇందుకొక నిదర్శనమిచ్చిన జాలును. మదనావస్థయందున్న దుష్యంతుడు లతామండపమున శయనించియున్న శకుంతలను జూచినపుడు "అయే లబ్ధం నేత్రనిర్వాణమ్" అని తన యనిర్వాచ్యానందమును వెలిబుచ్చును. ఈ స్వల్పవాక్యమునం దెట్టి యర్థగౌరవము రసపుష్టియు గలవో, రసజ్ఞులే గ్రహింపగలరు. ఈ భావమునే భవభూతి యీ పద్యమునందు వెల్లడించెను.

అవిరళ మివ దామ్నా పౌండరీకేణ నద్ధః
స్నపిత ఇవ చ దుగ్ధస్రోతసా నిర్భరేణ
కబళిత ఇవకృత్స్నం చక్షుషాస్ఫారితేన
ప్రసభ మమృతవేగే నేవ సాన్ద్రేణ సిక్తః.

ఈ యుభయకవుల సూక్తులను బోల్చి చూచినచో నే కవియొద్ద కళాకౌశల మెక్కువకలదో స్పష్టపడును. శాకుంతలము శృంగారరసప్రధానము, ఉత్తరరామచరిత్రము కరుణ రసపూరితము. శృంగారరసకావ్యముల యందు కవి విశృంఖలముగ భావవేగమును బెంచి వ్రాయజాలడు. ఇందుకు సంయమ మత్యవసరము. కాళిదాసమహాకవి కట్టి యపూర్వ సంయమ ముండుటచేతనే రసశిరోమణియగు సౌందర్యరసమును పభోగించుట కధికారియాయెను. సంయమములేని కవికి శృంగారవర్ణనమునం దధికారములేదు. అట్టి యనధికారులీ కార్యమునకు బూనుకొనుటచేతనే కావ్యప్రపంచమునకు గొప్ప విపత్తు సంఘటించినది. శాకుంతలమునం దీ కవికుల తిలకుడు ఎట్టి యపూర్వసంయమము జూపినదియు విమర్శనీయము. ఆ సంయమవిశేషమును గమనించినగాని కాళిదాసుని కవితాకౌశలము హృద్గతము కాజాలదు. అందుకనియే కాళిదాసు నాటకారంభమున "అభిరూపభూయిష్ఠా పరిషదియం" అని సూత్రధారునిచే బలికించెను. సకల కళాభిజ్ఞులైన విచక్షణులే శాకుంతలమును జూచి యానందించగలరు. మానవాది ధర్మశాస్త్రములు, కౌటిలీయకాద్యర్థశాస్త్రములు, వాత్స్యాయనాది కామశాస్త్రములు, భరతాది నాట్యశాస్త్రములు, సాంఖ్యయోగాది మోక్షశాస్త్రములు మొదలగువాని జ్ఞానముగల ప్రతిభాశాలులే తన కావ్యనిర్మాణసంవిధానమును గ్రహింపగలరని కాళిదాసు బహు సుకుమారముగ సూచించుచున్నాడు.

ఆరంభమందే తపోవనమునుజూపి తత్సందర్శనముచే పాఠకునియందు చిత్తసంస్కారము గలిగించినగాని కవిసార్వభౌముడు ప్రణయమహిమను ప్రదర్శించుటకు ఇష్టపడలేదు.

ఏమి! ఆ కణ్వాశ్రమముయొక్క ప్రశాంతత, నిర్మలత్వము, ధర్మోజ్జ్వలత! ఇక్కడ శాసనకాఠిన్యములేదు. భీతిలేదు. విశృంఖలతలేదు. తపస్సంయమప్రభావముచే నా వనమంతయు ఆశ్రమముగ మారిపోయినది. ప్రకృతికూడ నా సంయమము నవలంబించి ధర్మతేజమును వెదజల్లుచున్నది. మాలతీనదీ నిర్మలోదకములు నిత్యము వృక్షమూలముల క్షాళనము చేయు చున్నవి. పర్ణశాలలనుండి సతతము వెడలు హోమధూమము లచటి తరుకిసలయములకు బవిత్రత నాపాదించుచున్నవి. శుకములు నిర్భయముగ నీవారధాన్యములను ముక్కున గఱచి కొని తమ కోటరముల కెగిరిపోవుచున్నవి. హరిణములు కోమలవిశ్వాసముతో వనమందంతట దిరుగుచుండ, వాని వెంబడి హరిణశిశువులు దర్భాంకురములను గొఱుకుచు చెంగు చెంగున గంతులిడుచున్నవి. శకుంతలయు, సఖులును వనజ్యోత్స్నలతాదులకు జలసేచనము సేయుచుండిరి. ఎట్టిరమణీయత, ఎట్టి ప్రశాంతి, ఎట్టి విశ్వాసము, ఎట్టి కోమలత్వము ఈ వనాంతరమున రాజ్యము సేయుచుండెను!

అంతలో "ఆశ్రమమృగోయం నహన్తవ్యోనహన్తవ్యః" అను నొక భయానకవాక్య మీ తపోవనప్రశాంతిని భగ్నము సేయును. దినదినము ప్రీతిమై నీవారధాన్యముల దినుపించు హస్తములు, జలములను త్రాగించు హస్తములు, గాయము లకు ఇంగుదీతైలమును రాయు హస్తములును, తమయందు విశ్వాసము నే ర్పొదిసేయ పెరుగు నాహరిణశాబకములకు, పాపము! ప్రాణాంతకములగు బాణములను సంధించు కిరాత హస్తములు గూడ నుండునని యెట్లు తెలియును? ఆశ్రమ మృగములకే కాదు, అచ్చటి బాలికలకు గూడ దెలియదు. ఆశ్రమమున లతలతో, పుష్పములతో, సారంగములతో బెరు

గుచున్న శకుంతలకు తాను దుష్యంతబాణమునకు లక్ష్యమైతి నని ఎట్లు తెలియును? హరిణములు స్యందనాశ్వములకు సహితము భయపడక వ్యాధునివంక జూచుచందమున శకుంత లయు తన హృదయమున నెట్టిగాయము కాబోవుచున్నదియు నెఱుగక దుష్యంతుని "చతుర గంభీరాకృతి"ని విస్మయ ముతో జూచుచు నిలబడెను.

నఖలు నఖలు బాణః సన్నిపాత్యోఽయ మస్మిన్
మృదుని మృగశరీరే పుష్పరాశా వివాగ్నిః.

పుష్పరాశిపై యగ్నిపడినది. దుష్యంతుని బాణము శకుంతల కోమలహృదయమున నాటుకొన్నది. సంభ్రాంత చిత్తయై చూచుచున్న శకుంతల "సాధ్వసాదవచనాతిష్ఠతి" ఎక్కడిది యీభయము! ఈమోహము! ఈలజ్జ! శకుంతల యిట్టి చిత్తవికారమును బూర్వమెన్నడు నెఱుగదు. కాని యీనూతనవికారము తపోవనవిరుద్ధమైనదని మాత్రము తెలిసి కొనగలిగెను. "కిం నుఖల్విమం దృష్ట్వా తపోవన విరోధినో వికారస్య గమనీ యాస్మి సంవృత్తా" ఇది అనురాగ బీజము. శకుంతల నాగరకన్య యైనచో, నీబాణమునుండి తప్పించు కొనెడిది. కాని శకుంతల ముద్దరాలు. తపోవనమున బెరిగిన ఆబాల కేవైపునుండి యేమి వచ్చునో యెట్లు తెలియును? మన్మథుని అవిశ్వాసముతోడ జూడక పోవుటచే నామె మనో వికారమునకు బాల్పడిన దయ్యెను. "అవ్యాజ మనోహరం వపుః" స్వభావసిద్ధమైన రమణీయతచే విరాజిల్లుచున్న ఆ బాలికను "యౌవన మంగేషు సన్నద్ధమ్" యౌవన మత్తత ఆశ్రయించినది. "ప్రభాతరళము" ప్రకృతిసిద్ధమునైన సౌందర్యచాంచల్య మామెయందు మూర్తీభవించెను. అప్సర స్సంభవయగు నామెయందు నాకసుగంధము గర్భితమైయుండె.

కాన దుష్యంతుని "చతుర గంభీరాకృతి" ఆ కన్యకాహృదయమున కామము నుద్దీపనముగావించి స్వభావవేగమున విజృంభించునట్లు చేయగలిగెను.

ఈమె కేవలము అజ్ఞానయైయుండినను ఇట్లు తటస్థించెడిది కాదు. ఈతపోవనము నిర్జనారణ్యముగాదు. కాశ్యపగౌతములీవెను వాత్సల్యమున బోషింపుచుండిరి. సఖులు స్నేహరసప్రదానములచేతను, పరిహాసభాషణములచేతను సఖ్యతను గలుపుచుండిరి. శకుంతల నావరించియున్న వనము మూక ప్రకృతి కాదు. మాలతి, వనజ్యోత్స్న, వకుళ నవమల్లికా సహకారలతాగుల్మవిశేషములును, సారంగయూథములును, స్నేహరసమున గరగిపోవుచుండెను. సఖులగు ననసూయాప్రియంవదలవలె ఈ వనవృక్షములును లతలును గూడ నకృత్రిమసౌహార్ద్రము నామెయెడ బ్రసరింపజేయుచుండెను. కవి యిచ్చట జేసినది బహిఃప్రకృతి వర్ణన గాదు. శకుంతలాచరిత్రోన్మేషముకొఱకు తపోవనము నిర్మించి శకుంతల నా వనమునకు నంగభూతగా జేసెను. కావున శకుంతల సంసారవాసనలేని స్త్రీరూపము దాల్చిన ఋష్యశృంగుడు కాదు. కావుననే సంశయరహితయైన యీ శకుంతల యొక్కక్షణములో మదనునికి లొంగిపోయెను. పాషాణము బ్రద్దలగుటతోడనే గర్భితమైయున్న పర్వతఝురి స్వభావవేగమున బ్రవహింప మొదలిడెను. తపోవనతరుచ్ఛాయల బెరిగినను ఈమె తాపసుల కఠిననియమములచే బంధింపబడియుండలేదు. ధర్మభావ మీమెను పరోక్షముగమాత్ర మావహించియుండెను. అందుకనియే ఈ చిత్తవికారము తపోవనవిరుద్ధమని గ్రహింపగలిగెను. కాని భావవివశయై, చిత్తమును నిరోధింప నశక్తయై, దుష్యంతుని హస్తముల జిక్కెను.

స్వభావస్వచ్ఛందతకును, సంఘనియమములకును సంగమస్థల మునను్న గాంధర్వము కృత్రిమమునుగాదు, కేవల విశృంఖలమునుగాదు. కాని యౌవనమత్తత, సౌందర్యచాంచల్యము, విస్మయత్రాసవిహ్వలతాదులు చివుళ్లుదొడుగు యౌవనచపల ప్రణయవల్లి యీ గాంధర్వము నాశ్రయించును. శకుంతలకు తొల్లింటి నైసర్గికసరళత్వము, సహజకోమలత్వము పోయినవి. బాల్యము స్వర్గతుల్యము. శకుంతల యీ స్వర్గధామమునుండి పదచ్యుతినొంది అపరాధమున కాశ్రయమిచ్చినది. అన్యమనస్కయై చింతానిమగ్నయయ్యెను. తపోవనమంతయు నీమె దృష్టినుండి మరుగయ్యెను. తపోవననియమములు దూరమై పోయినవి. అచ్చటి ప్రశాంతి, మాధుర్యము, సరళత పూర్తిగ నష్టమయ్యెను.

తీవ్రాఘాత ప్రతిహతతరు స్కన్ధలగ్నైకదంతః
పాదాకృష్టవ్రతతి వలయాసంగసంజాతపాశః
మూర్తో విఘ్నస్తపస ఇవ నో భిన్నసారంగయూథో
ధర్మారణ్యం ప్రవిశతి గజః స్యందనాలోకభీతః.

తపోవనమంతట బ్రతిధ్వనించిన యీ కేకను శకుంతల భావావేశమున వినదయ్యెను. ధర్మారణ్యమున మత్తగజము ప్రవేశించెను. తపస్సు విఘ్నమయ్యెను. శకుంతలాస్వర్గధామము విచ్యుతమయ్యెను. అపరాధము హృదయమున బ్రవేశించి ప్రాయశ్చిత్తమును గోరుచుండెను.

విచిన్తయన్తీ యమనన్యమానసా
తపోధనం వేత్సి నమాముపస్థితమ్.

ఆహా! శాంతిభంగము దుర్వాసశ్శాపమున వజ్రబాణమువలె శకుంతలపై బడెను. కవి యిచ్చట బ్రదర్శించిన

కళాకౌశల మనన్యసామాన్యము. శకుంతల తన హృదయేశుని ధ్యానించవచ్చును. కాని తక్కిన నియమములను మఱచు నంతటి ప్రణయవేగము కూడదు. తపోధనులను సహితము ఆదరించనంతటి విహ్వలత శాంతిభంగ మనుట నిక్కము. దుఃఖానుభవముచేగాని శకుంతలకీ యావేశము చల్లారదు. ఈ చాపల్యము నశించదు. హృదయము పరిశుద్ధము కాదు. ప్రణయము ధ్రువత్వము నొందదు. నష్టమైన స్వర్గము తిరిగి ప్రాప్తించదు.

శకుంతల కిక తపోవనమునందు తావులేదు. తన యందు ప్రణయబీజము నాటిన పురుకులావతంసునియొద్దకు బోవలెనుకాని తపోవనమునుండి యామెను బంపివేయుట యెట్లు? శకుంతల తపోవనమునకు అంగభూతమైపోయెను. అనసూయ చెప్పినట్లు శకుంతలలేని తపోవనము శూన్యమే. తల్లి యంకమును వీడి శిశువు పరస్థలమున కెట్లుపోగలదు? "కథ మిదానీం తాతస్యాంకా త్పరిభ్రష్టా మలయ తటోన్మూలితా చందనలతేవ దేశాన్తరే జీవితం ధారయిష్యే" ఇట్టి వేదనతో శకుంతల తపోవనమును వీడవలసివచ్చెను. కాని తపోవనముకూడ నిట్టి వేదనయే పొందుచుండెను.

క్షౌమం కేనచి దిన్దు పాండు తరుణా మాంగల్యమావిష్కృతం
నిష్ఠ్యూత శ్చరణోపభోగసులభో లాక్షారసః కేనచిత్
అన్యేభ్యో వనదేవతాకరతలై రాపర్వభాగోత్థితై
ర్దత్తా న్యాభరణాని తత్కిసలయోద్భేదప్రతిద్వన్ద్విభిః.

ఆహా! ఏమి యీ సఖ్యరసముయొక్క ఆదానప్రదానములు! పతిగృహమునకు బోవుచున్న శకుంతలకు వనమంతయు గానుకల నర్పించి, సంతుష్టి నొందుచున్నది. ఇంగుదీ

తైలముచే గాయమును మానుపట్టించుకొన్న హరిణశాబకము శకుంతలను వీడిపోజాలకున్నది. శకుంతలావియోగభారమున

ఉద్గళితదర్భకబళా మృగాః
పరిత్యక్తనర్తనా మయూరాః
అపసృతపాండుపత్రాః
ముంచన్త్యశ్రూణీవ లతాః

మృగములు తినుచున్నదర్భలను వదలివేయుచున్నవి. మయూరములు నృత్యములను మానెను. పండుటాకులు రాల్చు లతలు అశ్రువులను వదలుచున్నట్లున్నవి. కణ్వుని కంఠము స్తంభితమైనది. తపోవన మంతయు జింతాభావముచే నాక్రందన మొనర్చుచున్నది.

ప్రకృతి నిట్లు దృశ్యమొనర్చుట కాళిదాసునకే తగినది. ఒక్క ఉత్తరరామచరిత్రమందు మాత్రము దీని ప్రతిబింబ మును గొంతవఱకు జూడగల్గుదుముకాని మఱియే యితర సాహిత్యమునందును ఇట్టి కరుణరసము ప్రకృతినుండి వెలువడ లేదు.

హస్తినాపురము కేవలము నూతనప్రపంచము. ప్రకృతికి దానికి చాలదూరము. నాగరికత తన చుట్టును ప్రాకార ములను నిర్మించుకొని జగత్తునుండి విడివడినది. "జనాకీర్ణం మన్యే హుతవహపరీతం గృహమివ" జ్వాలాచక్రముచే నావ రింపబడిన గృహమువలె నున్నదనుచున్నాడు శార్ఙ్గరవుడు.

అభ్యక్తమివస్నాతః శుచిరశుచిమివ ప్రబుద్ధఇవసుప్తమ్ ।
బద్ధమివస్వైరగతిర్జనమిహ సుఖసంగినమవైమి ॥

అని శారద్వతు డనుచున్నాడు. మునిజనమున కాపురము భయావహముగ నుండెను. ఇచ్చటి రాజశాసనమును,

భీత్యావహత్వమును వారెప్పుడును అనుభవించి ఎఱుంగరు. ఈ ద్వారములు! కృపాణహస్తులగు నీ రాజభటులు! సంశయానుమాన, భయ, కాపట్య, అవిశ్వాస, చాపల్యములను నీ కక్ష్యాంతరములు! ఈ ప్రపంచమెక్కడ? సరళవిశ్వాసము తోడను అకృత్రిమసౌహార్దము తోడను, తపస్సౌందర్యము తోడను నిండిన తపోవన మెక్కడ? ఇచ్చటనా మన ముద్దరాలు కాపురము చేయవలసినది! కాని శకుంతల కింకను రాజసౌధమున బ్రవేశించుట కర్హత రాలేదు. మహిషియై రాజశుద్ధాంతమున భాగ్యభోగముల ననుభవించుచుండినచో శకుంతల జీవనమునకు బరిపూర్ణత చేకూరదు. ప్రణయమున కిచట బూర్ణత్వ మెక్కడిది? శకుంతల దుష్యంతునకు బహు సులభముగ జిక్కుటచే శకుంతలయందుగాని దుష్యంతుని యందుగాని ఈ ప్రణయలాభముయొక్క మూల్యము స్ఫుటము కాలేదు. కావున కవి శకుంతలను రాజసౌధాంతమున నుంచుటకు కా దిచ్చటకు దీసుకొనివచ్చినది. శకుంతల దుఃఖభాగినియై, యౌవనమత్తతయు భావవేగమును నశించినగాని ప్రణయ మహిమ వెల్లడికాదు. అనుతాపము దుష్యంతుని హృదయమును దగ్ధము చేసినగాని శకుంతలాలాభము నాతడు గుర్తింపజాలడు. కవిసార్వభౌముని అపూర్వకళాకౌశల మిట్టి పట్టులనే కలదు.

భాగ్యభోగ్యములతో తులతూగు హస్తినాపురమునకు వచ్చితిమి. యౌవనమత్తతకు పుష్టిని సార్థక్యమును సంపాదింపగల యీ నగరమునకు నాయికను గొనితెచ్చిన కవిసార్వభౌముడు తన యపూర్వసంయమముచే నా ప్రణయవేగము నంతను జక్కసేయు విస్మృతిసేతువు నడ్డమువైచినాడు. గర్భవతి దిక్కులేనిదయ్యెను. పక్షి యెగదన్నుకొనిపోయినట్లు శకుంతలను మేనక ఎక్కడికో ఎగదన్నుకొనిపోయెను. శకుం

తలా హృదయమున నెట్టి దుఃఖాగ్ని రగులుచున్నదో యెవరికి దెలియును ? కవి యేకారణముచేతనో ఆ రోదనమును మనకు వినిపింపలేదు. దుష్యంతుని విస్మృతియందు బడవేసెను. శకుంతలను శాంతినిలయమునకు బంపివేసెను. మన మేకాకులమై వేలును పెదవిపైనుంచుకొని, నిశ్శబ్దముగ ఆశ్చర్యపడుచుంటిమి. భర్తచే దిరస్కరింపబడిన శకుంతలను తిరిగి తపోవనమునకు బంపక యెక్కడికో తెలియరానిచోటి కేల పంపవలసి వచ్చెనో! ఇచ్చటనే కలదు కాళిదాసు ప్రతిభా ప్రభావము. అనివార్యవేగమున బరుగిడుచున్న ప్రణయమును మనము చూచుచు చూచుచుండగనే నిస్తబ్ధత జెందించిన కవి యెంతటి క్రూరచిత్తుడో ! ఒక్క నిట్టూర్పుగూడ వినబడదు. శకుంతల ఏమనుకొనుచున్నదియు దెలియదు. పోనీ, శకుంతల యొక్క పూర్వపు నర్మభాషణములనైనను జ్ఞప్తికి దెచ్చుకొందమన్న నవియు గానరావు. అపురూపమగునట్టి స్వల్పసంభాషణముతో నాయికా నాయకుల నెడబాపిన యీ కవి కెంత క్లుప్తి ! ఎంత సంయమము ! ఏ దిక్కునను ప్రతిధ్వని కూడ వినబడదు! ఆ శాంతి దుర్భరము! ఆ నిస్తబ్ధత దుఃఖావహము.

ఓహో! హంసపదిక పాడిన ఆ గీతిక మన శ్రోత్రపుటముల నింకను బ్రతిధ్వనించుచునేయున్నది.

అభినవమధులోలుప స్త్వం
తథా పరిచుమ్బ్య చూతమంజరీమ్
కమలవసతిమాత్రనిర్వృతో
మధుకర విస్మృతో స్యేనాం కథమ్.

కవిసార్వభౌముడు ప్రణయచపలత్వము నెంత మనోహరముగ వర్ణించినాడు! ఈ చాపల్యము పోయినగాని,

విస్మృతితమస్సులు చెల్లాచెదరై ప్రణయము స్థిరసౌదామినివలె బ్రకాశింపజాలదు. ఇక్కడ కవి దుష్యంతుని అనుతాపమున బడవేసి అపరాధమునుండి మంగళమునకు దీసికొనిపోవజూచు చున్నాడు. అభిజ్ఞతచే దుష్యంతునకు గలిగిన అనుతాపము వాని హృదయమును బరిశుద్ధముచేసినగాని శకుంతలను స్వీకరించుట కధికారము లేదు. బాహ్యవిఘ్నముకా దిచ్చట డాపురించినది. బాహ్యవిఘ్నములను శాసనముచే దొలగించి బలముచే గమ్యస్థానమును జేరవచ్చును. అట్లు చేరుట లోకసామాన్యమగు మార్గము. బలము, భీతి, విజయము- ఈ మూడు మాటలలో లోకమంతయు నిమిడియున్నది. కాళిదాసోపదేశమంతయు,- ప్రణయము, అనుతాపము, క్షమ, శాంతి, మంగళము, పూర్ణత్వము— అను మాటలలో నిమిడియున్నది. విశ్వాసఘాతుకుడ నైతినని దుష్యంతు డెంత పరితపించెను ! ఈ పరితాపము ఆత్మవస్తువు. ఇయ్యది బయటిది కాదు. తప్తకాంచనమువలె హృదయము బరిశుద్ధినొందినగాని దుష్యంతుడు తపస్సౌందర్యమును వీక్షింపజాలడు. అనుతాపద్వారముననే స్వర్గప్రాప్తి సాధ్యము.

శకుంతల దుఃఖభాగినియైనది. ఇక అనన్యమనస్కయై యుండజాలదు. పార్వతి తన చలాపాంగముచేత శివుని బొందజాలకపోయెను. శకుంతల తన స్నిగ్ధవీక్షణములచేతనె దుష్యంతుని సులభముగ బొందెను. శివుని బొందజాలక పార్వతి తపస్సునకు గడంగెను. శకుంతలయో, దుష్యంతుని బొందిన మీదటనే తపస్సు చేయవలసివచ్చెను. ఎటులైనను తపస్సు తప్పదు. శకుంతల మారీచాశ్రమమున తపశ్శాలినియాయెను. దుష్యంతునకు స్వర్గప్రయాణమున తన మనోభీష్టము సిద్ధించును. ఎటుల ? యౌవనమత్తతయందున్న శకుంతలను

ఏకాంతమున జూచుటచేతనా? కాదు. ఇప్పు డదంతయు మారి పోయినది.

కథమివ సంపూర్ణమపి మే మనోరథం నాభినందామి

(ఇతి బాలం పరిష్వజతే)

అహాహా ! పుత్రాలింగనమున మనోరథము సిద్ధించినది. పుత్రాలింగనమే ప్రణయమునకు మంగళాచరణము. ఈ ముహూర్తముననే ఏకవేణీధరయగు శకుంతలాదేవి ప్రవేశించును.

వసనే పరిధూసరే వసానా
నియమక్షామముఖీ ధృతైకవేణిః
అతినిష్కరుణస్య శుద్ధశీలా
మమ దీర్ఘంవిరహవ్రతం బిభర్తి.

ఇప్పుడు దుష్యంతునకు నేత్రనిర్వాణ మొనర్చుచున్న రూపము "ప్రభాతకళాతరళజ్యోతి" గాదు. శుద్ధశీల, భరతుని తల్లి, కేవలము మాతృస్వరూపము. శకుంతల యిప్పుడు చూచుచున్నది ' చతురగంభీరాకృతి ' యగు దుష్యంతమహారాజును గాదు. పశ్చాత్తాపవివర్ణుడైన యీ పురుషు డెవరు ?

మాతః ఏష కోపి పురుషో
మాం పుత్ర ఇత్యాలింగతి.

అని భరతుడు తల్లికి తన జనకుని జూపును. దుష్యంతుడు శకుంతలాపాదములపైబడి "సుతనుహృదయా త్ప్రత్యాదేశ వ్యలీకమపైతుతే" యనినాడు. అంతటితో దుష్యంతుని అనుతాపము పూర్తియైనది. శకుంతలాదేవియొక్క దుఃఖముకూడ నంతరించినది. ఆనందము వెల్లివిరిసినది. మంగళము చేకూరినది. నిశ్చయము ! " ఉదేతి పూర్వం కుసుమం తతఃఫలం "

46

తపోవనములో వికసించిన పుష్పము హస్తినాపురములో వాడి స్వర్గములో ఫలించినది. తపోవనము సరళ విశ్వాసముతో నిండిన శైశవావస్థ. హస్తినాపురము సంసారప్రతిఘాతభీషణ మగు మధ్యాహ్నకాలము. స్వర్గము శాశ్వతానంద నిలయమగు పరిణతవయస్సు. అభిజ్ఞానశాకుంతలమున కవి భూతలమును స్వర్గధామముగ బరిణమింపజేసి చూపినాడు. పుష్పము ఫలించు నటుల మర్త్యలోకము స్వర్గమునందును, స్వభావము ధర్మము నందును, ప్రణయము మంగళముననుు, దుఃఖము ఆనందము నను, త్యాగము భోగముననుు బూర్ణత్వము నొందినవి.

1916

*

మే ఘ సం దే శ ము * *

'మేఘదూత' యందు వర్ణితమైన జీవనధార మధురమైన మందాక్రాంతావృత్తరూపమున తరంగితమైనది. రామగిరిశీత నగమధ్యస్థమైన ఆ ప్రాచీనభరతవర్షమునుండి యక్షునివలె మనమును ఒక వర్షఋతువునందేగాక, సంతతప్రవాసుల మైతిమి. ఎచ్చటి యుపవనముల వెలుగులలోని కేతకీవృక్ష పంక్తులు తెల్లని పూలరేకులతో శోభిల్లుచుండెనో, ఎచ్చట ప్రాకృతాలమునకు బూర్వమే గ్రామరథ్యలలోని చెట్లు గూండ్లను కట్టుకొను కాకాదిగ్రామపక్షుల కలకలములచే నాకులితములయ్యెనో, ఎచ్చటి గ్రామపరిసరముల జంబూ వనములు విస్తారముగబండి నల్లని మేఘములవలె నొప్పుచుం డెనో, అట్టి దశార్ణదేశ మెచ్చటికి బోయినది? వత్సరాజు యొక్క వాసవదత్తాపహరణము మొదలైన అద్భుతోపాఖ్యాన ములతో వినోదపడుచు కథాకోవిదగ్రామవృద్ధులుగల ఆయవం తీపుర మేమైనది? ఆ శిప్రానదీ తటవర్తినియగు ఉజ్జయినీ నగర రాజమో? నేడది సమస్త వస్తుసంపూర్ణమై బహువైశ్వర్యము లతో తులతూగుచుండినమాట నిజమేకాని, అంతమాత్రముచే మన స్మృతి సంపూర్ణమగునా?

జాలోద్గీర్ణై రుపచితవపుః కేశసంస్కారధూపైః
బంధుప్రీత్యా భవనశిఖిభిర్దత్తనృత్తోపహారః
హర్మ్యేష్వస్యాః కుసుమసురభి ష్వధ్వఖేదం నయేథాః
పశ్యన్ లక్ష్మీం లలితవనితాపాదరాగాఙ్కితేషు.

[ఓ మేఘుడా ! ఉజ్జయినీనగరహర్మ్యగవాక్షముల నుండి వెడలు కేశసంస్కారధూపముల పరిపుష్టశరీరుడవై, నెయ్యంపు బెంపున నేత్రోత్సవముగ నీ యెదుట నృత్యము చేయు పెంపుడునెమిళ్ల నృత్యసేవ లంగీకరించి, గృహాలంకారార్థమై చల్లబడిన పువ్వుల పరిమళముచే ఘ్రాణతృప్తి యొనర్చుకొనుచు, దర్శనీయములగు అందకత్తెల పాదముల లత్తుకజాడలు కనులపండువొనర్ప ఉజ్జయినీనగరశోభను గాంచుచు నా హర్మ్యములందు విశ్రాంతియు, వినోదము పొందగలవు.]

ఆ లలితవనితల కేశసంస్కారధూపముల పరిమళము లేశమైనను నేడు మన ముకుపుటముల జొరకున్నదిగదా! అంధకారబంధురములైన నిశీథసమయములందు ఆ భవనశిఖరములపై బరుండియుండు పారావతముల సుఖనిద్రయు, ఆ విశాలనగరపరిత్యక్తపథముల నిస్తబ్ధతయు నొకింత స్మృతికి దెచ్చుకొందుమేని, ఆ రుద్ధద్వారసుప్తసౌధములనుండి ఆ నిర్జన రాజపథములందలి సూచీభేద్యములైన తమస్సులగుండ ఉద్రిక్తకాములై స్వయముగ కాంతార్థినులై ఒంటరిగనేగు నభిసారికల హృదయస్పందనము లొకింత యూహింపగలుగుదుమేని, మదన వశంవదలైన ఆ రమణుల కాలితెన్నుల కనకనికషస్నిగ్ధమైన కాంతి నించుక ప్రసరింపజేసి మార్గమును చూపగలిగితిమేని ధన్యులమే.

ఆ ప్రాచీనభరతఖండమునందలి నదీపర్వతనగరముల నామములు సయితమెంత రమ్యములు! అవంతి, విదిశ, ఉజ్జయిని, విశాల, రేవ, శిప్ర, వేత్రవతి, చర్మణ్వతి—ఆహా! ఈ నామములయం దేదో యనిర్వాచ్యమైన శోభ, సౌందర్యము, మాధుర్యము గలవుకదా! నాటినుండియు ఆ భాష,

ఆ వ్యవహారములు, ఆ విలాసములు క్రమముగ జీర్ణించి అపభ్రంశమును బొందినవి కాబోలు. నేటి నామకరణములుగూడ నట్టి విపర్యయములలోనివే. ఆ రేవాశిప్రానిర్వింధ్యానదీ ప్రాంతములనున్న అవంతీవిదిశావిశాలాపురముల నెల్లైన నొక్కసారి ప్రవేశించి ఆ పూర్వలక్ష్మీశోభాదర్శనముచే నొక్క ముహూర్తమాత్ర మానందింపగలమేని నేటి పట్టణవిక్షోభములనుండి విముక్తిపొందగలుగుదుము. కాని, యక్షుని మేఘుము, ఏయే గిరిసరిన్నగరములమీదుగా విశ్రమించుచు, క్రీడించుచు, వినోదించుచు సంచరించెనో, ఆ మజిలీలగుండ విరహకాతరుడగు పాఠకుని దీర్ఘనిశ్వాసములు నేడు పయనించుచున్నవి. ఎచ్చట పల్లీవధువులు ప్రేమరసస్నిగ్ధలోచనలయ్యు భ్రూవిలాసముల నెఱుగరో, పరిచిత భ్రూలతావిభ్రమములగు ఎచ్చటి నెఱజాణల పక్ష్మోత్క్షేపములచే కృష్ణశబలప్రభలు కౌతూహలపూర్వకములై యిటునటు మీటిన మల్లెలవెంటబోవు మధుకరశ్రేణుల సిరిని దొంగిలించుచుండునో- అట్టి కాళిదాసుని భరతవర్షమునకు దూరమైపోతిమి. ఆ కవియొక్క మేఘుముతప్ప, నేడచ్చటకు దూతగ నేగుట కింకెవరున్నారు ?

మానవులు సముద్రములో దూరదూరముగ విసరివైచిన ద్వీపములవలె నున్నట్లొక ఆంగ్లకవి వాకుృచ్చినాడు. ఉన్నతపదమునుండి యీ లంకలను గాంచినచో, ఎవని అభిశాపముననో ఈ భరతఖండము వ్రక్కలై, ముక్కలై వాని మధ్య విలాపరాశి పొంగి పొరలి నురుగులు గ్రక్కుచున్నట్లు తోచును. ఘూర్ణమానాంభోధివంటి యీ వర్తమానమునుండి కాళిదాసమహాకవివర్ణితమైన ఆప్రాచీనభరతవర్షతలము నొక్కసారి తిలకింపుడు ! శిప్రాతీరమున రమణీయములగు శిరీషోద్యాన

ములందు కుసుమముల నేరు నా పుష్పలావికలు, అవంతీనగర చైత్యములందు ఉదయనుని ప్రణయగాథలను వినుపించు ఆ కథాకోవిదగ్రామవృద్ధులు, ఆషాఢమాసపు తొలిమేఘమును ముంగురుల నెత్తిపట్టుకొని కాంచుచు ప్రియసమాగముకొరకు ప్రాణములను నిలుపుకొనియున్న ఆ పథికవనితలు—ఆహా! ఆ నారీనరుల విలాసములలో లీనమైపోవుటకు ఏ పాఠకుని హృదయ ముప్విళ్లూఱదు ?

మన పూర్వులకు, మనకును నిగూఢమగు సంపూర్ణైక్యత లేదందుమా? ఉన్నను కాలము వారికిని మనకును నిష్ఠురమైన వ్యత్యాసమును కలుగజేసినది. కాని కవికృపవలన నా ప్రాచీనకాలము అమరసౌందర్యములకు ఆటపట్టయిన అలకాపురమైనది మనకు. మనము విరహావిధురమగు వర్తమానమునుండి యీ యలకానగరమునకు ఊహామేఘమును దూతగ పంపుచున్నాము. ఓ అలకానగరీ!

> యత్రోన్మత్తభ్రమరముఖరా పాదపా నిత్యపుష్పా
> హంసశ్రేణీరచితరశనా నిత్యపద్మా నలిన్యః
> కేకోత్కంఠా భవనశిఖినో నిత్యభాస్వత్కలాపా
> నిత్యజ్యోత్స్నాః ప్రతిహతతమోవృత్తిరమ్యాః ప్రదోషాః

ఎల్లప్పుడును వసంతమగుటచే ఉన్మత్తభ్రమరములచే ముఖరితములగు పూలచెట్లతోడను, హేమంతాదులయందును పద్మములచే శోభిల్లు తామరకొలంకులతోడను, మొలనూళ్లుగ నాచరించు హంసశ్రేణులతోడను, పింఛములు విప్పుకొని సదా నర్తించుచు కేకలిడు క్రీడామయూరములతోడను, శుక్లపక్షములోవలె నెల్లపుడు వెన్నెలచే రమణీయములగు

రాత్రులతోడను ప్రకాశించు నీవు మాకు నే డతీతమై పోతివి. నీకడకు మే మెట్లువత్తుము ?

వర్తమానముననే కాదు. సర్వకాలములందు ప్రతి మానవునిలోను అఖాతమగు విరహము గలదు. ఏ ప్రియుని గలసికొన గోరుదుమో, ఆ ప్రియుడు మానససరోవరతీరమున ఆ కైలాసశిఖరమున నివసించుచుండును. అచ్చటకు కేవలము నూహలను పంపగల్గుదుమే గాని సశరీరముగ బోవుటెట్లు ? ఓ ప్రియుడా ! నీ వచ్చుట, నే నిచ్చుట. మన మధ్యనున్న అనంతమగు నీ యంతరము నెవరు దాటగలరు ? అనంత కేంద్ర ప్రవర్తియగు ఆ ప్రియాతముని సాక్షాత్కారమును బొందగలవా రెవరు ? నేడు కేవలము భాషలో, భావములో, ఆభాసలో, ఇంగితమున, భ్రాంతియందు, వెలుగునీడలలో, జనన మరణ ముల ప్రోతోవేగముల మధ్య, వానియొద్దనుండి యేతెంచు దక్షిణపవనాంకూరలవమునే మహాభాగ్యముగ నెంచుకొనుటే కాని ఈ విరహలోకమున నింతకంటె నెక్కువ నెవ రాశింప గలరు ?

భిత్వా సద్యః కిసలయపుటాన్ దేవదారుద్రుమాణాం
ఏతత్క్షీరస్రుతిసురభయో దక్షిణేన ప్రవృత్తాః
ఆలింగ్యంతే గుణవతి! మయా తే తుషారాద్రివాతాః
పూర్వం స్పృష్టం యది కిల భవే దఙ్గమేభి స్తవేతి.

[అప్పుడే దేవదారు చిగురాకు పుటంబులవిప్పి ఆ పాలయోడికల నుబ్బు పరిమళమూని, దక్షిణముఖముగా నిచటికి వీచుచున్న మంచుగొండగాలులను ఓ గుణవతీ ! తప్పక కౌగిలింతు, అవి నీ శరీరమును ముందుగ తాకెనను తలంపుతో]

ఏమీ, యీ విరహము ! ఉభయులము, రెండువేళల వియోగవివశులమై విలపించుచున్నాము. మన మిర్వురము

నిర్జనగిరిశృంగముల నిలువబడి ఉత్తరపుదిక్కుకు జూచుచున్నాము. ఉభయులమధ్య ఆకాశము, మేఘములు, సుందరభూమి, రేవ, శిప్రి, అవంతి, ఉజ్జయిని, సుఖసౌందర్యభాగ్యభోగముల చిత్రరచనలు విస్తరించియున్నవి. ఈ రమ్యదృశ్యము లన్నియు ప్రియుని జ్ఞప్తికిదెచ్చుచున్నవే కాని సంయోగమును గూర్చుటలేదు. ఆకాంక్ష నుద్దీపింపజేయుచున్నవే కాని నివృత్తిపరచుటలేదు. ప్రియులమధ్య ఇంత యంతరమేమి ? కాని యెన్నడో మన ముభయులము ఏకలోకమున నివసించి, యిప్పు డందునుండి నిర్వాసితులమైతి మనువిషయము మనస్సున స్ఫురించుచుండును. "హృదయమందిరమునుండి నిన్ను బయటకు గెంటిన దెవరు ?" అని ఒక వైష్ణవకవి పృచ్ఛించుచున్నాడు. ఏమి జరిగినది ? నా హృద్దేశవాసి బయటి కేల వచ్చెనో ? అచ్చట స్థానములేదు కాబోలు. ఆ యైక్యమునుండి బాహ్యులమై యొండొరుల జూచుకొని నేడు వికలచిత్తుల మగుచున్నాము. విరహమునం దెంత విధురత ! ఆకాంక్షయం దెంత వ్యాకులత ! ఉభయులము తిరిగి యేకము కాజాలమా ? ఈ దూరమును దాటుదమన్న నీ విశాలభూమి అడ్డు తగులుచున్నదికదా !

శాపాంతో మే భుజగశయనా దుత్థితే శార్ఙ్గపాణౌ
శేషా న్మాసా న్గమయ చతురో లోచనే మీలయిత్వా
పశ్చా దావాం విరహగణితం తం త మాత్మాభిలాషం
నిర్వేక్ష్యావః పరిణతశరచ్చంద్రికాసు క్షపాసు.

[ఈ దుఃఖము నిరవధికము గాదు. విష్ణుమూర్తి శేషశయనమునుండి మేల్కొను నప్పటికి నాకు శాపావసానము కలుగును. శేషించియుండు నాలుగు మాసములును నెట్లో విరహతాపము నోర్చుకొని జీవించియుండుము. అటు తరువాత,

నీ విరహావస్థలో తలపోసికొనెడి సకలభోగములను శరత్కా-
లపు ముదురువెన్నెలరాత్రులలో అనుభవింపగలము.]

ఓ నిర్జనగిరిశిఖరవిరహాకాతరుఁడా ! స్వప్నమున నే
ప్రియురాలి నాలింగన మొనర్చుచుంటివో, మేఘముఖమున
నే సుందరికి సందేశము బంపుచుంటివో, ఆమెతో నొక
యపూర్వసౌందర్యధామమున నొకానొక శారదపూర్ణిమా
రాత్రిమున నీకు శాపముతీఱి తిరిగి చిరసంయోగము ఘటిల్లు
నని యీ యాశ నీకెవరు కల్పించిరి ?

ఇష్టాన్ దేశాన్ జలద విచర ప్రావృషా సంభృతశ్రీ
ర్మాభూదేవం క్షణమపిచ తే విద్యుతా విప్రయోగః

[ఓ మేఘుఁడా! వర్షలక్ష్మిచే నత్యంతము శోభిల్లుచు నీ
కిష్టమైన దేశములు తిరుగుము. నీకు నీ భార్యయైన మెఱుపు
తీగెతో వియోగము కలుగకయుండునుగాక.]

ఓ యక్షుఁడా ! నీకు చేతనాచేతనభేదజ్ఞానము మున్నే
పోయినది. ఇపుడు సదసద్వివేకమును గూండ నతిక్రమించి
తివా యేమి ! నీతోపాటు మేఘునిగూడ కృతార్థునొనర్చు
చున్నావు !

1933

*

కావ్యజగత్తు * *

మానవునకు రూపదర్శనమునందు సహజమైన ఆసక్తి కలదు. మానవుని సహజాభిలాషలలో ఈ రూపలాలస యొకటి. బాలుడు మొదలుకొని వృద్ధునివఱకు ఈ ప్రదర్శన కౌతూహలము వ్యాపించియున్నది. కేవలము సాంసారికతాపత్రయములందు జిక్కుకొనిన జననీజనకులుకూడ విరామకాలములందైనను తమ బాలబాలికల ఆటపాటలను జూచి ఆనందనిమగ్నులు కాకుండనుండజాలరు. ప్రతిమానవుడును తన రూపమును తాను తన కుటుంబముననో, తన సంఘముననో, తన దేశముననో, వ్యష్టియందో లేక సమష్టియందో—ఏదోవిధముగ అనేకదిక్కులనుండి దర్శించి సార్థకత నొందును. మానవునకు గల ఈ రూపపిపాస కేవలము కృత్రిమము గల్పితము గాదు. ఆనందరసస్వరూపుడైన ఈశ్వరునియందే ఈ రూపపిపాస కలదు. ఈశ్వరుడు కేవలము నిర్గుణుడైనచో, ఈ సృష్టికి తావే లేదు. విద్యలకును కళలకును ప్రయోజనము కాని సార్థకతకాని యుండదు. అప్పు డీ రూపములును, ఈ రూపపిపాసలును కేవలము తుచ్ఛములు, త్యాజ్యములు అగును. కావున నిరాకారుడన, అతీతుడయ్యు సర్వాకారుడై బహురూపుడై వెలయుటయని గ్రహింపవలయును. "సకామో అజాయత బహుస్యాం ప్రజాయేయేతి" అనుటచే, ఈశ్వరుని ఆనందరస మెప్పుడును భోక్తృభోగ్యరూపముల విచిత్రగతుల, విచిత్రలీలల, విచిత్రరసముల చిందుచుండును. ఈశ్వరుని యీ బహురూప సమృద్ధియే మానవునియందు

గూడ నిహితమైయుండి సకల కళలను, విద్యలను బురికొల్పు చున్నది. అనగా, ఏ సృజనాశక్తి ఏ యఖండానందరసము ఈశ్వరుని విశ్వరూపునిగ జేసెనో, ఆసృజనాశక్తియే, ఆయానంద రసమే మానవులకట్లకావ్యజగత్తునందు బరిపూర్తినొందు చున్నది. ఈశ్వరసృష్టికిని, మానవరచనకును నిజముగ భేదము లేదు. ఈశ్వరసృష్టి మానవరచనయందు చరితార్థతను, పూర్ణతను బొందునప్పుడే సృష్టిరహస్యము బుద్ధిగోచరమై, కళల ప్రయోజనము గ్రాహ్యమగును. ఋషిముఖవినిస్సృతములైన వేదము లపౌరుషేయములని చెప్పుట కిదియే కారణము.

హిమవన్నగమునందలి శిల్పముకంటె, గంగాయమునల గానమాధుర్యముకంటె, నత్యున్నతమై, అతిగభీరమై, అతిమధురమై, విశ్వమర్మభేదకమైన శిల్పకళ వేదములందు బ్రకాశించు చున్నది. వేదము కేవలము విశ్వవృక్షాగ్రమున వికసించిన సుందరకుసుమము. కావుననే ఆ కుసుమలావణ్య మెప్పటికిని వాడునదికాదు. ఆ కుసుమసౌందర్య మెన్నటికిని మాయునదికాదు. ఆ కుసుమపరిమళ మేనాటికిని క్షీణించునదికాదు. అయ్యదియే సకలవిద్యలకు, సకలకళలకు, సకలచరితలకు, సకలసాధనభజనలకు మొదలిగనిదై, యుగయుగముల దివ్యజ్యోతింబోలె మానవుని స్వర్గారోహణమునకు మార్గమును చూపుచున్నది. మానవముఖవినిస్సృతమయినను నిజమైన కవితయందు విశ్వకవియొక్క ఉచ్ఛ్వాసనిశ్వాసములే గాంచ నగును. ఆ విశ్వకవియే మానవుని జిహ్వాగ్రమున వాణీ రూపమున నృత్యముచేయుచు సకలకళలను విరజిమ్మును. మానవజిహ్వ, మానవహృదయము నెంత పరిశుద్ధమైన, ఈశ్వర వాణియు నీశ్వరరూపము నంతసుందరముగ, నంతమధురముగ నావిష్కృతమగును.

మానవునకు రూపతృష్ణ యెంతయున్నను ప్రతిరూపము నాతని నాకర్షింపదు. మన వ్యావహారికజీవితమును చుట్టుకొని యున్న రూపసమూహమంతయు వ్యవహారైకప్రయోజనమగుటచే నది శిల్పమనిపించుకొనదు. పదార్థముల వ్యావహారిక ప్రయోజనమును దెలుపు పని శిల్పముది కాదు. అర్థశాస్త్ర వాణిజ్య పరిశ్రమాదులగు జీవికాసాధనముల దావని. అవి పదార్థముల స్థూలరూపములనే వెల్లడించును గాని నిజస్వరూపమును వెల్లడించవు. కావుననే మానవుడు కేవలము వ్యవహారముతో తృప్తిపొందుటలేదు. వ్యవహారమునందును సుఖదుఃఖములున్నవి. అందు ఉత్తేజనమును గలదు. పోరాటమును గలదు. కాని ఇవియన్నియు మానవజీవితముయొక్క బాహ్యప్రవృత్తులేకాని జీవనముయొక్క ఆంతర్యమును స్పృశించునవి కాకపోవుటచే, వ్యావహారికములగు నీ జీవనపుటెల్లలను బంధనములను తప్పించుకొనుటకు మానవహృదయ మెప్పుడును పరితపించుచుండును. పదార్థములకును విషయములకును వ్యవహారము నిర్దేశించురూపముచే మానవుని రూపలాలస సంతృప్తిపడుటలేదు. కావుననే వ్యవహారప్రయోజనమునందు కలుగని సంతృప్తి నాతడు కావ్యజగత్తునందు బడయగోరును.

ప్రకృతిశాస్త్రముకూడ విషయస్వరూపమును వెల్లడించుటకు బ్రయత్నించునుగాని తత్ప్రయత్నములెల్ల విషయముల బాహ్యరూపపరీక్షతోడనే సమాప్తమగుటచే దానికి కావ్యత్వసిద్ధి లేదు. అది విషయముల యాంతర్యమును సూక్ష్మదృష్టితో జూడదు. హృదయముతో సంబంధముగల వ్యవహారదృష్టికైనను విషయములు కొంతవరకు భావమయముగదోచునుగాని హృదయమును ఇంద్రియములనుండి పూర్తిగ బహిష్కరించు ప్రకృతిశాస్త్రమున కట్టి దృష్టి లేదు. నాతోటలోని నారికేళవృక్షమును

జూచునప్పుడు నా కొకింత భావస్ఫూర్తి కలుగును. అయ్యది నా పూర్వులచే నాటబడినది. నా బాల్యక్రీడలను జ్ఞప్తికి దెచ్చుచున్నది. నా కుటుంబముయొక్క, నా వంశముయొక్క చరిత్రము అందు లిఖింపబడియున్నది. దైనికవ్యవహారసంబంధములలో గూడ హృదయమిట్లు వ్యాపించియుండుటచే సంసార మొకించుక భావాత్మక మగుచున్నది. వృక్షశాస్త్రమునం దీ భావము పనికిరాదు. మమతాగంధవర్జితమైన ప్రకృతిశాస్త్రమునకు మానవహృదయమునకు జాలదవ్వు. ప్రకృతిశాస్త్రము ఇంద్రియముల కొక విధమైన సంగత్యాగమును బోధించును. ఏ పూర్వస్మరణయు, నే రసభావమును, ప్రకృతిశాస్త్రజ్ఞుని నేత్రమును రాగరంజితము కానీయదు. ఒక విధమయిన నిర్మమత్వముతో ఇంద్రియముల నుపయోగించినప్పుడే ప్రకృతిపరిశోధన సాధ్యమగుచున్నది. కావున రాగద్వేషములకు మానాభిమానములకు పూర్వసంస్కారములకు ప్రకృతిశాస్త్రమునందు తావులేదు. కేవలము రాగశూన్యమైన ఇంద్రియానుభూతియే ప్రకృతిశాస్త్రమునకు విషయము. అట్టి యనుభూతితో పదార్థముల అంగప్రత్యంగములను విడదీసి పరీక్షించుటయే ప్రకృతిశాస్త్ర కర్తవ్యము. అట్టి పరీక్ష విషయముల స్వరూపమును వెల్లడింపగలదా? ఆ పరీక్షచే గనుగొనిన రూపమహిమ మన హృదయమును సంతృప్తిపరచునా? పుష్పదళములను కత్తితో ఛేదించి, "మైక్రోస్కోపు" అద్దముక్రింద బెట్టి చూచి, దాని నాళములను బరిశీలించినంతమాత్రమున పుష్పస్వరూపము వెల్లడియగునా? ఎప్పుడు దళములను పుష్పమునుండి విశ్లేషణమొనర్చి కత్తి నాటునకు బలియొసర్చితిమో, అప్పుడే పుష్పరూపమును వికృతమొనర్చితిమి. అదియునుగాక, హృదయమును బాఱ

దోలిన ఇంద్రియానుభూతి విషయముల స్వరూపము నెట్లు వెల్లడింపగలదు ? విషయముల సార్థకత విషయియందే కదా కలదు ? అట్టి విషయిని దూరమున నుంచి విషయము లను బరిశోధింపజూచుట వాక్యమునుండి పదములను విడ దీయుటవంటిది. పదప్రయోజనము సమగ్రవాక్యమునందే కలదు గాని ప్రత్యేకపదముల విడివిడిగ నెంతపరీక్షించినను, వాని యర్థ మించుకయైనను గ్రాహ్యమగునా ? అటులనే సకలవిషయములకు జ్ఞాతయు భోక్తయునైన మానవాత్మను నిరోధించి, విషయములు స్వతంత్రము లను భ్రమయందు పడ వేయు ప్రకృతిశాస్త్రము మానవహృదయము నెప్పటికిని సంతృప్తిపరుపదు. కాని ప్రకృతిశాస్త్రపఠనముచే సృష్టి వైచిత్ర్యములు వెల్లడియై, మనమున కొంత విస్మయము నాహ్లా దము కలుగవచ్చును. కాని ఈ చిత్తవృత్తులు నిజముగ ప్రకృతిశాస్త్రప్రకరణములోనివి కావు. విషయములను విషయి నుండి విడదీయుట యసాధ్యమనుటయే మన మిచట గ్రహింప వలసినది.

చరిత్రలుగూడ కొంత రూపప్రకటనకు గడంగును. కాని చరిత్ర కవితకాదు. చరిత్ర సృష్టికాదు. సంఘము యొక్క కొన్ని ఘటనలను కర్మలను ఉద్యమములను ఒక యనుక్రమణికగ వర్ణించునది చరిత్ర. కాలప్రవాహమున అనేకములైన మార్పులు జరుగుచున్నవి. వానిలో చక్షుర్గో చరమైన కొన్ని పైపై అలలను పరామర్శించునది చరిత్ర. ఈ చరిత్రవలన సంఘముయొక్క బాహ్యరూపము వెల్లడి కావచ్చును. దాని ఆంతర్యము గాని, సమగ్రసత్యముగాని గోచరముకాదు. చరిత్రయందు నిజముగ సత్యములేదు. చరిత్రకారుని ఇష్టానిష్టములు, వాని వివేచన, వాని పరిశీలన

ఒక విధమైన కాల్పనికజగత్తును రచించును. ఏలయన చరిత్రకారుని దృష్టి ఖండదృష్టి. విశ్వమునంతటి నాత డొక్కమారు పరికింపడు. భూతభవిష్యద్వర్తమానముల నొక్కదృష్టిలో జూడజాలడు. విశ్వమును ఖండములుగ జీల్చును. కాలమును యుగములుగ పరిచ్ఛేదించును. బింబమును ముక్కలుగచేసి చూచుటచే బింబాకృతి యెట్లు వెల్లడియగును ? చరిత్రకును, ప్రకృతిశాస్త్రమునకువలెనే, కొంతప్రయోజనము కలదు. కాని ప్రకృతిశాస్త్రమువలెనే, చరిత్రయు దేశకాలముల బాహ్యరూపమునే ప్రదర్శించునుగాని కవితవలె ఆంతర్యమును వెల్లడింపజాలదు.

ఈ విషయపరిశీలనకు తత్త్వశాస్త్రము కూడ గడంగును. కాని తత్త్వశాస్త్రము సహితము కవితకాదు. తత్త్వశాస్త్రము తర్కబద్ధమైనది. బుద్ధియొక్క న్యాయములకు లోబడినది. సత్యాసత్యము లను పరస్పరవిరుద్ధములైన ఆశయములను కల్పించుకొని అది మానవుని అనుభవములలో గొన్నిటి నంగీకరించుచు, కొన్నిటిని విసర్జించుచు, ఒకకాల్పనికమయిన సామంజస్యమును నెలకొల్పజూచును. మీమాంస పరీక్షకు సాధనమే కాని సృష్టికి తోడ్పడదు. ప్రేమయొక్క ఆకర్షణ బుద్ధిచే కట్టుబడునదియుగాదు. బుద్ధి జగత్తులో నొక విధమైన క్రమమును,-సంగతి, విరోధ, సమన్వయముల ద్వారమున ఐక్యతను, జూపుటకు బ్రయత్నించినను ఆ జగత్తు పూర్ణజగత్తు కాదు. ఎప్పుడు మన జీవనములో గొంతభాగమును విసర్జించి మిగిలినదానిపై సత్యమును బ్రతిష్ఠింప జూతుమో ఆ సత్యము ఖండసత్యమగునేకాని పూర్ణసత్యమెట్లగును ? మానవహృదయము బుద్ధి గీయు గీతలలో ఇమిడియుండుట కిష్టపడదు. మనస్సు ఇంద్రియముల నతిక్రమించి అతీం

ప్రియమైన రూపమును జూడగోరునట్లే, ఆత్మయు బుద్ధియొక్క ద్వంద్వ నిరూపణముచే బద్ధముకాక, బుద్ధినిగూడ నతిక్రమించి, సీమలేని, పారములేని, అనంతసౌందర్యనిలయమును జేరజూచును. బుద్ధి స్వతంత్రముకాదు! వెనుక ఉపలబ్ధి లేనియెడల, బుద్ధియొక్క వ్యాపారము నిలిచిపోవును. ఉన్న అనుభవములపై బుద్ధి తన అంకితములను ముద్రించి, వర్గవిభాగము చేయజూచునే కాని, లేనియనుభవమును సృష్టించలేదు. అట్టి బుద్ధి రూపముయొక్క పూర్ణసౌందర్యము నెట్లు వెల్లడి చేయగలదు? రూపము నతిక్రమింప గలిగినప్పుడే రూపముయొక్క సౌందర్యము గోచరమగును. మనస్సు రూపమునందే ఆబద్ధమైనంతకాలము రూపముయొక్క మర్మము గ్రాహ్యముకాదు. రూపారూపముల ఐక్యతను జూడగల సామరస్యము బుద్ధికందని విషయము. కవియొక్కడే అరూపుని రూపమును జూడగలడు.

వాస్తవజగత్తున కతీతమైనది, ప్రకృతిశాస్త్రము వెల్లడి చేయలేనిది, చరిత్ర వర్ణించలేనిది, తత్త్వశాస్త్రము నిర్దేశించలేనిది, కవిత కెట్లు దర్శనయోగ్యమగునని ప్రశ్నింపవచ్చును. మానవుని రూపలాలసయందున్న ఆ వేగమెట్టిది? మానవుడు తన్ను తాను తెలుసుకొనుటకు ప్రయత్నించుచున్నాడు. తన సంఘస్వరూపమును దెలిసికొనుటకు బ్రయత్నించుచున్నాడు. తనచుట్టును విస్తృతమైయున్న జగత్తుయొక్క స్వరూపమును జూడగోరుచున్నాడు. రూపముయొక్క బాహ్యరేఖలను, స్థూలాకృతినే కాక, దానిమర్మమునుగూడ విప్పిచెప్పగలిగినట్టిదే మానవహృదయమును సంతృప్తిపరుపగలదు. వాస్తవజగత్తునందు ఈమర్మము వ్యక్తమగుటలేదు. వాస్తవజగత్తు పంకిలమై ఖండఖండములై యున్నది. కావుననే మనదృష్టి దీని నతిక్రమించి, దీనివెనుకనున్న పూర్ణరూపమును జూచుటకు బరితపిం

చుచున్నది. ఇట్టి సందర్భములలో కేవలవాస్తవజగత్తును బ్రిదర్శించుటవలన మనస్సు వెగటునొందునే కాని, సంతృప్తినొందదు. కావున కవిత వాస్తవలోకపునకలు వ్రాయుట కొప్పుకొనదు. కవిత మానవునిదృష్టిని వాస్తవమునుండి పైకి నాకర్షించి, వాస్తవమువెనుక నున్న యథార్థమును, సత్యమును వెల్లడించును. మన వాస్తవజగత్తువెనుకను మూడులోకములున్నవి. కవిత ఈమూడులోకములను యథేచ్ఛగ విహరించును. ఈ మూడులోకములకును అతీతమయిన దిక్కునకు చేరగల్గినప్పుడే, ఈ త్రిభువనస్వరూపము హృద్గోచరమగును.

మొదట మన వాస్తవజగత్తువెనుక నున్నది భూలోకము, పృథివి. ఇది కేవలము యంత్రముపగిది పనిచేయుచుండు శక్తి. తన్ను తాను తెలిసికొనలేని ఒక అపారమైనశక్తి బ్రహ్మాండము నంతను యంత్రముపగిది ఆడించుచున్నది. ఈ శక్తి అమోఘము; కాని జడము. దాని ప్రవాహములో సకలచరాచరములు తృణములవలె నెగిరిపోవుచున్నవి. "భయా త్తపతి సూర్యః." సూర్యుడుగూడ భయమువలన తపించుచుండ నిక దాని సమ్ముఖమున నిలబడి 'నీ వెవ్వ'రని ప్రశ్నింపగలవా రెవరు? ఈ జడప్రకృతి మహోన్నతమైన పాషాణప్రాకారమువలె మన చుట్టును ఆవరించి యున్నది. అయ్యది బధిరము, అంధప్రాయము, మూకము నయ్యు, సమస్తమును అణచిపెట్టి నిరంకుశముగ రాజ్యము చేయుచున్నది. దాని పదాఘాతముచే భూమి కంపించుచున్నది. అగ్నిపర్వతములు బ్రద్దలగుచున్నవి. సముద్రములు ఘూర్ణిల్లుచున్నవి. జంతుసంతానము, మానవసంఘములు దద్దరిల్లిపోవుచున్నవి. దాని యట్టహాసమున సామ్రాజ్యములు రక్తపాతమున మునుగుచున్నవి. దాని వీక్షణమున లోకములు దహించుకొనిపోవు

చున్నవి. ఆ శక్తి అగ్నికంటె తీక్ష్ణమై, వాయువుకంటె శీఘ్రమై, లోహముకంటెను కఠినమై సర్వత్ర వ్యాపించి యున్నది. ఈ భూలోకమునందు పురుషుడు నిద్రించుచున్నాడు. ప్రకృతి జడమై వెలుగుచున్నది. అట్టి భూలోకముయొక్క రూపప్రదర్శనమును చేయగల్గినది కవిత. కవి యీ జగత్తు యొక్క పునాదులలో దూరి బ్రహ్మాండమున కంతకు ఆధార భూతమైన అన్నస్వరూపమును దర్శించి 'అన్నాదేవ ఖల్విమాని భూతాని జాయంతే...అన్నంవ్యజానాత్ బ్రహ్మ' యని కీర్తించును. వాని దృష్టి ఈ దేశకాలపటములను ఛేదించుకొని కారణజలములలోని మత్స్యకూర్మవరాహరూపములను దర్శించగలదు. ప్రకృతి, చరిత్ర, తత్త్వశాస్త్రముల కందని పరమరహస్యము లివి.

భూలోకము పైది భువర్లోకము. ఇచ్చటిశక్తి జడము కాదు. ప్రాణమయము. ప్రాణశక్తి త్రిభువనములనిండి నిబిడీకృతమైయున్నది. ఎప్పుడును రూపములను సృష్టించుచున్నది. తిరిగి రూపములను విలీనము చేయుచున్నది. ఇందు విధి విరామములు లేవు. నిత్యసృష్టి, నిత్యప్రళయము. జననము తరువాత మరణము, మరణము పిమ్మట జననము- దివారాత్రములవలె ఛందోబద్ధముగ నృత్యము చేయుచున్నవి. ప్రాణిని ప్రాణి హింసించుచున్నది. ప్రాణినుండి ప్రాణి యుద్భూతమగుచున్నది. ప్రాణమునందు కలయిక, ప్రాణమునందు వియోగము, ప్రాణమునందు భిన్నత్వము విచిత్రగతుల రాగప్రస్తారములవలె విలసిల్లుచున్నవి. క్షుత్తు పిపాస నిద్ర మైథునము వృద్ధి క్షయము స్వసంరక్షణము సంహారము సంతానము పారంపర్యత స్వజాత్యభిమానము జీవనసంగ్రామము— ఇవియెల్ల ప్రాణముయొక్క లీలలు. ఈ భూమి

యందు బలహీనునకు స్థానము లేదు. బలవంతునిదే రాజ్యము. సంహారమునందే స్థితి. జడమునందు ప్రాణము లేదు. ప్రాణమునందు హృదయము లేదు. ప్రాణములో ఆకర్షణకలదు. అభిమానము గలదు. కాని మృత్యువు తప్పదు. సర్వము విషాదాంతము. ప్రాణి పరుగిడి పరుగిడి, ఎగిరి ఎగిరి, తుదకు విధి యను పాషాణముపై తన శిరమును వ్రక్కలుచేసికొనును. కాని ప్రాణి నిరాశచెందియుండదు. ఎప్పుడును ఆశతో దీపించుచుండును. తుదకీ యాశాదీపము తైలవిహీనమై వెలుగక ఆరిపోవును. త్రాగినకొలదిని దాహము, తినినకొలదిని క్షుత్తు తీక్ష్ణములగును. నిత్యప్రయాస, సతతశ్రమ, అవిచ్ఛిన్నమైన పోరాటము ! ప్రకృతి యిట్లు మానవస్వేచ్ఛకు నలువైపుల పర్వతాకారముగ నిల్చి, ఎదుర్కొని, మానవుని నిత్యదాసునిగ, బానిసనుగ జేసివైచుకొనుచున్నది. ఈ పోరాటమునందు స్వేచ్ఛకు విజయము లేదు. కాలము, దైవము, విధి, ప్రకృతియు అప్రతిహతములై వైరమును బురికొల్పుచున్నవి. ప్రాణముయొక్క పల్లవి అమంగళము, నాశనము, మృత్యువు, అపజయము, దుఃఖము, శూన్యము. భూలోకగర్భమున పెనవేసికొనియున్న పెనుచీకటివంటిది కాక భువర్లోకమునందలి అంధకారము తారాస్వప్నములతో అమవసనిసివలె భాసిల్లును. కావున మఱింత భీకరమైనది. ఆశాదీపము చల్లారిన పిమ్మట నొదవు శూన్యము దుర్భరము. ఇందు వేకువకలదు. జీవముకలదు. ప్రయాస గలదు. కాని చూపులేని వేకువ, సుఖములేని జీవనము, ఫలసిద్ధిలేని ప్రయాస. గ్రీకునాటకములయందు, తదనుసరణముగ పాశ్చాత్యుల "ట్రాజెడీ"ల యందును, భువర్లోకమునందలి మానవలీలలు, అతి చమత్కృతితో వర్ణింపబడినవి. కాని ఈ ప్రాణమయజగత్తుయొక్క లోతు

పాతులు భారతకవులకే గ్రాహ్యములు. భారతకవి ఈ జగ త్తునుజూచి భీతిల్లడు. ఆమహేశ్వరుడగు శివుని పాదములక్రింద ద్రొక్కుచు నర్తించు మహాకాళీస్వరూపమునుజూచి తల్లి యని ప్రణమిల్లును. సంహారము ఒక క్రీడవంటిది. యోధు నకు రణకేళి యెట్టిదో, శక్తికి సంహార మట్టిది. కరాళివలె తన రక్తమును తానే పీల్చుకొని రౌద్రబీభత్సములం దోలలాడు చున్నది. శ్మశానము రుద్రుని ఆవాసము. కాలసర్పములు మహేశ్వరుని భూషణములు. భువర్లోకమునందలి ప్రాణస్పం దన విధానము జీవశాస్త్రజ్ఞునకు దెలియజాలదు. కాళీ ఉపా సకుడైన కవికే ప్రాణమయజగత్తుయొక్క శక్తిస్వరూపము సాక్షాత్కారమగును.

భువర్లోకముపైది సువర్లోకము. ఇందలి శక్తి జడమును గాదు, ప్రాణమునుగాదు, మనోమయము. అంధకారమును జీల్చుకొనుచు జ్ఞానకిరణము ప్రసరించినది. నిస్తబ్ధతనుండి వాగ్దేవత బహిర్గతయైనది. దుఃఖమునుండి సుఖము బయల్వెడలి నది. జననమరణములనుండి అమృతము స్రవించినది. అసత్యము నుండి సత్యజ్యోతి ప్రకాశించినది. పృథివి కేవలము స్థితి. ప్రాణము కేవలము గతి. సువర్లోకము కేవలము ఆరోహణము. పృథివియందు సంఘర్షణమే కాని జయము లేదు, అపజయమును లేదు. భువర్లోకమున అపజయము మాత్రమే కలదు. స్వర్లోకమున జయాపజయములు రెండునుగలవు. సత్యాసత్యములు, ధర్మా ధర్మములు, సుఖదుఃఖములు, పుణ్యాపాపములు రెండును పారి పార్శ్వకముగనున్నవి. మానవుని బోధమంతయు అసత్యమును విడిచి సత్యమునకు, అధర్మమును విడిచి ధర్మమునకు, దుఃఖ మును విడిచి సుఖమునకు, పాపమును విడిచి పుణ్యమునకు, నడచుచుండును. వివర్తధర్మమే వాని జీవనసాధనము.

" అసతో మా సద్గమయ. " ఈ ధర్మసమరమున అసురులకు అపజయము, దేవతలకు జయము ధ్రువము. ఈ ద్విముఖము దాల్చిన స్వర్లోకము, భయమోహముల కాకరమైనను, ఆ భయ మోహములను బారదోలు సంజీవినియు నందేకలదు. సత్యమే ముందుగ అసత్యరూపమున బయలుదేరి తుదకు తన సత్యరూప మును వెల్లడిచేయును. అసురులు కూడ ప్రచ్ఛన్న దేవతలు. రుద్రుని అంతస్స్వరూపము శివము. హాలాహలముక్రింద అమృ తభాండము దాగియున్నది.

మానవుని పాదములు పృథ్విపై నిలిచియున్నను, వాని బాహువులు భువర్లోకమునందు వ్యాపించియున్నను, శిరము మాత్రము స్వర్లోకమునందే కలదు. భూలోకము తమస్సు, భువర్లోకము రజస్సు, స్వర్లోకము సత్త్వము. ఈ మూడు లోక ములలో నేదిలేకపోయినను మానవుని ఉనికియే యసాధ్య మగును. కాని తలక్రిందు మాత్రము కాకూడదు. శిరమును భూలోకమునం దుంచినయెడల మానవజీవనము యంత్రము పగిది నిర్జీవమగును. పృథివి మానవుని పాదపీఠము. శిరస్సు స్వర్లోకమునందుంచనియెడల మానవజీవనము రాక్షసమగును. భువర్లోకము గడియారములోని స్ప్రింగువంటి ఉజ్జీవిక. అది లేనియెడల భూలోకమునుండి స్వర్లోకమునకు బోవుటకు సేతు వుండదు. ఈ రెంటిమధ్యను అఖాత మేర్పడును.

ఈ స్వర్లోకమునందలి రూపప్రదర్శనమునందు పాశ్చా త్త్యులకును, భారతీయులకును సంప్రదాయభేదముగలదు. స్వర్లోకము ద్వంద్వభూయిష్ఠమై యుండుటచే ఈశ్వరునకు శత్రు వుగ సైతానును సృష్టించవలసి వచ్చినది. ప్రపంచ విస్తా రమే పాశ్చాత్త్యులకు ధ్యేయము. ఎక్కువజ్ఞానమును, ఎక్కువ బలమును, ఎక్కువసుఖమును బొందుచుండుటయే పాశ్చాత్త్య

మానవుని ఆశయము. ఎవడు శతమానవుల బుద్ధియు, శతమానవుల బలమును, శతమానవుల ఆనందమును తనయందు వికసింప జేసికొనగలడో అతడే ఉత్తమపురుషుడు. భారతీయుని ఆశయము, మానవుడు బృహత్తరశక్తిమంతమైన మానవ రూపమును బొందుటకాదు. మానవత్వము కేవలము ఈశ్వరుని లీలాభూమి. రసికశేఖరుడగు గోవిందునియందుగాని మానవసంసారములోని దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర భావములకు బరిపూర్తిలేదు. మర్త్యలోకము అవతారపురుషులకు ధర్మక్షేత్రమేకాని నిత్యనివాసముకాదు. భారతకవి ఋషివలె మానవలీలయందు నిఖిలరసామృతమూర్తియొక్క దివ్యకళల ననుభూతము చేసికొనగల్గెను.

భారతీయుని అతీంద్రియదృష్టి స్వర్లోకమునందు బంధింపబడుట కియ్యకొనక, తదతీతమైన సత్య, తపో, మహర్లోకములను ఆధ్యాత్మికజగత్తును అన్వేషించెను. మానవుడిచ్చట బృహద్రూపమును దాల్చిన "సూపర్ - మాన్" కాదు. మానవుడు దేవత్వమున రూపాంతరము బొందును. ఇచ్చటి అనుభవము దుఃఖములేని సుఖముకాదు. సుఖదుఃఖముల కతీతమైన ఆనందరసము. ఇచ్చటినీతి అధర్మముబయట నుండు ధర్మము కాదు. ధర్మాధర్మముల కతీతమైన సాధర్మ్య మోక్షము. ఇచ్చట గోచరమగునది అసత్యమును వీడిన సత్యము గాదు. సత్యాసత్యముల నిముడ్చుకొని ద్వంద్వములకు లోబడని నిర్వికల్పమయిన అనంతసత్యము. ఇయ్యది కేవలము సాక్షాత్తు రాధాకృష్ణులు నివసించు ఆనందధామము-బృందావనము. ఇచ్చటి వృక్షము కల్పతరువు. ఇచ్చటి గోవు కామధేనువు. ఇచ్చటి పృథివి చింతామణి. ఇయ్యది అమృతనికేతనము. భూర్భువస్సువర్లోకములలో ఈశ్వరుని బాహ్యా

లీలలు మాత్రమే గోచరమగును. ఈ సత్యలోకమున ప్రకృతిపురుషుల, రాధాకృష్ణుల, అభ్యంతరలీలామృతమును పానముచేసి కృతార్థులను కావచ్చును. భారతకవి రససిద్ధు డగుటచే అన్నిలోకములను స్వేచ్ఛగ విహారించిరాగలడు. మన పురాణేతిహాసములయందు ఈ లోకములన్నియు నిజరూప మున బ్రదర్శించబడినవి. ప్రస్తుతకవు లిట్టి బోధము లేక, కేవలము తామసికాచారబద్ధులైపోయిరి. నిరంకుశత్వమును గోలుపోయి బానిసలైన కవులు త్రిలోకసంచారు లెట్లగుదురు? కవి యనగా ద్రష్ట. ఏదీ ఆ చూపు? ఆ విశ్వ రూపమును వీక్షించుచూపు కూపస్థమండూకముల కెట్లబ్బును? అలసులకు ప్రాణశక్తిక్రీడ యెట్లు గోచరమగును? సముద్రము లంఘింపగల ఆంజనేయు డేడీ నేటికవులలో? తీవ్రధర్మ సంగ్రామమున నిలబడగల కర్మవీరు డేడీ స్వర్లోకమును జితిం చుటకు? శ్రీ గోపీజనపరివేష్టితుడగు ఆ మోహనమూర్తిని దర్శింపగల భక్తుడేడీ బృందావనమును బ్రదర్శించుటకు? త్రికాలజ్ఞానము, సౌందర్యబోధము, ఆనందరసనిమగ్నత, అతీం ద్రియస్పర్శానుభూతి,— ఈ నాలుగు లక్షణములు లేనిది ఉత్తమకావ్యరచన యసంభవము. వ్యాసుడు మర్త్యలోకము నందలి ధర్మసంగ్రామ రహస్యమును అతులకౌశలముతో నుద్ఘాటించి, మహాభారతమునకు పంచమవేదమను ప్రసి ద్ధిని కలిగించెను. వాల్మీకి మానవచరిత్రయందలి భావశబ లతను కావ్యాదర్శమున ప్రతిఫలింపజేసి శ్రీరామచంద్రుని భారతీయులకు ఉపాస్యదేవతగ బ్రసాదింపగల్గెను. కాళిదాసు ప్రణయకీర్తనముచే పృథివిని స్వర్గధామమున జేర్చగల్గెను. భారతీయుల కావ్యజగత్తు పారములేని ఆనందసింధువు.

1920

*

రసస్వరూపము * *

శ్రీ రాధామాధవవిలాసగీతగోవిందకృష్ణకర్ణామృతకావ్యములందలి గీతామృతమును గ్రోలి ఎవరు భావోన్మత్తులు కాకుండనుండగలరు ? ఒక్క సంస్కృతసాహిత్యమున దక్క మఱియొకచో దుర్లభమగు నీ కావ్యవర్ణనముచే గల్గు ఆ రసావేశావస్థ అనుభవైకవేద్యమే కాని ఇట్టిదని చెప్పుట కేరి తరము ?

"వినిశ్చేతుం శక్యో నసుఖమితివా దుఃఖమితివా
ప్రమోహోనిద్రావా కిము విషవిసర్పః కిముమదః
తవస్పర్శేస్పర్శే మమహి పరిమూఢేంద్రియగణో
వికారశ్చైతన్యం భ్రమయతిచ సమ్మీలయతిచ"

అనియు, ఉన్మిషితవేద్యాంతరసంపర్కశూన్యాపరిమితభావమనియు చెప్పబడిన ఆ ప్రకాశానంద చిద్రూప మిట్టిదని నేనెట్లు చెప్పగలను? ఈ యపూర్వవస్తువును మిథ్యయని విశుద్ధాద్వైతవాదులు చెప్పెదరు గాక ! ఆ లీలామానుషవిగ్రహము అలీకకల్పన యని బ్రహ్మసామాజికు లాక్షేపింతురు గాక ! ఆ మధురరసము రక్తమాంసముల యుత్తేజనమని "ప్యూరిటెన్లు" నిషేధించెదరు కాక ! మనుష్యుడు కానివాని నే నెట్లుపాసింప గలను ? ఉపాస్యుడు మనుష్యుడు కాదనుకొనినచో రసభంగము కాక యేమున్నది ? మమతాగంధము లేని నిరాకారతత్త్వమునందు రసాస్వాదనమెట్లు ? లీలామానుషవిగ్రహము వంధ్యాపుత్రునివలె అలీకకల్పనయా ? కల్పనవలన పులకలును, అశ్రువులును కలిగినను అవి శరీరవికారములే కాని సాత్త్వికములు

కావు. మృదంగముపై దెబ్బపడుటతోడనే, కాలు నృత్యము సేయవచ్చును. కాని హృదయాంతరాళమున భావతరంగములు వాని యంతట నవియే పొంగి పొరలి, అంగములను జలింపచేసి, నృత్యశీలునిగ జేయు విషయము వేఱు, ఈ వికారములు వేఱు. పదములయందలి ఛందస్సును, ఝుంకారమును, రాగమును, మానవుని స్నాయుమండలి నుత్తేజితము చేసి, పులకాశ్రువులను అంగవిలాసమును గలిగింపవచ్చును. కాని అందు సత్యరసానుభూతి యెక్కడిది? గతానుగతికమైన సామాన్యలోకము, ముఖమున ఊర్ధ్వపుండ్రములను, కాళ్లకు గజ్జెలను, చేతుల చిరుతలను ధరించినవారి స్నాయుపీయోత్తేజనమునే రసానుభూతియని భ్రమపడుటచే గీతగోవిందాది మహాపదముల మర్యాద చెడుచున్నది.

జయదేవాదికవివరేణ్యుల సాహస మేమని చెప్పవచ్చును? సర్వాంతర్యామియు సర్వాతీతుఁడును నగు పరబ్రహ్మమును తోడిమానవునిగ జేసివైచినారే! కాని ఇది కేవలము కవిచాతుర్యమా? మానవకోటిని సృష్టించి, ధరించి, పాలించి, ప్రివర్తింపజేయుచున్నది మానవుడేనా? మానవరూపము నిత్యమైనయెడల మానవధర్మముకూడ నిత్యము కావలెను. నరరూపము నిత్యసిద్ధము కానియెడల, క్రమాగతముగ నిన్ని నరరూపము లెట్లు కలుగుచున్నవి? నరప్రకృతి అనాదిసిద్ధమే కానియెడల, నరప్రకృతి ధారావాహికముగ వికాసము నొందుటెట్లు? నరరూపము సార్వజనీనము, విశ్వగతము, నిత్యసిద్ధము. అయ్యదియే దేశకాలములయందు క్రమాగతముగ భిన్నభిన్న వ్యక్తులయం దభివ్యక్తమగుచున్నది. ఆ రూపము పూర్ణము. ఈ వ్యక్తుల రూపము అసంపూర్ణము. ఆ ప్రకృతి దేశకాలాతీతము. ఈ ప్రకృతి దేశకాలములయందు

అంశామాత్రముగ బహిర్గతమగుచున్నది. దాని పూర్ణత్వమే మన అపూర్ణత్వమునకు బ్రమాణము. మనయందు పరిణామము నొందుచున్న ప్రకృతి దానియందు నిత్యము ప్రస్ఫుటమై యున్నది.

మానవునకు సహజముగ రూపలాలస గలదు. ఇది యెక్కడిది ? సకలనారీనరులలోనున్న విశ్వమానవరూపము నకై మనచక్షువులు వెదకుచున్నవి. మనగుణములపై మనకు స్వభావసిద్ధమగు నాకర్షణ కలదు. మనహృదయము ఆ యనంతగుణునికొరకు అన్వేషించుచున్నది. మన ఇంద్రియ ములు, మన ప్రాణము, మన మనస్సు, మన బుద్ధి- సర్వస్వము ఆ లీలామానుషవిగ్రహమును దెలిసికొనుటకు, జూచుటకు, స్పృశించుటకు, భోగించుటకు, వ్యాకులత నొందుచున్నవి. మానవుని సకలప్రయత్నములును, సమస్తోద్యమములును, నరునియందుండు నరోత్తముని, పురుషునియందుండు పురుషోత్తముని బొందుటకై ఆయాసపడుచుండును. నరోత్తమునికొఱకు నరుడు, నరునికొఱకు నరోత్తముడు అనవరతము నన్వేషించు చున్నారు. కావుననే ఒకనరుడు ఇంకొక నరుని గుర్తింప గలుగుచున్నాడు, ప్రేమింప గలుగుచున్నాడు. తానెఱుగని పదార్థముకొఱకెవడైన ప్రయత్నించునా ? భగవంతునకును, మానవునకును, సజాతీయధర్మము లేనియెడల మనము వానిని భజింపలేము. భావైక్యత లేనిచోట భజన యెట్లు సాధ్య మగును ? ఈశ్వరభజన సాధ్యముకావలె ననిన, మానవు డైనను ఈశ్వరుడు కావలెను, ఈశ్వరుడైనను మానవుడు కావలెను. క్రైస్తవసాధనలలో ఈశ్వరుని, స్వర్గమునుండి క్రిందికి దింపి మానవునిగజేసి భజనను సంభావ్యము చేసినారు. హిందువులు ఈ మనుష్యునే పైకెత్తి బ్రహ్మముతో నేకము

చేసినారు. ఈశ్వరుని క్రిందికి దింపినచో ఈశ్వరత్వము నష్టమగును.

ఈశ్వరునికి మానవత్వము, సత్యమా లేక ఆరోపితమా? ఈశ్వరమానవత్వములు పరస్పర విరుద్ధములైనచో, ఈశ్వరుడు నిజముగ మనుష్యుడు కాలేడు. కొందఱు తత్త్వశాస్త్రజ్ఞులు ఈశ్వరుని మానవత్వమును మాయక్రింద గొట్టివేసిరి. "సంభవామి" యను గీతావాక్యమునకు శంకరులు వ్యాఖ్యానము సేయుచు "ఇవ" యని "మనుష్యునివలె" అని చెప్పి, మనుష్యత్వమును మాయావస్తువుగ సూచించిరి. క్రైస్తవులలో గూడ మాయావాదమున్నది. ప్రాచీన క్రైస్తవులలో గొందఱు క్రైస్తవలీలలను "Apparent" అని నుడివిరి. శంకరుని "ఇవ" శబ్దమునకును, క్రైస్తవుల "అప్పేరెంటు" పదమునకును విశేషవ్యత్యాసము లేదు. కొంద ఱాచార్యులీ స్వవచన విరోధమును ఖండించి "గూఢం పరబ్రహ్మ మనుష్యలింగం" పరబ్రహ్మముయొక్క నిగూఢస్వరూపము నరలింగమనిరి. "ఉత్తమం రహస్యమ్" అనుటచే పరబ్రహ్మము నిత్యసిద్ధమైన నరలింగము గనుకనే, గీత క్షరాక్షరముల నంతర్భుక్తము చేసికొనిన పురుషోత్తమస్వరూపమును నిర్దేశించినది. శ్రీమద్భాగవత మింతటితో నాగలేదు. పురుషోత్తముడు నిఖిల రసామృతమూర్తియనికూడ నిరూపించినది.

రసవస్తువు ఇంద్రియప్రత్యక్షము కాదు. అంతరంగానుభవైకవేద్యము. ప్రేమ నెవరును గంటితో జూడలేరు, చెవులతో వినలేరు, రసనతో రుచిచూడలేరు. కాని ఇంద్రియములకును రసమునకును ఘనిష్ఠసంబంధము గలదు. రూపము నాశ్రయించక, ఇంద్రియప్రేరణము లేక ప్రేమకు జన్మలేదు, వికాసము లేదు. ప్రేమ రూపము నాశ్రయింపక ప్రకాశింప

జాలదు. వత్తియందు బుట్టియు వత్తి నతిక్రమించు దీపశిఖ వలె ప్రేమ, ముఖమండలమునందు, కనుదోయియందు, అంగ విలాసమునందు, తనుకాంతియందు, పుట్టి వానినెల్ల నతిక్రమించును. మనస్సుయొక్క భావమాత్రములైన కామక్రోధా దులు శరీరమున సకలావయవములందును సాత్త్వికభావచేష్టా విలాసాదులలో విశిష్టరూపమున బ్రకాశించును. ప్రేమో న్మత్తుని రూపమును జూచి వాని ప్రేమోన్మాదమును గ్రహింప గలుగుదుము. ఎప్పుడు రసము లోపలినుండి అంగప్రత్యంగ ములయం దుబికి విలసిల్లునో అప్పు డా రూపము రసమూర్తి యగుచున్నది. అట్టి సకలరసమూర్తులును రసోద్దీపకములై భోగ్యము లగుచున్నవి. రసవిలాసము ప్రత్యక్షమైనప్పుడు నాకును నాలోపల రసోదయ మగును. అచేతనముగ నుండిన భావము సచేతనమై మనోవీధుల విహరింపజొచ్చును. హాస్య రసము నాస్వాదించునపుడు అధరములపై హాసము వెలుగొం దును. ప్రేమవివశమైనమూర్తిని గాంచినప్పుడు మనయందును ప్రేమోద్దీపనము కల్గును. లోపలి రసమునకును, బయటి రూపమునకును, నిబిడసంబంధము లేనియెడల, మానవుని యందు నిద్రాణములైయున్న రసములు మేల్కొనజాలవు. ప్రతి రసమునకు విశిష్టమగు స్వరూపము కలదు. దాని నాశ్ర యించియే ఆ రసము పొంగును. ఆయాలంబనమే లేనియెడల రసమునకు నుత్పత్తియు భోగ్యత్వము నుండదు. ఎవని యందు సకలరసములు మూర్తిమంతములై యున్నవో, మన హృదయభావము లెవని అన్వేషించుచున్నవో, ఎవని ఆభాసను బొందినంతమాత్రమున సుప్తరసములు మేల్కొని నృత్యము సేయజూచునో, వానినే నిఖిలరసామృతమూర్తి యని చెప్ప నగును.

శ్రీ జయదేవకవి శ్రీకృష్ణుని రసవిలాసమును రూప సంపదలతో జిత్రించి ఇంద్రియానుభూతికిని అతీంద్రియమగు రసానుభవమునకునుగల నిగూఢనిబిడసంబంధమును నిరుపమానముగ బ్రదర్శించెను. ఇంద్రియములన్నిటికిని నా యమృతమూర్తికొఱకు నిత్యపిపాస కలదు. కాని ఆ యమృతమూర్తిని ఇంద్రియరాజ్యమున అనుసంధానము సేయలేము. ఆ వస్తువు అతీంద్రియరాజ్యమునుండి ఆత్మయొక్క దహరాకాశము నుండి ఇంద్రియసమ్ముఖమున విద్యుల్లతవలె ఒక్క క్షణములో మెఱసిపోవునుగాని స్థిరసౌదామనియై వెలుంగదు. అందుకనియే చక్షువులు ప్రతిరూపమునందును భ్రమరమువలె వ్రాలుచు, చంచలములై తిరుగుచున్నవి. ప్రీతిజనకమగు ముఖమును తిరిగి తిరిగి చూచుటకు ఇచ్ఛగలుగును. కన్ను, ఆప్రీతి రూపములోనున్నదని భావించి కొంచెము చూచి, కనుగొనలేక ఆయాసపడును. సకలేంద్రియముల యవస్థయు నిట్టిదే. ఆ యమృతమూర్తి చిక్కదు. ఇంద్రియములు దానిని పట్టుకొనలేక శ్రాంతిజెందుచున్నవి. ఎట్టిభ్రమ! ప్రాణతుల్యమైన ఆ మోహనవిగ్రహమును, ఆసుందరమధురరూపమును అనుభవముచే దర్శింపనంతవఱకు, గీతగోవిందాదిసంకీర్తనములను పాడినను, వినినను, వట్టి వేడుకయే. కృష్ణకర్ణామృతమును దెఱచి అందు శ్రీకృష్ణుని రూపగుణలీలలను జదివి ఆనందించునపుడు, శ్రీకృష్ణుడు ఈశ్వరుడా మనుష్యుడా యని ప్రశ్నింపకుము. ప్రశ్నించితివా, ఆనందసాగరమంతయు నొక్క నిముసములో ఇనికిపోవును. హృదయము శుష్కించిపోవును. నాప్రాణమర్మమున, ప్రకృతియొక్క హృదయమధ్యమున, తీవ్రముగ బాధించుచున్న పిపాసను తృప్తిపరుపగలవా డెవ్వడు? అతడు నా ప్రాణమర్మపటమున బొడకట్టిన సుందరరూపుడు

కానిచో నా పిపాసతీరుటెట్లు ? ఈశ్వరుడు అరూపియా ? నేను చూడ గోరుచున్నది రూపము. ఈశ్వరుడు అరసుడా ? నేను భోగింప గోరుచున్నది రసము. ఈశ్వరుడు అగంధుడా ? నేను గంధమును గోరుచున్నాను. ఇంద్రియశాంతికొఱకు ఆనందద్వారమును బంధించుటకు నేనొప్పుకొనను. ఆనంద ద్వారమును బంధించితినా, నామనుష్యత్వమే పోవును. నేను గాని దానిని నే గోరుటెట్లు ? ఈశ్వరుని అశబ్దస్పర్శరూప రసగంధునిగ జేసి, ఈ శబ్దస్పర్శరూపరసగంధములను తృప్తి పరుపజాలము. కాక, ఈ గుణములను మనుష్యునిపరము చేసి నే నెట్లు సార్థకము చేసికొనగలను? నాలోని మనుష్యునివదలి వెలుపల నేదో ఉన్నదని అనుకొనుటచే నాకు తృప్తి లేదు. అది నన్ను భ్రమింపజేయజాలదు. సఖుని కౌగిలించుకొని ప్రాణము తృప్తినొందజూచునుగాని, సఖుడు పూర్ణతృప్తినీయ జాలడు. ఎవడో రహస్యముగ నిద్దరిలోపల వెలుపల నుండి, మా యతృప్తిచే, తనవైపునకు ఆకర్షించుచున్నాడు. "jove in me nods to the jove in you" అనినాడు ఎమర్సనుకవి. సఖులు ఎంత సమీపమున నుండినను, అంతదూరమయ్యెదరు. ఎంత తృప్తియుండునో, అంత క్షుధ యుండును. మనుష్యుని వదలినను తృప్తి లేదు. కూడుకొనియుండినను తృప్తి లేదు. నా ప్రాణము గోరుచున్నదేమి ? ఎవడు ఇంద్రియవర్జితుం డయ్యు సర్వేంద్రియగుణాభాససంపన్నుడై యున్నాడో, ఎవని యందు కల్పన వాస్తవమును, వాస్తవము కల్పనయు అగు చున్నదో, ఎవనిని జూచియు జూడలేకపోవుచున్నానో, ఎవ్వని స్పృశించియు స్పృశింపలేకున్నానో, సర్వరసము లందు మునిగియు ఏ రసమునను వాని పూర్ణానుభూతి నంద జాలకున్నానో ఆ సఖుడు, ఆ వల్లభుడు, ఆ రమణుడు నాకు

గావలెను. వాని ప్రత్యంగసాంగత్యముకొఱకు నా ప్రాణము తహతహలాడుచున్నది. నా ప్రాణము స్వర్గములోని ఈశ్వరుని గోరుటలేదు. మర్త్యస్వభావముచే, ఉపచయాపచయశీలము గలిగి, రోగశోకజరామృత్యువులచే బీడింపబడు మానవుడును గాదు నాకు గావలసినది. నా ప్రాణము మనుష్యునే గోరుచున్నది. కాని, రోగములేక జరాభారములేక నిత్యానందుడై రసస్వరూపుడై సకలకామములను నివృత్తిచేయగల్గి, దేహేంద్రియప్రాణమనోబుద్ధిచిత్తాత్మలచే ననుభావ్యుడై మానవత్వమును సమగ్రమును సంపూర్ణమును సార్థకమును జేయగల నిఖిలరసామృతమూర్తియగు మనుష్యుడు నాకు గావలెను. ఈ మూర్తిని ఈ విగ్రహమును బ్రదర్శింపగల కవి, గాయకుడు, చిత్రకారుడు, శిల్పియు నేరీ? ఎచ్చటను కానరారు. ఆంశిక భావమున నితరులీ చిరసుందరుని జిత్రించిరి. భాగవతము, గీతగోవిందము, కృష్ణకర్ణామృతము, ఛాయామాత్రముగ సూచించెను. కాని విశ్వేషముగ వ్యక్తీకరించుట అసాధ్యము. ఎవరును పరమతత్త్వమును విశుద్ధమానవప్రకృతిసంపన్నునిగ వర్ణించుటకు సాహసింపలేదు. వానియందు సఖ్యవాత్సల్య మాధుర్యాది రసప్రబోధమునుమాత్రము దిఙ్మాత్రముగ సూచించిరి.

సంసారమున నీ సఖ్యవాత్సల్యాది సంబంధము లున్నను రసానుభవముమాత్రము దుర్లభము. ఈ సంబంధములకు రెండు విశేషధర్మములు గలవు. (1) తరళత (2) ఆనందము. తరళత యనగా సర్వత్ర సంచారము చేయునది, అందఱిలోను బ్రవేశించునది. ఆనందము సంచరించుచోట సుఖము ఉత్ఫుల్లమగును. సర్వసంచారశీలము, సర్వానందదానము రసము యొక్క ముఖ్యధర్మములు. ఈధర్మములించుక సంసారమునందు గలవు. సాంసారికసంబంధములు తరళములును, సుఖమయము

లును నగును. నిశ్చయమే. కాని వానికి వికాసములేదు. ఆ సంబంధములు దేహప్రాణమనఃపర్యంతమైనను బూర్తిగ వ్యాపింపలేకున్నవి. ఇక నతిక్రమింప జాలవని వేఱుగ జెప్పనేల ?

దేహప్రాణమనముల నాక్రమించి, వాని నతిక్రమింపనంతవరకు వానిని రసములని యనుటకు వీలులేదు. సఖ్యరసమును జూడుడు ! సఖ్యసంబంధ మెప్పుడు దేహప్రాణమనముల నావరించి, అతిక్రమింప నారంభించునో, సఖునిజీవన మపుడు సుఖమయమగును. పంచేంద్రియములును సఖునిబొందుటకు వ్యాకులత బొందును. మనస్సు అవిరామముగ సఖునిరూపమును ధ్యానించుచుండును. రెండు దేహములలోను ఒక్కప్రాణమే స్పందించును. సుఖదుఃఖములయందు ఐక్యత ఏర్పడును. జాగ్రదవస్థ స్వప్నమువలె గన్పట్టును. దేహము, ప్రాణము, మనస్సు పరస్పర సమగ్రతకొఱకు అనవరతము వేదన నొందుచుండును.

దేహమున స్నాయుమండలి ఉత్తేజమునొందును. ప్రాణమున ఆకాంక్ష జ్వలితమై విజృంభించును. మనస్సు భావనలచే నూతన జగత్తులను గల్పించుచుండును. కనువిచ్చినను, మూసినను పరస్పరరూపావలోకనము సిద్ధముగనుండును. శ్రోత్రగోచరము కాకపోయినను, శబ్దము వినబడును. బహిరింద్రియసాక్షాత్కారము లేకున్నను పంచేంద్రియములు సఖులసంగమును బడయజేయును. స్వేదము కంపము పులకాశ్రువులు మొదలగు సాత్త్వికలక్షణములు ప్రకాశించును. అప్పుడు దేహమునకును, ఆత్మకును, ఇంద్రియములకును, అతీంద్రియమునకును గలభేదము సమసిపోవును. శరీరమును, అశరీరము నేకమగును. ఆత్మ దేహధర్మమును, దేహము ఆత్మధర్మమును బొందును. ఆత్మ దేహమునందు వ్యక్తమగును. దేహము ఆత్మయందు లీనమగును. ఈ యపూర్వావస్థ యిట్టిదట్టిదని

వచింపరానిది. ఎవడు సఖ్యరసము నొక్కకణమునైన నాస్వాదించునో వానికిది కల్పనకాదు. శైశవము పోయి యౌవనమంకురించు ప్రదోషకాలమున సఖ్యరసాస్వాదనమన నెట్టిదో యించుక తెలియని హతభాగ్యు డెవడుండును ?

రసమనునది మానసవస్తువా ? కాదు. దైహికమా ? కాదు. అయ్యది మానసవస్తువు కావచ్చును. కాని ఆ మానసము ఇంద్రియవిహీనమైన మానసము కాదు. అయ్యది ఆత్మవస్తువు కావచ్చును. కాని ఆ యాత్మ శరీరాతిరిక్తమైన యాత్మకాదు. అందు శబ్దాశబ్దములు, రూపారూపములు ఒక్క యనుభవమున మిళితము లగుచున్నవి. ఈ వస్తువు కేవలము ఆధ్యాత్మికభావమని జెప్పుట ఎంతయబద్ధమో, రక్తమాంసము యొక్కగాని స్నాయుమండలియొక్కగాని ఉత్తేజనమని జెప్పుటయు నంతే యబద్ధము. రసము సకలశరీరధర్మశూన్యమని గాని, ఇంద్రియసంపర్కవివర్జితమనిగాని చెప్పువారికి రసస్వరూప మెట్టిదో తెలియదు. వారికి రసాస్వాదన భాగ్యము లభించలేదని యర్థము. ఈ రసము నింద్రియవికారమని చెప్పు వానికి రసమన్న మొదలే అగ్రాహ్యవిషయము. అతీంద్రియము, ఇంద్రియముల నాశ్రయించి తన్ను దాను వికసింప జేసికొనుచున్నది. ఈ వికాసమునందే రసము వ్యక్తమగుచున్నది. రసము ఇంద్రియరాజ్యమున జన్మించి, అతీంద్రియ రాజ్యమున లీలను జూపుచున్నది. ఈ మర్మమును దెలిసికొన గలిగినవారే రసవస్తు వెట్టిదో చెప్పగలరు.

వస్తువుల అనుభవము మొదట ఇంద్రియసహాయముతో ఉత్పన్నమగును. ఈ యనుభవము, రసము నొక్కటికాదు. (అను-పశ్చాత్ భవ-జన్మము) ఇంద్రియములవలన గలిగిన సాక్షాత్కారము అనుభవము (Perception). ఈ యనుభ

వము సకలమానవులకే కాక, సమస్తకీటకపశుపక్షిజంతుజాలమునకును సామాన్యము. ఈ యనుభవము రసము కాదు. రసవస్తువు దీనికి భిన్నమైనప్పటికిని దీని నాశ్రయించియే యుండును. ఇంకొక విధమున నుండుటకు వీలులేదు. రసము అనుభవాధీనము. అనుభవము ఇంద్రియాధీనము. అనుభవవిహీనమైన రసము వస్తుతంత్రవిహీనమైన కల్పనమే కాని, వాస్తవముగాదు. కావున ఇంద్రియసాక్షాత్కారమున నుత్పన్నమైన అనుభవమునందుగాని రసము జన్మింపదు. కాని అనుభవము ఇంద్రియముల నతిక్రమించి నిలువజాలదు. రసమన్ననో, యనుభవమునందు జన్మించినను ఆయనుభవము నేగాక వర్తమానాతీతములైన యనుభవములనుగూడ మేల్కొల్పి వానినెల్ల నతిక్రమించును. చక్షువు తక్కిన యింద్రియముల కార్యమును చేయజాలదు. ఇంద్రియానుభవము రసముగ బరిణమించుటతోడనే రూపసంస్పర్శవలన చక్షువులకే కాక, సకలేంద్రియములకును పిపాసను గల్పించును. చక్షురింద్రియానుభవమునందు కేవలము రూపము, వర్ణము, ఘటన యను జ్ఞానము మాత్రమే యుండును. ఆ యనుభవమెప్పుడు రసముగ బరిణమించునో, యప్పుడా రూపము కేవలము చక్షుర్గ్రాహ్యరూపము గాదు. రసావేశమున గోచరమగురూపము బుద్ధిగ్రాహ్యరూపము, ధ్యానగమ్యరూపము, చిన్మయము. ఎవరు చక్షుజన్యమైన అనుభవమునందు, ప్రమోదమును బొందుచున్నారో వారియందు రసోదయము కానున్నదని చెప్పవచ్చును. "యతో భావ స్తతో రసః". పేరు వినినంతమాత్రముననే సకలేంద్రియము లున్మత్తములైనప్పుడు రసావిర్భావమైనదని తెలిసికొననగును. అప్పుడు ఒక్క యింద్రియమే తక్కిన ఇంద్రియముల పనినిగూడ జేయగలుగును. ఇది ఇంద్రియ

రాజ్యమునుండి యతీంద్రియమునకుబోవు నవస్థాసూచకము. అనుభవము బీజము. రసము వృక్షము. రసమనగా ఇంగ్లీషులో జెప్పబడు "ఫీలింగు" కాదు. దేనిని ఆలంకారికులు "రొమాన్సు" అని అనెదరో అది కొంతవరకు రసస్వరూపమును అంశామాత్రముగ నిర్దేశించును. రసము ఇంద్రియముల బుట్టి, ఇంద్రియముల నతిక్రమించుటయే కాక ఇంద్రియగ్రామమునుగూడ నతీంద్రియమగు రసరాజ్యమునకు గొంపోవును. రసవస్తువు ఆనందసేతువు— ప్రత్యక్షము నప్రత్యక్షమునకును, రూపము నరూపమునకును, ఇంద్రియముల నతీంద్రియమునకును, దీసికొనిపోగల ఆనందసేతువు. అప్పుడీ చక్షువులు చర్మచక్షువులు గావు. అవి రసచక్షువులు. అప్పుడీ శ్రోత్రములు శ్రోత్రములుగావు. అవి రసశ్రోత్రములు. "నేత్రస్య నేత్రం, శ్రోత్రస్య శ్రోత్రం, ప్రాణస్య ప్రాణం, మనస్య మనః" నూతననేత్రము, నూతనశ్రోత్రము, నూతనప్రాణము, నూతనమనస్సు, నూతనబుద్ధియు నుదయించును. అప్పుడే కవి యోగియై శ్రవణదర్శనాదులచే రససిద్ధినొందును. సకల విశ్వము ఒక్కొక్క సంబంధమున ఒక్కొక్క విశ్వరూపముదాల్చి సహస్రశీర్షుని విశ్వలీలను బ్రదర్శించును. అప్పుడు నరరూపము నరప్రకృతియు, ఈశ్వరరూపమునకు ఈశ్వరప్రకృతికిని భిన్నములుగ గన్పట్టవు. పరాపరప్రకృతులు క్షరాక్షరములు పురుషోత్తమునియం దొక్కటేయను ఉత్తమ రహస్యము వెల్లడి యగును. శాంతి, దాస్య, వాత్సల్య మధుర మహాభావములును, శృంగారవీరకరుణాద్భుతరౌద్రభయానకహాస్యబీభత్సాదిరసములును, సృష్టిస్థితిలయాద్యవస్థలును ఆ నగోత్తముని లీలారూపములై భోగ్యవస్తువు లగును.

1917

*

రూపాంతరము * *

రసము బుద్ధిగోచరమగు బాహ్యవిషయముగాదు. అది యనుభవైకవేద్యమగు ఆంతరంగికవస్తువు. రసానుభవమును రూపద్వారమున బ్రకాశింపజేయు విద్యను శిల్పమనిగాని కళ యనిగాని అందురు. కల్పనయందు ప్రకాశించు సౌందర్యమును సత్యమున బ్రతిష్ఠించుటయే కళలయొక్క ప్రయోజనము. రూప,వర్ణ,గంధ,స్వరములచే మనస్సులో భావములు ప్రతిబింబించునప్పుడు మానవుని ప్రాణనికుంజమున రసస్ఫూర్తి యగును. రూపవిలాసములచే, వర్ణక్రీడలచే, శబ్దచ్ఛందస్సుచే, హృదయ వంశీగానము బయల్వెడలునప్పుడు విశ్వమంతయు సుందరరూపముతో విరాజిల్లును. హృదయముయొక్క జడత్వము వీడిపోవును. ప్రకృతివైచిత్ర్యములు మాధుర్యమయము లగును. ఆత్మ ఇంద్రునివలెనె సహస్రనేత్రములతో దిలకించును. విశ్వము తన మేలిముసుగును తొలగించుకొని వినిర్మలమందహాసరుచులను నలుగడల బ్రసరింపజేయును. అపుడు గ్రహనక్షత్రములు, ఋతుక్రమము, తరుగుల్మలతాదులు, నదీనదములు, నూతన విలాససంపదలతో దనరారును. అభ్రభేదియగు హిమవన్నగమును, ఉత్తుంగతరంగితమగు విశాలసాగరమును రూపముయొక్క అనంతమైన అరూపమును వెల్లడిచేయును. మనఃకల్పితములగు రూపారూప, శబ్దాశబ్ద, రసారస, గంధాగంధముల భేదములు మాయమైపోవును. ఆయుద్దీపనావస్థను వర్ణించుట యెట్లు ?

హృదయమణికోటరమున బ్రచ్ఛన్నముగ నుండు ఆత్మజ్యోతి బహిర్గతమై ప్రకాశింప నారంభించినయెడల ఆ వెలుగును మఱుగొనర్చుట యసంభవము. ఆత్మ తన వికాసముననే తాను బ్రకాశించును. అందుకనియే కవులు, శిల్పులు, కళానిపుణులు, తమ జీవనాంతరాళమున బ్రజ్వలింపుచుండు దివ్యజ్యోతిని జేతబుచ్చుకొని ప్రతిహృదయద్వారమందున నిలబడి, అం దారిపోవుటకు సిద్ధముగనున్న దీపములను జాజ్వల్యమానముగ బ్రకాశింపజేయుటకు బ్రయత్నింతురు. భరతవర్షమున జిరకాలమునుండియు, కవిశేఖరులు, కళావిదులు, శిల్పులు బయల్వెడలి తమతమ రసానుభవములను బ్రకటించు రచనలమూలమున, దేశమును బ్రజ్వలింపజేసిరి. భరతవర్షమింకను ఆత్మవికాసము నొందునుగాక! ప్రతి గృహమునందును ఆత్మజ్యోతి ప్రజ్వలించునుగాక! ఆ హృదయవంశీగానమును విచిత్రరీతుల, అనేకగతుల నాలపించెదముగాక! ఆత్మోద్దీపకములగు గానములను, కావ్యములను, శిల్పములను, కళలను బోషించుకొనెదముగాక. అప్పుడు మన యాకర్షణ వలననే ఈ గ్రహతార లన్నియు దిరుగుచున్నవనియు మన కాంతియే సూర్యచంద్రాదులకు తేజమొసగుచున్నదనియు దర్శించెదము. ప్రాణముయొక్క రహస్యవీధుల విహరించి జీవనముయొక్క ఏకాంతగోష్ఠీమర్మమును దెలిసికొనుచు ముందుకు అడుగిడెదము. ఆత్మచింతామణిని గైకొని, దాని స్వప్రకాశత్వమున జగత్ప్రకాశమును వీక్షించెదము. పాఠక మహాశయులారా! కవులును శిల్పులును బొందిన ఆ రసావేశావస్థ యెట్టిదో తెలిసికొనుటకు మీరు కుతూహలులగుట లేదా? ఆ మధురరసామృతతరంగిణీప్రవాహసరణిని తెలిసికొనుటెట్లు?

సామాన్యజ్ఞానమువలనను, మీమాంసాశాస్త్రము యొక్క తర్కవితర్కములవలనను, ప్రాణముయొక్క అంతర వస్తువగు రసము లభ్యముగాదు. మనము ఇంద్రియతరంగ ఫేనములో జిక్కుకొని, ప్రాణముయొక్క ఆ అంతస్తత్త్వ మును దెలిసికొనలేకున్నాము. మన చర్మచక్షువులు చూచు చున్నది రూపమును. ఇది బాహ్యవిషయము. కాని మనయందు స్నేహము, భక్తి, ప్రేమ మేల్కొనినప్పుడు మనకనులు చూచు నది ఆ రూపమునుగాదు. ఆ రూపముయొక్క రూపాంతర మును. "బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్" అని గీత నుడువు చున్నది. "ప్రేమచక్షువునకు గాని నందనందనుడు గోచ రింపడు" అని భక్తశిఖామణియగు మీరాబాయి గానము చేసినది. ఆప్రేమాంజనము మనయొద్ద లేనియెడల ఎన్ని యుప న్యాసములను జడిపినను, ఎన్ని వాదప్రతివాదములను జరిపి నను, ఎన్ని తర్కవితర్కముల గావించినను, రూపాంతరవిషయ మగ్రాహ్యము. బాహ్యమును వీడుడు. మీ ప్రాణముయొక్క అంతరమున బ్రవేశింపుడు. అచ్చట సింహాసనాసీనమైయున్న దెవరో చూడుడు! ఆ రాజ్యమెంత జాజ్వల్యమానముగ బ్రకా శించుచున్నది! ఆ సింహాసనము సత్యము. దానిపై నధిష్ఠించి నది ప్రేమ. ఎప్పుడు ప్రేమ సత్యప్రతిష్ఠితమగునో అప్పుడే విశ్వము రూపాంతరము నొందును. ఇది కవితయొక్క యుత్కృష్టధర్మము. ఇదియే శిల్పముయొక్క చరమప్రయో జనము. ఇదియే కళలయొక్క పరమసాఫల్యము. మనము పుష్పమును జూచినంతనే యొకరూపము గోచరమగును. కాని, యది పుష్పముయొక్క యథార్థరూపమునుగాదు, సంపూర్ణ రూపమునుగాదు. ఆ పుష్ప మీ యొక్కదినమున వికసించి నదా ? అనేకజన్మముల చరిత్ర మా పుష్పమున గర్భితముగ

లేదా ? ఎంతకాలమునుండి యాపుష్పము తన్నుదాను వికసింపజేసికొనుచు వచ్చుచున్నదో ! ఆ మహాయత్నమున నెన్నిమారులు జారిపడిపోయెనో ? తిరిగి ఎన్నిమారులు రేకెత్తెనో ? ఆ విషయము లెక్కింప నేరితరము ? ఆ ప్రసూనములోని ప్రతివర్ణమునందును, ప్రతిరేఖయందును, ప్రతిరెక్కయందును అనంతకాలము ముద్రితమై ప్రకాశించుట లేదా ? అనంతకాలముయొక్క సుఖదుఃఖములు ఆకుసుమసౌరభమున నంకితములై యలరారుచుండుట లేదా ? ఆ పుష్పచరిత్రము అనంతకాలముయొక్క విరహవేదనను గానముసేయుట లేదా ? పుష్పమన కేవలము చక్షుర్గోచరమగు శుద్ధపుష్పమని తలంపకుడు. అది విశ్వేశ్వరుని ప్రాణకళిక; అయ్యది అనంతుని లీలారూపము. దానియందు విశ్వరూపము ఉత్తేజితమగుచున్నది. ప్రపంచమంతయు ప్రాణమయము. సమస్తరూపములు చిద్రూపములు. అచేతనములని మనము హేయముగ జూచు జడరూపములును, మనకంటె దక్కువయని నిరసించు నీ తరులతాదులును, నీసమస్తజీవకోటియు, అనంతప్రాణసాగరమున లేచిపడు తరంగములు. పుష్ప మనంతము. నీవు అనంతము. సమస్తము ననంతమే. మనకన్నులలో జడత్వముండుటచే ప్రపంచమునకును, పుష్పమునకును జడత్వ మారోపించుచున్నాము. కాని మన యల్పత్వముచే పుష్పధర్మముగాని, పుష్పస్వభావముగాని మారిపోవునా ?

మనకన్నులకు గోచరించు పుష్పముయొక్క సామాన్యరూపము తొలగించి, పుష్పమునందు మునింగి తన్మయత్వముతో జూచితిమేని ఆపుష్పము ధ్యానధారణలకు లక్ష్యమగును. అప్పుడు పుష్పమువలన గలిగిన రసానుభవము సాధనకు ఆలంబన మగుటయేకాక మూర్తిమంతమగును. అందు ప్రాణ

సాక్షాత్కారమగును. పుష్పము చిదాగ్రమున ననంతమై, అనంతమగు ప్రాణవాహినియందు దివ్యసౌరభముతో వికసించును. అప్పుడు మన ప్రాణమునకును ఆ పుష్పమునకును జరుగు ఆదానప్రదానములనే, రసలీలనే, రూపాంతరమందురు.

మనజీవనమునమాత్రి మట్టి రూపాంతరము గలుగుట లేదా ? ఒకరమణిని జూచినప్పుడు హృదయమున ప్రేమోన్మేషమగును. కాని ప్రేమోదయమునకు బూర్వము మన కన్నులకు గనుపడినది యథార్థమగు నారీరూపముగాదు. అనురాగావస్థయందా కాంతను జూచినది కేవలచర్మచక్షువులతో గాదు. ప్రాణచక్షువులతో, ప్రేమనయనములతో జూచుచున్నాము. అప్పుడు నారీరూపము రూపాంతర మొందుచున్నది. అటులనే జడమతులు మట్టిబొమ్మలని చెప్పు మృణ్మయప్రతిమలు భక్తిచక్షువులతో జూచు సాధకులకు చిన్మయమూర్తులై ఆత్మోపలబ్ధిని బొందించును. అనురాగము గాఢమైనప్పుడు, భక్తి గంభీరమైనప్పుడు ఆ మూర్తి మన ధ్యానధారణలకు విషయమగును. ఏ క్షణమున మృణ్మయమూర్తియందు చిన్మయరూపమును జూడగలుగుదుమో ఆక్షణమే మనజీవితమున ఆనందముహూర్తము. అప్పుడే నాప్రాణమును నే ననుభవింపగలుగుదును. అప్పుడే ఆత్మసాక్షాత్కారమైనదని తెలిసికొనియెదను. అప్పుడు నేను అనంతప్రేమపథమున అనంతానుసంధానమునకై నడుచుచున్నానని తెలిసికొందును. ప్రథమమున ప్రేమోద్దీపనమునకు గారణమగు విగ్రహము ఉజ్జ్వలదేవతారూపమై, ఎవరి నుద్దేశించి నేను ప్రణమిల్లితినో ఆ మహాసాగరమునకు నా జీవనస్రవంతిని గొంపోవుచున్నదని గ్రహింతును. ప్రేమగాఢమైనప్పుడు, ప్రాణస్రవంతి కూలములనెల్ల నతిక్రమించి పొంగిపొరలి

ప్రవహింపుచుండును. ఆమహాస్రోతమున రూపాంతరమున విలసిల్లు పదార్థము లనంతములు. ఆయుజ్జ్వలితావస్థయందు అనంతుని చరణనూపురరవములు ప్రాణమధ్యమున బ్రతిధ్వనించును. అహో! ఆదివ్యమంగళవిగ్రహ మెంత సుందరము! "ముఖేందుమండలమరీచిజాలముల్ పర్వ" నా యనంతుడు హృదయమంటపమున నెట్లు నాట్యముసేయుచున్నాడు! ఓ హృదయేశ్వరా! నీనాట్యమునకు విశ్వమంతయు కరతాళధ్వనులు సల్పుచు "ధన్యోస్మి ధన్యోస్మి" యని గానముసేయుచున్నది.

నిఖిల పావనమైన నీకీర్తిఁ బాడుచు,
    నీతుమ్మెదలు వెంట నేగుదెంచె
నడవిలో గూఢుండవైన యీశుడవని
    ముసరి కొల్వఁగవచ్చె మునిగణంబు
నీలాంబరము తోడి నీవు జీమూతమ
    వని నీలకంఠము లాడదొడగెఁ
బ్రియముతోఁ గోపికల్ వీక్షించుచందాన
    నిను జూచె నదె హరిణీచయంబు
ఆ: నీవు విందవనుచు నిర్మలసూక్తులు
వలుకుచున్న విచట బరభృతములు
నేడు విపినచరులు నీవు విచ్చేసిన
ధన్యులైరిగాదె తలచిచూడ.

ఆ విగ్రహము ప్రేమమాధుర్యమును స్వాయముగ నాస్వాదించుచుండ, మన మానందమందిరమున బ్రక్కగా నిలిచి ఆనందవిహ్వాలులమై నిర్నిమేషనయనములతో జూచుచుందుము. అందుకనియే మువ్వురి క్రీడ ఒక్కరి లీలయని

భాగవతోత్తములు చెప్పుదురు. ప్రేమవ్రతోద్యాపనమైనగాని ఈ సందర్శనము లభ్యము కాజాలదు. ఆ యుద్యాపన మెప్పుడగునో చెప్పుట కష్టము. ఒక జన్మముననో, అనేక జన్మములనో ఆ ప్రేమవ్రత ముద్యాపితము గావలయును. అప్పుడు ప్రాణమధ్యమున బాహ్యాంతరముల చిదానందపరిపూర్ణుడు, ఘనరసామృతస్వరూపుడు, భగవంతుడు వెలువడి తన మృదుకరపల్లవముల జాచి, భక్తుల నాలింగనము చేసికొనును. ప్రేమవ్రతోద్యాపనమగులోపల గడనవలసిన అవస్థ లనేకములు గలవు. ఆ ప్రత్యవస్థయు రూపాంతరమే. ప్రతి రూపాంతరము సత్యమేమైనను ఉద్యాపనానంతరము గల్గునది చరమరూపాంతరము. ఇట్టి రూపాంతరములతోడనే ప్రేమరాజ్యము విరాజిల్లుచున్నది.

ప్రథమమున ప్రేమ స్వరూపము కనులకు బొడగట్టినప్పటినుండియు చరమావస్థవరకును, సకలరూపములకును యథార్థస్వరూపమగు భగవంతుడు ప్రాణమధ్యమున తాండవమాడుచుండును. ఈ తాండవము ననుభవించుటయే ప్రేమ. ఇట్టి ప్రేమానుసంధానమునకు ఆలంబనమగునదియే సత్యము. ప్రాణవల్లభుడు తన ప్రేమరాజ్యమునకు దీసికొనిపోవుటకే మురళిని పలుగతుల వాయించుచున్నాడు. ఇంద్రియప్రేరణమునే భగవంతుని ఆహ్వానమని పలుమారు భ్రమపడుచుందుము. కాని, ప్రేమ ఇంద్రియజగత్తునందు ప్రారంభమై, అతీంద్రియ జగత్తునందు పరిపక్వమగును. ఇంద్రియము లెప్పుడును అతీంద్రియుని నిర్దేశింపుచుండును. శబ్దము అశబ్దమును, స్పర్శ అస్పర్శను, రూపము అరూపమును, రస మరసమును, గంధ మగంధమును జూపుచుండును. ఇది ఇంద్రియధర్మము. ఆ యఖండ సత్యరాజ్యమునందు దేనిని విసర్జించుటకును వీలులేదు. ఏయిం

ద్రియమును విసర్జించినను సత్యమునకు వికలత్వము చేకూరును. సమగ్రసత్యము హృదయమున నుద్దీపనమైనపుడు, మన సామాన్యేంద్రియములు రూపాంతరమునొందును. ప్రేమ మాత్రము మార్పునందదు. ప్రేమ గాఢమైనకొలదిని, మన చిత్తమునందలి జడత్వము తొలగును. దివ్యదృష్టితో జూచిన నేవస్తువును జడముగాదు. సర్వమును చిన్మయము.

ఇట్టి యుజ్వలావస్థ నొందనివాడు కవిత్వము జెప్ప జాలడు. శిల్పమును రచింపజాలడు. కవితయొక్కయు, శిల్పము యొక్కయు ప్రయోజనము జీవితవిలాసప్రతిపాదనమనియు, ధర్మమునకును వానికిని ఎట్టి సంబంధము లేదనియు జెప్పువారు కొందరు గలరు. ధర్మమన నింగ్లీషులో జెప్పబడు "రిలిజియను" అని వారి అభిప్రాయము. మనవారు జీవనమును ఖండ ఖండములుగ విభజించి, అందొక్క ఖండమునకే ధర్మము నంట గట్టరు. ధర్మజీవనమొక యావరణయందు బద్ధమైయుండదు. కళలకు రససాధనయే ఆధారము. "వాక్యంరసాత్మకంకావ్యమ్" సకలరసములకు ఆధారమును ఆకారమును నగు నిఖిలరసా మృతమూర్తిని వీడి, రససాధన సార్థకత నొందుటకు వీలులేదు. రససాధన లేనినాడు రససృష్టి ఆత్మవంచనమగును. ఇంద్రియ ములయందు బంధింపబడి యుండుట విలాసధర్మముగాదు. విలా సము తన విషయమును బురస్కరించుకొని తన్మయత్వమొం దును. తనయావేగబలముచే ఇంద్రియగ్రామము నతిక్రమించి అతీంద్రియరాజ్యము జేరును. అప్పుడు రూపమునం దరూప మును, శబ్దమునం దశబ్దమును విలసిల్లును. కేవల మింద్రియరాజ్య మం దాబద్ధులగువారు విలాసవివర్తనము ననుసంధానము సేయజాలరు. వారు కాల్పనికజగత్తు నొకదానిని సృష్టించుకొని అందు కళలనుబ్రతిష్ఠింపజూతురు. వారాశ్రయించునది అనుభవ

విషయముగాదు. వారికళలు సత్యప్రతిష్ఠితములుకావు. ఇంద్రియములు చూచునది వస్తువుల బాహ్యవిషయము. వస్తుస్వరూపమును జూడవలెననిన అతీంద్రియరాజ్యమును మేల్కొల్పక తప్పదు.

అతీంద్రియ మన్న ఇంద్రియములను నిరసించుటకాదు. ఇంద్రియముల నాశ్రయించియే అతీంద్రియుని చేరవలెను. పాశ్చాత్యతర్కమును, మనదేశమందు మధ్యయుగమున ప్రబలిన మాయావాదమును, ఇంద్రియములకును అతీంద్రియమునకును విరోధము గల్పించి, ధర్మజీవనమును కృత్రిమముగను, రసవిహీనముగను జేసివేసెను. "దేవుడు ఇంద్రియగోచరుడు కాడు. ప్రపంచము జడము. మానవప్రవృత్తి అపవిత్రము" అని కొన్ని నీతివాక్యములను మనమునం దుంచుకొని, మానవుడు తనచుట్టు నొక గిరి గీసికొని, ఒక అసత్యపీఠమును బ్రతిష్ఠించినంతమాత్రమున నది దేవుడగునా? మానసప్రవృత్తి సత్యముగాదా? ఇంద్రియప్రవృత్తియందు భగవత్సాక్షాత్కారము లేదా? "సర్వమ్ ఖల్విదం బ్రహ్మ" అని శ్రుతివాక్యము గానము సేయుటలేదా? ఇంద్రియలోకమును వీడి మానసికకల్పనతో నొక పవిత్రలోకమును సృష్టింప బూనుకొనుట అంతరిక్షమున సౌధమును నిర్మించుటవంటిది. మానసికోపాసనయను పేరుతో మానవులు మిథ్యారాజ్యమును జేరుచున్నారు. చిత్తము జడమైనప్పుడు ప్రపంచమంతయు జడముగనే గన్పట్టును. ఇంద్రియము లపవిత్రములైనపుడు, ఇంద్రియముల కంధత్వమును, బధిరత్వమును సంఘటిల్లును. రూపమునం దరూపమును జూడజాలక రూపమును విడనాడి, కాల్పనిక జగత్తులో సత్యమును ప్రతిష్ఠింపజూచుట ఆత్మవంచనము. ఈశ్వరుడు సర్వగతుడని ఒక చిలుక

పలుకును బలుకుదురేకాని, వారికి దేవుడు ప్రపంచబాహ్యుడు. వారు ప్రాణకుంజమున మురళీగానమును వినజాలక ఈశ్వరుడు సాకారుడా, లేక నిరాకారుడాయని కొన్ని అల్పయుక్తులను ముఖస్థముజేసికొని, ఆత్మవంచనము గావించుకొనుచున్నారు. అట్టివారికి కవితాగానశిల్పాదికళల రససృష్టి బోధగమ్యమగుట యెట్లు ?

భక్తిరసామృతమును గ్రోలిన పరమభాగవతోత్తములు ఎట్లు ప్రాణవల్లభుని కనులారగాంచి ధన్యులైరో మీ శుద్ధాంతఃకరణమున నొక్కమారు యోజించి, రూపాంతరమన్న నెట్టి రసావేశావస్థయో యూహించుకొనుడు.

సనకసనందనాదిమునిసత్తము లంచితయోగదృష్టిచే
బనివడి యాత్మలన్ వెదకి పట్టనగోచరమైనమూర్తి యి
ట్లనవరతంబు మాంసనయనాంచలగోచరుడయ్యె నట్టె ! యే
మననగు వీరి పుణ్యమున; కాదట నెట్టి తపంబు సేసిరో !

నిరయస్వర్గము లాత్మకైకొనక తా నిర్వాణమూర్తైన యా
హరిజూడన్ హరితోడఁబల్క హరిమే నంటంగ హరిం బాడగా
హరితో నేగ సహాసనాస్తరణశయ్యావాసులైయుండగన్
హరిబంధుత్వసఖిత్వముల్ గలుగు భాగ్యంబెట్లు సిద్ధించెనో.

1917

*

కవిప్రశంస * *

"కవిః కవిత్వా దివి రూపం అసృజత్"

ఎవడు కవితాశక్తిచే స్వర్గమునందలి దివ్యరూపములను వెల్లడించునో వాడు కవి. శిల్పకర్మకూడ నదియే. మన కంటికి అగుపడునది ఇంద్రియగోచరమగు భూలోకము. కవి హృదయమునకు గోచరమగునది ఇంద్రియాతీతమైన దివ్య లోకము.

ఈశ్వరుడు విశ్వమై వెలయుట సృష్టిరహస్యము. ద్రష్ట దృశ్యమై ప్రకాశించుట శిల్పరహస్యము. సృష్టి ఈశ్వరుని మానసమూర్తి. శిల్పము శిల్పియొక్క స్వస్వరూపానుభవ ప్రకటనము. "హిరణ్యాపేకాశ కవి గంభీర చేతసా" కవి తన గంభీరచేతస్సునందలి బంగారు రూపములను వెలిబుచ్చునని వేదము చెప్పుచున్నది. ఆ గభీరచేతస్సే స్వర్గము.

ఋషీశ్వరుని చూపులో నామరూపము లన్నియు గరగిపోవును. "సర్వాణి భూతాని ప్రజ్ఞానస్య నామధేయాని" కవి చూపులో నామరూపములు రూపాంతరము నొందును. "ఋతస్య పదం కవయో నిపాన్తి గుహా నామాని దధిరే పరాణి" కవి సత్యముయొక్క పదమును నిలుపుచు, గుహ్యములైన నామరూపముల నుద్ధరించును. కవితాదృష్టికి సర్వనామధేయములు చిద్రూపములు.

కవిజ్ఞానము ప్రత్యక్షము— అపరోక్షము. "కవయః సత్యద్రష్టారః" కవులు కేవలము ద్రష్టలు. కవి తార్కికునివలె తర్కించడు. అనుమానముచే నూహించడు. ఇంద్రియము లిచ్చు జ్ఞానముతో తృప్తినొందడు. "సూర్యచక్షుః" అనుటచే వాని నేత్రము సూర్యునివలె చాటుచోటుల నన్నిటిని ప్రకాశింపజేయును. మర్మముల నుద్ఘాటించును. నామరూపములయొక్క అభ్యంతర లీలలను వెల్లడించును. "కవయః సూర్యత్వచః" అనుటచే వాని శరీరముసహితము సూర్యమండలమువలె తేజోవంతము. స్వయంప్రకాశమానమగు జ్ఞానమున సుప్రతిష్ఠుడై ఆతడు సర్వశక్తుడగును.

కవి సర్వస్వతంత్రుడు. లోకుల బాటలు వానిని బంధింపజాలవు; సామాజికనీతినియమములలో నిమిడియుండనేరడు. "కవిర్విప్రేణ వవృధే" వాని జ్ఞానము ప్రకాశవంతమైన దగుటచే, వాని బుద్ధి అధోలోకములను మించి పెరిగిపోవును. "కవేశ్చిత్ తంతుం మనసా వియన్తః" — వారి మనస్సు ప్రపంచమంతట అల్లుకొనిపోవును. కర్మిష్ఠుల విధినిషేధములతో వాని కవసరములేదు. సత్యము ఈ ద్వంద్వముల కతీతము. కవి సత్యద్రష్ట యగుటచే నీ భేదములకు గట్టుబడడు. "సూర్య సత్యాసవ సత్యాయ సత్యప్రసవాయ".

కవి కేవలము ద్రష్టయేకాదు, నిర్మాతకూడ— "కవయఃసన్తి వేధసః" కవులు తాముచూచిన సత్యమును లోకమున ప్రతిష్ఠించెదరు. "కవియజ్ఞ వితనోతి పన్థాం" ఆతడు యజ్ఞమునకు బాటవేయును. లోకులగతి వక్రము. కవిది ఋజుపథము. "కవి ఋతస్యపద్మభిః" 'సత్యరథమునకు గట్టిన అశ్వమువంటివాడు కవి' యని వేదము చెప్పుచున్నది. ఈ యశ్వము సరళమైన సూనృతమార్గమున బరుగిడి ఆనందధామమును జేర్చును.

" కవిర్హోతాయజతి మన్మసాధనః " కవి హోతవలె సృష్టియజ్ఞ మును క్రియమార్గమున నడిపించును. కవి సవితయై సత్యమును వెల్లడించును. త్వష్టయై నిర్మాణముసేయును. వేధయై ప్రవర్తింపజేయును.

శిల్పి భావసమాహితచిత్తుడు. ఆనందభరితుడై వెలుగు యొక్క పుట్టుకయం దంతర్భూతుడగును. " అర్కస్యయోనిం అసదం " దివ్యసౌందర్యముతో వెలుగుచు ఆనందరసమును కుమ్మరించును. "శోభతే వృష కవిర్యో నవధిప్రియః" సౌందర్యరసమున ఆవిర్భూతుడగును. "కవిర్హి మధుహస్త్యః" వాని హస్తములనుండి మధువు స్రవించును. కవి వ్రాసినది కవిత్వ మగును; గీసినది చిత్తరువగును; చెక్కినది విగ్రహ మగును; మీటినది సంగీతమగును. " సర్వేషాం భూతానాం మధుః " సమస్తభూతాంతర్గతమగు మధుస్రవంతి వాని హస్త ద్వారమున వెల్లివిరిసి లోకమును మధుమంతముగ జేయును.

జగత్పరిణామమున చేతనాచేతనములు మనమున మేల్కొని ఆత్మస్వరూపమునన్వేషించుచున్నవి. కవితలో ఆత్మ, మనస్సు నాశ్రయించి ఇంద్రియసమ్ముఖమున బ్రతిష్ఠించుకొన జూచుచున్నది. అది ఆరోహణము; ఇది అవరోహణము, అవతరణము. ఆరోహణము సాధనము; అవతరణము సిద్ధి. మొదటిది సాయుజ్యము; రెండవది సాధర్మ్యము.

శిల్పమున దేవతలు దివ్యశరీరులయ్యు చాక్షుషమూర్తులయ్యెదరు. కవిబుద్ధి సహస్రాక్షుని చింతామణి పీఠము. వాని క్రియ అగ్నిదేవతకు యజ్ఞవాటిక. వాని ప్రీతి లక్ష్మీదేవికి కమలాలయము. వాని యిచ్ఛలు అశ్వినీదేవతలకు అశ్వములు. వాని సుఖము దేవతల సోమపానము. వాని హృదయము "వాగ్దే

వతాచరితచిత్రితచిత్రసద్మము." వాని హస్తము సూర్యకరోజ్వలము.

"రసోవైసః" అనునది శిల్పవిద్యామంత్రము. దీనికి అధిష్ఠాత సృష్టికర్తయగు బ్రహ్మ. ఋషి 'సుందరమ్'. సత్యశివములు పార్శ్వమూర్తులు. ఛందస్సు ఇంద్రియసంచలనము. ప్రవృత్తినివృత్తులు పరికరములు. యోగము సాధనము. చతుర్వర్గ ఫలావాప్తి వినియోగము. సమస్తకళలు ఉపచారములు.

కవి బహుదేవతారాధకుడు. ఆతడు నిరాకారములో నిస్తేజుడుకాడు. శూన్యము నుపాసించడు. నానాత్వమును నిరసించడు. ఇంద్రియములను త్యజించడు. సంసారమును బరిహసింపడు. నిఖిలరసామృతమూర్తి సాకారుడుగదా! వాని దృష్టికి ఏ శక్తి దేవతకాదు? ఏవస్తువు విశ్వరూపముకాదు? ఏ కర్మ యజ్ఞముకాదు? శిల్పమున నీతి అవినీతి యను భేదములేదు. చేతనము అచేతనము అను పార్థక్యమున కవి గట్టుపడడు. "బ్రహ్మజ్ఞానే సముత్పన్నే మేధ్యామేధ్యం నవిద్యతే" జ్ఞాననేత్రమునకు సర్వము సత్యము, శివము, సుందరము. "త్వం సర్వరూపిణీ దేవి సర్వేషాం జననీపరా" యని కీర్తించుచు సమస్తభూతములను చిద్రూపములుగ భావించి నమస్కరించును. కాలమునుగాంచి "తవరూపం మహాకాలో జగత్సంహార కారకః" అనుచు ప్రణమిల్లును. శిల్పిబుద్ధికి అగ్ని హవ్యకవ్యవహుడు. సూర్యుడు "సుధూమ్రా భోగదా విశ్వాబోధినీ ధారిణిక్షమా". చంద్రుడు ప్రజ్ఞాబిందువు. మృత్యువును గూడ "మహాప్రేతరాట్టు"గ ధ్యానించి ఆతడు బ్రహ్మానందరసనిమగ్నుడగును. కవి నివసించునది దేవతాలోకము. సమస్తదేవతలు ఇంద్రునివలె శిల్పిని దర్శించెదరు. "మహాత్ తద్వః కవయ శ్చారు నామా యద్వాదేవ భవతా విశ్వ ఇన్ద్రే."

కవి సమదర్శి. దేనిని భేదబుద్ధితో జూడడు. ఏ యంశ మును రజువుచేయడు. ఏ మతమును స్థాపింపడు. ఏ ధర్మమును నిషేధించడు. వెలుగునీడలను, సుఖ దుఃఖములను, పుణ్యా పాపములను, నిమ్నోన్నతములను, ఉదయాస్తమయములను సంపద్విపత్తులను, అపథాపథములను, సకల వ్యాపారములను స్పృశించి, వాని యంతరమున జొచ్చి, మధుపమువలె మధు కోశమును గూడబెట్టును. ఒక్కొక శాస్త్రజ్ఞుడు జగత్తు నొక్కొక దృష్టితో జూచును. ప్రకృతిని బహిర్విషయముగ బరిశోధించి సత్యము నన్వేషించునది ప్రకృతిశాస్త్రము. మాన వుల వ్యష్టిసమష్టుల పరస్పరాశ్రయత్వమును బరిశీలించి నిరూ పించునది నీతిశాస్త్రము. ప్రాణుల పుష్టిపోషణముల కుప కరించు ద్రవ్యపరిశీలనము అర్థశాస్త్రము. జీవజగత్తుల సత్యా సత్యములను వివేచించునది తత్త్వశాస్త్రము. కవితయన్ననో, ఈ ఖండదృష్టులను, ఈ పాక్షికపరీక్షలను అతిక్రమించి అనేకా వస్థా తరంగములతో, అనేకరూపఫేనములతో, అనిలోద్ధూత మహాసాగరమువలె ఘూర్ణిల్లుచుండు సంసారసముద్రమును మథించి, అమృతకలశములను వెలికిదీసి లోకమును అమృత సత్రముగా మార్చును. కవిస్పర్శ పరుసవేదివంటిది. మృత్పిండ మును సచేతనముగ జేయుగల హస్తము వానిది. అది మూగ రాతికి మాటలు నేర్పును. రూపరేఖలను సొంపుతో నింపును. వన్నెలలో భావంపు దళుకులను బ్రకాశింపజేయును. పదము లను భావగుళికలనుగ మార్చును. రాగవల్లరులపై స్వర్గ ధామము నధిరోహించును. కవిత జగద్విలాసవర్ణనము.

1933

*

శిల్పము

చిత్రకళ * *

చిత్రరచనకూడ కావ్యకల్పనవంటిదే. అయ్యది ప్రత్యక్ష దర్శనముచే నుపభోగ్యమైనదేకాని శాస్త్రకారికలచేతను, తర్కవితర్కములచేతను, నిర్వచింపదగినది కాదు. రసస్పష్టి యుక్తి కతీతమైన విషయము. లక్ష్యములుగ నుండదగిన చిత్తరువులను గన్నులార గాంచినప్పుడే వాని సౌందర్యగరిమయు, రసోజ్జ్వలతయు హృదయంగమ మగును. కాని ప్రాచీన చిత్రవిద్యకు నిదర్శనములుగ జూపగలిగిన చిత్తరువులు నేడు విశేషముగ గనుపడనిమాట నిజము. కాలము సర్వమును భక్షింపగలదు. దేవాలయనిర్మాణములవలె, లోహప్రస్తర మూర్తులవలె నాలేఖ్యములు చిరస్థాయులుగ నుండజాలవు. పాషాణనిర్మితములైన దేవాలయములును, చైత్యములును సర్వగ్రాసియగు కాలమునకు బలియగుచుండ, పటములును రంగులును కాలగతిని జీర్ణములయి భ్రష్టము లగుటలో నాశ్చర్యము లేదు. నేటికిని నొకవిధముగ నిల్చియున్న ప్రాచీన చిత్రచిహ్నములలోనికెల్ల, నైజాంరాష్ట్రములోని అజంతా గుహాలయందలి కుడ్యాలంకారములే ముఖ్యముగ బేర్కొనదగియున్నవి. ఇవి సుమారు పదునారువందల సంవత్సరముల క్రిందటివి. ఈగుహాలు బౌద్ధభిక్షువుల నివాసమున కేర్పడిన మఠములు. విదేశశిల్పవిదులుకూడ వీనినిగాంచి కరములు మోడ్చి ప్రణమిల్లుచున్నారు. బైరాగుల మఠములయందే యిట్టి యపూర్వకళావైదగ్ధ్యము వెల్లడియగుచుండ ఆనాటి

రాజప్రాసాదములయందును, సంపన్నగృహస్థుల భవనముల యందును, చిత్రకళ యెట్టి పరాకాష్ఠను జెందియుండునో యొకించుక యూహించవచ్చును. అవియెల్ల కాలగర్భమున లీనమైనవి. ఈ అజంతాగుహ లిరువదినాల్గింటిలోను నలుబదిసంవత్సరములక్రిందటివరకు పదునాలుగుహాలయందు చిత్రాంకము లుండెడివి. కాని నైజాముప్రభుత్వమువారు వానిని భద్రపరచకపోగా, నిటీవల నొక మహమ్మదీయోద్యోగి వానిని తన యిష్టము వచ్చినట్లు నాశనము చేసివైచెను. తరువాత "డాక్టరు బర్డు" అను కళాభిమాని కొన్ని ప్రతిమలను త్రవ్వుకొనిపోయి బొంబాయి మ్యూజియములో జేర్చెను. నేడాఱు గుహాలయందు మాత్రమే చిత్రాలంకారములు గలవు. నిలచియున్నవియే భరతవర్షపు టపూర్వచిత్రరచనావిన్యాసమును దిగంతములకు వేనోళ్ల జాటుచున్నవి.

పూర్వకాలమున నిట్టి యలంకారములు ప్రతిదేవాలయమునను, రాజప్రాసాదమునను విలసిల్లియుండెడివి. మాల్వాలోని బాగుగుహల చిత్రములందును, సైగూరియాలో రెండు స్త్రీ చిత్రములందును ఈ యజంతాపద్ధతియే గనుపడుచున్నది. ఇటీవల పుదుక్కోట సంస్థానములోగూడ నొక గుహాయం దిట్టి రచనలు కనుపడినట్లు ప్రకటింపబడినది. బౌద్ధయుగము మొదలుకొని మహమ్మదీయయుగమువఱకు ననగా 900 సంవత్సరముల కాలములో నీ చిత్రధార ఫల్గునీనదివలె నంతరించినట్లు కనుపట్టును. కాని యాకాలములో నీవిద్య పూర్తిగ విస్మరింపబడినదని నమ్ముటకు మనస్సు ఒప్పుకొనదు.

ఆకాలములో భాస్కర్యవిద్యావిజృంభణ మెక్కువగ జరిగిన మాట నిజము. కాని చిత్రవిద్య విలుప్తమైనదనుట సాహసము. మనయదృష్టవశమున హిమాలయ ప్రాంతముల యందును,

వాని వెలుపలను గొన్ని చిత్రము లిటీవల బయలు పడినవి. స్థపిత భాస్కర్యములతోపాటు చిత్రవిద్యకూడ నీదేశమున నథమము రెండు వేలసంవత్సరములైనను నుచ్ఛదశను బొందియుండెననుటకు నాధారములు కలవు.

బౌద్ధయుగమునకు బూర్వమున నుండిన చిత్రములు మనకేమియు నేడు గన్పడకున్నను, చిత్రకళ వైదికయుగమునగూడ నుండినట్లు టిబెట్ చరిత్రకారుడగు డాక్టరు తారానాధ్ గారు కొన్ని ప్రమాణములను జూపుచున్నారు. శిల్పవిద్యలను గూర్చిన కొన్ని ప్రాచీనగ్రంథము లిటీవల దొరకినవి. ఈగ్రంథములు క్రీస్తునకు బూర్వము మూడుశతాబ్దులకు క్రిందటివై యుండునని పురాతత్వవిదుల యభిప్రాయము. ఆ గ్రంథములయందు చిత్రవిద్యయొక్క ప్రాశస్త్యము, లక్షణములు నుద్ఘోషింపబడినవి.

యథా సుమేరుః ప్రవరో నగానాం
యథాండజానాం గరుడః ప్రధానః
యథా నరాణాం ప్రవరః క్షితీశః
తథా కలానా మిహ చిత్రకల్పః

పర్వతములయందు మేరువు, అండజములయందు గరుడుడు, నరులయందు రాజు, ఎట్లు సర్వశ్రేష్ఠులుగ నెంచబడుదురో, అట్లే చిత్రవిద్య సమస్తకళలలోనికి శ్రేష్ఠమైనదని కీర్తింపబడినది. ఇందొకింత యతిశయోక్తి యుండినను నీ విద్య పూర్వకాలమున మహాదశ ననుభవించియుండవలెనని యూహించుటలో దోషమేమియులేదు. ఈ విద్య యంతకుబూర్వమే ప్రచురముగ లేకున్నయెడల లక్షణగ్రంథములు బయలుదేరుట యసంభవము. రామాయణభారతేతిహాసములయందు గృహ

ములు చిత్రములతో నలంకరింపబడినట్లు వర్ణింపబడియున్నది. ఇటీవలి కాళిదాసభవభూతులనాటకములయందే కాక, వెనుకటి భాసాదికవులయొక్క కృతులందుకూడ చిత్రకళ పేర్కొనబడి యున్నది. ఈ చిత్రవిద్య మొదట బ్రాహ్మణ్యయుగమునందును, పిమ్మట బౌద్ధయుగమునందును, అనంతరము మొగలులయు, రాజపుత్రులయు కాలముననను, రచనావిన్యాసరీతులలో ననేక దశాంతరములను బొందుచుండినను, భరతవర్షముయొక్క విశిష్టలక్షణమగు నాధ్యాత్మికసంపదను మాత్ర మెప్పుడును విడనాడియుండ లేదు.

ఈ కలికాలమున నన్నివిషయములలో వలెనే, చిత్ర విద్యయందు గూడ పాశ్చాత్యపద్ధతులే యాదరణీయము లగు చుండుటచే, స్వదేశహితైషులు చిత్రవిద్యయొక్క పూర్వ సంప్రదాయమును రక్షించి పోషించుటకు చిత్రకళా ప్రదర్శనములను, సభలను నిర్వహింపవలసివచ్చినది. స్వగృహములో లేని వస్తువును పరగృహమునుండి యెరువు తెచ్చుకొనుట దోషముకాదు. కాని, మన యిలువేల్పగు కళాలక్ష్మి నుత్తరరామాయణమునందువలె నడవిపాలు సేయుట దుఃఖకరము. ప్రాసాదములు, దేవమందిరములు, గృహములు, వస్త్రములు, భూషణములు, పాత్రలు, గృహోపకరణములు, ఆటవస్తువులు—ఇవియవి యననేల, మన కళాలక్ష్మికరకమలముచే స్పృశింపబడని వస్తువే లేదు. బౌద్ధభిక్షులు మన కళాలక్ష్మిని శిరములపై నుంచుకొని, దేశాంతరములకు, ద్వీపాంతరములకు గొనిపోయి కళాసామ్రాజ్యమును విస్తరింపజేసియుండ, మన మా తల్లిని సింహాసనమునుండి తొలగించి, యందు తెల్లదొరసానిని నెలకొల్పి యారాధింప జూచుట పరిహాసాస్పదము! ఇట్టి ఘోరవిపత్తున దగులొక్క

నినవారికి లోకములో గౌరవముండదు. పేరు ప్రతిష్ఠ లుండవు. లోకములో నెవరును వీరిపై కనికరమునైన జూప జాలరు. నూరు సంవత్సరముల క్రిందట వచ్చిన పాశ్చాత్య సభ్యతయందు దగుల్కొని, శిల్పకళయందు శిక్షను బొందియో పొందకయో, perspective, light and shade, anatomy, realism అను పది ఇంగ్లీషు మాటలను నేర్చుకొని, మహా పురుషుడగు విశ్వకర్మను బుద్ధివిహీను డనుటకు జంకక, పాశ్చాత్యాకాశమునందలి తళుకుబెళుకులకు లుబ్ధులమై పరు గిడుచు, క్రిందుమీదులు గానక పాశ్చాత్య సముద్ర తరంగ ములయందు బడి నశింపుచున్నాము. ఏది చిరకాలమునుండి మనజీవనపు మూలమూలల గ్రుమ్మకొని మన మనముల హరించి యానందము గొలుపుచుండెనో, దేని రసోజ్వల తచే భారతధర్మము దేశాంతరముల బ్రసరింపగలిగెనో, ఏది భారతీయుల యోగసిద్ధికి నిర్వాణప్రాప్తికి సాధనభూత మయ్యెనో, యట్టి కళాలక్ష్మిని ధ్వంసమొనర్చి, పశ్చిమ సము ద్రమునందలి యే తరంగమునో యాశ్రయింపజూచుటకంటె ఘోరవిపత్తేమి కలదు ? భారతచిత్రకళయొక్క మర్మమును హృదయంగమము చేసికొన దలచితిమేని మీమాంసలను, తర్కవితర్కములను నొక మూలకు ద్రోసివైచి, ఒకమా రజంతా గుహాలయందలి యక్షయప్రదీపశ్రేణులను తిలకించె దము రండు. సాయంసమయమున దేవాలయములో శంఖా రావఘంటానినాదములు మ్రోగుచుండ, తైలదీపములు తారా గణములవలె వెలుగుచుండ మంగళహారతుల ప్రకాశమున నాలక్ష్మిదేవి ముఖారవిందమును భక్తిపరులమై గాంచెదము రండు.

1917 *

శిల్పలక్షణము * *

సకలకళాతత్వవిదుడగు శ్రీ శుక్రాచార్యుడు,

ధ్యానయోగస్య సంసిద్ధ్యై ప్రతిమాలక్షణం స్మృతమ్
ప్రతిమాకారకో మర్త్యో యథా ధ్యానరతో భవేత్
తథా నాన్యేన మార్గేణ ప్రత్యక్షేణాపి వా ఖలు
దేవానాం ప్రతిబింబాని కుర్యాచ్ఛ్రేయస్కరాణి చ
స్వర్గ్యాణి మానవాదీనా మస్వర్గ్యాణ్యశుభానిచ
అపి శ్రేయస్కరం నృణాం దేవబింబమలక్షణమ్
సలక్షణం మర్త్యబింబం నహి శ్రేయస్కరం సదా ॥

అని, దేవతల బింబములను జిత్రించుటయే చిత్రవిద్య యొక్క పరమలక్ష్యమని నిర్దేశించుచున్నాడు. సలక్షణముగ వ్రాసిన మర్త్యబింబముకంటె, నవలక్షణముగ జిత్రింపబడినను దేవప్రతిమయే శ్రేయస్కరమని వాని మతము. ఇవి ఋషి వాక్యములు. ఈ శ్లోకములందు శిల్పముయొక్క పరాకాష్ఠ నిరూపింపబడినది.

"All Indian Art is a throwing out of self-vision formed by a going within to find out the secret significance of form and appearance, a discovery of the subject in one's deeper self, the giving of Soul-form to that vision, and, a remoulding of the material and natural shape to express the psychic truth of it with the greatest possible purity and power of outline, and the greatest possible concentrated rythmic unity of significance in all the parts of an indivisible artistic whole."

అరవిందఘోషుగారీ పై వాక్యములో శిల్పరహస్యమును గడు హృద్యముగ వర్ణించిరి. అప్రాకృతము, అతీతము, అనావిష్కృతమునైన సత్యస్వరూపమును యోగసమాధియందుపలబ్ధినొంది, ధ్యానధారణలచే రూపకల్పనగావించి, బాహ్యమున శబ్దముననో, రూపముననో, స్వరముననో ప్రకాశింపజేయుటకే కళావిదులు ప్రయత్నించిరి. ఇందు భారతశిల్పులు చూపిన ధైర్యసాహసములును, ధారణాపటిమయు, రచనాకౌశలమును నద్వితీయములు.

భారతశిల్పమునందు మూడుదశలు కలవు. వీనిలో మొదటిది వైదికశిల్పము. ఈ శిల్పమున నప్రాకృతభావము దేదీప్యమానముగ వెలుగుచుండును. చతుర్ముఖుడు, చతుర్భుజుడు, నరసింహమూర్తి, నటరాజు, బోళానాథుడు మొదలగు దేవతావిగ్రహములయందును, శ్రీరాముని నీలమేఘశ్యామ తేజమునందును, మురళీధరుని నవనీరదద్యుతులయందును, లక్ష్మీసరస్వతుల రూపకల్పనయందును నప్రాకృతభావము శతముఖముల గన్పట్టుచుండును. వానియందు నిరతిశయానంద ప్రవాహము తరంగభంగములతో నృత్యము సేయుచుండును. వానిని స్పృశించుటకుగూడ భయము కలుగును. భారత శిల్పము ధర్మప్రపంచమునకు నొసగిన యీ యాభరణముల యమూల్యత నెవరు మఱవగలరు? వీనిని బహిష్కృతము చేసిన హిందూధర్మప్రపంచము నిస్తేజమును, నిష్ప్రభమునై శ్మశానవాటికవలె గన్పట్టును. భారతీయుడు రూపసాగరమున మునిగి యమూల్యములైన ముత్యములను, మణులను వెలికి దెచ్చి భారతమాతయొక్క మకుటముపై స్థగితములొనర్చి ధన్యుడయ్యెను. అవిలంఘ్యమైన హిమాలయశిఖరముపై కాతడు యోగవిమానముపై నెగిరి యా ధవళశృంగములందు గౌరీ

శంకరులను బ్రతిష్ఠించెను. వాని సాహసమును నిరోధింపగలి గిన దేదియు నీ భూమండలమున లేదు. స్వరముపై నధిరోహించి పథాపథములనెల్ల తిరిగి తుదకు స్వర్గకవాటమును సహితము భేదించి, యం దనవరతము ప్రతిధ్వనించుచుండు గంధర్వకిన్నరుల దివ్యగీతములను భూలోకవాసులకువినిపించెను. శిలల దొలిచి, యందుండి రసస్రోతస్విను ల బ్రవహింపజేసెను. లోహదారువులను భావకణికలుగ మార్చెను. శబ్దములతోడను స్వరములతోడను పుష్పకములను నిర్మించి, సప్తలోకములను సంచారము చేసివచ్చెను. శిల్పమను చింతామణిపీఠముపై నధిష్ఠించి ఇంద్రునివగిది సహస్రనేత్రములతో విశ్వము నెల్ల పరికించెను. హిందూ శిల్పముయొక్క ప్రతిభ యప్రతిమానము.

బౌద్ధయుగమున శిల్పదేవత స్వర్గధామమునుండి మానవ జగత్తునకు దిగెను. కాని మానవునకు దాస్యముమాత్రము చేయలేదు. కరుణారసస్రష్టగు బుద్ధదేవుని శరణుజొచ్చెనే కాని రాజాధిరాజగు నశోకచక్రవర్తిని సహితము క్రీగంటనైన జూడలేదు. నిశ్చలమగు బుద్ధదేవుని శాంతమూర్తిని ధ్యానము సేయుచు, నిర్వాణపదవిని వెల్లడించెను. బౌద్ధ శిల్పముయొక్క స్వాతంత్ర్య మప్రతిహతము! దేశము నలుగడలను ధర్మస్తంభములను నాటినను వానిపై నశోకుని శిలావిగ్రహ మొక్కటైనను గనుపడదే! ఏ గుహాయందును వాని చిత్తరువు లేదే! రాజులు శిల్పము నాశ్రయించిరి కాని, శిల్పము రాజుల నాశ్రయించలేదు. వచ్చిపోవు ప్రతి గవర్నరునకు శిలాప్రతిమలను కంచువిగ్రహములను చిత్రపటములను నెలకొల్పు నాధునికశిల్పముయొక్క దాస్యమును దలచుకొనిన, నేటి యధఃపతనము మనోగతమగును. సింహములను సహి

తము దయారసస్వరూపములుగ మార్చివైచిన బౌద్ధశిల్పము యొక్క విజయ మకుంఠితము. బ్రాహ్మణ్యయుగములో స్వర్గ ధామమునందు నివసించుచుండిన కళలు, బౌద్ధయుగమున ధరా తలమునకు దిగినను, దృష్టిమాత్రము స్వర్గమువైపునుండి మరల్చలేదు.

అశోకచక్రవర్తిని క్రిందటనైన జూడనొల్లని శిల్పము మొగలుసామ్రాజ్యమునందు పాదుషాల యంతఃపురముల విహరింపజొచ్చెను. అప్పుడైనను దానిస్వరూపము నష్టము కాలేదు. మొగలుయుగమందు చిత్రింపబడిన పటములు కేవలము పాదుషాలయొక్కగాని, వారి బీగములయొక్కగాని చిత్తరువులు గావు. అవి మొగలుసామ్రాజ్యలక్ష్మియొక్క ధ్యానరూపములై విలసిల్లెను. షాజహానుచక్రవర్తి ప్రభుత్వము నందు శిల్పము సంపూర్ణవిముక్తి నొందెను. మృత్యువుయొక్క మహాస్వప్నము విశుద్ధచంద్రకాంతశిలారూపమున యమునా నదీతరంగనిస్వనములతో శ్రుతి గలుపుకొని

త్వమసి మమ శరణం। త్వమసి మమ జీవనమ్।

అను నమరగానమును లోకములకు వినిపించుచున్నది. భారతశిల్పమునందు విషయప్రభేదము చేతను, పద్ధతి వ్యత్యాసము చేతను ననేకశాఖ లేర్పడినను నవి యెప్పుడును నప్రాకృతభావమునుమాత్రము వదలక, యూర్ధ్వముఖములై యుండెను. భారతశిల్పముయొక్క యుపాస్యదేవత యంత ర్జ్యోతి. స్మృతికల్పనలు పార్శ్వదేవతలు. ధ్యానధారణలు సాధనములు. రసోజ్జ్వలత సాఫల్యము. భారతకళలన్నియు భావమూలకములైనను, వాని వాని వివిధపరికరముల చే, విషయనిర్ణయమునందును, రచనావిన్యాసమునందును గొంత

పరిభేదముండుట యనివార్యము. శిలాలోహములయందు వెల్లడియగు రసోజ్వలతకును, రేఖా వర్ణికా భంగములందు వ్యక్తమగు రసోజ్వలతకును భేదము కలదు. ఘనిష్ఠములగు శిలలయందు, లోహములయందు నచలత, నిశ్చలత, శాంతము, గాంభీర్యము, అమరత్వము మొదలగు భావము లెక్కువగ నొప్పును. చిత్రపటములలోని రూపరేఖావిన్యాసములందు విలసనము, తరళత, శృంగారము, ఉల్లాసము, క్రీడ, సంచార శీలము, మృదుత్వము మొదలగు భావలతికలు రమణీయము లగును. ఈ కారణముచేతనే జనసామాన్యమును చిత్రపటము లాకర్షించినంతగ శిలావిగ్రహములును, లోహప్రతిమలు నాకర్షింపజాలవు. చిత్రవిద్య వర్ణరంజిత మగుటచే నందు రూపసంపద ఎక్కుడుగ నలరారును. కాని భారతచిత్రవిద్య భాస్కర్యము ననుసరించియే యుండెను గాని విషయలంపటత్వమున జిక్కుకొన లేదు. ఇంద్రియానుభూతిద్వారమున నతీంద్రియ ధామసాక్షాత్కారమే యుభయవిద్యలకు పరమలక్ష్యము.

పాశ్చాత్య శిల్పకారు డింద్రియగోచరమగు వస్తుజగత్తును విడనాడడు. వస్తుజగత్తు నెప్పుడును గంటిముందర “ మాడెల్ ” గ నుంచుకొని దాని ననుకరించుటకే తన కౌశలమునంతయు నుపయోగించును. ఇంద్రియములకును మనస్సునకును సన్నిహిత సంబంధముండుటచే నింద్రియానుభూతి కలిగినప్పుడు భావసంచారముకూడ గలుగుట సహజము. పాశ్చాత్యశిల్పి యీ భావప్రపంచమున జిక్కుకొని వస్తుజగత్తును విడనాడుదు నేమో యను భీతితో నెప్పుడును భావమును నిగ్రహించుకొని వస్తువు నంటియుండును. వస్తురూపము నుల్లంఘించకుండుటకై perspective, light and shade, నియమములను గల్పించుకొనెను. గ్రీకు ఆర్టులో గొంత భావప్రవణత

యున్నను, నది వాస్తవమునకు దాస్యము సేయుచునేయుండెను. వారి idealism మానవుని లోకాతిశాయిరూపము (superman) ను సృష్టించుటయే కాని మానవుని యాత్మస్వరూపమును వెల్లడించుటకాదు. వారి దేవతలు magnified men.

వాస్తవజగత్తులో ననింద్యమైన రూప మసంభవ మగుటచే, కల్పనాశక్తిచే మానవునియొక్క భౌతికవిగ్రహము ననింద్యమైన పరిపూర్ణాంగసౌష్ఠవముతో వారు చిత్రించిరి. ఆప్రతిమలయందు వాస్తవజగత్తుయొక్క పూర్ణ వికాసమే కనబడునుగాని, వాస్తవ జగదంతరమందుండు నశబ్ద మరూప మవ్యయమునైన తేజమును బ్రతిబింబింపజేయలేదు. క్రైస్తవధర్మప్రాదుర్భావకాలమున రాఫెలువంటి సిద్ధహస్తులు ప్రాణముయొక్క యాంతర్యమును వెల్లడించుటకు బ్రయత్నించిరి. బాలక్రీస్తురూపమునందలి కోమలత్వము, మెడోనాయందలి మాతృస్వరూపము నాదర్శ రూపములే కాని వాస్తవికములు కావు. కాని వానిరచనా పద్ధతియందు గూడ వస్త్వనుకరణమే యెక్కువగ గన్పట్టును. భావవిలసనమును స్నాయువులయుత్తేజనము మూలమున చిత్రించుటయే కాని, దేహమును భావముచే గప్పివైచి తదనుగుణముగ దానిని మార్పగల సాహసము వారియొద్ద లేదు. వస్తువుయొక్క యాకృతిని మార్చుట వారి దృష్టిలో చిత్రదోషము. వస్తువుయొక్క యాకృతిని మార్చవలసిన యవసరము గూడ వారికి లేదు. ఎంతవరకును ప్రాణులయొక్క బాహ్యచేష్టలను స్నాయువుల యుత్తేజనద్వారమున బ్రకాశింపజేయు భావోద్దీపనమే గాని, ప్రాణముయొక్క బాహ్యక్రీడ నతిక్రమించి దాని మర్మమును భేదించగల విద్యుత్కటాక్షము పాశ్చాత్యశిల్పులయందు వికసించలేదు. కావుననే వారి చిత్తరువులలో Theatrical poses యెక్కువగ గన్పట్టును.

భారతశిల్పి స్వతంత్రుడు. వస్తువుయొక్క యాకృతిని తన యిష్టమువచ్చినట్లు మార్చగలడు. భావము వస్తువునకు దాస్యము చేయుట కెంతమాత్రము నొప్పుకొనడు. వస్తువును భావప్రాబల్యముచే రూపాంతరము నొందించును. అస్థిసంస్థాన విద్యకు (anatomy) కట్టుబడడు. భారతచిత్రకారుడు చిత్రించునది భావముయొక్క పరిమాణము, భావముయొక్క లావణ్యము, భావముయొక్క సాదృశ్యము. వస్తువు భావము ననుసరించుచుండవలసినదే కాని, భావము వస్తువునందు బంధింపబడదు. పాశ్చాత్యశిల్పులు వాస్తవజగత్తు నొక బందిఖానాగా జేసికొని యొంతవరకును దాని యావరణలో దిగురుటయే కాని, దాని ద్వారమును దెరచి, విముక్తులగుటకు జూడరు. భారతశిల్పి యీ వాస్తవజగత్తును "పద్భ్యాం పృథ్వీ" దేవతలకు పాదపీఠముగ జేయగల్గెను. వారిని జగత్తులో బంధించలేదు. కమలములపై లక్ష్మీదేవి నధిష్ఠింపజేసెను. నాగముపై చతుర్భుజుని బరుండబెట్టెను. వృషభముపై శివుని గూర్చుండబెట్టెను. వటపత్రమున నారాయణుని నిలిపెను. హంసపై సరస్వతి నూరేగించెను. విష్ణువును జతుర్భుజుని జేసెను. భూలోకముపై స్వర్గకాంతులను బ్రసరింపజేయుటయే భారతశిల్ప లక్షణము.

1926

*

వేదమునం దీ గాథ కలదు.

కొండొక కాలమున నొక బ్రాహ్మణుని కుమారుడు చనిపోయెను. తండ్రి దుఃఖార్తుడై యమునియొద్దకు బోయి, తన పుత్రుని తిరిగి యొసంగవలసినదని వేడుకొనెను. కాని యముడు వాని ప్రార్థనము నంగీకరింపలేదు. అంతట బ్రాహ్మణుడు బ్రహ్మయొద్దకు జని తన కుమారుని యమపాశములనుండి విడిపింపుమని యాక్రందన మొనర్చెను. పంచభూతవిలీనమై పోయిన కుమారుని శరీరము తిరిగి యెక్కడనుండి వచ్చును? ప్రాతరూపము విలుప్తమైనది. కాని యా వృద్ధుని దుఃఖోపశమనార్థము బ్రహ్మ యాకుమారుని రూపాంతరము నొసగెదనని సమాధానము చెప్పెను. అంతట బ్రాహ్మణుడు వివేకము తెచ్చుకొని యందులకు సమ్మతించెను. అప్పుడు బ్రహ్మ వానికి కుంచెను, రంగులను జేయు విధము నుపదేశించెను. ఆ బ్రాహ్మణు డంతట తన హృదంతరమున ముద్రితమైయున్న కుమారుని రూపమును ధ్యానించి, దానిని పటముపై రంగులతో జిత్రించెను. బ్రహ్మ యంతట నా చిత్తరువునకు జీవమును బోసెను. ప్రతిమకు ప్రాణప్రతిష్ఠ కలిగెను.

ఈ గాథ ఐతిహాసికము గాదు. ఇది అర్థవాదమువంటిది. చిత్రకళారహస్యమంతయు నీకథయందు గర్భితమై యున్నది. ఇందు ముఖ్యముగ రెండంశములు ద్యోతకమగుచున్నవి. చిత్త

రువు బాహ్యవస్తువుయొక్క రూపపటముకాదు ; ఫొటోగ్రాఫ్ కాదు ; నకలుకాదు; అనుట మొదటి యంశము. చిత్తరువు హృదంతరమున ధ్యానముచే సాక్షాత్కరించు దివ్యరూపము యొక్క ప్రకాశము అనునది రెండవయంశము. పుత్రుడు మరణించెను. ఎంతకాలమునుండియో యింద్రియములకు బరిచితమైన యావస్తు విక కనుపడదయ్యె. దిక్కులు శూన్యము లయ్యెను. సర్వము నంధకారమయమై దుర్భరమయ్యెను. ఇంద్రియములు తిరిగి వానిని బొందుటకు బరితపించుచున్నవి. ఈ కన్నులా కోమలగాత్రుని వెదకుచున్నవి. ఆ మధురవాణిని గ్రోలుటకీ శ్రోత్రపుటములు ఆతురపడుచున్నవి. చల్లని పుత్రాలింగనసౌఖ్యమునకై యీ బాహువులు పరితపించు చున్నవి. వెదకి వెదకి యింద్రియములు విఫలప్రయాసయందు మూసికొనిపోయెను. ఇంద్రియరాజ్య మంతర్ధానమయ్యెను. ఈ వియోగము దుస్సహము. హృదయమున ప్రచండమైన దుఃఖాగ్ని ప్రజ్వలించుచున్నది. దుఃఖజ్వాలలచే నీ యంధ కారము మఱింత దట్టమగుచుండెను. తిమిరములు దట్టమైన కొలదియు నుచ్ఛ్వాసనిశ్వాసము లాగిపోయెను. హృదయ స్పందనముకూడ నిలచిపోయెను. నిబిడాంధకారమున జిత్తము నిస్తరంగమైన మహానిస్తబ్ధతయందు మునిగెను. ఆ నిశ్చలసాగ రముపై స్వర్గమునుండికాబోలు మందపవనములు వీవసాగెను. మెల్లగ నొక యుత్తుంగతరంగము తేజోమయమై యుద్భూ తము కా మొదలిడెను. ఆతేజము సహస్రదళపద్మాకారమున రూపొంది, దళములు విప్పుకొనసాగెను. అట్లు వికసించిన స్మృతిగర్భమునం దొక దివ్యశరీరి శిరమున నమృతకలశము నిడు కొని ప్రత్యక్షమయ్యెను. ఎట్టి దివ్యదర్శనము ! కన్నులెప్పుడును నట్టి రూపమును జూచి యెఱుగవు. తను వట్టి శరీరమును

స్పృశించు భాగ్యము పూర్వమెన్నడును గలుగలేదు. కర్ణము లట్టి గానామృతమును గ్రోలియుండలేదు. ఈ రసన యట్టి సుధ నెప్పుడును జవిచూడలేదు. ఏమి యీ స్వర్గసౌరభము ! నాసికాపుటములు తనివితీరక యాఘ్రాణించుచున్నవి. హృదయము పల్లవించుచున్నది. ఆ యమృతకలశమునుండి వాత్సల్యసుధ ప్రవహింపసాగెను. అపూర్వానుభవము ! బ్రహ్మకృపచే తండ్రికి పుత్రసాక్షాత్కార మయ్యెను. మృత్యుచ్ఛాయలు పటాపంచలయ్యెను. జనకు డానందభరితుడై పుత్రుని యమరరూపమును, దివ్యశరీరమును, స్వర్గజ్యోతిని, ధారణచేసి బ్రహ్మకృపచే సిద్ధించిన కుంచెతోడను, రంగులతోడను దాని ప్రతిబింబమును జిత్రించి కళాస్రష్ట యయ్యెను.

ఇదియే చిత్రకళారహస్యము. ఈ చిత్రకారుడు రచించినది తనపుత్రుని భౌతికవిగ్రహముయొక్క ప్రతిరూపముకాదు. భౌతికవిగ్రహము చంచలము, క్షణభంగురము. నిన్నటి రూపము నేడులేదు. నేటి రూపము రే పుండదు. జనకుడు కోరునది పుత్రుని నిత్యరూపమునుగాని యనిత్యమైన శరీరమును గాదు. పుత్రుని నిత్యరూప మింద్రియరాజ్యమునందు గోచరము కాజాలదు. ఇంద్రియములకు గోచరమగునది యీ నిత్యరూపముయొక్క ఒకదిక్కు, ఒక లేశము, ఒక కిరణప్రసారము మాత్రమే. దాని మరుగున, దాని కతీతమైన పుత్రుని నిత్యరూపము నిండువెలుగుతో విరాజిల్లుచున్నది. ఇంద్రియముల నతిక్రమించిన గాని యీ నిత్యరూపము సాక్షాత్కారము కాజాలదు. కావుననే జనకుడు తన దృష్టిని బయటినుండి మరల్చి హృదంతరమునందు బఱపెను. అంతరంగమున రెండు శక్తులు గలవు. ఒకటి స్మృతి. ఇందు పూర్వపరిచయమంతయు వాసనారూపమున నంకితమైయున్నది. పుత్రుని బాల్యలీలలు,

పుత్రుని యౌవనోద్దామముయొక్క యావేగము స్మృతియం దాబద్ధములై యున్నవి. రెండవది కల్పనాశక్తి. ఈ శక్తియందు భావికాలపు స్వర్ణస్వప్నములు, నాశాకిరణములును విలసిల్లు చున్నవి. ఎప్పు డింద్రియరాజ్యమును వీడి యంతరంగము నాశ్రయించెనో, యప్పుడు స్మృతిచేతను, కల్పనాశక్తిచేతను తండ్రి, తన పుత్రుని స్వభావమును స్వరూపమును, వాత్సల్య పరిభావమున బ్రత్యక్షము చేసికొనగలిగెను. తండ్రి సృష్టించిన యీ రూపము ధ్యానధారణలచే ప్రేమచక్షువులకు గోచరమైన, జరామరణములు లేని దివ్యరూపము, బాహ్యమును పరివర్తనశీలము నైన పాంచభౌతికశరీరము గాదు. రసానుభవమును రూపద్వారమున బ్రకాశింపజేయుటయే కళ. కల్పనయందు ప్రకాశించు సౌందర్యమును సత్యముపై బ్రతిష్ఠించుటయే కళాప్రయోజనము. మన మింద్రియతరంగఫేనములో జిక్కుకొని ప్రాణముయొక్క రసోన్మేషము నుపభోగింపలేకున్నాము. ఎప్పుడు బాహ్యమునువీడి భావకైలాసశిఖరము నధిరోహించి మానససరోవరమునందలి సుధారసమును జవిచూచెదమో యప్పుడు మన యింద్రియములకు నూతన దివ్యదృష్టి వికసించును. సకల వస్తువులయొక్క మర్మము వెల్లడియగును.

రసమునకును ఇంద్రియములకును ఘనిష్ఠమైన సంబంధము గలదు. మనమున రసోదయమైనప్పు డింద్రియములు ప్రఫుల్లములై నూతనలోకమును గాంచగలుగును. ఆపుష్పము నట్టి రసదృష్టితో జూడుము! ఆకుసుమగర్భముననున్న వసంతలక్ష్మి కుంభములకొలది స్వర్గపరిమళము నెట్లు గుమ్మరింపుచున్నదో! విశ్వమంతయు కుసుమదర్శనముచే ముగ్ధమగుచున్నది! మనకనులు చూచునది పుష్పముయొక్క బాహ్య

రూపము. శిల్పి యీ మాయను దాటి తన్మయత్వములో మునింగి పుష్పముయొక్క విశుద్ధరూపమును గాంచగలుగును. శిల్పియొక్క యంతరంగమునకును, పుష్పముయొక్క యంతరంగమునకును జరగు రసలీలయే శిల్పరచనమునకు విషయము. అంతియకాని ఇంద్రియగోచరమగు జడవస్తువుగాదు. ఇట్టి యుజ్వలావస్థను బొందనివారికి దేవతాసాక్షాత్కారము కాజాలదు. దేవత లెక్కడనో లేరు. వారు మనతో సతతము క్రీడించుచున్నారు. గిరులయందు గిరిదేవత, నదీనదములందు నదీదేవత, తరులతాగుల్మములందు వనదేవత, దంపతులయందు రాధాకృష్ణులు, పుత్రునియందు గోపాలబాలుడు—జగత్తునందంతటను దేవతలు నిత్యము విహారము సేయుచున్నారు. ఈ ఇంద్రియరాజ్యము నతిక్రమించుటతోడనే శూన్యమున బడిపోవుదు మని భయపడెదము. ఆ కథలోని బ్రాహ్మణుడు తనపుత్రుడు మరణించుటతోడనే యట్టి జడత్వమునకు లోనయ్యెను. కాని ఈశ్వరప్రేరణచే నా మాయ తొలగెను. "సర్వేంద్రియ గుణాభాసం, సర్వేంద్రియ వివర్జితమ్" ఈ ఇంద్రియగ్రామము బయటనున్నది శూన్యము కాదు, అంధకారము కాదు. "ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" అది నిండువెలుగు. అయ్యది సర్వేంద్రియములయొక్క చరమసిద్ధి; పరమసాఫల్యము. ఇంద్రియరాజ్యమునుండి దేవతారాజ్యమునకును, పృథివినుండి స్వర్గమునకును, మృత్యువునుండి యమృతపదవికిని గొనిపోవుటకు బ్రహ్మనిర్మించిన యానందసేతువే యీశిల్పము, యీకళాసృష్టి.

1917 *

శిల్ప ప్రయోజనము * *

కళా ప్రయోజనమును నిరూపించుటలో నెన్నియో మతభేదములున్నవి. మానవునకు వ్యవహారజ్ఞానము నొసంగునదియు, కాంతాసమ్మితముగా యుక్తాయుక్తముల నుపదేశించునదియు, కార్యోత్సాహమును బుట్టించునదియు కళ యని కొందరి తలంపు. సాంసారికతాపత్రయమువలన జీవనము దుర్భరమైనప్పుడు, వ్యక్తిని గాని సంఘమునుగాని బంధించివేయు శృంఖలము లతికఠోరములైనప్పుడు, మానవుని మనస్సును పరాధీనతనుండి తప్పించి, యానందధామమునకును, స్వప్నగృహమునకును దీసికొనిపోవు సద్యఃపరనిర్వృతియే కళల ప్రయోజనమని కొందరి యభిప్రాయము. అమంగళమును తొలగించి, మేలును, శుభమును నొసగూర్చుటయే కళల యుద్దేశ్యమని మరికొందరి యాశయము. ఈ మతములందు సత్యము లేకపోలేదు. కాని యివి యన్నియు కళల బాహ్య ప్రయోజనములను దెలుపునేకాని వాని యాంతర్యమును దెలుపవు. మనస్సునకు చమత్కారమును, నానందమును గూర్చుటయే కళల ముఖ్యోద్దేశ్యమైనచో, వాని స్వతంత్రధర్మమే నశించును. కళల ప్రయోజన మింతకంటెను నెక్కువ యున్నతమైనది. నిజము నరసితిమేని మానవహృదయమునుండి బయల్వెడలుటకంటె వాని కన్యసార్థకత లేదు.

సత్యము సుందరమైనప్పుడు, భావము పంజరమునుండి ఎగయు విహంగమువలె విముక్తి నొంది యనంతపథమును దొరకును.

మానవప్రకృతి యుజ్వలితమైన వెంటనే ప్రాణము నృత్యము సేయును. ఆత్మయొక్క నిజసౌందర్యము బహిర్గతమగును. భవబంధములనుండి విముక్తినొందు భావము,—ప్రాణవిలసనము మూలమున వ్యక్తమగు నాత్మసౌందర్యము—కళల యందు మూర్తిభవించుచున్నది. కళయన రసస్పృష్టి; కళ యన విశ్వాంతరాళమునుండి వెలికివచ్చు నమృతకలశము.

మానవుని సామాన్యజ్ఞానమునకు విశ్వములోని యనంత రహస్యము గోచరముగాదు. ప్రకృతిగతమైన యాత్మకును, మానవాత్మకును ననవరతము జరగుచుండు రమ్యక్రీడ శుద్ధ మానవచింతకు గోచరమగు విషయముగాదు. విశ్వశక్తి యొక్క మూర్తిస్ఫురణయు, కామాతీతమగు రసమాధుర్యమును, ప్రాకృతేంద్రియములకు లభ్యమగుట లేదు. విశ్వము యొక్క బహిర్ద్వారములు బంధింపబడియుండుటచే విశ్వాంతరమున నిర్మలకాంతితో వెలుంగు నాత్మానందము సామాన్యులకు ప్రాప్యము కాకున్నది. ఈ బహిర్ద్వారములను దెరచి, యందలి యాత్మస్వరూపమును జూపగల తాళపుజెవియే— విశ్వాత్మయొక్క మూర్తిస్ఫురణను చర్మచక్షువులకు గోచరింపజేయు జ్ఞానాంజనమే— యీ కళ.

సృష్టివైచిత్ర్యములను దిలకింపుడు. అందు గన్పడు ప్రతిపత్రము, ప్రతివర్ణము, ప్రతిరూపము, ప్రతిస్వరము నాత్మయొక్క ప్రతిబింబమై గోచరించును. కాని మన కన్నులు జగత్తుయొక్క యంతరాళమున జొరలేకున్నవి. మన దృష్టి భ్రమరముభంగి రూపముల బాహ్యముననే తిరుగాడుచున్నది. కళ, విశ్వముయొక్క రూపములయొక్క యాంతర్యమును, వాని వక్షస్థలమునుండి పైకి పెకలించుచు, మనము మాయ యని భ్రమనొందు ప్రపంచముయొక్క యథార్థరూపమును వెల్లడి

సేయును. మన కంటికి నగపడు పదార్థములలో నిగూఢమై యున్న ద్వైతాద్వైతముల యచింత్యరహస్తత్త్వమును మన నేత్రములకు గనుపఱుపగలుగును. శబ్దస్పర్శరూపరసగంధములలోని సత్యమును మన ప్రాణపటమున ముద్రితమొనర్చును. కావున ప్రతిరూపమునందును, రసమునందును నున్న లీలను ధ్యానించుటచే గలుగు ననుభూతియే కళావిభూతి యని చెప్పనగును. అంతియకాని, కళ యన కచేరులలో నృత్యము సేయు వేశ్యవంటిదికాదు. ఇంద్రియములకు సుఖమును, వినోదమును సమకూర్చు నైంద్రజాలికునివంటిదికాదు. ఎవరు స్వకీయ జీవనమునందలి సత్యమును సాక్షాత్కార మొనర్చుకొనగలరో, యెవరి చిత్తము భగవదాయత్తమై, పరానురక్తిప్రవాహమున నిమగ్నమై యుండునో, యెవరిభావము దేహమనఃప్రాణముల నతిక్రమించి ప్రేమరసమున బారవశ్యమునొందునో వారే కళావిదులు, వారే రసస్రష్టలు, వారే కవులు, శిల్పులు, గాయకులు, చిత్రలేఖకులు, విగ్రహనిర్మాతలు కాగలరు.

మనస్సెప్పుడును సత్యపదార్థమును సుందరముగ జేయుటకై కోరుచుండును. ప్రాణము వట్టి భావములతో దృప్తినొందదు. అందువలననే మానవుని ప్రాణము రూపరసములను భోగింపజూచుచుండును. కాని యిందు దోషముగలదు. ఏల యన, రూపరసములు స్వతంత్రములుకావు. స్వతంత్రములు కాని విషయములలో మనస్సు చిక్కుకొన్నప్పుడు భోగసంబంధమైన దాస్యము వాటిల్లును. కావున ప్రాణముయొక్క స్వభావస్ఫూర్తి కాటంకము గలుగును. అందువలన నాభోగము సౌందర్యదూరీకృతమగును. స్వభావసిద్ధమైనగతియు, స్ఫూర్తియు నున్నప్పుడే యే పదార్థమైనను రమణీయమై, సౌందర్యమయమగును. ఏది రసోద్దీపనమునుగావించునో యదియే సౌంద

ర్యము. అదియే రసానుభూతి కాలంబనము. రసానుభవముతో

వస్తునిష్ఠమగు రసాంగములకు సంబంధముగలిగినప్పుడు, మనయం దొక్క రూపముద్వారమున, సర్వరూపముల యాభాసయు నుద్దీపితమగును. అప్పు డది సుందరరూపమును ధరించును.

ఈ విశ్వము జడముగాదు. జడత్వము మన మనస్సునం దున్నది. మన మనస్సుయొక్క వ్యభిచారదోషము వలన, రూపమాధుర్యములందుండు దివ్యసుందరుని జడునిగ జేసి, విశ్వము జడమని చెప్పుచున్నాము. ద్రవ్యముల అంగాంగీభావ మునసే రూపసృష్టి జరుగుచున్నది. కావుననే ప్రతిరూపము నందును నాత్మయొక్క మధురరస ముప్పొంగుచున్నది. "సర్వేషాం భూతానాం మధుః" ఈ మధురరసము నాస్వాదించి నప్పుడే రూపములు సౌందర్యమయములగును. ప్రతిమానవు నకును రూపములయెడల సహజలాలస గలదు. కారణమేమి? రూపములలోని దివ్యసుందరమూర్తిని జూచుటకై మానవుని ప్రాణము సదా వ్యాకులత నొందుచుండును. ఇంద్రియచాంచ ల్యమునకు సార్థకత అందే కలదు. తుమ్మెదలవలె మన యింద్రి యములు రూపమాధుర్యమును జవిచూచుటకై రూపము లనెడి పుష్పములపై సతతము వ్రాలుచున్నవి. రూపములలోని మాధుర్యమును గ్రోలలేక, యింద్రియము లతిచంచలము లగుచున్నవి. భక్తులయు కవులయు కళాస్రష్టలయు ప్రాణము లుద్దీపితములై యుండుటచే, వారి యింద్రియములు రూపము లోని మాధుర్యమును గ్రోలి, తన్మయత్వము నొందుచున్నవి. రూపములలోని సుందరుని, మాధుర్యమయుని, రసస్వరూపుని వ్యక్తీకరించుటయే కళాసృష్టి. కళావిదుల దృష్టిలో, మనకు జడములవలె గన్పట్టు రూపములు, రూపాంతరమునొందును, చిన్మయములగును, ప్రాణకణికలగును. ఏభావములు మాన

వాంతఃకరణమున నిద్రాణములైయున్నవో, యేరసములు మానవుని ప్రాణరంగమున దృశ్యాదృశ్యముగ ఖేలనంబొనర్చుచున్నవో, యేప్రాణము సంకల్పవికల్పములయందు స్నేహదాస్యవాత్సల్యమాధుర్యాది మహాభావరసములందు, జననమరణములందు, తరంగాయితమై ప్రవహింపుచున్నదో, ఆ భావములు, ఆ రసములు, ఆ సమగ్రజీవనము నిఖిలరసామృతమూర్తి నాశ్రయించి, రూపాంతరము నొందు నవస్థావిశేషమే కళల కాశ్రయము. అందే కళల సృష్టి. రూపములోని సచ్చిదానందస్వరూపము, దేహమనఃప్రాణములతో భోక్తృభోగ్య సంబంధమున జూపు లీలావిలాసమును బ్రకాశింప జేయుటయే కళల యుద్దేశము. ఆ సాధనయే కళలచరిత్ర.

ప్రాకృతసృష్టికంటె కళాసృష్టి యతినికృష్టమైనదని కొందఱు చెప్పుదురు. ఏల యన, ప్రాకృతసృష్టి సజీవము, ప్రాణమయము; మానవసృష్టి ప్రాణవిహీనము, నిర్జీవము నని వారి తలంపు. కళాసృష్టికి దారువు, శిల, పటము, వర్ణము, స్వరము మొదలగునవి యుపాదానములు, నుపకరణములును. ఇవి నిజముగ మృతములును కావు. కేవల మీపదార్థముల వలననే చిత్రకళ సృష్టింపబడుటయు లేదు. ఆత్మానుభూతియే రూపకల్పనకు బ్రాణప్రతిష్ఠను గలిగించుచున్నది. అనుభవము విశ్వగతమగు ననంత ప్రాణసాగరములోని తరంగము. అందువలననే కళ, దారుశిలాలోహముల నతిక్రమించి, సజీవమగుచున్నది. సృష్టియం దేసత్యమును జూచుటకు బ్రయత్నింతుమో, ప్రకృతియం దేసృష్టిని సచేతనమని తలచుచున్నామో, కళయు దానినే యాశ్రయించి నవనవరూపముల జీవనసౌందర్యమును ధరించును. ఇందువలననే, కళాసృష్టి శ్రేష్ఠమగుచున్నది.

1926

*

నీ తి వా ద ము * *

కళావిదుడెప్పుడు నుపదేశికుడు కాడు. ఒక నీతిని బోధించుటకు గాని, యొక ధర్మము నుపదేశించుటకు గాని, తన కళ నెప్పుడును వినియోగింపడు. నీతులు, ధర్మములు దేశకాలములను బట్టి మారుచుండును. ఒక్కొక కాలమునం దొక్కొక ధర్మము జనుల నాకర్షించును. శిల్పి తదనుగుణముగ తన కళను మార్చుకొని యెరుగడు. దేశకాలముల కతీతమైనది శిల్పము. శిల్పి యీ వ్యావహారికజీవితమునందు సతతము మారుచుండు పుణ్యపాపములు, సుఖదుఃఖములు, ఉచ్చనీచములు మొదలగు ద్వంద్వములలోని నిత్యసత్యము యొక్క విచిత్రలీలను దర్శించి పరమానందభరితు డగుచుండును. శిల్పము లోకకల్యాణమునకు సహకారిగా నుండవచ్చును. కాని యంతమాత్రము చేత శిల్పి యా కార్యమునకు బంధింపబడి యుండునని తలంప జనదు. అట్లు బంధింపబడినయెడల జ్ఞానము కుంఠితమగును. జగత్తునందలి యనంతరహస్యము సీమాబద్ధమై మఱుగువడును. ఈశ్వరుని విచిత్రరససౌందర్యలహరి మానవనేత్రములకు గోచరింపక, దాని యాస్వాదనమే యసంభవమగుట తటస్థించును.

శిల్పము నీతిబద్ధమగునా, కాదా యను చర్చకు గడంగునప్పుడు రస మనంతవిధము లను విషయమును మఱతుము. నీతివాదులబోలి, భగవంతున కొకపరిచ్ఛిన్న రూపము గల్పించి, లోకనీతి యను నొక కొలతబద్దతో శిల్పము

యొక్క మూల్యమును, ప్రయోజనమును, నిర్ణయించుటకు గడంగుదుము. సామాజకనీతి, రాజనీతి మొదలగు వ్యావహారిక ధర్మములకుగూడ శిల్పమును దార్ప బ్రయత్నింతుము. మానవుని యాత్మోన్నతి కొఱకు భగవంతుని విశేషరూపములను దేశకాలపాత్రముల ననుసరించి యారాధించవలసియుండును. అందుమూలమున సాంఘికరాజకీయ విషయములందు వికాసము గలుగవచ్చును. కాని యీ విషయములు శిల్పముయొక్క యాంతర్యమును దెలుపజాలవనుటమాత్రము నిశ్చయము.

శిల్పమునకు మూలాధారము సత్యము. సత్యము మారునదికాదు. అయ్యది నిత్యమై సర్వగతమైనది. బుద్ధికి గోచరమగు సత్యము నిజముగ సత్యముకాదు. ఒకరి బుద్ధికి సత్యముగ దోచిన దింకొకరికి సత్యముగ దోచదు. ఒకకాలమునందు సత్యముగ తలంపబడునది యింకొకకాలమున సత్యముగ దలంపబడదు. మనబుద్ధికి గోచరమగు సత్యము సతతము మారునదే కాని నిర్వికల్పమైన యఖండసత్యము కాదు. అటులనే మనబుద్ధి నిర్ణయించు పుణ్యము, సౌందర్యము, ఆనందము శాశ్వతమైనవి కావు. మానవునిబుద్ధి సత్యాసత్యములు, పుణ్యాపాపములు, సుఖదుఃఖములు, సౌందర్యాసౌందర్యములు మొదలగు ద్వంద్వములమధ్య తిరుగుచుండును. కాని సత్యమీ ద్వంద్వముల కతీతమయ్యు నీ ద్వంద్వములందు గూడ నంతర్గతమైయున్నది. ప్రతివస్తువునందు నంతర్గతమైయుండు నిత్యసత్యమును, రసపూర్ణతను వెల్లడించుటకే శిల్పి యెప్పుడును చూచుచుండును. నిత్యమగు విశ్వలీల తాత్కాలికులగు నీతివిదుల కమంగళకరముగను, పాపభూయిష్ఠముగను దోచవచ్చును. అట్లని యది యీశ్వరలీల కాదని మాత్రము చెప్పకూడదు.

జగత్తులో జరుగుచుండు ప్రతివిషయమును సత్యము నాశ్రియించుకొనియే ప్రకాశించుచున్నది. సత్యమే యా విషయము యొక్క సౌందర్యము. పుణ్యపాపములు, ధర్మాధర్మములు వివేచన చేయుపని శిల్పిది కాదు. ప్రతిపదార్థమునందును దాగియుండెడి యానందఘనస్వరూపమును వెల్లడిపఱచుటయే శిల్పి యొక్క కర్తవ్యము. శిల్పి సాధుపుంగవుల వైరాగ్యమును జిత్రించునటులనే కాముకుల కామోన్మాదమును జిత్రించును. కాముకుల కామోన్మాదమును జిత్రించుటచే చిత్రకారుని గౌరవమున కెంతమాత్రము భంగము వాటిల్లదు. సాధువుల వైరాగ్యమువలెనే, కాముకుల కామోన్మత్తతగూడ సత్యముయొక్క ప్రకాశమే.

ఆధ్యాత్మికభావమునకును, శిల్పమునకును నెట్టి వైరుధ్యమును లేదు. ఆధ్యాత్మికభావమే నిజముగ శిల్పమునకు జీవము. ఆధ్యాత్మికభావము యోగుల యోగమునందును, భోగుల భోగమునందునుగూడ సమానముగనే యుండును. యోగుల యోగిత్వము, భోగుల భోగిత్వము, దేవతల దేవత్వము, పశువుల పశుత్వము యథావిధిగ జిత్రింపగలవాడే కళావిదుడు. ఇందువలన శిల్పి నాధ్యాత్మికవాది యని పిలుచుట కెట్టి సంశయము నుండ నవసరము లేదు. శిల్పి యనంత దయారస స్వరూపుడగు బుద్ధభగవానుని జిత్రించి ధన్యుడైనట్లే, దశకంఠుని రౌద్రరూపమును గూడ జిత్రించి, ధన్యుడు కాగలడు. కరుణరసమును జిత్రించిన భవభూతికవియు ప్రధానరసమగు శృంగారమును జిత్రించిన కాళిదాసును సమానముగ బూజ్యులగుదురు. శాకుంతలాదులను బఠించు పాఠకుల మనములయందు శృంగారరస ముద్దీపితమైనచో నందు కాళిదాసు దోషమేమిగలదు? మానవప్రకృతియందు విరాజిల్లుచున్న

శృంగారరసమును వెల్లడించుటయే కాళిదాసుని యుద్దేశము. కాని యొకానొక సమయమున బ్రహ్మచారులవంటి సాధకులకు శృంగారవర్ణన మంతరాయము కలిగించ వచ్చునను కారణముచే దాని నసత్యమనిగాని, సౌందర్యవిహీనమనిగాని చెప్పుట కేవలము సాహసము.

నగ్నస్త్రీల చిత్తరువులు నేత్రములకు బాధను గలిగించును. అట్లుండుటకు గారణము కేవలము నీతిజ్ఞానమే కాదు. సౌందర్యబోధ వానిలో నేమాత్రమును లేకపోవుటచే నవి యసహ్యముగ నుండును. సాధారణముగ మనము చూచు బూతుబొమ్మలు సౌందర్య విహీనములైనవి. అవి నిజముగ చిత్తరువులు గావు. అవి ఫొటోగ్రాఫులు. నకళ్ళు స్త్రీలయొక్క బాహ్యరూపమును మాత్రమే చూపించును గాని, యంతర్గత సత్యమగు స్త్రీత్వమును వెల్లడింపజాలవు. రసికుని దృష్టికి నగ్నస్త్రీల ఫొటోగ్రాఫు లెంత యసహ్యములో సాధుపుంగవుని ఫొటోగ్రాఫుకూడ నంత యసహ్యముగనే యుండును. ఫొటోగ్రాఫులు స్త్రీల స్త్రీత్వమునుగాని, సాధువుల సాధుత్వమునుగాని చూపింపజాలవు. ఈ కారణముచేతనే రవివర్మ చిత్తరువులు రసవిహీనములై రసజ్ఞున కసహ్యముగ దోచును. నీతివాదుల యశ్లీలజ్ఞానముతో నాలోచించినను, రసజ్ఞుల యతీంద్రియదృష్టితో జూచినను, బాహ్యరూపము వెనుకనుండు గభీరసత్యమును వెల్లడింపజాలని చిత్తరువులు హేయములే. శిల్పశాస్త్రమునం దట్టి చిత్తరువులు దూష్యములుగ నెంచబడును. స్త్రీరూపచిత్రమును జూచునప్పుడు, ఆ రూపమును, శిల్పి వివస్త్రముగ జిత్రించెనా, లేక సవస్త్రముగ జిత్రించెనా యని కా దాలోచింపవలసినది. ఆ రూపమునందు శిల్పి స్త్రీయొక్క స్త్రీత్వమును జిత్రింపగలిగెనా యను విషయమునే

రసజ్ఞు డాలోచించును. అట్టి చిత్తరువునందలి రూపము నగ్నమైనను, రసజ్ఞుని దృష్టి అందలి స్త్రీత్వముమీదనే నిలచును గాని, చిత్తవికారమును గలిగించు బాహ్యరూపముపై నిలువదు. రసికుడు చిత్తరువునందు నారీప్రకృతియందలి సత్యమును ఋషివలె దర్శించి పరమానందభరితుడగును. నీతికోవిదుడు దృశ్యముల నెంతవఱకు పుణ్యపాపములనెడు వివేచనతో జూచు నభ్యాసమునకు వశుడైయుండుటచే, పుణ్యపాపముల కతీతమైన యీ గూఢరహస్యమును, సహస్రధారలుగ బ్రవహించు రసవాహినియొక్క మూలరఝరిని దర్శించి ధన్యుడు కాజాలడు.

శిల్పికి రససిద్ధి కలిగినప్పుడు రూపసృష్టి చేయును. రసావేశావస్థ పుణ్యపాపములకు, విధినిషేధములకు నతీతమైనది. రససిద్ధుని పరిపూర్ణమగు సత్యానుభూతి, యపరిణతావస్థ యందుండు నీతివాదికిగాని, సాధకునకుగాని గోచరింపదు. సాధకునకు గోచరించు సత్యము క్షణికము, ఖండము. అందు సత్యముయొక్క నిత్యరూపము గోచరముకాదు. "రససిద్ధాః కవయః" కవులు ఋషులవలెనే రససిద్ధులు. కవి దృష్టి మర్మభేదివలె, ప్రకృతియందలి చిరంతనసత్యమును వెల్లడిచేయును. రవి గాంచనిచోటు కవి గాంచును. నీతివాది యన్ననో, యిది పుణ్యమా, పాపమా యను కొలతబద్దలతో సర్వమును విచారించుచుండుటచే నీ కొలతల కతీతమైన సౌందర్యమును గాంచజాలడు. ప్రసిద్ధ గ్రీకుశిల్పులు చిత్రించిన నగ్నస్త్రీప్రతిమలను జూచినంతనే నీతివాది మనస్సు కలవరపడును. ఆ విగ్రహములయందలరారుచుండు సత్యము, సౌందర్యము వానికి బోధపడదు. ఇంద్రియనిగ్రహమును సాధించుట సమంజసమే. కాని నీతివాది యింద్రియనిగ్రహ మను

ప్రేర, నింద్రియములందలి సత్యమునకే దూరమగును. ఇంద్రియముల బాహ్యావిక్షేపమునకు భీతిజెంది, యింద్రియముల యందలి సత్యదేవతను విడనాడుట రససిద్ధికే గాక, సత్యానుభూతికి గూడ నంతరాయము గల్గించును.

నీతివాది మార్గమునకును, రసికుని మార్గమునకును భేదముగలదు. నీతివాదిది వ్యతిరేకమార్గము. రసజ్ఞునిది అన్వయపథము. నీతివాది "ఇదికాదు, ఇదికాదు" అనుచు ముందుకు నడచును. రసజ్ఞుడు "ఇదే కాదు, ఇదే కాదు" అనుచు ముందుకు బోవును. సాధకు డతీంద్రియజగత్తును జేరుట కింద్రియలీలలను త్యజింపబ్రయత్నించుచుండును. కళావిదు డింద్రియ విభూతి ద్వారముననే యతీంద్రియజగత్తును జేరును. సాధకు డింద్రియనిగ్రహముకొఱ కాచారములు, విధినిషేధములు మొదలగు నియమములను గల్పించుకొనును. కాని కళావిదు డీ నియమములను గమనింపడు. తాను ముక్తపురుషునివలె సంచరించును. ముక్తభావ మెప్పుడును జాగృతమైన యెడల, నాతడు సిద్ధుడగుటకు సందియములేదు. సాధకుడు తన సాధనకును, ధర్మప్రవర్తకుడు తన ధర్మశీలమునకును, ననుగుణమైన విషయములను మాత్రము గైకొని, మిగిలిన వానిని వర్జించును. కాని శిల్పి యట్టి ధర్మమీమాంసకు గడంగడు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" యను రసజ్ఞునకు దోషభూయిష్ఠమగు విషయ మేముండను? శిల్పిసర్వ విషయముల యందు నంతర్గతముగ నుండు సౌందర్యమహిమను, సత్యప్రేరణను గాంచి తన్మయుడగుచుండును. సాధకు డాచారనియమములు, దీక్షావ్రతములు, వితర్కవిచారములు మొదలగు వాని సాహాయ్యముతో దనసాధనలను బలపరచుకొనుచు నాత్మోపలబ్ధికి గడంగును. కళావిదుడు సకలరూపముల

నుపాసించుచు గమ్యమును స్వేచ్ఛగ జేరుటకు బూనుకొనును. "నిరంకుశాః కవయః" రససిద్ధులు స్వతంత్రులు. యశోదా దేవిని జిత్రించిన సిద్ధహస్తుడు వారాంగనాచిత్రమునుగూడ జిత్రించుటకు సంశయింపడు. ఆ ద్వివిధచిత్రములయందు ప్రకృతిగతమగు దోష మణుమాత్రమైనను గాన్పింపదు. కళా విదునకు గావలసినది సత్యప్రేరణము, సౌందర్య బోధ. దానికి మించినది మరియొకటి లేదు.

ధర్మమీమాంస కలవాటువడిన నీతివాదులు సౌందర్య బోధ ననుభవింపజాలరు. తర్కముతోడను, నీతితోడను సమన్వితమైన గాని, వారి కేవిషయమును గ్రాహ్యముకాదు. ధర్మశాస్త్రము, నీతిశాస్త్రము వారికి ప్రమాణములు. వారు కళావిదులనుగూడ నీ పాశములచే బంధింప జూచెదరు. విషయ భోగములందు జిక్కుకొనిన జనసామాన్యమునకు నీతి మిక్కిలి ప్రయోజనకారి యనుటకు సందియములేదు. కాని యది మానవుని సూక్ష్మదృష్టిని, అంతఃప్రకృతిని ప్రబోధ మొనర్ప జాలదు. రసజ్ఞుల దృష్టియే జగదంతర్గతమైన రహస్యమును వెల్లడించగలదు. రససంబంధముచే భగవదుపలబ్ధియైనవాని కాచారనియమములతో బనిలేదు. కావుననే శిల్పి యింద్రియ లీల యందలి సౌందర్యము ననుభవించి, తన్మూలమున నాధ్యాత్మికభావమున నోలలాడును.

1926 *

రాజపుత్రశిల్పము * *

క్రీస్తుశకము పదుమూడవ శతాబ్ది మొదలుకొని పదునెనిమిదవ శతాబ్దమువఱకు ఉత్తరహిందూస్థానములో, ముఖ్యముగ పంజాబు, రాజపుత్రస్థానము మొదలగు ప్రాంతములలో, ప్రాబల్యమునందిన హిందూశిల్పమునకే రాజపుత్రశిల్పమనుపేరు కలిగినది. ఈ శతాబ్దిలోనే హిందీ, పంజాబీ, గుజరాతీ, బంగాళీ, మహారాష్ట్రము మొదలగు ప్రాకృతభాషలు కూడ విజృంభించెను. అంతకుబూర్వము, ముఖ్యముగ తొమ్మిదవ శతాబ్దమువఱకు, సంస్కృతమునకే ప్రాముఖ్యముండెడిది. సంస్కృత మా కాలమున మాతృభాష కాదు. రాజసభలందు, పండితపరిషత్తులందు, భక్తుల గోష్ఠులందు, గురుకులములందు, సంస్కృతమే వ్యవహరింపబడుచుండెడిది. క్రిందితరగతులవారుమాత్రము ప్రాకృతములో మాట్లాడుచుండిరి. కాని బుద్ధునికాలమున, సంస్కృతమునకే ప్రాముఖ్యమున్నను, బౌద్ధమతప్రచారముమాత్రము ప్రాకృతమునందే సాగెడిది. సుమారు పదునొకొండవ శతాబ్ద్యారంభకాలమున, ప్రాకృతమునుండి బయల్వెడలిన దేశభాషలు తలలెత్తి, రాజసభలను, పండితపరిషత్తులను సహితము ఆక్రమింపజొచ్చెను. పదుమూడవ శతాబ్ది వచ్చుసరికి, సంస్కృతము చాలవరకు మూలబడి, దేశభాషలే రాజభాషలయ్యెను. దేశభాషలలో భారతేతిహాసము లనువదింపబడసాగెను. కవులు దేశభాషలలోనే కావ్యములను

వ్రాయ మొదలిడిరి. చైతన్యుడు, నానకు, కబీరు, మీరా బాయి మొదలగు భక్తపుంగవులును దేశభాషలలోనే కీర్తనలను రచించి భక్తిజ్ఞానవైరాగ్యములను జనసామాన్యములో వెదజల్ల నారంభించిరి. ప్రజలలో నొక యపూర్వమైన యుద్బోధము కలిగెను. రాజకీయపరివర్తనములమూలమున హిందూరాజ్యములు శిథిలములై ఆత్మరక్షణోపాయములలో జిక్కుకొనిపోయినను, సంగీతము, సాహిత్యము, చిత్రలేఖనము, అభినయము మొదలగు విద్యలకు త్తేజనము కలిగెను. అంతకుబూర్వము సంస్కృతభాషాపేటికలయందును, శాస్త్రగ్రంథములందును దాగియుండిన అమూల్యరత్నభాండారములు ప్రజలచే గొల్లకొట్టబడినవి. ప్రాచీనహిందూవిద్యల కొకవిధమైన నూతనకళ యుదయించి, హిందూసభ్యతయొక్క అప్రతిహతశక్తి శతముఖముల వ్యక్తమయ్యెను.

హిందూస్థానమున నీ పదుమూడవ శతాబ్దిప్రారంభమునుండియు బయల్వెడలిన మతోద్యమములు, శిల్పప్రయత్నములు, సాంఘికపరివర్తనములు మొదలగు విషయములను గూర్చిన చరిత్ర సరిగ నింకను బరిశీలింపబడినట్లు లేదు. వైష్ణవమతకర్తలగు రామానుజ, మధ్వ, నింబార్కాది వ్యాఖ్యాతలింకను సంస్కృతమునే ఆశ్రయించుచుండినమాట నిజము. జయదేవుడు అపూర్వమగు తన గీతగోవింద కృతి పదుమూడవ శతాబ్దియందు రచించెను. కాని, వారి యనుయాయులు పదునాల్గు, పదునైదు, పదునారవ శతాబ్దులలో దేశభాషనే ఆశ్రయించి యభివృద్ధిపఱచిరి. రామానందుడు పదునాల్గవ శతాబ్దిలో వెలసెను. వాని శిష్యుడగు కబీరు పదునైదవ శతాబ్దియందు దేశమునంతను గదలించివైచెను. విద్యాపతి, ఉమాపతి, చండీదాసు మొదలగు

వైష్ణవకవులు పదునైదవ శతాబ్దిలోనివారు. శ్రీనాథాజీ మతమును స్థాపించిన వల్లభుడు 1479 లో జన్మించెను. మల్లికు మహామ్మదు ప్రణీతమగు 'పద్మావతి' 1540 లో బూర్తి చేయబడెను. గౌరాంగప్రభువగు చైతన్యుడు 1485-1533 కాలపువాడు. తులసీదాసుని కాలము 1532-1623. లాక్షణికులగు కేశవదాసు, బేహారిలాలు ప్రభృతులు 16 వ శతాబ్దియందు విలసిల్లిరి. ఈ సందర్భములనుబట్టి, ఉత్తర హిందూస్థానమున దేశభాషలు 14, 15, 16 వ శతాబ్దులలో నుచ్ఛదశ నందెనని తెలియనగును.

రాజపుత్రశిల్పము కూడ నీశతాబ్దులలోనే యెక్కువ వ్యాప్తినొందెను. 17, 18 శతాబ్దులలోగూడ గొంతవ్యాప్తి గలిగినను, దీనికొక స్థిరపద్ధతి యీ శతాబ్దులలోనే సిద్ధించెననుట నిశ్చయము. దేశభాషలు ప్రాంతీయభాషలగుటచే, సంస్కృతముకంటె నీ దేశభాషలు ఆయా ప్రాంతీయుల వ్యక్తివిశేషముల నెక్కువగ నభివ్యక్తముసేయుట కవకాశము కలిగెను. అట్లే రాజపుత్రశిల్పమును రాజస్థానము, పంజాబు, హిమాలయప్రాంతము మొదలగు స్థానములందలి ప్రత్యేక లక్షణముల నెక్కువగ ప్రకటింపగలిగెనని రాజపుత్ర చిత్రరచనలతో పరిచయముగలవారికి దెలియని విషయముకాదు. ఈ శిల్పము రాజపుత్రస్థానముబయటకూడ వ్యాపించినను రాజపుత్రసంస్థానాధీశుల పోషణమున నిది యెక్కువగ వర్ధిల్లుటచేతను, వీని చిహ్నములింకను జయపూరు, చిత్తూరు, ఉదయపూరు మొదలగు పర్వతదుర్గములందే యెక్కువగ గాన్పించుటచేతను, ఈ శిల్పమును రాజపుత్రశిల్పమని యిటీవలి చిత్రకారులు వర్ణించుటకు గారణమయ్యెను.

రాజపుత్రశిల్పములు ముఖ్యముగ కుడ్యాలంకారములుగ విలసిల్లుచుండెను. ఉదయపూరు, బికనీరు రాజమందిరముల లోని గోడలమీద నివి యింకనుగానవచ్చుచున్నవి. జయపూరు, అమృతసరము, హోషియార్పూరు మొదలగు పట్టణములలో, ప్రాచీనమందిరముల యంతర్భాగములందే కాక, బయటకూడ నెక్కువగ గాన్పించును. కాగితములపై జిత్రింపబడిన రచనలు స్వల్పాకృతులు కలిగియుండినను, గోడచిత్తరువులుమాత్రము మనుష్యుని ఆకృతినిగూడ మించి, ఒక గోడనుండి యింకొక గోడకు తీగెలు సాగినట్లు అల్లుకొనియుండును. గుజరాతు ప్రాంతములలో, గుడ్డలపై చిత్తరువుల నద్దుట కలదు. ఒక్కొక్క తానుపై గజములకొలది పొడవున, శ్రీకృష్ణలీలలు, రామాయణకథలు, కురుక్షేత్రయుద్ధము మొదలగు రసవంతములైన గాథలు వివిధవర్ణముల అద్దకముచే చిత్రింపబడుచుండెను. పాశ్చాత్యసంపర్కము వచ్చినపిమ్మట నీ చిత్రకళ యుత్సన్నమయ్యెనేకాని, రామాయణభారతకాలములనాటినుండి 18 వ శతాబ్దివఱకు నీ చిత్రవిద్య స్వీయస్వరూపలక్షణములను గోలుపోక, అనేకములైన క్రొత్తక్రొత్త పుంతలను ద్రొక్కుచు జాతీయజీవనము నాక్రమించుకొని యుండెడిదని సంస్కృత కావ్యములందే కాక, దేశభాషాగ్రంథములందు కూడ వర్ణింపబడిన చిత్రశాలలనుబట్టి తెలియగలదు.

మహమ్మదీయులు రాజ్యముచేయుచుండిన కాలములో సహితము ఈ హిందూశిల్పమునకు వన్నె తగ్గలేదు. మొగలు పాదుషాల యాదరణమువలన, 'మొగలుశిల్పము' అను క్రొత్త సంప్రదాయము బయల్వెడలినమాట నిజము. పర్షియానుండి కొందరు శిల్పులు, చిత్రవిద్యావిశారదులు, మొగలుదర్బారుల నాశ్రయించి, పర్షియనుసంప్రదాయానుగుణముగ, చిత్తరు

వులను రచించుచుండిరి. మొగలుశిల్పమునకును, రాజపుత్రశిల్పమునకును భేదము కలదు. మొగలుశిల్పము కేవలము మొగలుచక్రవర్తులనే ఆశ్రయించుకొనియుండెను. ఆ చక్రవర్తుల వినోదముకొఱకు చిత్తరువుల సంపుటములు స్వల్పాకృతులలో, 'ఆల్బము' గ్రంథములపగిది, తయారుచేయుచుండిరి. చక్రవర్తుల యొక్కయు, రాణులయొక్కయు లేఖలకు అంచులుదీర్చి చిత్రశోభితముగ జేయుచుండిరి. ఈ చిత్తరువులన్నియు గ్రంథపుటలలో నిముడదగినంత స్వల్పములే కాని పెద్దవికావు. ఇందువర్ణింపబడిన విషయములు గూడ మతసంబంధమైనవికావు. మహమ్మదీయులు విగ్రహాభంజకులు. దేవునకు మానవాకృతిని ఆరోపించరు. వారి మతప్రవక్తయగు మహమ్మదునకుగూడ రూపపటము గల్పించుట కొప్పుకొనరు. చెట్లు, పూలు, పిట్టలు, మద్యపాత్రము మొదలగు రమ్యరూపములను మాత్రము చిత్రించి యానందించెదరు. ఇటీవల, చక్రవర్తులయొక్కయు, బేగములయొక్కయు ఆలేఖ్యములను వ్రాయుచుండిరిగాని, వానిలో దైవభావము నేమాత్రమును సూచించుట కొప్పుకొనకుండిరి. మొగలు సామ్రాజ్య వైభవద్యోతకములైన భావములను మాత్రము ప్రకాశింపజేయుచుండిరి. ఈ మొగలుచిత్తరువులన్నియు పర్షియనుశిల్పులే రచించియుండలేదు. మొగలుచక్రవర్తుల యాదరణమునకు పాత్రులైన కొందఱు హిందూశిల్పులును మొగలు చిత్తరువులను రచింప నారంభించిరి. ఎంత వలదన్నను, హిందూశిల్పుల తూలికాప్రభావముచే, మొగలుశిల్పమునందుకూడ నిటీవల రాజపుత్రశిల్పపు కళలు దిగుట సంభవించెను. ఇప్పుడు మ్యూజియములలో బ్రదర్శింపబడుచుండు మొగలుచిత్తరువులు చాలవఱకు హిందూశిల్పరచనలే యనుట నిశ్చయము. తమ

రచనలక్రింద చిత్రకారులు తమ సంతకములనుజేయు క్రొత్త యాచారము ప్రారంభమయ్యెను. ఈ మొగలుశిల్పము అక్బరు (1556—1606) తో ప్రారంభమై ఔరంగజేబు (1706) తో నంతమొందెను.

రాజపుత్రశిల్పము కేవలము రాజులపోషణచేత నే వర్ధిల్లలేదు. జనసామాన్యముకూడ అభిమానింపజొచ్చినది. ఈ శిల్పమున వర్ణింపబడిన విషయములే ఈ వ్యాప్తికి గారణము. రాజపుత్రశిల్పము మానవహృదయాంతర్గతమైన రసస్రోతమును బయట కుబికించెను. గోపగోపీజనుల విహారకేళులందు ప్రేమ మాధుర్యరసములు చిప్పిలెను. శ్రీకృష్ణుని మురళీగానమున చరాచరము లన్నియు నేకరసమున గరగిపోయెను. ఆత్మ పంచేంద్రియములద్వారమున తన సౌందర్యప్రభావమును వెల్లడించెను. నాయికానాయకుల భావోన్మత్తత చిత్రవిచిత్ర రీతుల వర్ణింపబడెను. రాజపుత్రశిల్పమున జిత్రింపబడినది కేవలము శ్రీకృష్ణలీలలే కాదు. శైవశాక్తపురాణములందలి విషయములుగూడ జిత్రితములయ్యెను. పార్వతీపరమేశ్వరుల రూపము లతిదివ్యభావమున జూపబడెను. రాధాకృష్ణులు బృందావనములో విహరించిన రీతిని శివుడును బార్వతియు హిమాలయసానువులందలి దేవదారువనములమధ్య బ్రణయ లీలలను బ్రదర్శించిరి. శివుడు శ్మశానవాటికయందు నృత్యము సల్పుచుండును. పార్వతి వివిధకల్పములందలి బ్రహ్మలశిరములను పూలమాలగగూర్చి శివుని కంఠసీమ నలంకరించును. దుర్గ వ్యాఘ్రవాహనముపైన మహిషాసురునిమీదికి దాడివెడలును. ప్రమథగణము వివిధాయుధములతో సైనికులవలె వెంబడించును. రాజరాజేశ్వరి, త్రిభువనమాత, నవరత్నఖచిత సింహాసనముపైనధిష్ఠించియుండ, మహేశ్వరుడామె ముందుతన్మయుడై

నృత్యము సల్పుచుండును. చుట్టును ఆవరించియుండు ధవళశృంగములపైనుండి దేవతలు మూగుచుందురు. సరస్వతి వీణవాయించుచుండును. ఇంద్రుడు మురళి నూదుచుండును. బ్రహ్మ తాళము వేయుచుండును. లక్ష్మి రాగము నాలాపింపదొడగును. విష్ణువు మృదంగము వాయించుచుండును. గంధర్వ యక్ష కిన్నర ఉరగ సిద్ధ సాధ్య విద్యాధర అప్సరోబృందములు చుట్టును బరివేష్టించి నిర్నిమేషనయనములతో దిలకించుచుండును. ఆ హిమాలయప్రాంగణమున, ఆ సంధ్యారాగమున, రాజరాజేశ్వరీసమ్ముఖమున జరగు శివనాట్యము జగన్మోహనము! రుద్రాణి కాళీదేవియొక్క తామసిక రూపము. చతుర్భుజములు, త్రినేత్రములు కలిగి, జరాభారముచే కృశించి, అస్థిపంజరమువలె భయంకరాకృతిని దాల్చియుండును. నదీతటమున నీమె ఇనుపపాత్రమున వంటచేయుచుండును. చక్రవర్తియొక్క కిరీటము, భుజకీర్తులు, దుస్తులు, ఖడ్గము మట్టిలో గలిసిపోవుచుండును. వాని కళేబరము పాత్రలో తుకతుక నుడుకుచుండును. రుద్రాణి భక్షించినంత భక్షించి శేషించినదానిని పాత్రతో బయట కడిగిపోయుచుండును. ఆవల మహేశ్వరుడు లింగాకారమున నక్షయభావమున నిమగ్నుడై యుండును. పైన చంద్రరేఖ తన చల్లని అమృతకిరణములను వర్షించుచుండును. ఏమీ యీ దృశ్యము! సృష్టిసంహారములు కల్పకల్పములనుండియు నివ్విధమున జరగిపోవుచున్నవి. రాజమకుటములు గూడ నీ సంహారక్రీడకు ఆహుతికాక తప్పదు. రాజపుత్రశిల్పమున నీ సృష్టిరహస్యము అద్భుతరూపమున జిత్రింపబడెను.

ఈ రాజపుత్రచిత్తరువులలో స్త్రీసౌందర్యము పరాకాష్ఠ చెందెను. అందు స్వర్గమర్త్యలావణ్యములు ఏకరూపము

దాల్చెను. ఆ కమలాక్షుల, ఆ పీనపయోధరల, ఆ బింబాధరల, ఆ మందగమనల లీలావిలాసములు నూత్ననూత్న కాంతులతో విరజిమ్మబడెను. రాధ శ్రీకృష్ణుని సందేశమును దూతముఖమున వినును. ఆమె యమునాతీరమందలి లతాకుంజమునకు జనును కాని, శ్రీకృష్ణు డచట లేడు. ఇంకను రాలేదు. రాధ విటపశాఖను బట్టుకొని ఉత్కంఠయై నిరీక్షించుచుండును. అయ్యది చిత్తరువు కాదు—కావ్యము; కావ్యము కాదు—రాగము. రాధ ఆత్మయంతయు ఆ చూపులలో నున్ముఖమయ్యెను. అంధకారమును జీల్చుకొనుచు సహస్రయోజనముల వేగముతో బరుగిడు సూర్యకిరణమువలె, నిశ్శబ్దసాగరమును ఒక్క ముహూర్తములో పొంగునట్లు చేయు రాగిణివలె, నాచూపు రోదోంతరాళమునంతను జుట్టుకొనివచ్చును. శ్రీకృష్ణుడు పద్మాసనముపై నృత్యము సేయుచు మురళి ఊదుచుండును. గోపబాలురు నిశ్చేష్టులై, శ్రీకృష్ణుని ముఖమండలమును వీక్షించుచుందురు. ఆవులు చెవులు నిక్కించి, మేపులుడిగి, కృష్ణునిమ్రోల నిలువబడును. కాసారమునందలి స్వర్ణకమలములు వికసించి సౌరభము వెదజల్లుచుండును. పైనుండి లతాప్రతానములు పుష్పవర్షమును గురియుచుండును. గోధూళివేళ, గోపబాలురు గోవులను దోలుకొని తిరిగి బృందావనమునకు వచ్చుచుండిరి. శ్రీకృష్ణుడు వారిమధ్య మేఘశ్యామద్యుతితో బ్రకాశించుచు మురళివాయించుచుండెను. త్రోవనుబోవుచుండిన ఆవు లట్టె నిలచిపోయినవి. యమునాతీరమునుండి జలకలశములను గొనితెచ్చుచుండిన గొల్లభామలు, వికసిత వదనారవిందములతో బ్రక్కనుండి చూచుచుండిరి. సౌధగవాక్షముల నుండి పౌరరమణులు తమ హస్తకమలములతో 'అడుగో చిన్నికృష్ణు' డని చూపుచు ముగ్ధలగుచుండిరి. నందుడు గృహా

ద్వారముకడ నిలువబడి తిలకించుచుండెను. యశోదా బల రాములు గృహాభ్యంతరమునుండి వెలుపలికి వచ్చుచుండిరి. ఆ చిత్రికారుల తూలికలలో నే ప్రభావముండెనో! ఆరేఖల ఒయ్యారము, ఆ వన్నెల భావంపు తళుకులు, ఆ బింబముల సొంపులు, ఆ భంగిమముల హావభావ లీలావిలాసములు వర్ణ నాతీతములు. ఒక్కొక పటము ఒక్కొక కావ్యమై విలసిల్లెను. ఒక్క కృష్ణుని దివ్యచరిత్రమునే కాదు, రామాయణకథను వన్నె చిన్నెలతో వర్ణించిరి. శ్రీరామచంద్రుడు తన శిరమును సీతాదేవి యంకమున బెట్టుకొని పరుండియుండును. లక్ష్మణుడు శ్రీరా ముని మృదుపాదకమలమున గ్రుచ్చుకొనిన ముల్లును తీయు చుండును. ఏమి మార్దవము!— ఏమి సౌకుమార్యము! ఆ బింబములు భావంపుగళిక లేకాని రంగులబొమ్మలు కావు. మహాభారతేతిహాసమంతయు ఆ చిత్రికారులచే తిరిగి విచిత్ర రూపమున వ్యాఖ్యానము చేయబడినది. ద్రౌపదీవస్త్రాప హారణము, భీష్మాచార్యుని అంపశయ్య మొదలగు పటము లానాటి భారతవీరుల విగ్రహములను గన్నులకు గట్టినట్లు చేయును.

ఇట్లే, కబీరుదాసుని భజనలు, శిక్కుపీరుల దర్బారులు సొంపు లొలుకునట్లు వర్ణింపబడినవి. ఇట్లెన్ని వందల చిత్రికా రులు పారంపర్యముగ శిల్పవృత్తి నవలంబించి దేవాలయము లను, మందిరములను, రాచనగరులను, సంపన్నగృహస్థుల సౌధములను తమ చిత్రరచనలచే నలంకరించి చరితార్థు లగు చుండిరో తెలియదు. కాలము సర్వగ్రాసి. ఎన్ని చిత్తరు వులో కాలగర్భమున బడిపోయినవి. శత్రువులు దాడి వెడలి వచ్చి రాజపుత్రనగరములను ధ్వంసము చేసినప్పుడు, దేవా లయములను కొల్లగొట్టినప్పుడు ఈ చిత్రము లెన్నియో నాశ

నమై యుండును. శేషించినవానిలో, నెన్నో - విజాతీయుల హస్తగతములై, జర్మనీ, అమెరికా, ఇంగ్లాండు మొదలగు దేశములలోని మ్యూజియములలో గుప్తము చేయబడినవి. దేశములో మిగిలిపోయినవానినైనను భద్రపరచి ఆనందించు అభిమానము మృగ్యము. ఆ చిత్రరువులను జూచి ఆనందించు కన్నే పోయినది. పాశ్చాత్యవ్యామోహముచే నేత్రములకు మబ్బు క్రమ్మినది. నేటి నవనాగరికులకు సౌందర్యము వికారముగను, వికారము సౌందర్యముగను గన్పట్టుచున్నది. ఈ మబ్బులు వీడి సౌందర్యరసజ్ఞత తిరిగి యుదయించుట కింకను ఎంతకాలము పట్టునో తెలియదు.

1933 *

విగ్రహనిర్మాణ విద్య * *

విగ్రహనిర్మాణవిద్యకు స్థపితమని పేరు. ఈ విద్య ఈ దేశమున నెప్పుడు ప్రారంభమయ్యెనో సరిగ నిర్ణయించుట కష్టము. వేదములలో దేవతారూపములు వర్ణింపబడినవి. దివ్యులవాహనములుగూడ పేర్కొనబడినవి. సూర్యాగ్నులకు అశ్వములు వాహనములు. ఇంద్రరుద్రులకు వృషభము వాహనము. ప్రజాపతి నానాజంతురూపముల నవతరించినట్లు వాకృవ్వబడెను. భౌతికరూపము లెన్నియో దేవతల కాయుధములుగను అలంకారములుగను సూచింపబడెను. చక్రము విష్ణువునకు ఆయుధము. ఆచక్రమే క్రమముగ పరిపాలనాధర్మమునకు చిహ్నమయ్యెను. పృథ్వీచక్రశాసకుడు చక్రవర్తిపదలాంఛితుడు. చక్ర మిటీవల బౌద్ధమతమున ధర్మచక్రముగ బరిణమించెను. దేవతలు దివ్యశరీరు లగుటచే, వారి శిరములు ప్రకాశముతో వెలుగుచుండినట్లు వర్ణించిరి. ప్రభామండలము శీర్షచక్రము మొదలగు వర్ణన లెన్నియో కలవు. దేవతల పీఠములు పైనను క్రిందను వెడల్పుగనుండి, మధ్యను స్త్రీకటిప్రదేశమువలె సన్నగనుండవలెనని సూచించిరి. ఇంద్రుని వజ్రాయుధమునకు దివ్యరూపమును గల్పించిరి. అథర్వణవేదములో, చైత్యవృక్షములనుగూర్చి వర్ణింపబడెను. వృక్షదేవతలు మంగళరూపములతో నారాధింపబడుచుండెను. క్రమక్రమముగ నీ దేవతలకు మర్త్యరూపములు గల్పింపబడెను. బ్రాహ్మణములలోను సూత్రములందును విగ్రహ

ములు పేర్కొనబడినవి. అనార్యులలో—ఆర్యులు అనార్యులు అను విభాగము సరియైన దైనయెడల—లింగము సృష్టికారణ రూపముగ నారాధింపబడుచుండెను. జనసామాన్యము యక్షులు, నాగులు, భూదేవి మొదలగు దేవతారూపముల నుపాసించుచుండిరి. శుల్వసూత్రములలో అగ్నివేదికలను గూర్చియు, యజ్ఞవాటికలనుగూర్చియు లక్షణములు వివరముగ సూత్రీకరింపబడియుండెను. రానురాను పురాణేతిహాసముల యందు, మనుస్మృతియందు గృహ్యసూత్రములందును దేవతా విగ్రహములు విస్పష్టముగ నభివర్ణింపబడినవి. క్రీస్తునకు మూడు నాలుగు శతాబ్దుల పూర్వపు గ్రంథములలో, దైవతము, ప్రతిమ, ప్రతికృతి, మూర్తి, దేవతామూర్తి మొదలగు శబ్దములు విగ్రహములకు పర్యాయపదములుగ వ్యవహరింప బడుచుండెను. విగ్రహములను జేయువారు దేవలకులను పేరుతో బిలువబడుచుండిరి. హరివంశములో, నా కాలమున శిలావిగ్రహములు చెక్కబడుచుండినట్లు ఉదాహరణములు గలవు. పాణినికి వ్యాఖ్యవ్రాసిన పతంజలి శివ, స్కంధ, విశాఖాది విగ్రహములు విక్రయింపబడుచుండినట్లు సూచించి యుండెను. గృహ్యసూత్రములలో దేవతల యూరేగింపులను గూర్చి వ్రాయబడెను. ఆశ్వలాయనసూత్రములందు నాకబలి విధానము వర్ణింపబడెను. గృహ్యపరిశిష్టమున, నాగమును కొయ్యతోగాని రేగడతోగాని చేసి ఒక సంవత్సరము పూజ చేయవలెనని చెప్పబడెను. కుశానగుప్తుల కాలములో నాగ ములు శిలలో జెక్కబడుచుండిన సంగతి చరిత్రప్రసిద్ధము.

పంజాబులోని హరప్పయందును, సింధుప్రాంతము నందలి మహేంజదారునందును బయటపడిన పురాతనచిహ్న ములలో, సున్నముతో జేయబడిన విగ్రహములు కలవు.

పొడుగుగడ్డముగల పురుషవిగ్రహములు సున్నపురాతితో జేయబడియుండినట్లు ప్రకటింపబడినది. ఇది క్రీస్తుకంటె వేయి సంవత్సరములు పూర్వపు కథయై యుండవలెను. రథములను, లోహపాత్రలను, బంగారునగలను కళానైపుణ్యముతో జేయుచుండిన ప్రాచీనార్యులు విగ్రహములను నిర్మింపగలుగుటలో నాశ్చర్యములేదు. గౌతముని కాలములోనే బుద్ధుని దారువిగ్రహములు చేయబడుచుండినట్లు ఇటీవలి చరిత్రకారులు వ్రాయుచున్నారు. ఖారవేలచక్రవర్తియొక్క హాతీగుంఫా శాసనమున కేతు అను పేరుని దారువిగ్రహమును గూర్చిన గాథ కలదు. పద్మము అనాదినుండియు బ్రహ్మకు చిహ్నముగ నిరూపించుచుండిరి. మౌర్యుల కాలములో, పద్మపీఠములు సర్వత్ర కనుపడుచుండెను. సాంచిలో మాయాదేవి లక్ష్మివిగ్రహములకు పద్మము ఆసనముగ జిత్రింపబడియుండెను. పిమ్మట చాల దేవతలకు పద్మాసనము సామాన్య మయ్యెను. హిందువులు, బౌద్ధులు, జైనులు, కొన్ని సామాన్యచిహ్నముల నుపయోగించుచుండినను, వారి వారి ప్రత్యేక విశ్వాసములనుబట్టి, వేరువేరు భావములతో వానిని వాడుచుండిరి. నాణెములమీద జంతువులు, వృక్షములు, దేవతలు, పతాకలు మొదలగు వివిధచిహ్నములను జిత్రించుచుండిరి. నాణెములపై ముద్రింపబడుచుండిన చిహ్నములను బట్టి యవి ఏయేప్రాంతములలో, ఏయేరాజ్యములలో చలామణి యగుచుండెనో తెలిసికొనవలెనని, వణిక్కు లుద్బోధింపబడుచుండిరి. కుశానులకాలమునకు పూర్వము నందిపాద, త్రిరత్న, త్రిశూల, స్వస్తిక, నాగ, మత్స్య, గజ, అశ్వ, చంద్ర, మయూర, శృంగ, సరోవర, పద్మ, మకర—ఇత్యాది చిహ్నములు ముద్రించుచుండిరి. దీనినిబట్టి శిల్పులు లోహ

ములమీద విగ్రహములను జెక్కగలిగిన ప్రజ్ఞాతిశయమును గడించియుండిరనుట స్పష్టము.

బౌద్ధయుగమున నీ విద్య క్రమక్రమముగ వికసించి ప్రౌఢదశ నొందగలిగెను. శిల్పసూత్రములు, ధ్యానమంత్రములు, లక్షణగ్రంథములు క్రమముగ బయల్వెడలెను. లోహవిగ్రహములను పోతపోయు పద్ధతి ఎప్పుడు ప్రారంభమయ్యెనో చెప్పుట కష్టసాధ్యమైనను, క్రీస్తు తరువాత నాలుగైదు శతాబ్దుల నాటికే లోహవిగ్రహములు పోతపోయబడుచుండినట్లు దృష్టాంతములు గలవు. "శైలజాత్ లోహజం శ్రేష్ఠం" అని శిల్ప గ్రంథములందు బ్రశంసించుటనుబట్టికూడ, హేమాద్రికాలమున కింక బూర్వమే ఈ స్థపితవిద్య దేశములో వ్యాపించి యుండవలెనని చెప్పకతప్పదు. పల్లవులరాజధానియగు కాంచీపురమున కోటకు కంచుతో పోతపోయబడిన ద్వారముండినట్లు చెప్పబడినది. కృష్ణాజిల్లాలో, గుప్తులకాలమునాటి, అనగా 5 వ శతాబ్దినాటి బుద్ధుని కంచువిగ్రహ మొకటి దొరకెను. 7 వ శతాబ్దిలోనే పల్లవుల శిల్పకళానైపుణ్యము విజృంభింపదొడగెను. మహాబలిపురమున శిలారథము, శిలాగజము మొదలగు చెక్కడపుపనులు నాడే ప్రారంభమయ్యెను. చోళవంశపు రాజులు రాతిచెక్కడపు పనులతోపాటు లోహవిగ్రహములను జేయుపద్ధతులనుగూడ బ్రోత్సహించుచుండిరనుట నిశ్చయము. దేవాలయములలోని గర్భాలయములందు ప్రతిష్ఠింపబడు విగ్రహములు సర్వసామాన్యముగ రాతివైనను ఉత్సవవిగ్రహములు, భోగమూర్తులు మాత్రము లోహప్రతిమలుగ నుండెడివి. చోళులకాలములో 'మూర్తిదానము' రాజులకు విధిగ మహాదానములలో శాసింపబడెను. మొదటి రాజరాజు కాలమున (క్రీ॥ శ॥ 985—1018) తంజా

వూరునందలి బృహదీశ్వరుని ఆలయమున చెక్కబడిన శాసనమునందు రాగివిగ్రహములను గూర్చిన ప్రసక్తిగలదు. ఈ రాజరాజేశ్వరుడు బృహదీశ్వరుని ఆలయమునకు జాల గ్రామములను విగ్రహములను దానముచేయుటచే, నాతనికి “ శివపాదశేఖర ” అను బిరుదముకూడ నొసగబడెను. ఉత్తరహిందూస్థానములోకంటె, దక్షిణదేశములో లోహ విగ్రహములను జేయు నైపుణ్యము బహుప్రాచీనమగుటయేకాక, అయ్యది పరాకాష్ఠనుగూడ జెందెనని చరిత్ర పరిశీలనమున దెలియగలదు. లోహ విగ్రహములతోపాటు, కంచుదీపపు సెమ్మెలతిరమ్యముగ జేయబడుచుండెడివి. దక్షిణ దేశపు ఆలయములలో రాజులు, వర్తకులు దానముచేసిన ప్రాచీన లోహ దీపస్తంభములు నేటికిని గానవచ్చుచున్నవి. దక్షిణదేశమున విష్ణువిగ్రహములుగూడ జాల నుండినను శైవ విగ్రహముల కళానైపుణ్యము వానిలో జూపట్టుటలేదు. శైవ విగ్రహములలో, నటరాజవిగ్రహము జగద్విఖ్యాతమైనది. విలియం రోథెన్‌స్టీను పండితుడు నటరాజునుగూర్చి వ్రాయుచు నిట్లు నుడివెను :—

“No Chinese artist had reached greater perfection of poise and form than the Nataraja bronzes or the ecstatic figures of Sundaramurthi Swamy achieve.”

సుప్రసిద్ధ శిలావిగ్రహ నిర్మాతయగు అగస్టీరోడిన్ ఆచార్యుడిట్లు ప్రశంసించినాడు :—

“The Indian Nataraja can well contest for superiority in gracefulness with the gesture of the Venus de Medicis which defends its charms by the arms while Siva does the same by an ingenious gesture.”

పూర్వకాలమున గొన్నికుటుంబములవారీ విగ్రహ నిర్మాణవిద్యను వంశపరంపరానుగతముగ నభ్యసించి ఆచార్యత్వము వహించుచుండిరి. ఈ సిద్ధహస్తుల దివ్యచాతుర్యము లక్ష్యముగనెంచి ఎన్నియో లక్షణగ్రంథములు సహితము బయల్వెడలెను. దేవతల విగ్రహములు దశతాళ ప్రమాణము గలవిగ నుండవలెననియు, దేవీవిగ్రహములు, వానికంటె చిన్నవిగ, అష్టతాళప్రమాణముగలవిగ నుండవలెననియు శాసించిరి. 'అష్టతాళా భవేద్దేవీ' అనగా దేవియొక్క శీర్షమునకు విగ్రహము ఎనిమిదిరెట్లు అధికపరిమాణముగలదిగ నుండవలెనని విధించుచుండిరి. బాలావిగ్రహములు 'పంచతాళస్మృతా బాలా' యనికూడ నిరూపించిరి. సామాన్యముగ నీ విగ్రహములు పంచలోహములలో— అనగా రాగి, ఇత్తడి, వెండి, బంగారము, తగరములలో—చేయబడవలెనని విధింపబడినను, దక్షిణదేశమందు సర్వసామాన్యముగ రాగితోనే జేయబడుచుండెను. విగ్రహములను బోతపోయుటకుముందు మూసల నెట్లు కట్టవలెనో ఆ విధానమంతయు లక్షణగ్రంథములందు స్పష్టీకరింపబడినది. 'లోహజం సకలం యత్తు మధూచ్ఛిష్టేన నిర్మితం' మైనముతో ముందు విగ్రహమును నిర్మించవలెను. మకుటములు, కేయూరములు, వలయములు, హారములు, కటిబంధములు, ఊరుబంధములు, నూపురములు మొదలగు అలంకారములన్నియు సన్నని పోగరలతో నా మైనపువిగ్రహములపై బహుసుకుమారముగ జెక్కవలెను. పిమ్మట మెత్తని బంకమట్టితో నా విగ్రహముపై పూతపూసి మట్టి విడిపోకుండునట్లు ఇనుపతీగెల యల్లికతో జుట్టవలెను. తరువాత అగ్నిని చూపినయెడల, మైనమంతయు గరగి, సన్నని రంధ్రములగుండ బయటకు వచ్చివేయును. అంతటితో మూస

యేర్పడును. లోహమును గరగించి, వడపోసి, ఆ మూసలో పోసినచో విగ్రహ మేర్పడును. ఆ విగ్రహమును నునుపుచేయుటకును, అలంకారముల దీప్తిని మెరుగుచేయుటకును ఎంత కాలమో పట్టును. శిల్పగ్రంథములు గుల్లవిగ్రహములను నిషేధించినవి. దక్షిణదేశమునందు కానవగు విగ్రహము లన్నియు సర్వసాధారణముగ గట్టివి. ఈ విగ్రహములు ధ్యానమంత్రముల ప్రతికృతులుగ నుండును. రసానుగుణములైన భంగములతోను, ముద్రలతోను ఒప్పియుండును. ఆ ముద్రలు దివ్యక్రియలుకాని, మానవభావోద్రేకసూచకములైన హస్తవిన్యాసములుకావు. ఈ సామాన్యపు హస్తవిన్యాసములు కంపెనీ నాటకములకును, సినిమా ప్రదర్శనములకును బరిపాటియగునే కాని రసాత్మకమైన శిల్పవిద్య కనుగుణములైనవి కావు. వానియందు రసమొప్పదు. విగ్రహములందలి ముద్రలందుకనియే "దివ్యక్రియ"లై యుండవలెనని విధింపబడినది. భరతమునిప్రణీతమైన నాట్యశాస్త్రపరిచయ ముండినగాని యీ దేవతావిగ్రహముల సమభంగ, అభంగ, త్రిభంగ, అతిభంగాది భంగిమములు, కటకా, సూచీ, లోల, అర్ధచంద్ర, వరద, అభయాది హస్తములు, అర్ధనిమీలిత, నిమీలిత, ఉన్మీలితాది దృగ్భేదములు మొదలగు విశేషములు బోధపడవు.

1933 *

శిల్పులు — కర్మకారులు * *

మానవప్రతిభాప్రసూతమగు అలౌకికసృష్టివిలాసమే శిల్పము. "శిల్పం కౌశలం శీలస్సమాధా" అన్నారు శాబ్దికులు. చిత్తవృత్తుల యేకాగ్రతవలన సమాధి కలుగు చున్నది. సమాధిలభ్యమైన దర్శనముచే కౌశలము సిద్ధించు చున్నది. కౌశలఫలమే శిల్పము. "యోగః కర్మసు కౌశలం" అని గీతాకారుడు కూడ సూచించియున్నాడు. శిల్పమనిన సృష్టికాని అనుకరణముగాదు.

శిల్పమునకు సౌందర్యరససృష్టియే ప్రధానలక్ష్యము. జగన్మోహనుని అనంత సౌందర్యలీలలు మానవుని బయ టను, అంతరంగముననను చిత్రవిచిత్రగతుల బ్రదర్శింపబడు చున్నవి. కాని యివి కేవలము చర్మచక్షువులకు అంతగ గోచ రింపవు. శిల్పి తనప్రేమనయనములతో వానిని వీక్షించి ఆత్మ రసానురూపఖేలనమున వెల్లడించి చరితార్థుడగుచున్నాడు. వాని రచనలు భక్తిమహిమాన్వితములగుటచే, భావోద్దీపక ములై సర్వజనపూజ్యములగుచున్నవి.

శిల్పులు కవితుల్యులు—మంత్రద్రష్టలని కూడ జెప్ప వచ్చును. కౌతూహలముతప్ప వీరి రచనలకు వేఱుద్దేశము ఉండదు. వారి చిత్తసాగరము భావపూర్ణిమచే వెల్లివిరిసి నాట్యమాడును. ఇంతకంటె శిల్పమునకు వేఱులక్ష్యము లేదు. శిల్పులయందలి సౌందర్యరసానుభూతిని బట్టియు, రచనావిన్యా సమును బట్టియు, శిల్పమునందు ఉత్కర్షాపకర్షలు తార

తమ్యము లేర్పడినమాట నిజము. దేశకాలపాత్రముల ననుస రించి శిల్పప్రతిభ పలువిధములుగ బ్రకాశించినది. అందువలన శిల్పమున కనేకనామాంతరము లేర్పడినవి. కాని మూలము నందు మాత్రము ఆనందరసానుభూతియే శిల్పవస్తువు.

ఇటీవల శిల్పమును సంకుచితార్థమున వ్యవహరింప మొదలిడిరి. శుక్రనీతిసారమునందు ప్రతిమాప్రాసాదాది నిర్మాణకౌశలమే శిల్పమని నిర్దేశింపబడినది. రానురాను వాస్తుశాస్త్రమే శిల్పముగ నెంచబడుచుండెను. కాని శిల్ప మున కీ యర్థమే రూఢమైనదని చెప్పుటకు వీలులేదు. శిల్ప ములే కళలని కొందరు విచక్షణులు, అవి వేఱువేఱని కొందరు విచక్షణులును నిర్ణయించినట్లు కన్పట్టుచున్నది. "శిల్పం కలా దికం కర్మ" అన్నది అమరకోశము. దీనినిబట్టి శిల్పమునకు కళకు అభేదమేర్పడుచున్నది. హేమచంద్రుడు కూడ నీ అమర సింహునితో నేకీభవించినాడు.

కాని మరికొందరు శాబ్దికులు కౌశలవికాసము కళ యనియు, సౌందర్యవికాసము శిల్పమనియు నిరూపించిరి. భరత శాస్త్రమునందు "నసాకలా నచ్ఛిల్పం యన్నాట్యేన ప్రకాశి తం" నాట్యశాస్త్రమునందు బ్రకాశింపని కళగాని, శిల్పము గాని లేదు అనుటచేత రెంటికిని భేదము గమనింపబడుచున్నది. శుక్రనీతిసారము విద్యలనుగూర్చి వ్రాయుచు విద్యలు ముప్పది రెండనియు, కళలు అరువదినాలుగనియు జెప్పి, వాగ్వ్యాపార సాధ్యమగునవి విద్యలనియు, మూఢులుకూడ జేయదగినవి కళలనియూ నిర్వచించినది.

శ్లో. యద్యత్ స్యా ద్వాచికం సమ్యక్ కర్మ విద్యాభిసంజ్ఞితం
శక్తోమూకోపి యత్ కర్మ కలాసంజ్ఞస్తు తత్ స్మృతమ్.

కాని ఇట్టి విభాగ మితరగ్రంథములయందు కానరాదు. వామనకృతమగు కావ్యాలంకార సూత్రప్రవృత్తియందు వాగ్వ్యాపారమైన సంగీతమును కళయని పేర్కొనుటచే, శుక్రనీతిసారమునకును దీనికిని మతభేదము గన్పట్టుచున్నది. వాత్స్యాయనుడు కామసూత్రములందు "లోకజ్ఞతాం గమయతీతి కళా"యని వ్యుత్పత్తిని నిర్దేశించి, లోకజ్ఞతను జేకూర్చునట్టి చతుష్షష్టికళలలో గీతము, వాద్యము, నృత్యము, ఆలేఖ్యము, తక్షకము, కావ్యక్రియ మొదలగు విద్యలనన్నిటిని కళల క్రింద జేర్చినాడు. "ధర్మార్థకామమోక్షేషు వైచక్షణ్యం కళాసు చ" అను అగ్నిపురాణవచనము కళావిజ్ఞానమునకు గూడ కావ్యసంసేవనమువలన గలిగెడి ఫలమును సూచించుటచే, కళకు శిల్పార్థ మారోపింపబడుచున్నది. ఈ సందర్భములనుబట్టి, శిల్పము, విద్య, కళ యను పదములు తుదకు పర్యాయపదములైనట్లు తోచుచున్నది.

ఈ విభాగ మెట్టిదైనను, శిల్పమునకును కర్మవిద్యకును భేద మనాదినుండియు గమనింపబడుచుండినదనుట నిస్సంశయము. విష్ణుసంహితయందు శిల్పులకును కర్మకారులకును భేదము నిర్దేశింపబడినది. స్వతంత్రముగ రూపకల్పనలను జేయగల ప్రతిభాశాలురు శిల్పులనియు, వారి రూపకల్పనల ననుకరించు సిద్ధహస్తులు కర్మకారులనియు నా సంహితయొక్క నిరూపణము. శిల్పమును కులవృత్తిగ జేసికొని పణ్యద్రవ్యములను నిర్మించు శ్రమజీవులు (Craftsmen, artisans) కర్మకారులనియు, కౌతూహలముకొఱకు స్వతంత్రముగ సృష్టిచేయు ప్రతిభాశాలురు (artists) శిల్పులనియు దీనినిబట్టి తేటపడుచున్నది. శిల్పులు కర్మకారులకు గురువులు. వారి రచనలు వీరికి లక్ష్యములు. వాని ప్రచారమే వీరి కర్మకలాపము.

కర్మకారులే లేనియెడల శిల్పులరచనలు దేశమునందు వ్యాప్తిపొందెడివికావు. నటరాజవిగ్రహమునుగాని, చంద్రశేఖరుని విగ్రహమునుగాని ఆదిని సృష్టిచేసిన ప్రతిభాశాలు రెవరో తెలియదు. కాని ఆ విగ్రహములను ధ్యానశ్లోకముల సాహాయ్యముచేతను, తాళమానముల చేతను గ్రామములలోని కర్మకారులు పోతపోసియో, చెక్కియో ప్రత్యాలయమున ప్రతిష్ఠింపగలిగిరి. కర్మకారులైనను కేవలము బాహ్యావస్తువునుజూచి నకలుచేయువారుకారు. ధ్యానశ్లోకములే వీరి రచనలకు ఆధారములు. ఆధ్యానశ్లోకములనుబఠించుటచేత, చిత్తమునందు తేజరిల్లు మానసమూర్తిని రాతిలోనో, దారువునందో, పటముమీదనో రూపొందించగల ప్రజ్ఞావంతుడే కర్మకారుడు. అసలు ప్రప్రథమమున నీ మూర్తికల్పనలనుజేసిన మహనీయులకు ధ్యానశ్లోకముల సాహాయ్యముగూడ లేదు. వారు సర్వస్వతంత్రులు. కర్మకారులకు భిక్ష పెట్టగలిగిన ప్రతిభాశాలురు. అట్టి ద్రష్టలు సర్వకాలముల బ్రభవించరు. వారి రచనలు అపూర్వములు. కర్మకారులు వీనిని లక్ష్యముగ జేసికొని విగ్రహనిర్మాత లయ్యెదరు. గ్రామములలోని స్వర్ణరజతకారులు, దేవాలయనిర్మాతలు, తక్షకులు, భరతశాస్త్రవేత్తలు నిజముగ మొదటిశ్రేణికి జెందిన శిల్పులుకారు. వీరు శిల్పరత్నములను గాపాడు రెండవశ్రేణికి జెందిన కర్మకారులక్రిందనే పరిగణింపదగుదురు.

ఈ కర్మకారులకును, ఫ్యాక్టరీలలో యంత్రముల యందు పనిచేయువారికిని హస్తిమశకాంతరముగలదు. యంత్రములలో బనిచేయువారిలో కళానైపుణ్యముగాని సౌందర్యబోధగాని యుండదు. యంత్రములను త్రిప్పు నేర్పరితనము తప్ప వేఱుకౌశలముండదు. కర్మకారులకు శిల్పులే

గురువులగుటచే, వారియందు ధారణాశక్తియు, హస్తకౌశల
మును సమానముగ బెంపొందును. కర్మకారుల హస్తములు
సజీవములు. వారుపయోగించు పనిముట్లు వారి కధీనములు.
యంత్రములలో బనిచేయు మెకేనిక్కులు యంత్రములకు
దాసులు. వారికి ధ్యానధారణములతో బనిలేదు. రసాను
భూతి అంతకంటెను గూడదు. వారి కర్మ కది ప్రతిబంధకము
గూడ నగును.

చేతిపనులలోనున్న ప్రతిభ యంత్రనిర్మితవస్తువులలో
నుండదు. చేతివ్రాతకును, అచ్చుకూర్పుకును ఎంతభేదము
గలదో చేతిపనులకును యంత్రపరిశ్రమలకును అంతవ్యత్యా
సము కలదు. వ్రాయసగాని కలము హస్తస్పర్శచే సజీవమై,
వాని ప్రకృతి యంతయు వ్రాతయందు ప్రతిబింబించును.
అచ్చు అక్షరములకును అచ్చుకూర్చువానికిని ఎట్టి సజీవసంబంధ
మును లేదు. వ్యక్తిగతమైన విలాసమేమియు అచ్చుకూర్పు
నందు వ్యక్తముకాదు. కర్మకారుడు యజమాని, వాని పరికర
ములు వానికి విధేయులైన నౌకరులు. యంత్రము ప్రభువు,
యంత్రములో బనిచేయువారు కేవలము యంత్రమునకు
దాసులు. యంత్రము తిరిగినట్లు అతడు తిరగవలసినదే కాని,
చేతి పనిముట్టువలె, యంత్రము వాని చిత్తవృత్తి ననుసరిం
పదు. యంత్రనిర్మితవస్తువు కేవలము కృతకము. చేతిపని
స్వభావసిద్ధము.

యంత్రనిర్మితవస్తువు లే దేశములో తయారైనను
మాదిరి ఒకటే. వానియందు ఆ యా దేశముల స్వభావము
ప్రతిబింబించదు. ప్రజల యభిరుచుల నాకర్షించినగాని, తమ
సరకులు విడుదలకావను ఆర్థికసూత్రమును ఉత్పత్తిచేయు
వారు గమనించి, ఆయా దేశముల రచనాభేదములను

వైఖరులను యంత్రములచే ననుకరించి వాని సహజవిలాసము లను నాశనము చేయుటకూడ సంభవించుచున్నది. జపాను జర్మనీలనుండి దిగుమతియగు ఆటబొమ్మలే యిందుకు నిదర్శన ములు. ఆ దేశములలో వీనినుత్పత్తిచేయువారు హిందువుల యభిరుచులను గనుపెట్టి మన హిందూవిగ్రహములమాదిరి రబ్బరు సెల్యూలాయిడు బొమ్మలను యంత్రములలో తయారు చేసి, ఓడలకొలది మన దేశమునకు దిగుమతిచేయుచున్నారు. వానిలో మన దేవతారూపములందలి దివ్యత్వముగాని, సౌంద ర్యముగాని ఎంతమాత్రము గోచరించదు. మన బాలబాలిక లకు అట్టి బొమ్మ లాటవస్తువులగుటచే, బాల్యమునుండియు దేశీయుల యభిరుచులు మంటగలియుటకు గారణమగుచున్నది. మన కర్మకారులు సహితము దిగుమతియగు వస్తువుల డిజైన్ల ననుకరించి, మన కళాసంప్రదాయమును నాశన మొనర్చు చున్నారు. ఇదంతయు కళావిధ్వంసమునకు గారణము.

మన చేతిపనులు నానాటికి నాశనమగుటకు కేవలము యంత్రపుపోటీయొక్కటే కారణముకాదు. యంత్రసంపర్క ముచే మన చూపులు, రుచులుకూడ చెడినవి. యంత్రనిర్మిత వస్తువులు చౌకయను కారణముచేతనేకాక ఎక్కువ అందముగ నుండునను భ్రమతో వానిని గొనుట సంభవించుచున్నది. ఇప్పుడు కుటీరపరిశ్రమలను బునరుద్ధరించుటకు దేశములో సంకల్పముదయించుట శుభసూచకము. కాని ఈ యుద్యమము జయప్రదము కావలెనన్న, మన యభిరుచులు తిరిగి మారవలెను. చేతిపనులలోనుండు సహజసౌందర్యమును, దేశీయ సంప్రదాయమును జూచి హర్షించగల రసజ్ఞత మన కలవడ వలెను. మన కర్మకారులు కేవలము పురాతనపు తీరులనే అవలంబించుటవలన ప్రయోజనములేదు. కాలమానము

ననుసరించి, దేశసంప్రదాయానుగుణ్యముగ క్రొత్తడిజైన్లను, క్రొత్తవిలాసములను కూర్పవలసియున్నది. కాని ఈ పని కేవలము కర్మకారులు చేయగలదికాదు. స్వతంత్రశిల్పులీ పనికి బూనవలెను. ప్రతిభాశాలురైన కళావిచక్షణులు నవ్యసృష్టిని గావించి, కర్మకారులను క్రొత్త త్రోవలలోనికి నడుపవలసిన బాధ్యత కలదు. దేశములోని కళాసంపద కర్మకారుల మీదనే ఆధారపడియుండును. కర్మకారులను సరియైన మార్గములందు బెట్టగలిగినది కళాకోవిదులు. గ్రామోద్ధారకులు కళలకును కుటీరపరిశ్రమలకును గల సంబంధమును గమనించినగాని కృశించిన మన చేతిపనులు తిరిగి ప్రాణము పోసికొని నూతనచైతన్యముతో విలసిల్లనేరవు.

చేతిపనులనే నిజమైన స్వదేశపరిశ్రమలనుగ నెంచవలయునని గాంధిమహాత్ముడు నిర్దేశించినాడు. కాని ఈ నిర్వచన మంతటితో బూర్తికానేరదు. చేతిపనులలో నేడు విజాతీయసాంకర్యము చాల గోచరించుచున్నది. మన నవీనుల యభిరుచి ననుసరించి, మనకర్మకారులు స్వసంప్రదాయములను విడనాడి యురపియను వస్తువుల లక్ష్యములుగ నెంచుచున్నారు. బట్టల అద్దకములలో, తివాసీల రంగులలో, గృహపాత్రల ఆకృతులలో, చెక్కడపు పనులలో, గృహనిర్మాణములో పాశ్చాత్యానుకరణ మెక్కువగ ప్రబలుచున్నది. ఈ యనుకరణమైనను పాశ్చాత్యుల ప్రశస్తశిల్పవైఖరుల నాశ్రయించియుండిన గొంతవఱ కాదరణీయముగావచ్చును. కాని పాశ్చాత్యకళాకోవిదులు విసర్జించినవానిని గాంచియు జనసామాన్యముకొఱకు మిల్లులలో తయారగు బజారుసరకులను జూచియు మన నవీననాగరికులు ముగ్ధులగుచుండుటచే, మనకళాసంప్రదాయమేకాక, సహజమైన రసజ్ఞతకూడ నశించుచున్నది. మన

యభినవశిల్పులు తిరిగి మన కర్మకారులకు గురువులు, మార్గదర్శకులు అయినగాని, మన చేతిపనులు మరల చిత్తాకర్షకములు కాజాలవు. గ్రామపునర్నిర్మాణమునకు బూనుకొనువారు స్వదేశవస్తుప్రదర్శనముల నేర్పాటు చేయునప్పుడు, ఏవి కళాశోభితములో, ఏవి కావో మన శిల్పాచార్యులచే నిర్ణయింపజేసి వా రామోదించిన చేతిపనులనే ప్రదర్శనములయం దుంచు నియమమును గమనింపవలసియుండును.

1934

నృత్యకళ * *

మన పూర్వులు నిరూపించిన చతుష్షష్టి కళలలో నృత్య విద్యకు ప్రధానస్థాన మీయబడినది. పాశ్చాత్యదేశములందు కూడ లలితకళలలో నృత్యమునకు ముఖ్యస్థానము గలదు. నృత్యము సభ్యజాతులలోనేకాక, అసభ్యజాతులందుకూడ స్వభావసిద్ధమైన సౌందర్యముతో విరాజిల్లుచున్నది. నృత్యము నభ్యసించని ఆరణ్యకజాతి లేదనియే చెప్పవచ్చును.

మనదేశమునందు నేటికిని ఆరణ్యకజాతులు చాల కలవు. మనసభ్యత యురపియనుసభ్యత వంటిది కాదు. యురపు ఖండమున మహాప్రళయతుల్యమైన నాగరకతవలన, అసభ్య జాతులెన్నియో నామరూపములు లేక నశించినవి. కాని మన దేశములో నట్లుకాదు. మన దేశమునం దిప్పటికిని పర్వ తారణ్యప్రాంతముల నివసించు జాతు లనేకము కలవు. వేల కొలది సంవత్సరములనుండి హిందూసభ్యత దివ్యతేజముతో వెలుంగుచున్నను, ఆ యరణ్యజాతులవా రింకను హిందూ నాగరకతకు వశులుకాక, తమ సమాజరూపమును గాపాడు కొనుచు వచ్చుచున్నారు. ఆంధ్రదేశమున కోయలు, చెంచులు, ఎరుకలు, ఏనాదులు మొదలగు అనాగరకజాతులు కలరు. ఇతర ప్రాంతములలో తోడాలు, భిల్లులు, ఖాండ్లు మొదలగువారు కలరు. న్యూజీలెండు, ఆస్ట్రేలియా, అండ మాను మొదలగు ద్వీపములలో నారణ్యకజాతివా రింకను గలరు. వీరెల్లరు నృత్యపరాయణులు. వీరియందు నృత్యము

పర్వదినములయం దెల్ల పలువిధములుగ జరుగుచుండును. బాలబాలికలే కాక, యువతీయువకులు, వృద్ధులు కూడ గలసి నృత్య మొనర్చుచుందురు.

వీరి నృత్యవిన్యాసములం దొకవిధమైన సరళత వెల్లడి యగుచుండును. కొందరు గీతవాద్యములను జేర్చి నర్తించెదరు. కొందరు చప్పట్లు చరచుచు నాడెదరు. పరస్పరము చేతులుపట్టుకొని మండలాకారముగను, అర్థమండలాకారముగను, గొంచెముసేపు వడిగను, గొంతకాలము అలసముగను, చిత్రవిచిత్రగతుల, వివిధభంగిమములతో నృత్య మొనర్తురు. ఈ నృత్యమునం దొకమారు భూమి కంపించును. ఇంకొకమారు భూమి జనము నీనుచున్నట్లుండును. ఆ గతులశోభ వర్ణనాతీతము. ఆ యంగభంగిమముల కోమలత అతిమనోహారము. వాని జూచినప్పుడు తుచ్ఛపుతలంపులుకాని, నీచములైన మనోవికారములుగాని కలుగుట కెట్టి యవకాశము నుండదు. ఆ నృత్యము సహజోల్లాసముయొక్క విలాసము. ప్రకృతిలో చరాచరజగత్తునందు స్వభావసిద్ధముగ జరుగు క్రీడ నంటిదది. కేవల సంతోషసమయములయందే కాక, దుఃఖసమయములయందుకూడ వారు నృత్యము సల్పుచుందురు. శవముచుట్టును జేయునృత్యము ప్రళయతాండవమును బోలియుండును. జుట్టును విరియబోసికొని, చేతుల నాడించుచు, ఒడలుమరచి చిందులు త్రొక్కునప్పుడు, కేవలము కాళికాదేవి ప్రత్యక్షమైనట్లుండును.

నృత్యము, మానవుని జన్మతోనే పుట్టినదని చెప్పవచ్చును. ప్రాగైతిహాసిక కాలమునుండియు నీవిద్య సార్వజనీనమైయుండినట్లు కన్పట్టుచున్నది. లేగలలో ప్రాణము ఉబుకుచున్నదా యనునట్లు అవి వేయుగంతులు, విహంగములు ప్రణయ

కాలమున రెక్కలు విప్పుకొని కులుకుచు వేయు అడుగులు—మానవునిదృష్టి నాకర్షించి, నృత్యకళగ నావిర్భవించుటలో నాశ్చర్యము లేదు. ప్రాచీనకాలమున మనదేశమునందలి నృత్య విద్యాప్రాచుర్యతకు తల్లక్షణగ్రంథములే సాక్షులు. మన కావ్యములందు గూడ దీని కనేక నిదర్శనములు కలవు. మహాభారత కాలమున సంఘమునందు సర్వోన్నతస్థానము వహించిన రాజ బంధువులు—స్త్రీలును, పురుషులును—నృత్యగీతాభినయముల యందు ప్రవీణులైయుండి రను విషయము విరాట్పర్వమునందు గానవచ్చును. అజ్ఞాతవాసమునందుండిన అర్జునుడు ఉత్తరకు నృత్యగీతాదులను నేర్పు నుపాధ్యాయుడగుట ఎల్లరు నెఱిగి నదియే. పలుకారణములచే నీవిద్య యిటీవల నంతరించినను, నృత్యపిపాసాతృప్తికై వేశ్యాసంఘము నేర్పాటుచేసి, వానికి దేవాలయములందు కూడ స్థానమొసగిరి. ఈ విద్య యట్లు కులటల పాలబడుటచే, శిష్టులకు బరిగ్రహణీయము కాకుండ పోయినది.

మానవునకు కళానుశీలనమువలననే సౌందర్యానురక్తియు రసపిపాసయు తృప్తిచెందుచుండును. రసస్ఫూర్తికొఱకే కళలేర్పడిన సంగతి విచక్షణులకు దెలియనిది కాదు. బాలు డత్యంత నృత్యప్రియుడు. వాని సహజోల్లాసమును నిరోధించకుండ నుండినయెడల, నృత్యకళ సంఘమునందంతటను ఆవహించి, అభివృద్ధిపొందక తప్పదు. స్పందనము జీవనమునకు ప్రధానలక్షణము. ప్రాచీనులు గ్రహనక్షత్రముల గానమును వినగల్గుచుండిరి. కనుకనే వేదములు ఛందోబద్ధములయ్యెను. గీత నృత్యములకు అవినాభావసంబంధముగలదు. ఒకదానిని విడచి రెండవది యభివృద్ధిపొందనేరదు. తాళము, మానము, లయ గతియుక్తములు. గతి, స్పందనము నృత్యమున బయల్పడ

లును. అందుకనియే శాస్త్రకారులు నాట్యక్రమము నిట్లు సూచించిరి :—

శ్లో. కంఠే నాలంబయేద్గీతం హస్తే నార్థం ప్రదర్శయేత్
చక్షుర్భ్యాం దర్శయేద్భావం పాదాభ్యాం తాళ మాచరేత్.

రసభావ పరిజ్ఞానవిషయమున నృత్యమే ముఖ్యమని మన కళాకోవిదులు ప్రప్రథమముననే కనుగొనిరి. హృదయ సాగరము భావతరంగిత మైనప్పుడు దేహమునందలి స్నాయు వుల కుత్తేజనము గలిగి అంగప్రత్యంగములకు సంచలనాదులు కలిగితీరును. ఆ సంచలనాదులను లయాన్వితమొనర్చుటయే నృత్యము. కావ్యములయందలి ఛందస్సు, సంగీతమునందలి తాళ మానములు, చిత్తరువు లందలి రేఖావిన్యాసములు, నృత్యవిశే షములేయని తెలిసికొనదగును. ఆనందముయొక్క ఖేలనమే నృత్యమని సూచించుటకు ఒక కవి భోజనప్రియులైన బ్రాహ్మ ణుల గూర్చి యిట్లు వర్ణించియున్నాడు :-

నృత్యంతి భోజనే విప్రా మయూరా మేఘదర్శనే

శరీరతత్త్వవిదు లీ నృత్యకళకంటె సర్వోత్తమమైన వ్యాయామము మరియొకటి లేదని సూచించుచున్నారు. నృత్య మువలన దేహమునందలి అంగోపాంగముల కెల్ల వ్యాయా మము కలిగి, దేహపటుత్వము అభివృద్ధియగుననుటకు సంది యములేదు. అయ్యది మానసోల్లాసమునకుగూడ సాధన భూతమగుటచే, దేహసౌందర్యమును, ముఖకాంతియుగూడ వికసించుట కవకాశముగలదు. ఈ కారణముచే నిప్పుడు యురపు అమెరికాఖండములలో ప్రైమరీస్కూళ్లయందు బాల బాలికలకు నృత్యశిక్ష నొసగుచున్నారు. ఒక సుప్రసిద్ధనర్తకి యిట్లు నుడువుచున్నది :— " కాలమును సుఖసంతోషము

లతో గడుపవలెననిన, నృత్య మొనర్పుము. శరీరారోగ్యమును సంపాదించికొనవలెననిన, నృత్యముచేయుము. నృత్యము సమస్తరోగములకు దివ్యౌషధము. విషాదము నడంచి, సంతసమును గలిగించుటకు, సౌందర్యశోభను వృద్ధిపరచుటకు నాట్యకళవంటి సంజీవని మరియొకటిలేదు. నృత్యాభ్యాసము వలన, అప్సరసలను ధిక్కరించు సౌందర్యమును, యోగుల ననుగమించు చిత్తస్వాస్థ్యమును లభించును. ఆనంద మెచ్చట నుండునో, అచ్చట నృత్యముండును. హృత్పిండముయొక్క నర్తనమే జీవవిలసనము. ఈ నర్తన మాగినంతనే జీవితము ముగియును."

నృత్యానుశీలనములేని జాతి మృతప్రాయము. మనదేశములో బ్రిస్తుతము తమస్సు రాజ్యముచేయుచున్నది. ఈ తమోరాజ్యమే శాంతమని భ్రమించుచున్నాము. శ్మశాన వాటికయందు ప్రబలు శాంతమిది. శవమునందు జూపట్టు నిస్తబ్ధత యిది. ఇందువలననే భారతీయులు నృత్యకళను మరచిరి. మనజీవితము కేవలము ఆనందశూన్యమైనది. నృత్యమనుట తోడనే పరిహాసముచేయు దురవస్థకూడ దాపరించినది. ఒక కాలమున నృత్యకళ ఆంధ్రుల భాగ్యమనుటకు నేటికిని దేవాలయములయందలి చెక్కడపుబనులలో నృత్యవిలాసము లెన్నియో సాక్షిభూతములై యున్నవి. నృత్యమయములై తనరారు మన వీధినాటకములిప్పుడు నవనాగరకులకు బరిహాస పాత్రము లైపోయినవి. ఆంధ్రజాతియందు స్తబ్ధమైయున్న ఆ యమృతవాహిని సంగీతసాహిత్యములయందు, శిల్పనృత్యముల యందు వెల్లివిరిసి, దేశము మరల భాగ్యభోగములతో విలసిల్లుగాక !

1934 *

ధర్మము

రూపకల్పన * *

బ్రహ్మసాధనప్రపంచము అతివిశాలమును గంభీరమునై అధికార తారతమ్యమును బట్టి వివిధమార్గములు గలిగి ఒక మహా విశ్వవిద్యాలయమువలె గన్పట్టును. ధర్మసమన్వయమువలెనే సాధనసమన్వయముకూడ సప్పుడప్పుడు కల్గుచు వచ్చెను. మొత్తముమీద నీవివిధసాధనములు జ్ఞానభక్తి కర్మమార్గములుగ విభజింపబడెను. తిరిగి ప్రతిమార్గము నందును అనేక సోపానములు కనుపెట్టబడెను. జ్ఞానమార్గమున సాధనచతుష్టయము, ధ్యానధారణ యోగసమాధులు మొదలగు సోపానము లెన్నియో పేర్కొనబడినవి. ఒక్క యోగమార్గమున అనేకసాధనములు కలవు. భక్తిమార్గమున దాస్య సఖ్య వాత్సల్య మాధుర్య మహాభావములును, ఉద్బోధన స్తోత్ర వందన ప్రార్థన అనుతాప మంగళాదిభజనలును, 24 రసములును, అసంఖ్యాకములగు ప్రపత్తులును, తరంగమాలికలుగ విస్తరిల్లి అదియొక యనంతసాగరమువలె జూపట్టును. ఇక కర్మమార్గము, ఆశ్రమచతుష్టయముతో పంచమహాయజ్ఞములతో అంతములేనివ్రతములతో విధినిషేధములతో యజ్ఞయాగములతో జపతపములతోగూడి ఒకమహారణ్యమువలెగన్పట్టును. ఒక్క తాంత్రికుల యుపాసనా విధానమునందు 116 విభాగములు సూచింపబడినవి. వీనినన్నిటిని గూర్చి తెలిసికొనగోరువారి సంఖ్య కడుస్వల్పము. వానిని స్వానుభవమున తెలిసికొని పరిశీలించువారిసంఖ్య అంతకంటెను

స్వల్పము. ఇవి గ్రంథపఠనమువలన గాని తర్కసాహాయ్యము వలన గాని అలవడు విద్యలు కావు. సిద్ధులగువారియొద్ద శుశ్రూష చేయువారికే యవి లభ్యమగును.

వేదాంతులు ఉపాసనలను మూడు విధములుగ విభజించిరి. ప్రతీకోపాసన, సంపదకోపాసన, స్వరూపోపాసన యనునవి మూడు తరగతులు. అనధికారులు చేయునది ప్రతీకోపాసన. దీనినే అధ్యాసజనితోపాసనయందురు. "అన్యత్ర దృష్టః పరత్రావభాసః." ఒకవస్తువుయొక్క గుణమును మఱియొకవస్తువునకు ఆరోపించుటయే అధ్యాస. రజ్జువును సర్పముగ భావించుట అధ్యాసము. శ్రుతజ్ఞానముచే అనగా విని కిడివలన కలిగిన జ్ఞానమును ఘటపటముల కారోపించి పూజ చేయుట ప్రతీకోపాసన. పూర్వుల యనుభవములను అనుశీలనము చేయుటే దీని యుద్దేశము. ఇందు అపరోక్షానుభూతి యెంతమాత్రము లేదు. సంపదకోపాసన నిమ్నాధికారులకొఱకు ఉద్దేశింపబడినది. నిమ్నాధికారి అనధికారికంటె నెక్కువ చిత్తసంస్కారము కలిగియుండును. స్వల్పవస్తువు మూలమున పెద్దవస్తువును ధ్యానము చేయుట నిమ్నాధికారి మార్గము. రెండువస్తువులకు గల సామాన్య ధర్మమును కనుపెట్టి, నిమ్నాధికారి చిన్నదానినుండి పెద్దదానిని, పరోక్షము నుండి అపరోక్షమును చేరగలుగును. బాలుడు నారింజ పండును జూచి భూగోళముయొక్క ఆకారము నెట్లు తెలిసికొనునో, అట్లే సంపదకోపాసకుడు సూర్యుని స్వప్రకాశత్వమును జగత్ప్రకాశకత్వమును మనోగతముచేసికొని బ్రహ్మముయొక్క స్వప్రకాశత్వమును జగత్ప్రకాశకత్వమును ధ్యానించును. బ్రహ్మము చిద్వస్తువు, నిరాకారస్వరూపము, అవాఙ్మానసగోచరము. ధర్మమార్గమునందలి ప్రథమావస్థయందు

దృశ్యమానపదార్థములగు బ్రహ్మాండములను జూచి బ్రహ్మ

మును ధ్యానింపగలుగుదుము. సూర్యోపాసననుండి ప్రాణోపాసనకును, ప్రాణోపాసననుండి మనోపాసనకును, మనోపాసననుండి అవతారోపాసనకును, క్రమక్రమముగ కక్ష్యాంతరములను దాటుచు నిమ్నాధికారి తుదకు అధికారి కాగలడు. సంపదకము గూడ నుపమానమువంటిదగుటచే దీనియందును ప్రత్యక్షానుభవములేదు. ఈ రెండు తరగతులును కేవలము సాంకేతికములు. వ్యవహారమునందివి విశుద్ధములుగ నుండజాలవు. ప్రచలితధర్మములందు ప్రతీకోపాసనయు సంపదకోపాసనయు పరస్పరపరిమాణగతప్రభేదములతో వర్ధిల్లుచుండును. స్వరూపోపాసన ఉత్తమాధికారులకే సాధ్యము. ఆత్మయందు పరమాత్మోపలబ్ధిని పొందుటయే దీని యుద్దేశము. ధ్యానధారణములవలన బ్రహ్మైక్యత నొందుటయే దీనిసిద్ధి. చిత్తనివృత్తియుండినగాని స్వరూపోపాసన సాధ్యము కాదు. చంచలచిత్తమున చిద్వస్తువు ప్రకాశింపదు. ఏకనిష్ఠతో నిజస్వరూపము నుపాసించునప్పుడే సాక్షాత్కారము లభించును. వ్రతములచే చిత్తశుద్ధిని గావించుకొని యోగాభ్యాసమున సమాధ్యవస్థను పొందవలెను. ప్రతీకోపాసనయందు ఆత్మానాత్మవిచక్షణ లేదు. సంపదకోపాసనయందు సమాధ్యవస్థ లేదు. ఒక స్వరూపోపాసకులకే బ్రహ్మసాక్షాత్కారము సాధ్యము.

బ్రహ్మోపాసన సాధనవిషయము. వివిధసాధనములయందలి సత్యాసత్యములు స్వానుభవమువలననే తెలియనగును. ధర్మతత్త్వము సాక్షాదనుభూతిగ్రాహ్యము. ఏతత్త్వమును తర్కమువలన పూర్ణముగ సిద్ధాంతీకరించుటకు వీలులేదు. తర్కము శ్రద్ధావంతుని శ్రద్ధను దృఢపఱుపవచ్చును. కాని, శ్రద్ధ లేనివారికి అనుకూలవిశ్వాసమును పుట్టింపజాలదు.

సమగ్రజ్ఞానము మానవుని స్వానుభూతిపై ప్రతిష్ఠింపబడియున్నను, మనస్సుచే పురికొల్పబడు తర్కము, మీమాంస, విచారణ, అనుభవమును బయటనుండిమాత్రమే విమర్శింపగలుగును. కార్యమును జూచి కారణమును గ్రహించినపుడు బుద్ధికి కనబడునది కారణముయొక్క నిజస్వరూపము కాదు. మీమాంస కార్యమువెనుకనుండు కర్త యొక్క రూపమును ప్రతిష్ఠింపగలుగును; ఆ రూపము కేవలము సత్తామాత్ర జ్ఞేయము. అనగా, ఉన్నది అని మాత్రమే చెప్పవచ్చును గాని ఆ వస్తుస్వరూపముయొక్క వివరణ మెట్టిదయినదియు చెప్పుటకు శక్యముకాదు.

"యతోవా ఇమాని భూతాని జాయంతే । యేన జాతాని జీవంతి ।
యత్ప్రయంత్యభిసంవిశంతి । తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మ"

అని యుపనిషత్తులు బ్రహ్మతత్త్వమును నిరూపించుచున్నవి. కాని, ఈ వాక్యము బ్రహ్మముయొక్క బహిఃప్రకాశమునుమాత్రమే వర్ణించుచున్నది. బ్రహ్మమును దూరమునుండి చూపుచున్నది కాని, దాని స్వరూపమును లోపలనుండి వెల్లడించుటలేదు. బ్రహ్మపదార్థమును మనము తెలిసికొనుచున్నది తర్కసంబంధమైన "అనుమానము" వలననే గాని, అనుభవమువలన కాదు. సూర్యుని తేజస్సును మాత్రము చూడగల్గియు తదీయ స్వరూపమును చూడలేనట్లు మనస్సువలన బ్రహ్మముయొక్క బాహ్యరూపప్రకృతులను కొంతవఱకు తెలిసికొనుచున్నామే కాని, బ్రహ్మదర్శనలాభమును బ్రహ్మస్పర్శసౌఖ్యమును అనుభవింపజాలము. దర్శనలాభమును పొందనియెడల బ్రహ్మసాక్షాత్కారము పూర్తి కానేరదు. మనస్సునకు వస్తుతత్త్వము అజ్ఞాతమును అజ్ఞేయమును గూడనగుచున్నది. బ్రహ్మాండముయొక్క కార్య

కారణసంబంధము విచారించి, జగద్రూపమునకు వెనుక కారణరూపము కలదని ప్రతిపాదించుచున్నాము. ఆ కారణ తత్త్వమునే యుపనిషత్తులు బ్రహ్మతత్త్వ మని చెప్పుచున్నవి. ఆ తత్త్వము నిర్గుణము, నిరాకారము. కార్యకారణసంబంధ విచారణ మనోధర్మము. మనస్సునకు భేదవిచారణయందు సామర్థ్యము కలదు. అభేదప్రతిపాదనము మనస్సుయొక్క యధికారమునకు అందనివని. మనస్సెప్పుడును, " అవును కాదు " అను నీ రెండు సంజ్ఞలయందే సంచరించుచుండును. కార్యమునకు కారణము గలదు. కార్యము కారణముకంటె భిన్నమైనది, స్వతంత్రమైనది. కార్యము దృశ్యము, కారణము అదృశ్యము; కార్యము ఇంద్రియప్రత్యక్షము, కారణము అనుమానప్రతిష్ఠితము; కార్యము సాకారము సవిశేషము, కారణము నిరాకారము నిర్విశేషము—అనుచర్చను చేయగలిగి నది మనస్సు. తర్కము మనల నీ సిద్ధాంతమువఱకే తీసికొని పోగలదు. "నేతి నేతి" అనియే మనస్సు చెప్పగలుగును గాని, ఆపదార్థముయొక్క స్వరూపమెట్టిది యను ప్రశ్నకు ప్రత్యుత్తర మీయజాలదు. నిరాకారవాదము మానవుని మనోమయకోశమునకు మాత్రమే సంబంధించి యుండును. మానవు డీకోశమును దాటలేనంతవఱకు నిరాకారనిర్గుణవాదమును అతిక్రమింపజాలడు. ఈ వాదము మనస్సునే బ్రహ్మమని తెలిసికొనుచున్నది. " మనో బ్రహ్మేతి వ్యజానాత్. " అనగా, నీ బ్రహ్మము మనోమయబ్రహ్మము. ఇది తత్త్వము యొక్క ఒకదిక్కును ఒక యంశమును మాత్రమే వెల్లడింపగలుగును.

బ్రహ్మవాదు లీ యంశమును దాటి బ్రహ్మపదార్థము యొక్క మఱియొక దిక్కునుగూడ ప్రదర్శించిరి. సృష్టిస్థితి

లయములయందు బ్రహ్మమును మనము కారణరూపముగ చూచుచున్నాము. దానినే మన జీవనాంతరాళమున వివిధావస్థలందును అశేషపరివర్తనములందును సాక్షిచైతన్య రూపమున చూచుచున్నాము. పరిణామము జగత్తుయొక్క నిత్యధర్మము. జగత్తు ఎల్లప్పుడు తిరుగుచు, చంచలమై, విరామము నొకప్పు డెఱుంగక ప్రవహించుచున్నది. ఇంద్రియములన్నియు నిరంతరము విషయప్రవాహమున తగుల్కొని కంపించుచున్నవి. దృశ్యవస్తువుల ఛాయలు చక్షువులపై ఒకదాని తరువాత నొకటి పడుచున్నవి, తొలగిపోవుచున్నవి. శ్రోత్రములందు భిన్నభిన్న ధ్వనులు ఒకదానితరువాత నొకటి శబ్దించుచు తిరిగి ఆకాశమున నంతరించుచున్నవి. ఇదే విధముగ సకలేంద్రియములమీదను ఆయా ఇంద్రియములకు సంబంధించిన విషయసముదాయము నదీతరంగములవలె లేచి పడుచు వెంటనే తొలగిపోవుచున్నది. ఈ ఖండఖండములయిన దృశ్యములును ధ్వనులును రసగంధములును మన యింద్రియముల ద్వారమున జ్ఞానోదయమును గలుగజేయుచున్నవి. ఈ విషయస్పర్శ అతిచంచలము. ఇది యెప్పుడును గలుగుచుండును, పోవుచుండును. పూర్వ మేది కలిగెనో, దానితరువాత నేది వచ్చెనో, ఆ సంబంధము మనసులో నిలువనియెడల, పూర్వము గలిగినదాని యనుభూతితోడ, ఉత్తరక్షణమున గలుగు జ్ఞానమును సమసింపజేయుటకు వీలులేదు. శబ్ద స్పర్శ రూప రస గంధాదులగు విషయానుభవములు ఆ సంబంధము లేనియెడల పూర్ణమైన విషయజ్ఞానమును కలుగజేయజాలవు. ఏతత్త్వము, చంచలమగు విషయస్పర్శలవలన గలుగు క్షణికానుభవములను మనస్సులో సూత్రమున మణులవలె జాగ్రత్తపఱచి విషయజ్ఞానమును సంభవింపజేయునో, దానినే సాక్షిచైతన్యమందురు.

ఇదియే సూత్రాత్మ, లేక సర్వగతమగు పరమాత్మ. శుద్ధసత్త్వ మాత్రజ్ఞేయమగు బ్రహ్మతత్త్వము సర్వాతీతమే కాక, సర్వగతమగు పరమాత్మస్వరూపమనికూడ తెలిసికొనగలుగుచున్నాము. కాని, పరబ్రహ్మతత్త్వము సర్వాతీతమనినను, సర్వగతమనినను, దాని పూర్ణస్వరూపము వ్యక్తమగుటలేదు. సృష్టికార్యముల వలన పరబ్రహ్మస్వరూపమును, విషయస్పర్శముల క్షణికానుభూతివలన సాక్షిచైతన్యమగు పరమాత్మస్వరూపమును తెలిసికొనుచున్నాము. మనస్సువలన పరబ్రహ్మముయొక్క కారణరూపము నెట్లు తెలిసికొనగలుగుచున్నామో, అట్లే విజ్ఞానము వలన సర్వాంతర్యామి యగు పరమాత్మస్వరూపమును తెలిసికొనగలుగుచున్నాము. కాని, పరమతత్త్వముయొక్క ఈ రెండు దిక్కులను అనుమానప్రమాణమువలననే తెలిసికొనగలుగుచున్నాము గాని, అపరోక్షానుభూతివలన సాక్షాత్కారము చేసికొనుట లేదు.

ఈ సాక్షాదనుభూతి గలుగుట యెట్లు? అనుమాన ప్రమాణమువలన ఇది సాధ్యముకాదని తేటపడినది. ఇందువలననే, భక్తులు, భగవాను డెవనిపై కృపనుచూపునో, అట్టివాడే బహు పుణ్యఫలమునవలన సద్గురుచరణాశ్రితుడై ప్రత్యక్షానుభవమును పొందగలుగునని చెప్పుచున్నారు. కాని, లోకహితార్థము బ్రహ్మవిదులు అనేకోపాసనలను కల్పించిరి. ఒక సూర్యకిరణముచే అనంతకోటిస్ఫటికము లొక్కమారుగ ప్రకాశించు విధమున, ఎవని యంశాస్పర్శచే సమస్తస్థావరజంగమములును ప్రకాశించుచున్నవో, ఎవడు ధర్మజిజ్ఞాసయొక్క చరమయుక్తియు ప్రపంచవాసనల పరమనివృత్తియునై బ్రహ్మాండము నంతయు ఓతప్రోతభావమున నిండియున్నాడో, ఎవని లీలావిలాసమందు నిఖిలజగత్తు చకితమై పులకితమై విస్మితమై సుమధురక్షీర

ఖండన్యాయమున కరగిపోవుచున్నదో, అట్టి భగవానుని అట్టి పరమసుందరుని అట్టి నిఖిలరసామృతమూర్తిని అట్టి సచ్చిదానందవిగ్రహమును, స్వజీవనమున, స్వానుభూతియందు దర్శించి స్పర్శించి ఆస్వాదించి అమృతపదవి నందిన సిద్ధులయొక్క చింతనల, భజనల, యోగముల, సమాధుల, రూపకల్పనల రహస్యమును తెలిసికొనిన గాని బ్రహ్మసాక్షాత్కారమార్గమున ప్రవేశించుటకే వీలులేదు.

"చిన్మయస్యాఽద్వితీయస్య నిష్కలస్యాఽశరీరిణః
ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా"

అని కులార్ణవతంత్రమున నొక సిద్ధపురుషుడు నుడివెను. మరియొక స్థలమున నొకయోగి

"సాధకానాం హితార్థాయ బ్రహ్మణో రూపకల్పనా"

అని వాక్రుచ్చియున్నాడు. రూపకల్పన చేయునది సిద్ధులు. ఉపనిషత్కాలమున ప్రబలిన తత్త్వాలోచనలతో వారు తృప్తినొందక రసాత్మక మగు భక్తిమార్గము నున్నత పదవికి తెచ్చిరి. ఈ సందర్భమున ఆర్యుల యోగసాధన మెట్లు క్రమక్రమముగ వృద్ధిపొందినదియు తెలిసికొనుట యుక్తము.

వైదికకాలమున ఆర్యులు ఇంద్రవరుణాదిదేవతలను అతి మనోహరముగ వర్ణించిరి. ఈ దేవతలు చాక్షుషమూర్తులు కారు. వీరు రూపులా? అరూపులా? అను విచారము అనాదిని లేదు. ఈమూర్తులు రూపములును కావు, అరూపములును కావు. రూపమును అరూపమును విడదీయు భేదబుద్ధి మానవుని శైశవావస్థయందుండదు. అందుకనియే ఆర్యులు మొదట

చూచిన దేవతలు రూపములని గాని అరూపములనిగాని చెప్పుటకు వీలులేదు. ప్రదోషకాలమున చీకటియు వెలుతురును కలసియుండునట్లు రూపమును అరూపమును గలసియుండెను. కాని, వరుణేంద్రాదిమూర్తులు ఆర్యుల మనమునందు క్రమముగ అతీంద్రియదృష్టిని ఉద్బోధించుచునే యుండెను. ఇంద్రియము లెప్పుడును అతీంద్రియునివంకకు తిరుగుచుండును.

ఇది సృష్టిలోని రహస్యము. మానవుడు శైశవావస్థను దాటిన కొలది భేదబుద్ధి ప్రబలును, వివేకము హెచ్చును, నిత్యానిత్య వస్తువిచక్షణ తీక్ష్ణమగును, ఆత్మానాత్మజ్ఞానము వికసించును. ఆర్యులు దేవతలను చూచి చూచి, వర్ణించి వర్ణించి, అరూపమును నిరాకారమును సత్తామాత్రజ్ఞేయమును నగు అప్రత్యక్షవస్తువును పొందిరి. దీనిని "నేతి నేతి" వాక్యములతో నిరూపించుచు అజ్ఞాతమును అజ్ఞేయమును నగు మహాశూన్యసాగరమున బడిరి. సాకారనిరాకారభేదము లేని యవస్థనుండి విడివడి నిరాకారతత్త్వమును జెందిరి. ఆ నిరాకారమును పట్టుకొనలేక, సత్తు అని గాని అసత్తు అని గాని ప్రతిపాదించుటకు సాహసింపరైరి. అది మహాంధకారము. అది ప్రాణమునకు తృప్తినీయలేదు. బ్రహ్మసూత్రముల గల్పించిన వ్యాసభగవానుని చిత్తము వ్యాకులత చెందెను. అప్పుడు మహాశూన్యసింధువు మథింపబడెను. అంతట సకల రూపముల సారమగు లక్ష్మీదేవియు, సకలరసముల నిదానమగు అమృతమును ప్రత్యక్షమయ్యెను. వ్యతిరేకపథమున బడిన ఆర్యులు తిరిగి అన్వయమార్గమున జేరిరి. శూన్యము పరిపూర్ణతను చెందెను. సాకారము నిరాకారమును, నిరాకారము సాకారమును గప్పివేసెను. శబ్దమం దశబ్దమును, రసమునం దరసమును, స్పర్శయం దస్పర్శయు వేణునాదముతో

ప్రబోధించుచు భక్తవత్సలుడు ప్రత్యక్షమయ్యెను. ప్రతి ప్రాణియందును యమునానది తరంగితమై పొంగుచున్నది. ప్రతి హృదయనికుంజమునను వేణుగానము ప్రతిధ్వనించుచున్నది. జగత్తు క్షీరఖండమువలె మధురరసమున గరగుచున్నది. జ్ఞానము భక్తిగ వికసింప నారంభించెను. భక్తి మహాభావమున లీనమయ్యెను. నిరాకారము సర్వాకారముగ విరాజిల్లెను. భగవంతుడు అరూపుడు కాడు, బహురూపి. అప్పుడు చక్షువులు విశుద్ధములై ఇంద్రియములందు అతీంద్రియరూపములను చూడగల్గెను. సర్వరూపములు, స్థావరజంగమములగు సకలజీవులు, రసమూర్తులై భగవల్లీలయందు నృత్యము సలుపుచుండెను. ఉపనిషత్కాలమున కూడ నొకవిధమగు భక్తి కలదు కాని, ఆ భక్తికిని భాగవతకాలమునందలి భక్తికిని భేదము కలదు.

"ఈశావాస్య మిదగుం సర్వమ్ । యత్కించ జగత్యాం జగత్."

ఈశ్వరద్వారమున చంచలమగు విషయరాజ్యము నాచ్ఛాదన మొనర్చి ఈశ్వరునితో కామ్యవస్తువులను భోగించుచుందుము.

సత్యజ్ఞానానంతబ్రహ్మమును అంతరమను ఆకాశమున తెలిసికొని, ఆ బ్రహ్మముతోగూడ సమస్తములగు కామ్య వస్తువులనుపభోగింపుము. అందు శుద్ధనిర్మలజ్ఞానము భక్తిసిక్తమైనను అయ్యది తన్మయత్వమును పొందించుటలేదు. ఆ యనంతమైన సౌందర్యము ఈ జగత్తులో ప్రతిఫలించి జగత్తు సౌందర్యమయమైనను, ఆ పరమసుందరుని స్పృశించుటకు అవకాశము చిక్కలేదు. కామ్యవస్తువులు మధురమైనవే కాని, ఆ మాధుర్యము ఆస్వాదింపబడలేదు. అంతరమున బ్రహ్మము ననుభవించినను వానిని చక్షువులతో చూచుట సంభవింపలేదు.

చక్షువుల గభీరపిపాస తృప్తినొందు టెట్లు ? నేత్రములు 'అలఖ నిరంజను'ని చూచుటకు భూనభోంతరాళమున వెదకుచున్నవి. ఆ ముఖమండలము ఆ సౌందర్యమూర్తి బయలుపడినగాని హృదయమునకు శాంతి లేదు.

ఇంద్రియచాంచల్యమునకు కారణమేమి ? ఇంద్రియములు వేనిని కోరుచున్నవో వానిని పొందకపోవుటవలన, యోగి కనులను తెఱవడు. కనులను తెఱచినతోడనే, ధ్యానావస్థయందు హృదయమందిరమున చూచిన యనంతమూర్తిని తాను ఎప్పుడు చూడలేకపోయెనో అప్పుడే యోగి తిరిగి కనులను మూసికొనును. ఎంతవఱకు ధ్యానమూర్తి బాహ్యమున కనబడదో, అంతవఱకును యోగి అస్థిరుడగుచునే యుండును. విషయితో విషయమును, రసముతో నింద్రియమును, మనుష్యత్వముతో మనుష్యుని అనుసంధానముచేసి, విషయ రాజ్యమున రసమూర్తిని ప్రతిష్ఠించినగాని, యోగియొక్క అస్థిరత పోనేరదు. " ఈశావాస్యమిదగుం సర్వం " ఈశ్వరుని ద్వారమున సకలమును ఆచ్ఛాదనము చేయుమని ఉపనిషత్తులు చెప్ప భక్తిమార్గమునం దీ స్థిరత లేదు. సకలకామములను బ్రహ్మతో భోగింపుడని ఉపనిషత్తులు బోధించుచున్నవి. బ్రహ్మమునే సకలభోగములతో ననుభవింపుమని భాగవతము ప్రబోధించుచున్నది. పూర్వకాలములో అరూపద్వారమున రూపమును భోగించుట. ఇప్పుడన్ననో రూపముద్వారమున అరూపమును ప్రత్యక్షము చేసికొనుట. పూర్వము అశబ్దమున శబ్దము వినుట, అరసమున రసము నాస్వాదించుట, అగంధమున గంధము నాఘ్రాణించుట. ఇప్పుడది యంతయు నతిక్రమింపబడినది. శబ్దద్వారమున అశబ్దమును, రసద్వారమున అరసమును, గంధద్వారమున అగంధమును, స్పర్శద్వార

మున అస్పర్శమును ప్రబోధించి, హృదయమర్మమునకు లాగి కొనుము. భక్తవత్సలుడు భక్తుల ఆర్తప్రార్థనలను విని ఎట్టి రసజగత్తున బడవేసెను? వేదకాలమున రూపారూపములకు గల యైక్యత అల్పజ్ఞానముపై నాధారపడియుండెను. అప్పుడు వివేకములేదు. ఆత్మానాత్మ విచక్షణలేదు. అప్పటి జ్ఞానము ప్రదోషమునందలి వెలుతురువలెనుండెను. ఈ కలయిక అట్టిది కాదు. ఇక్కడ జ్ఞానము పరిపూర్ణమైనది. ఇక్కడ అనాత్మ యందు ఆత్మభ్రమలేదు. ఈ యైక్యత ఈ యభేదజ్ఞానము అవిద్యచే కల్పితమైనవికావు. ఇది రససృష్టి. ఈ మహాసాధనము నందు, రససృష్టియందు, యోగి రూపకల్పనలను చేయును.

"సాధకానాం హితార్థాయ । బ్రహ్మణో రూపకల్పనా."

రూపకల్పన సాధకులకు సహాయభూతమగును. కల్పన చేయునది సాధకులుకారు, సిద్ధులు. వారు తమ ప్రసన్న చిత్తమున దేని సాక్షాత్కారమును పొందిరో, ఏరసము నాస్వాదించిరో, దానిని మొదట ప్రతిమల రూపమున ప్రకాశింప జేసిరి. సమాధిలోకలిగిన ఆత్మోపలబ్ధితో వారు తృప్తిపొందరు. ఏలయన, సమాధి నిత్యావస్థకాదు. సమాధి విడిపోయినప్పుడు సమాధిలో ప్రత్యక్షమైన ఇష్టదేవతను తిరిగిచూచుటకు ఇచ్ఛ కలుగును. జాగ్రదవస్థయందు ఆ స్వరూపమును ఇంద్రియ సమక్షమున నుంచుకొనుటకు యోగీంద్రులు రూపకల్పన చేయుదురు. వారు రూపకల్పన చేయునది తమ కొఱకే గాని ఇతరులకొఱకు కాదు. ఇంద్రియసంయమముచే చిత్తనిరోధముచే సమాధినిపొంది ఏ యుపాస్యదేవతా సాక్షాత్కారముఁబొందునో, దానిని తిరిగి బైటను ప్రవృత్తియందు శబ్ద స్పర్శ రూప రస గంధములయందు ఉప భోగించుటకు యోగి యుత్కంఠు డగును. భక్తుడు తన రస

మూర్తిని తన యిష్టదేవతను తన హృదయేశుని తన యాత్మ మందిరమునందే కాక, జీవనమునందును సంసారమునందును సమాజమునందును వాఙ్మయమునందును శిల్పమునందును కళలయందును గానమునందును కావ్యములందును ప్రతిష్ఠించిన గాని వాని యానందము పూర్తి కాదు. అప్పుడు కాని, వాని సాధన సిద్ధింపదు. ఇది ప్రేమయొక్క సహజలక్షణము. ప్రథమమున ప్రేమ బహుగూఢముగ సంచరింపనారంభించును. ఎప్పుడు ప్రేమ యుదయమగునో, అప్పుడు లజ్జయు భయమును నంకురించును. ప్రియురాలు మొదట తన ప్రేమను బహిరంగపఱచుటకు ఇష్టపడదు. ఇతరుల దృష్టి దానిపై బడుట కెంతమాత్రమును సహింపదు. సకలబాహ్య సంబంధములును దానికి అంతరాయము లని భావించును. తన మనోనాథుని హృదయమునందలి నిగూఢప్రదేశమునందుంచుకొని ఆనందించుచుండును; ఉద్రేకమును పొందుచుండును; సంకల్పసోపానముల నెక్కుచు ప్రియుని సంగమమున రాగనిమగ్న యగును. కాని, ప్రేమ వికసించినకొలది లజ్జ తొలగిపోవును. ఇక ఏకాంతభావము తృప్తి నియ్యజాలదు. ప్రియు నలంకరించి వానిని దూరమునుండి చూడగోరును. తన ప్రియుని ఇతరులకు జూపి వారిచూపుతో తనచూపును కలిపి, ఆనందము పొందుటకు ఆతురపడుచుండును. తాను జనసంఘమున లీనమై ప్రియుని కీర్తించును. తన శిశువును ఇతరు లెత్తి ముద్దాడినగాని తల్లి కానందము లేదు. ఇది ప్రేమతత్త్వము.

అంతరంగికమైనదానిని జగత్తునందు ప్రకాశింపజేయుటకు ఏ వ్యాకులత భక్తున కుండునో, ఆ వ్యాకులతయే కవికి కూడ గలదు. కవి రూపరసములద్వారమున తాను

పొందిన దివ్యానుభవములను ప్రకటించుటకు అస్థిరుడగును. తన హృదయమున పొంగి తరంగితమై ప్రవహించు భావ లహరిని శబ్దమున ఛందస్సున సంతమున ప్రపంచమునకు వినిపించిన గాని కవికి తృప్తి లేదు. కవియొక్క ఆవేదన, భక్తునియొక్క వ్యాకులత, ప్రియురాలి విరహము—ఇవి యన్నియు రసజగత్తునందు రూపకల్పనలను పురికొల్పుచుం డును. ఇయ్యది ప్రసూతి వేదన వంటిది. ఇది సృష్టికి మూలము. ప్రియుడు కవి భక్తుడు—ఈ మువ్వురును తమ రసజగత్తును బయట ప్రతిష్ఠించుటకు ప్రయత్నింతురు. కాని, ఆ ప్రయ త్నము సఫలము కానేరదు. అది వ్యర్థప్రయాస. రసజగత్తు బహిర్వస్తువు కాదు. అది అతీంద్రియము. దాని లావణ్యము రూపలావణ్యము కాదు, అది భావలావణ్యము. దాని సౌంద ర్యము భౌతికము కాదు, అది రససౌందర్యము, అనంగము, అరూపము, అనూహ్యమును. ఆ సౌందర్యమును ఆ మాధు ర్యమును ప్రకటించుట యెట్లు? ఏ "కెమేరా" యు దాని రూపపటము నెత్తలేదు. ఏ ప్రియుడును తన నాయికను చిత్రించి తృప్తి పొందలేదు. ఏ కవియు రసానుభవమును వెలి పుచ్చగలభాషను ఛందస్సును కనుగొని శాంతచిత్తుడు కా లేడు. ఏ భక్తుడును తన ప్రాణపటమున జూచిన ఇష్టదేవతా మూర్తిని ప్రతిబింబింపగల రూపమును ఈ జగత్తులో కనుగొని సంతోషస్వాంతుడు కాలేడు. ఇంద్రియాతీతమైన ప్రేమ మాధుర్యమును రససౌందర్యమును భావలావణ్యమును ప్రక టింపగల భాష లేదు, ఛందస్సు లేదు, శిల్పము లేదు. ప్రక టింపుమని ఆవేదన యొకమూల ప్రేరేపించుచుంచును. ప్రయత్నము వ్యర్థమైనందునకు ఒక మూల యసంతృప్తి

కలుగుచుండును. రసరాజ్యమున, ఆవేదనయు అసంతృప్తియు పొందుచుండుటయే ప్రయోజనము, ఫలము.

రసమునకు సంసారమే ఆశ్రయము. సంసారము రసముల లీలాభూమి. రసము సంసారమున బుట్టి సంసారము నతిక్రమించును. మహాసాగరమున తరంగములు దిగంతము వ్యాపించి క్రమముగ అనంతమగు నీలాంబరమున లీనమగు విధముననే, రసముకూడ వ్యక్తియందు బుట్టి సమాజమునకును, సమాజమునుండి విశ్వమునకును వ్యాపించి, తుదకు నిర్విశేషమున గలసిపోవును. మొదట నొక యల్పమగు శిశువుమూలమున గలిగిన వాత్సల్యరసము సకలసంతానము నిండి, విశ్వవ్యాప్తివఱకును ప్రవహించును. మొదట వాత్సల్యము దేని నాశ్రయించి పుట్టెనో అది విశిష్టవస్తువు. దాని సంగమస్థానము నిర్విశేషము. "ఇది నా తల్లి. అందఱి తల్లి కాదు. నా తల్లిని అమ్మా యని అన్యులు పిలుచుట కధికారములేదు. ఇది నాసొత్తు. అమ్మ అందఱిదికాదు, నాది." కాని, క్రమముగ నాది యనునది పోయి, నా తల్లిని ఇతరులుకూడ అమ్మా యని పిలుచుటకై నా మనము వ్యాకులత నొందును. అమ్మయని పిలుచుట కొక కంఠముచాలదు. కోటికంఠములతో అమ్మా యని పిలువవలెను. త్రింశత్కోటికంఠకలకలనినాదమున 'వందేమాతరం' మంత్రము ప్రతిధ్వనింపవలెను. నా తల్లి యెవరు? త్రిపురసుందరి, త్రిభువనమోహిని. నా తల్లి నా యందు ఏ ప్రేమను మేల్కొల్పెనో ఆ ప్రేమయే జగజ్జనని రూపమున వెలసినది, వికసించినది. ఈ మాతృమూర్తి నాదే కాదు, అందఱిది, సకలవిశ్వసంతానముది, సకలసృష్టిది. వేయేల? సకలసృష్టియు నా తల్లిదే. ఈ మాతృమూర్తి మూర్తి

లేని అమూర్తి కాదు. ఇది సాకారమును కాదు, నిరాకారమును కాదు. మాతృమూర్తి యనగా, ప్రపంచములోని తల్లు లందఱి కూడిక కాదు. ఆ మూర్తి ప్రతి తల్లియందు నున్నది, అందఱిని అతిక్రమించియు నున్నది. ఎప్పుడు విశిష్టమగు మూర్తి అమూర్తిని స్ఫురింపజేయదో, ఆ మూర్తి ఆ రూపము ఆ విగ్రహము అలీకకల్పన, అర్థవిహీనమగు కల్పన. అది కేవలము జడపిండము.

ఏ మూర్తి యమృతప్రేరణము సేయగలుగునో, అది సమముగ సాకారమును నిరాకారమును నగుచున్నది. ప్రకటితమైనది సాకారము. ప్రకటితము కానిది నిరాకారము. ప్రకటిత మైనదానిని వదలివేసి అప్రకటిత మైన దానిని అనుసంధానము చేయుటయెట్లు? రూపము వినా స్వరూపమును తెలిసికొనుటయెట్లు? సాకారమూలమున గాక నిరాకారమున భావన చేయుట యననేమి? మన ఋషులు సాకారనిరాకారములను ఛాయాతపములుగ వర్ణించియున్నారు. వ్యష్టిజనని మూర్తి. సమష్టిజనని అమూర్తి. వ్యష్టిసంతానము సాకారము, సమష్టిసంతానము నిరాకారము. వ్యష్టినాయకుడు రూపము. విశ్వనాయకుడు అరూపము. ఒకదానిని విడచి మఱియొకటి యుండదు. రూపమునందు స్వరూపము, గతియందు శక్తి, ఆవిర్భావమునందు భావము, శబ్దమున అశబ్దము, స్పర్శయందు అస్పర్శ, గంధమునందు అగంధము, ఛాయాతపములవలె అవినాభావమున నున్నవి. ఈ విశ్వత్వము అంకగణితమార్గమున గ్రాహ్యము కాదు. ఇది జీవనతత్త్వము. జీవము అంగముల కూడిక కాదు. జీవము ప్రత్యంగమున నున్నది. జీవము ప్రత్యంగమున వ్యాపించి పూర్ణత నొందును. ప్రత్యంగము జీవమును ప్రేరేపించుచు సార్థకత నొందును.

జీవము పరిపూర్ణత నొందుటకు అంగములను సృష్టించును. అంగము లన్నియు ఆనందమయ జీవమును ప్రకాశింపజేయును. అటులే జగజ్జనని తన పరిపూర్ణతకై తల్లులను సృష్టించుచున్నది. ప్రతి తల్లియు రూపములేని జగజ్జననిని ప్రకాశింపజేసి సార్థకత చెందుచున్నది. అంగాంగిసంబంధమున సాకారమును నిరాకారమును, సాలంబమును నిరాలంబమును అన్యోన్యముగ భేదాభేదముల నొందుచున్నవి. నీతి, ధర్మము, దర్శనము, శిల్పము, సాహిత్యము ఈ నియమము ననుసరించియే రూపమున స్వరూపమును, భేదమున అభేదమును, విశిష్టమున నిర్విశిష్టమును వెదకుచు కనుగొనుచు పూర్ణత్వము నొందుచుండును.

ఈ దృష్టితో జూచితిమేని, హిందూదేవతావిగ్రహములు సమాధిలబ్ధమైన ఇష్టదేవతామూర్తులని మన మంగీకరింపక తప్పదు. విశ్వబ్రహ్మ, అర్ధనారీశ్వరుడు, మహిషాసురమర్దని, యుగళమూర్తి, నటరాజవిగ్రహము, దుర్గ, భవాని, కాళి, జగద్ధాత్రి, సరస్వతి, లక్ష్మి, దక్షిణామూర్తి మొదలగు ప్రతిమలు సర్వాంతర్భావుకుడగు నిఖిలరసామృతమూర్తియొక్క భావాంగఘటనలని తెలిసికొనగలుగుదుము. ప్రస్తుతము విగ్రహారాధకులు ఈ మూర్తులను ఇట్టి దృష్టితో జూచుచుండిరా లేదా యనునది ప్రస్తుతవిషయము కాదు. ఈ విగ్రహములను సృష్టించినవారు సాధారణమానవులు కారు. వారు బ్రహ్మసాక్షాత్కారమును పొందిన సిద్ధపురుషులు. వారి సమాధికి భంగము కలిగినప్పుడు ఉద్భవించిన ఆవేదనలో తమ ఉపాస్యదేవతలను మంత్రరూపమున గీర్తించిరి. వాని ననుసరించి శిల్పులు దారు లోహ శిలా విగ్రహములను చేసిరి. చిత్రకారుడు తన చిత్తరువును లిఖించుటకు పూర్వము పటముపై ముందుగ సఫేదు రంగును

పూయును. అటుపిమ్మట తన కుంచెను వివిధములగు రంగులలో ముంచి చిత్తరువులను పూర్తిచేయును. అటులే సాధకుని చిత్తముపై బ్రహ్మభావ ముదయింపవలెను. "ఈశావాస్య మిదగుం సర్వం" ప్రపంచమంతయు ఒక్క బ్రహ్మభావమున కనబడవలెను. మనకు కనబడు వస్తుతంత్రము స్థావరజంగమములే యైనను, అవి యన్నియు బ్రహ్మముయొక్క మూర్తులై ప్రకాశించును. కాని, ఇది సాధకునకు ప్రారంభదశ. భక్తి యింకను గంభీరము కాలేదు. నేత్రములనుండి అశ్రువులు రాలనారంభించెను. దృష్టి విడివడినది. కాని, సృష్టి ఆరంభము కాలేదు. సమాధియందు తాననుభవించిన భావోన్మాదము జాగ్రదవస్థయందు కూడ కొంతవఱకైనను నిలిచినగాని, సృష్టి యారంభము కాదు.

"ఈశావాస్య మిదగుం సర్వం" అను వాక్యమునందు బ్రహ్మభావము కలదుగాని, భావాంగసృష్టి ప్రారంభము కాలేదు. భావాంగము కేవలము అనుభవముకాదు. అది కల్పన. అనుభవము ప్రగాఢమైనప్పుడు కల్పనతో జేరి భావమునకు అంగములను సృష్టించును. ధ్యానములో మాతృత్వము అనుభవమైనది. ధ్యానము భంగమైనప్పుడు ఇంద్రియములు మేల్కొనినప్పుడు ఈ భావము రక్షింపబడదు. ఇంద్రియములు భేదబుద్ధిని కలిగించును. ప్రాణ మప్పుడు వ్యాకులత పొందును. అప్పుడు కల్పన సృష్టిచేయ నారంభించును. ఈ కల్పనలు మాతృప్రతిమను ఘటించును. ఇది పరులకొఱకు కాదు.

ప్రాణతృప్తికొఱకు గాఢానుభవము అతీంద్రియతత్త్వమును ఇంద్రియసమ్ముఖమున ప్రతిష్ఠించును. అందుకనియే ఋషులు మంత్రద్రష్ట లగుచున్నారు. నిరాకారవాదులుకూడ నీ మార్గమున నడచి మానసమూర్తులను గల్పించి "ఓమ్ పితానోసి" అని బ్రహ్మమునకు ప్రణామము చేసి విశ్వపితయను మానసిక

కల్పనను చేసినారు. విగ్రహములను విడనాడిన మానసికో పాసకులు సయితము సున్నితములైన మానసికకల్పనలకు లోనగుచునే యున్నారు. వారు చేయునది నిరాకారోపాసన కాదు. ఎప్పుడు ఈశ్వరుని చరాచరాత్మకమైన జగత్తు ద్వార మున కీర్తించుచున్నారో, ఎప్పుడు వానిని "తండ్రి,తల్లీ" యని సంబోధించుచున్నారో, అప్పుడు మానసిక కల్పన తప్పదు. ఎప్పుడు పుత్రుడు "అమ్మా" యని తల్లిదగ్గఱకు పరుగిడు చున్నాడో, అప్పుడు పుత్రుడు మాతృప్రతిమను సృష్టించు చున్నాడు.

ఇది నిమ్నాధికారుల సంపదకోపాసనము కాదు. ఇది బ్రహ్మజ్ఞానసాధనయు గాదు బ్రహ్మజ్ఞానమునందు బ్రహ్మ ప్రకాశముమాత్రమే సాక్షాత్కారమగును. స్థావరజంగమము లన్నియు నిష్టదేవతయొక్క ఏకరూపమును దాల్చును. ఇందు విగ్రహాసృష్టి లేదు. సర్వము సమానమైనప్పుడు, జగత్తంతయు ఒక్క బ్రహ్మరూపమైనప్పుడు, రసస్పష్టి యెక్కడ ? అందు కనియే, భక్తులీ యవస్థను దాటవలెనని చెప్పుచున్నారు. బ్రహ్మప్రకాశముకంటె బ్రహ్మవిలాసము మహత్తరమైనది. ప్రకాశముచందు ఒకటేరూపము, కావున నిరాకారము. విలాస మునందు సర్వరూపము. కావున అనంతకోటి విగ్రహములు, నామములు, అవతారములు, లీలలు. ప్రకాశమున శాంతభావ ముతో ముగింపు. విలాసమున శాంతము ప్రథమసోపానము. ఆ రసపిపాసకు తనివి యుండదు. ఆ రసక్రీడయందు ఎప్పటికప్పుడు నూత్ననూత్న రాగములు, నూత్ననూత్న నృత్యములు, నూత్న నూత్న వేషములు, నూత్ననూత్న విలాసములు. అదియొక మహాయాత్ర. క్షేత్రమునుండి క్షేత్రమునకు, ఆలయమునుండి ఆలయమునకు, విగ్రహమునుండి విగ్రహమునకు, సహస్ర

నామసంకీర్తనముతో ప్రణామము లొనర్చుచు, ఆత్మ రస యాత్రకై బయల్వెడలును. భగవంతుడేమిచేయగలడు ? ఎంతకును భక్తునకు తృప్తిలేదు. రసపానము చేసినకొలది రసపిపాస హెచ్చును. భగవంతుడు భక్తుని తృప్తిపఱుపక యెట్లుండగలడు ? వాని తృప్తినిమిత్తము ఈశ్వరు డెప్పటి కప్పుడు నూతనరూపములను దాల్చును. భక్తుడా రూపములను విగ్రహములుగ నొనర్చి, క్రొత్త రూపములకై నిరీక్షించుచుండును.

ఆ రసపిపాసకు విరామములేదు. ఆ విగ్రహసృష్టికిని తెంపు లేదు. ఇది యనేకేశ్వరోపాసన కాదా ? కాకపోనిమ్ము ! భగవంతుని వర్ణించుటకు నాకు ఒక్క నామముచాలదు. వానిని సందర్శించుటకు ఒక్కరూపము చాలదు. వాని సందర్శనానందమున నోలలాడినకొలది నూతనరూపరచనలు తమ యంతట తామే యుద్భవించుచుండును. భావము భావాంగ ఘటనా మూలమున పరిపూర్ణత నొందుచుండును. భావాంగ ఘటన రూపరచనల ద్వారమున విస్తీర్ణమగుచుండును. ఏవి భావాంగఘటనలు కావో అవి విగ్రహములు కావు. విగ్రహములందలి శిలాజ్ఞానము వస్తుతంత్రము. అది ప్రయోజనకారి కాదు. వానిచే ప్రబోధింపబడు దేవతాబుద్ధియే బ్రహ్మోపాసనకు సహాయకారియగును. అందుకనియే విగ్రహములు అనధికారులకు ప్రయోజనకారులు కావు. వారికి అందు శిలాజ్ఞానముతప్ప మఱొకటి యుండదు. "సాధకానాం హితార్థాయ." సాధకులు అనధికారులు కారు.

ప్రవర్తకులు అనధికారులు. సాధ్యము తెలిసినవారే సాధకులు. ఒక్కమారైనను తమ జీవితమునందు బ్రహ్మజ్ఞానలేశమును పొందినవారే సాధకులగుదురు. ఈశ్వరసహవాసమును నిత్యానుభూతిగ జేసికొనయత్నించువారే సాధకులు.

అట్టివారియందు విగ్రహములు రసోద్దీపనము గావించి, వారిని ఈశ్వరసన్నిధికి జేర్చును. వారికి ప్రాణప్రతిష్ఠ చేయబడిన ప్రతివిగ్రహమును ధ్యేయము.

గురువులయొద్ద మంత్రోపదేశము నొందినగాని యోగాభ్యాసము సాధ్యముకాదు. ప్రతి మంత్రమున కొక యధిష్ఠాన దేవతయుండును. విగ్రహము లీ యధిష్ఠానదేవతలయొక్క ప్రతిమలు, కావున మంత్రోపాసన లేనిది విగ్రహారాధనము సఫలము కానేరదు. విగ్రహ ముపాస్యమగుటకుముందు దానికి ప్రాణప్రతిష్ఠ కావలెను. ప్రాణప్రతిష్ఠ యనగా ఆ విగ్రహమునకు చెందిన మంత్రముయొక్క బీజాక్షరముగల యంత్రముపై దానిని స్థాపించుట.

"సర్వదేవమయీం దేవీం సర్వమంత్రమయీం పరాం
ఆత్మానం చింతయే ద్దేవీం పరమానందరూపిణీం."

ఇట్లు ధ్యానము సేయునప్పుడు దారుశిలాలోహవిగ్రహములయందు వస్తుజ్ఞానము నశించి, దేవతాబుద్ధియే యుదయించును. దేవతాబుద్ధి యుదయించినతోడనే, సాధకుని అతీంద్రియదృష్టి వికసించి, ఈశ్వరగుణానుభవము కలుగును. కావున విగ్రహముల మర్మములను తెలిసికొనగోరువారు ముందర గురువులయొద్ద మంత్రోపదేశమును పొందవలెను. విగ్రహముల మర్మములను వెల్లడించుట యనగా, రసస్వరూపమును ప్రకటించుట. ఆ కార్యము చింతనల, భజనల, యోగముల మూలమున అనుభవించి ఆనందింపవలసినదే కాని, దానిని లిపిబద్ధ మెవరు చేయగలరు? కవులు చేయగలరు. ఋషులు చేయగలరు. సిద్ధులు చేయగలరు.

1916 *

రూపకల్పన

ఆత్మవితరణము * *

"నరకళేబరములమీఁదుగ సాగు నీ ధర్మరక్షమార్గము రక్తపంకిలముగదా!"

ఈ చిన్ని వాక్యమునందు టెన్నిసన్ మహాకవి మానవ చరిత్రయొక్క గభీరరహస్యమును ఇమిడ్చియున్నాడు. మానవాభ్యుదయరహస్యమే కాదు, అఖిలసృష్టిమర్మము నిండి యిమిడి యున్నది. రుధిరప్రవాహమన నరహత్యకాదు. జనసంహారము కాదు. హింసకాదు. మఱియేమన, సత్యముకొఱకు మృత్యువును సహితము ఎదుర్కొనగల వజ్రసంకల్పము, హృదయ శోణితమును గూడ దానముచేయగల ఆత్మవితరణము, సర్వస్వమును విసర్జింపగల కార్యదీక్ష. దీనినే ఆర్యులు తపస్సను శబ్దముతో నిర్వచించిరి. తపస్సునకు సృష్టిమర్మమంతయు ప్రత్యక్షమగును. అఖండుడును, పూర్ణుడును, ఆనందమయుడును నగు నీశ్వరుడు ఖండఖండములుగ చీలి, ఈ యఖిల బ్రహ్మాండమును సృష్టించెను. "స తపస్తప్త్వా సర్వమిద మసృజత్." ఎప్పుడు కారణవారిధియందు "తపః" అను జాగరణమంత్రము శబ్దించెనో అప్పుడా ప్రళయాంధకారమును చీల్చుకొనుచు, సూర్యోదయమున వికసించు అరవిందమువలె, లీలయను సహస్రదళకమలము వికసింపదొడంగెను. ఆత్మవితరణమే సకలసృష్టికి ప్రభవకారణమగుటచే, చేతనాచేతనములు, సకలజంతుసంతానము, నిఖిలజగత్తు, తపఃప్రభావముచే ఆచ్ఛాదితమై యున్నది. కన్య యౌవనలావణ్యమును గోల్పో

యినగాని సంతానవతి యగుటలేదు. తల్లి తన ప్రాణము నుండియే శిశువునకు బ్రాణ మొసగుచున్నది. పుష్పవికాసము కొఱకు వృక్ష మెంత ఆత్మదానము చేయుటలేదు? పుష్పములు వృక్షబీజములను తమ గర్భమున దాచియుంచి కొని, పరిపక్వసమయమున దామే నాశన మొందుచున్నవి. తిలలు గానుగలో నలిగినగాని తమయందు గర్భితమైయున్న తైలామృతమును వెలిపుచ్చవు. ఈ యాత్మదాన మసదృశము! కఠినపర్వతకందరముల బంధింపబడి, అనేకశిలాప్రహారణముల కోర్చి తుదకు బయల్పడి, పొంగి, ప్రవహించి, ధరణిని సస్యశాలినిగ జేయు నా నిర్ఝరధారలయొక్క తపోమహిమమును గనుడు. ఈ ఆత్మదానమహిమను వర్ణింప నేరితరము! నాగ్జాలముచే దాని నొకింత వర్ణింపనగును. బుద్ధి వైభవముచే గొంత గ్రహింపనగును. స్వానుభవమునకు మఱికొంత వేద్యమగును. అంతియేకాని దాని పూర్ణ భావము మాత్రము అగ్రాహ్యము.

చీనాంబరధారిణియై, మణిభూషణాలంకృతయై, రాజసౌధముల బెరుగుచున్న హైమవతి షోడశవర్షప్రాయమున కాషాయవల్కములనుధరించి, రుద్రాక్షమాలికను జేబూని, పంచాగ్ని మధ్యమున తపస్సుచేయుచుండెను. ఈ తపఃక్లేశము వలన శుష్కించిన బాహులతలనుండి జపమాలిక మాటిమాటికి క్రిందబడిపోవుచుండెను. శీతకాలమున, గంగాజలములు నిల్చి చలింపక ఈశ్వరధ్యానమునందు ఘనీభవించురీతిని, పార్వతియొక్క కామనలన్నియు నిశ్చలతజెంది, మహేశుని ధ్యానమునందు లయమయ్యెను. ఏమి ఆ తపఃప్రభావము! తపఃక్లేశమునందు శాంతమును, సాధనానుష్ఠానమునందు ఆనందమును బొందుచున్న ఆతపస్వినినే గదా ప్రతి హిందూకన్యయు

నుపాసించి ధన్యయగుచుండును! ఆత్మసమర్పణ మనగేమో యింకను విప్పిచెప్పవలయునా? ఏ గురుని విగ్రహమును ప్రాణ ప్రతిష్ఠము జేసికొని అతిఘోరతపఃక్లేశముచే ధనుర్విద్యాసిద్ధిని బొందెనో, ఆగురువు ప్రత్యక్షమై, ధనుర్ధారణకు ప్రధానావలం బనమగు దక్షిణహస్తముయొక్క అంగుష్ఠమును ఖండించి గురుదక్షిణగసమర్పింపుమని ఆజ్ఞాపించినప్పుడు తపస్వియగు ఏక లవ్యుడు, ప్రసన్నవదనముతో గుర్వర్థముగ తన యంగుష్ఠ మును ఖండించుకొని ధన్యుడయ్యెను.

తపఃక్లేశమువలననే ఆత్మ విముక్తినొంది, అమృతరస పానమును జేయగల్గును. తపస్సుయొక్క ఆరంభమునందు నవసానమునందుగూడ ఆనందమే సముద్రఘోషణమువలె సతతము ప్రతిధ్వనించుచుండును. బ్రహ్మమానసపుత్రియగు శారదయొక్క వీణెనుండి ప్రవహించుచున్న రాగమే ప్రళయ కాలమున రుద్రుని పినాకగర్జనమునందును మ్రోగు చుండును. ఏతపఃప్రభావమువలన దేశకాలాతీతమైన పరబ్ర హ్మము, సృష్టియందు దేశకాలపరిచ్ఛేద్యమయ్యెనో, ఆతపః ప్రభావమువలననే దేశకాలబాధితమైన భూతకోటి తిరిగి ఆ యఖండపరిపూర్ణానంతపదవిని జేరగల్గుచున్నది. తపస్సు చేతనే ఈశ్వరునకు బంధనము గల్గుచున్నది. తపస్సుచేతనే మానవునకు తిరిగి మోక్షము సిద్ధించుచున్నది.

ఈ బంధము లనిత్యములు, నశ్వరములు. ఆత్మ యెప్పు డును వీనినతిక్రమించుటకే ప్రయత్నించుచుండును. ఈ ప్రయ త్నమే తపస్సు. ఆత్మవితరణము, త్యాగశక్తియు నన లాభనష్ట పరిగణనములుకావు. ఎంతయిచ్చినను తఱుగని ఆత్మదాన మెక్కడ! ఆయవ్యయగణనమెక్కడ! అఖండానంద పరిపూర్ణు డగు భగవంతునిపూర్ణత్వము ఆత్మవితరణమువలన తఱుగుట

లేదుగదా ! ఒక దీపశిఖనుండి శతసహస్రదీపములు ప్రజ్వలించునట్లు, ఆత్మవితరణముననే ఆత్మ వికసించును. ప్రాణదానమునందే జీవి వృద్ధినొందును. వ్యయమునందే ప్రాణి ప్రాణిగ నుండగల్గును. ఈశ్వరుడు జీవునకు ప్రాణ మొసంగినపుడు, ప్రాణముతోపాటు ప్రాణదానము చేయగల శక్తియు నిచ్చియుండుటచేతనే మోక్షము నభిలషించి తపఃక్లేశములను సంతోషపూర్వకముగ బడయుచున్నాడు. తల్లి శిశువునందు, భార్య భర్తయందు, గురువు శిష్యునియందు, సేవకుడు స్వామియందు, సాధువు ధర్మమునందు, దేశభక్తుడు దీనదుఃఖనివృత్తియందు ప్రాణదాన మొనరించి ఉత్తీర్ణులగుచున్నారు. మానవుడు స్వాభావికముగ క్లేశములయందే తృప్తి చెందుచుండును. "క్షురధారాసిశిత దుర్గమ దురత్యయ" పథముననే శాంతియు ఆనందమును ప్రవహించుచుండును. ఆత్మవితరణమువలననే మానవుడు తన యల్పత్వము వదలి విశ్వాత్మను బొందగల్గును. ప్రాణదానము వలననే సంకల్పము తనదుర్బలత్వమును వీడి చిచ్ఛక్తియందు సుస్థిరమగును. ఆత్మసమర్పణమువలననే ప్రేమ తన చాంచల్యమును జయించి, అఖండానందరసమున లీనమగును. స్వధర్మనిర్వహణమునకు, గృహపాలనమునకు, సంఘసంస్కరణమునకు, రాజ్యాంగనిర్మాణమునకు, స్వాతంత్ర్యప్రతిష్ఠాపనమునకు, సర్వకళాశోభకు, మానవసేవానిరతికి, తుదకు మోక్షప్రాప్తికి గూడ ఈ యాత్మవితరణమే, ఈ ప్రాణదానమే, ఈ యాత్మయజ్ఞమే మూలము, సాధనమును.

తాపసికి వసుధయంతయు కుటుంబమే యగును. తన మేలు దా నెప్పుడును బ్రత్యేకముగ జూచుకొనడు. అన్యుల సుఖదుఃఖములను దనవిగనే భావించుకొని, లోకశ్రేయము

కొఱకు కెప్పుడును బాటుపడును. స్వతంత్రుడయ్యు, బానిసల దాస్యముచే తన్ను బంధించుకొనును. పవిత్రుడయ్యు పాపుల భారమును తన మూపున దాల్చి, వారి విముక్తికై తన ప్రాణమును భక్తిపూర్వకముగ నిచ్చివేయును. ఈశ్వరుని యజ్ఞము కూడ నిట్టిదేకదా! ప్రతిబంధనమున ఈశ్వరుడే బంధింపబడుచున్నాడు. ప్రతిహింసాకార్యమున ఈశ్వరుడే హింసింపబడుచున్నాడు. ప్రతిపాపవిషయమున ఈశ్వరుడే అవజ్ఞ పాలగుచున్నాడు. ఈశ్వరుని అనంతశక్తి, సృష్టికి ఆవలవెలుగు శుద్ధజ్యోతియందుకంటె, సృష్టియందా జ్యోతి తన్ను తాను అజ్ఞానతిమిరమున మఱుగుచేసికొనుటలోనే ఎక్కువగ వ్యక్తమగుచున్నది. పాపిని ఋషిని సమభావముతో జూచుకొను భూదేవి సహనమును జూడుడు! ఎట్టి క్షమ! ఎట్టి యాత్మసమర్పణము! తల్లి శిశువునకు లోబడి, శిశువుతో తిరిగి పెరుగుచున్నది. గురువు శిష్యునకు వశుడై తిరిగి శిష్యుని అభివృద్ధియందు తానును అభ్యుదయమార్గమును ద్రొక్కుచున్నాడు. దేశభక్తుడు సోదరదేశీయులదుఃఖమునందు నిమగ్నుడై, వారి విముక్తితోపాటు తానును తిరిగి విముక్తినొందును. ప్రజలు తనను రాజుగ గోరుకొనినను శ్రీరామచంద్రుడు పితృవాక్యపరిపాలనకై రాజ్యమును త్యజించెను. సీతాదేవి తన పాతివ్రత్యమహిమచే స్వరక్షణమునకు బూనుకొనగల్గినను ధర్మసంస్థాపనమునకై రావణుని చెఱకు లోబడెను. రాజకుమారుడగు సిద్ధార్థుడు దీనుల దుఃఖనివృత్తికై భిక్షుకుడయ్యెను. ఏసు పతితుల పాపభారమును తొలగించుటకై సిలువపై వధింపబడుట కంగీకరించెను. మానవుని ధర్మచరిత్రయంతయు ఆత్మవితరణము యొక్క దివ్యసంకీర్తనము.

1919

*

సాధన * *

బ్రహ్మజ్ఞానసిద్ధికి శాస్త్రము, ఉత్సాహము, గురువు, కాలము— అని నాలుగు సాధనములు చెప్పబడుచున్నవి. సాధ్యస్వరూపమును యోగక్రమమును దెలుపునది శాస్త్రము. సత్యాన్వేషణముకొఱకు సాధకునియందు ప్రజ్వలించు ఆకాంక్ష ఉత్సాహము. ముఖాముఖిని ప్రత్యక్షనిదర్శనముచే ఆత్మపరిబోధమును గావింపగల్గువాడు గురువు. వీనినన్నింటిని పరిపక్వము చేయగల్గునది కాలము.

ఆత్మోపలబ్ధికి సాధనభూతమైన శాస్త్రము బాహ్యమున గ్రంథస్థమై యుండునది కాదు. అయ్యది ప్రతిమానవుని యందును హృద్దేశమున నిత్యసిద్ధమైయున్నది. అయ్యది శాశ్వత జ్ఞానము— అనాదిసిద్ధమైన వేదము. అయ్యది మనలోపల పుండరీకమువలె ముకుళితమైయున్నది. సాధకుడు అనంతుని వంకకు ఈషణ్మాత్రమైనను దిరుగ నారంభించుటతోడనే, ఆ హృత్పుండరీకమునందలి దళములు క్రమక్రమముగ వికసింప మొదలిడును. అందుండి వెలువడు జ్ఞానతేజము చుట్టును ఆవరించి యుండు తమస్సులను ఛేదించి, జీవనమునంతను క్రమక్రమముగ ప్రకాశవంతముగ జేయును.

బహిర్ముఖుడై యున్న సాధకుడు అంతర్ముఖుడగువఱకే స్వప్రయత్నము నాశ్రయించును గాని, పిమ్మట తన ప్రయత్నమువెనుక అంతరమున నొకశక్తి సంచరించుచు తనను నూతన జ్ఞానభూమికి గొంపోవుచున్నట్లు గ్రహించును. నిజ

మైన ఆత్మబోధ కేవలజిజ్ఞాసచే సిద్ధింపజాలదు. భగవానుని కృపాకటాక్షముచేగాక, ఈశ్వరసాన్నిధ్య మెట్లు లభ్యమగును ? బ్రహ్మస్పర్శ చేతనే హృత్పుండరీకము వికసింప నారంభించి ఆత్మోపలబ్ధి మందముగనో లేక సత్వరముగనో సిద్ధించును. జీవాత్మయందు జ్ఞానము గర్భితమై యుండనియెడల, ఎట్టి విద్యయు, ఎట్టి శిక్షయు మానవుని జ్ఞానినిగ జేయజాలవు. పూర్ణప్రకాశము, శాశ్వతానందము, అనంతశక్తి మానవుని యందు నిత్యసిద్ధమై యుండుట చేతనే, సాధకుడెప్పటికైనను ఉత్తమస్థితిని బొందగల్గును. గర్భితమైయున్నదానిని బహిర్గతము చేయునదియే విద్య.

జ్ఞానమునకు సాధనము శబ్దము. శబ్దమును బయట నుండియైన వినవచ్చును. లేక, అంతరముననైనను వినవచ్చును. అనుద్బుద్ధమైయున్న జ్ఞానస్వరూపమును ప్రకాశింపజేయుటయే శ్రుతియొక్క ప్రయోజనము. అంతకుపైన దాని ప్రయోజనము లేదు. హృదయమధ్యమున అనంతతేజోవిరాజమానుడై ప్రకాశించు జగద్గురువుయొక్క దివ్యవాణిని వినగల్గువానికి ఆత్మోపలబ్ధి సులభసాధ్యము. కాని సామాన్యుల కట్టి యుత్తమస్థితి వెంటనే లభ్యముకాదు. జగద్గురువు ప్రతి హృదయమున విరాజమానుడై యున్నను, వాని శబ్దమును ఆలకింపగల శ్రోత్రమెక్కడ ? మనము శ్రోత్రముండియు శ్రోత్రము లేని బధిరులవలె, చక్షువులుండియు చక్షువులు లేని అంధులవలె ప్రవర్తించు మందప్రజ్ఞులము.

నిమ్నాధికారులకు ప్రాచీనఋషులముఖతః ప్రతిధ్వనించిన శబ్దమును, లేక వర్తమానమున అట్టి అతీంద్రియ శ్రవణమును వికసింపజేసికొనిన గురువును సాహాయ్యముగ స్వీకరించుట యావశ్యకము. కాని, ఈ శ్రుతులును, ఈ గురుసాన్ని

ధ్యమును అంతరమున నివసించు జగద్గురువునకు బదులుగ తాత్కాలికముగ ఉపయోగింపదగిన ప్రత్యామ్నాయములే కాని శాశ్వతముగ స్వీకరింపదగినవికావు. వీని సాహాయ్యమును స్వీకరించుచున్నప్పుడుకూడ, వీని యుపయోగము తాత్కాలికమను నమ్మకము ఉండినగాని, హృదయమునందు ఆకాంక్ష తీవ్రము కాజాలదు.

మహాత్ములు లక్ష్యమును జూచినపిమ్మట లక్షణములను విశదీకరింతురు. సాధకులు లక్షణములనుబట్టి లక్ష్యమును జేరుటకు బ్రయత్నింతురు. ఉభయులకును శాస్త్రములు ప్రమాణములే. కాని మహాత్ములకు శాస్త్రములు అనుభవప్రతిష్ఠితములు, అనుప్రకాశకములు. సాధకుల కవి అనుమానప్రతిపాదితములు, జ్ఞానప్రబోధకములు. ఆత్మ స్వతంత్రమైనదని చెప్పు శాస్త్రము స్వాతంత్ర్యమును భంగపఱచి ఆత్మ స్వరూపమును నాశనము చేయజాలదు. పూర్వుల యనుభవములెంత గంభీరములైనను, అవి సాధకుని జీవితపథమును విశేషకాలము ప్రకాశవంతముగ జేయగల్గుచున్నను, వాని యుత్తమ వికాసమున సర్వాంతర్యామియగు జగద్గురువునే పూర్ణముగ శరణము పొందక తప్పదు. ఉత్తమస్థితియందు సాధకుడుపాసించునది ఏగ్రంథమునుగాదు ; సర్వగ్రంథములకు అతీతుడైన అనంతుడే ఉపాస్యుడు. ' సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ' యను అమృతవాణి హృదయకుహరము నుండి నిరంతరము ప్రతిధ్వనించుచున్నది.

సాధనవిషయము చాలవఱకు గ్రంథస్థమైయున్నను, కొంతవఱకు గురుపారంపర్యముగ అనుశ్రుతముగ వచ్చుచున్నను, సాధకులు ఎప్పటి కప్పటికి నూతనమార్గములను త్రొక్కకపోలేరు. యోగాభ్యాసమున పతంజలి సూచింపని

సాధన లనేకము లిటీవల వాడుకలోనికి వచ్చెను. ధర్మ పరిణామమున క్రొత్త క్రొత్త మార్గము లింకను కనిపట్టబడుచున్నవి. లోతుగ నాలోచించితిమేని ఎవరిపద్ధతి వారిదేయని తెలిసికొనగల్గుదుము. వ్యక్తుల గుణకర్మభేదములనుబట్టి, పద్ధతులు మాఱుచుండును. ప్రకృతిసిద్ధమైన వ్యత్యాసములుగల మనుజుల నెల్లరిని ఒక్కపద్ధతియందే అచ్చులోవేసి బిగింపజాలము. ప్రతిసాధకునకు సాధనయందుగలుగు ఆవేదనలో ఈశ్వరుడే తగిన మార్గమును వెల్లడిచేయును. సాధకుడు ప్రథమావస్థయందు తన మతమునందు అనుశ్రుతముగవచ్చు రాజబాటను పడి పోయినను, కొంతదూరము పోవుసరికి త్రోవతెన్నులేని మహారణ్యమున బడినట్లగును. అప్పుడు సాధకుడు తనంతటతాను, అడుగడుగుకు మార్గమును గనిపట్టుచు ముందుకు సాగుచుండవలసివచ్చును. ఇయ్యది ఈశ్వరవిధానము. స్వప్రయత్నమునగాని 'స్వ' ప్రతిష్ఠింపబడదు. ఏకాంతమునగాని ఆత్మ దుఃఖప్రదమగు పరవశతను తప్పించుకొని సుఖదాయకమైన స్వవశతను బొందజాలదు. దురంత కఠోర నిర్జనత్వమునగాని బాహ్యశబ్దములన్నియు స్తంభించి, ఆత్మగతమైన బ్రహ్మనాదము శబ్దింపదు.

ప్రకృతిని నిత్యము నూతనముగ నుంచుటకే సూర్యుడు తిరిగి తిరిగి యుదయించుచున్నాడు, ఋతువులు మాఱుచున్నవి. అటులనే, వ్యష్టిజీవితమునందును, సమష్టిజీవితమునందును నూతనదశలు, నూతనావస్థలు ఉద్భవించుచున్నవి. ఈశ్వరశక్తియు యుగయుగమున 'సంభవామి' యని క్రొత్త క్రొత్త ధర్మావతారముల రూపమున ప్రబోధింపుచున్నది. సాధకుడు తన సాధనమార్గమునందు ఈ దేశకాలభేదములను, యుగధర్మములను గమనింపక తప్పదు. శక్తివిహీనమైన సత్త్వ, గతి

విహీనమైన శక్తి, పరిణామవిహీనమైన గతి అసంభావ్యములు. అఖండానంతశక్తిని స్వగతమున, వర్తమానమున, స్వదేశమున ప్రకాశింపజేయగలిగినప్పుడే సాధన సార్థకమగును. ప్రాచీనులు అట్టి స్వతంత్రమైన ఆత్మప్రతిభను బ్రతిష్ఠించి ధన్యులైరి. ఏ సాధకునియందు బ్రహ్మజిజ్ఞాస ఉజ్వలితమై ప్రకాశించునో ఆ సాధకుడు ఇతరుల సాధనప్రణాలికలచే బంధింపబడడు. సాధకుడు విశ్వమునంతను అవగాహనము, ఐక్యము చేసికొనియు, తన వ్యక్తిత్వమున సచ్చిదానందునకు నూతనదేహధారణము నొసంగగల్గును. ఈ విషయమునే వివేకానందస్వామి కడు హృద్యముగ వాక్రుచ్చినాడు :—

" A free adaptability in the manner and the type of the individual's acceptance of the Universal and the Transcendent into himself is the right condition of the full spiritual life in man. The unity of all religions must necessarily express itself by an increasing richness of variety in its form. The perfect state of that essential unity will come when each man has his own religion— when not bound by sect or traditional form he follows the free self-adaptation of his nature in its relation with the Supreme. "

ఈ యన్వయము సాధకుని సమగ్రజీవనమునందును, సకలప్రకరణములయందును, లోపలను బయటను బ్రతిష్ఠింపగల్గినప్పుడే, సాధనయొక్క సిద్ధి ప్రారంభమైనదని తెలిసికొననగును. సాధనయొక్క తీవ్రతయు వ్యాప్తియు వికాసమును సాధకుని స్వోత్సాహముపైననే ఆధారపడియుండుననుట నిశ్చయము. కాని, ఈ స్వోత్సాహము క్రమముగ ఈశ్వరానుగ్రహముగ పరిణామము బొందుచుండునను విషయము తెలిసి

కొనినగాని, సాధన పరిపక్వము కానేరదు. సాధనవికాసమున మూడు క్రమావస్థలను సూచింపవచ్చును. పరబ్రహ్మముతో సాయుజ్యము స్వల్పముగనైన నేర్పడనంతవఱకు సాధకుని స్వప్రయత్నము క్రమముగ ఘోరతపస్సుగ పరిణమించును. ఇది ప్రథమావస్థ. తపస్సు తీవ్రతరమైనకొలదియు తనయందు ఉత్సాహమేకాక, ఇంకొక నూతనశక్తి ఉద్బుద్ధమగుచున్నదని గ్రహించి అంతకంతకు దాని కధీనుడగును. ఇది ద్వితీయావస్థ. ఆ దివ్యశక్తికి అధీనుడైనకొలదియు స్వపరభేదములు నశించును. అప్పుడు వాని దేహమనఃప్రాణములుకూడ విశ్వరూపములై వెలయును. జీవితమంతయు ఈశ్వరలీలగ రూపొందును. ఇది మూడవ యవస్థ.

ఈ తృతీయావస్థయందు మమత్వము పూర్తిగ నశించును. ఈశ్వరేచ్ఛయే తన యిచ్ఛ. ఈశ్వరకర్మయే తనకర్మ. ఈశ్వరభోగమే తన భోగము. అజ్ఞానావస్థయందీ సత్యము అనుభవవేద్యము కాజాలదు. అనుశ్రుతముగవచ్చు కొన్ని మతానుష్ఠానములతో సాధకుడు తృప్తిపడుచుండును. తనయందు వృద్ధినొందుచుండు జ్ఞానము, ప్రేమ, బలము, కార్యోత్సాహము తనవిగనే భావించుకొని గర్వించుచుండును. తన యుక్తికి తట్టినది సత్యము, తన యభీష్టసిద్ధిని గావించినది ఆనందము, తన యభిరుచికి అనుకూలమైనది కళ్యాణము. ఇది యంతయు ప్రవర్తకావస్థ.

స్వతంత్రమైన ధర్మచింత యుదయించుటతోడనే, గతానుగతికముగ జరిగిపోవుచున్న సంసారమున సంక్షోభము పుట్టును. అసంతృప్తి, వ్యాకులత, ఆకాంక్ష, జిజ్ఞాస ప్రజ్వలించి, సాధకుని జీవనము ధర్మసంగ్రామమునకు రంగమై వెలయును. అంతకుపూర్వము సత్యమనుకొనినది అసత్యమగును.

బలమునుకొనినది అశక్తత యగును. శాంతి మాంద్య మని పించుకొనును. తన మంచియంతయు మోసమగును. ఎట్టి యీవేదన, ఎట్టి అనుతాపము !— చిత్తశాంతిని నశింపజేసి పలుభంగుల వేధించుచుండును. ఇంద్రియములు ప్రతిఘటించును. భయమోహములు జిజ్ఞాసను నిరోధించును. లోపలను బయటను విరోధము, సంఘర్షణము. ఉపాసనకు గూర్పుండును. ఇంద్రియనిగ్రహము సాధ్యముకాదు. ఏకాగ్రత కుదురదు. ఉపాస్యమెట్టిది ? సరియైన భావనలేదు. కర్మ నాచరించును. వాక్యములను పఠించును. నామమును స్మరించును. జపమాలను త్రిప్పును. కాని వానియందు అర్థబోధ లేదు. సాధనను వదలివేయునా, వదలుటకు ఇచ్ఛకలుగదు.

పై మెట్టు కన్పట్టదు. ఆకాంక్ష యొకవైపు, దౌర్బల్య మింకొకప్రక్క ; ఈ మధ్య సాధకుని జీవనము రభసతో, ప్రయాసతో, తాపముతో బీడింపబడుచు, వ్యాకులత నొందుచుండును. ఎక్కడనుండియు సాహాయ్యమురాదు. ప్రార్థనము ఫలింపదు. నిష్ఠ కుదురదు. చంచలమైన మనస్సు, కామముతో రగులుచుండిన హృదయము, అహంకారభూయిష్ఠమైన నడవడి సాధకుని కృంగదీయుచుండును. 'పాహిమాం, పాహిమాం' అని ఆక్రందించును. అశ్రువుల రాల్చును. ఇంకను ఎంత కాలము ? కన్నులాశించుచున్న రూపము, ప్రాణము కోరుచున్న శాంతి, మనస్సు అన్వేషించుచున్న సత్యము, హృదయము కాంక్షించుచున్న ఆనందము, సంకల్పము అభిలషించుచున్న బలము లభ్యములు కావు. బహుశః భ్రమలయందు చిక్కుకొనెనా ? కాదు. 'కలడు కలం డనెడివాడు కలడో లేడో!' ఈ సంశయముకూడ హృదయమును వేధించుటకే బయల్వెడలినది. ప్రపంచము భ్రమ కావచ్చును. సంసా

రము భ్రమ కావచ్చును. కాని, ఈశ్వరనామము భ్రమ కాదు, ఆత్మ భ్రమకాదు.

బహుశః పరిశోధనము చాలకపోవచ్చును. ఆకాంక్ష యం దింకను కాపట్య ముండియుండును. లేనిచో నీ దార్బల్య మెక్కడిది ? శాస్త్రములు సహాయపడుటలేదు. ఆచారములు త్రోవ్వడకున్నవి. గురుబోధ చాలదు. పూజలు, పురస్కార ములు ఫలప్రదము లగుటలేదు. ఈ యగ్నిపరీక్ష చాలదా ? ఇకనైనను ఈశ్వరుని కరుణాకటాక్షము ప్రసరింపదా ? ఏకాం తమున విలపించును. రాత్రిల జాగరణము చేయును. విపిన భూముల తిరుగును. భజనకూటముల జేరును. ఉపదేశముల నాలకించును. కాని ఆ వ్యాకులతకు తృప్తి యెక్కడ ? అంధ కార మంతకంతకు దట్టమై, అనుతాపము దురంతమగును. సాధకు డొక్కపెట్టున 'నీ యిచ్ఛ' అని జగత్పిత చరణాబ్జ ములపై బడును. పితృవాత్సల్యము వర్ణనాతీతము. ఆ దయా రససముద్రము అపారము. సాధకుని జీవనాంతరాళమున నూతనజ్యోతి వెలిగినది. భక్తుని పుష్పాంజలిని భగవానుడు స్వీకరించినాడు. బలి ఈశ్వరప్రీతికర మైనది. తపస్సు ఫలించి నది. కృశించిన తనువు, పరితప్తమైన హృదయము, నిస్సార్థమైన మనస్సు, ఆత్మనివేదనము— సర్వమును, శుష్కించి యుండిన సరోవరము వెల్లివిరిసినట్లు, స్వర్గోన్ముఖమై ఈశ్వరారాధనమై వెలుగును.

సాధకుడు ఈశ్వరాధీనుడై ప్రవర్తించినకొలదియు, తాను ఈశ్వరుని యధీనమున ప్రవర్తించుటపోయి, ఈశ్వ రుడే తనయందు ప్రవర్తించుటయగును. కాని, జీవనమింకను మధురముకాలేదు. జగత్తు సుందరముకాలేదు. బ్రహ్మభావ మున ఆత్మ అంతర్ముఖమైయున్నదిగాని, తిరిగి బహిర్ముఖ

మగుటకు సంకోచము. ఇంకను ముందుకుబోవును. ఈ యవస్థలో స్వగతభేదముకూడ నాశనమగును. అంతయు నొక్కటే. 203
బ్రహ్మమే తన్ను దాను జూచుకొనుచు నిగ్రహించుకొనుచు ఆనందించుకొనును. భక్తునియందు భగవానుడు, భగవానుని యందు భక్తుడు ఏకాత్మత చెంది పరిపూర్ణులగుచుందురు.

అఖండసచ్చిదానందమూర్తి మనకు ప్రప్రథమమున విశ్వశక్తిగనో, విశ్వప్రేమగనో, విశ్వాత్మగనో, సర్వాతీతమైన అనంతసత్యముగనో, అంతర్భావుకుడైన పురుషోత్తముడుగనో—ఏ రూపముననైన ఏ నామముననైన గోచరింపవచ్చును. తుదకు ఈ నామరూపములన్నియు నొకటేయని తెలిసికొనగల్గుదుము. ఈశ్వరుడు నీ యింటికి ఏరూపమున, ఏ నామమున, ఏవేళను వచ్చునో వేచియుందుము. ఇంటిని పరిశుభ్రపఱచియుంచుము. ద్వారములను దెఱచియుంచుము. అన్యమనస్కుడవై యుండకుము. శ్రీరామచరణరజముకొఱకు నిరీక్షించుచుండిన అహల్యవలె, విశ్వాసముతో వానిరాకకై కనిపెట్టుకొనియుందుము.

1916

*

*

కృష్ణా స్వదేశీ ముద్రాక్షరశాల,
మచిలీపట్టణము.

*